



చెన్నపట్టణము, జూన్ ౧౯౩౧

సంపుటము ౮ ప్రజోత్పత్తి సంవత్సరము జ్యేష్ఠమాసము సంఖ్య ౬


# సాత్త్వికనిరోధము


భోగరాజు నారాయణమూర్తి గారు


స్వాంతంబుల్ కరఁగింపఁజాలు మృదువాగ్జాలంబుతో, దీనతా
క్రాంతంబైన మొగంబుతో భుజనటత్ఖాదీసమూహంబుతో
కాంతా! సాత్వికమార్గ మూని పురియంగళ్లం బ్రసంగించు నీ
శాంతోపేత నిరోధబోధనల నశ్రాంతంబు శ్లాఘించెదన్.

యాతాయాతజనంబు లెల్లరు సమగ్రాశ్చర్యులై చూడ వి
ఖ్యాతింగాంచిన శ్వేతహార్యరుణవర్ణాంచత్పతాకంబు నీ
చేతందాలిచి, యెండ కోరిచి, విదేశీయాంబరస్తోమవి
క్రేతృక్రేతల మందలింతువు; నినుం గీర్తింతు సాధ్వీమణీ!

ఆరయఁ జండభానుని సహస్రకరప్రకరప్రతాప మె
ట్లోరుచుకొందువో యెఱుఁగ నోసుమకోమలగాత్రి! నిత్యమున్
భూరికృపాపరత్వమున భూతము లైదను బ్రోచునొక్కొ యు
క్రూరతనోర్వ సాత్వికనిరోధమహోద్యమసువ్రతాత్మలన్!

కంటం జూచియెఱుంగ వంగడుల నేకాలంబునం దట్టినిన్
గంటిన్ నీవెనువెంట నీబుడుతలం గైకొంచు బాజారులో
నొంటం జెమ్మట గ్రమ్మ సాత్వికనిరోధోద్యోగమందుండ ; నేఁ
గంటిన్ దేశహితార్థమూనఁదగు త్యాగంబుం బవిత్రాంగనా.

చిఱుతలు నీకుమారకులు చెచ్చెరఁ జీటలతోడ నిప్పులం
జెఱగెడు నెండలోన వడఁజెందరు నీడకుఁబోరు వన్నెలం
దఱుగరు ; తావకీనధృతదారుణ దేశహితార్థసువ్రతం
బరుదుగఁ దోఁచె నింతటిమహత్తరమానపతివ్రతామణీ!

ఆరం బంగరురంగు మేనులను ఘర్మాంకూరముల్ గ్రమ్మఁగా
ఘోరార్కోజ్జ్వలతాపతప్తులయి నీకుఱ్ఱల్ మహాభీలకాం
తారోద్వహ్నిఁ గురంగశాబకము లైనారమ్మ! యెవ్వారికిన్
వారింజూచిన దుఃఖవారికణముల్ వర్షించు నవ్వారిగా.

'అన్నా! వద్దు విదేశవస్త్రు' మని నీ వర్థించి కేల్మోడ్చుచో
నిన్నుంజూచి సరోజపాణియుగముల్ నీపుత్త్రికల్ మోడ్తు ; రా
చిన్నారుల్ సుకుమారమూర్తులు చిరంజీవుల్ మహాకీర్తిసం
పన్నుల్ గా నిజదేశవర్ధనులుగా వర్ధిల్ల దీవించెదన్.

నీకుఱ్ఱల్ ఫలముల్ మిఠాయిలు చటుల్ నిత్యంబు వీక్షించుచున్
మాకుం దెమ్మని వేఁడ్వ రేమి చెపుమా మాపిల్ల లట్లమ్మరో!
నీకుఱ్ఱల్ విధిమైననాఁడు చెఱకున్ నిశ్చింతమైఁ బోవఁగా
నేకోర్కుల్ మదికోరకుండు నలవా టీనాఁడె గావించితే?

ప్రవిమలశీల! నీకతనఁ బట్టణవర్తకకోటికిన్ విదే
శవసనవాసనల్ కడునసహ్యములయ్యెఁ గదమ్మ! చిత్తముల్
దవులఁగఁ దెల్పుటన్ ఖదరుధారణకారణమర్మముల్ ప్రజా
నివహ మెఱింగి మెచ్చుకొనె నీయవిరోధనిరోధబోధనల్.

మగువా! ఖద్దరురక్షణార్థమయి యుష్మన్నిష్ఠురాలాపచా
పగుణధ్వానము వర్తకప్రతతిలో వ్యాపించి, తచ్చిత్తముల్
పగులంజేసి, విదేశపట్టణములన్ వస్త్రాల బస్తాలపై
బిగియంగట్టిన యిన్పరేకులను ద్రెంపెం జుమ్ము వీరాంగనా!

# సాహిత్యరత్నాకరకారుఁడే భాష్యరత్నప్రభాకారుఁడు

మహోపాధ్యాయ బ్రహ్మశ్రీ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయన శర్మగారు

ఈశీర్షికతోఁ బ్రమోదసంవత్సరమాఘమాస "భారతి" లోఁ బ్రకటింపఁబడిన బ్రహ్మశ్రీ వేమూరి నృసింహశాస్త్రిలవారి వ్యాస మెల్లరును సావధానముగాఁ జదువఁదగినది. పండితప్రకాండులగు నృసింహశాస్త్రిలవారు సయుక్తికముగాను, సోపపత్తికముగాను "సాహిత్యరత్నాకరకారుఁడే భాష్యరత్నప్రభాకారుఁ" డని స్థిరపఱచి తమవ్యాసమును బ్రకటించి యాంధ్రలోకమునకు మహోపకార మొనరించిరి. సాహిత్యరత్నాకరాదికృతులను రచించిన సుప్రసిద్ధమహాకవియును షడ్దర్శనపారంగతుఁడగు మహాపండితుఁడును నగు వారణాసి ధర్మసూరి కృష్ణాతీరవాసియగు నాంధ్రబ్రాహ్మణుఁడు. ఈతఁడే తురీయాశ్రమస్వీకార మొనరించినపిదప బ్రహ్మసూత్రశాంకరభాష్యమునకు భాష్యరత్నప్రభాటీకను రచించెను—అను నీవిషయము తెలిసినంతనే యే యాంధ్రుఁడైనను సంతోషమును వెలిఁబుచ్చి గర్వపడక యుండఁగలఁడా?

నృసింహశాస్త్రిలవారు లోకసంగ్రహముకొఱకుఁ బనిఁబూని ధర్మసూరివిషయమున విశేషాంశములను బ్రకటించినట్లే సుప్రసిద్ధవిద్వత్కవులగు నాంధ్రమహాపురుషులను గూర్చిన విశేషాంశములను బ్రకటించి కీర్తివహింతురుగాక. మల్లినాథసూరి జగన్నాథపండితరాజు మొదలగు నాంధ్రమహాపురుషుల చరిత్రములు కేవల మాంధ్రలోకమునకే కాక సమస్తలోకమునకు నుపకారకము లగుటచేత నావశ్యకములు.

నృసింహశాస్త్రిలవారి వ్యాసమున ధర్మసూరిని గూర్చి తెలిపిన విషయములను సావధానముగాఁ జదివి వారివ్యాసమున కనుబంధరూపముగా నుపయోగపడవచ్చునేమో యను నభిప్రాయముతో నే నీక్రిందఁ గొన్ని విషయములను తెలుప సాహసించుచున్నాను—ధర్మసూరి చరిత్రమును దెలిసికొనఁ గోరువారికిఁ బనికివచ్చు నను తలంపుతో విశదీకరించుచున్నాను.

(వారణాసి) త్రిపురారి సోమయాజి + పార్వతి

|

ధర్మసుధీ + నాగాంబిక

|

నారాయణావధాని    పర్వతేశసూరి    రామపండితుఁడు

పర్వతేశసూరి + ఎల్లమాంబ

|

ధర్మసుధి

ఈవంశానుక్రమణిక సాహిత్యరత్నాకరమునఁ బ్రథమతరంగమునందుఁ దెలుపఁబడియున్నది. ధర్మసుధీ నాగాంబికల పుత్రులు ముగ్వురిలో నారాయణావధాని జ్యేష్ఠుఁడు కావున సాహిత్యరత్నాకరకారుఁడగు ధర్మసూరికిఁ బెదతండ్రియగుచున్నాఁడు. నారాయణావధాని పరిక్రమణచక్రవర్తి యనిపించుకొనుచుండెను. ధర్మభూపాలుఁ డను రాజుసభలో సుప్రసిద్ధుఁడగు రామావధానిని నారాయణావధాని వేదావధానవిషయమున జయించుటవలన రాజాతనిని మెచ్చి ఛత్రచామరాందోళికలను బహుమాన మిచ్చి "అవధానీశ్వరశరభ ఘటాగండభేరుండ" బిరుదమును సమర్పించెను.

జిత్వా రామావధానిప్రవర మురుమరు
ద్వేగవద్వేదచర్చా
గోష్ఠ్యా నారాయణార్యస్సదసి బుధశతై
శ్లాఘ్యమానావధానః
సంతుష్టా ద్ధర్మభూపా దలభత శిబికాం
చామరచ్ఛత్రపూర్వం

గర్వాఖర్వావధానీశ్వరశరభఘటా
గండభేరుండచిహ్నామ్॥

—సాహిత్యరత్నాకరము; ప్రథమతరంగము, ౨౧

పైని జెప్పిన ధర్మభూపాలుఁ డెప్పటివాఁడో, యెప్పటివాఁడో చరిత్రకారులవలన వెలుఁగఁదగియున్నది.

నారాయణావధానుల యనుజుఁడగు పర్వతనాథసూరి సకలశాస్త్రపారంగతుఁడు. అతఁడు పండితసభా ముఖ్యమునందు వాదమున జనార్దనాచార్యుఁడను పండితుని జయించి యాతనికిఁ గల ప్రౌఢమగు "వాదికేసరి" బిరుదమును స్వయముగా సంపాదించెను; మఱియు నాతని "మాయావాదిభయంకర" బిరుదమును రూపుమాపి కీర్తి వహించెను.

తస్యాఽనుజః పర్వతనాథసూరి
రాసీ దశేషాగమపారదృశ్వా
..............................

సా. ర. ప్రథమతరంగము, ౨౩.

యో వాదేన జనార్దనాహ్వయబుధం
మధ్యేవిపశ్చిత్సభం
జిత్వాఽవిందత వాదికేసరిపదం
ప్రౌఢం తదీయం స్వయమ్।
మాయావాదిభయంకరాఖ్యబిరుదా
దత్యూర్జితా దార్జితా
త్క్రాం చోదంచయతిస్మ కీర్తి మతులాం
ప్రచ్యావయ న్నైష్ణవమ్॥

సా. ర. ప్రథమతరంగము, ౨౩.

చరిత్రకారు లీ జనార్దనాచార్యు లెవ్వరో తెలుపఁదగియుండును.

పర్వతనాథసూరితమ్ముఁడగు రామపండితుఁడును షడ్దర్శనీపారంగతుఁడు; మహావక్త.

పర్వతనాథసూరిపుత్రుఁడు ధర్మసుధి (ధర్మసూరి ధర్మాంతరాణ్వేతి ధర్మభట్టు మున్నగునవి యాతని పేర్లు) సన్న్యాసాశ్రమమును స్వీకరింపక పూర్వము

1. కష్ణాస్తుతి,
2 బాలభాగవతము (మహాకావ్యము),
3. రఘిళతకము

ననుకావ్యములను,

౧. నరకాసురవధము
౨. కంసవధము

నను నాటకములను హంససందేశ మను ప్రాకృతకావ్యమును, బ్రహ్మవృత్తవర్తిణి (గురువృత్తి) యను బ్రహ్మసూత్రవివరణమును రచించినపిమ్మట సాహిత్యరత్నాకరమును రచించినట్లు తలంపవలసియున్నది.

* * * *

వ్యాఖ్యావిఖ్యాతకీర్తే ర్వివరణగురువా
క్సాంఖ్యముఖ్యాగమానాం
తస్యాఽలంకారశాస్త్రీ
..............................

—సా. ర. ప్రథమతరంగము ౩౬.

కావ్యాలంకారకృష్ణాస్తుతిరవివిశతకో
న్నాటకాదిప్రణేతు
స్తస్యాఽలంకారశాస్త్రీ
..............................

—సా. ర. తృతీయ తరంగము ౧౫.

భావ్యరత్నప్రభాటీక సాహిత్యరత్నాకరమునం దెప్పటను జేర్పఁబడి యుండకపోవుటవలన నృసింహశాస్త్రులవారు వ్రాసినట్లు ధర్మసూరి సన్న్యాసాశ్రమమును స్వీకరింపక మున్నే పైగ్రంథములను వ్రాసె ననుటయు సన్న్యసించినపిమ్మట భావ్యరత్నప్రభాటీకను రచించె ననుటయు సమంజసముగా నున్నది.

ధర్మసూరి పూర్వాశ్రమమున రచించిన గ్రంథములను గూర్చి దిక్ప్రదర్శనరూపమున నించుక విశదపఱచుట సముచితమని యెంచి కొంచెము వివరించుచున్నాను.

కృష్ణాస్తుతి.

ధర్మసూరి కృష్ణాతీరవాసి యగుటవలన కృష్ణాతరంగిణియెడఁ దనకుఁ గల భక్తిగౌరవములను బ్రకటించుచుఁ గృష్ణాస్తుతిని రచించినట్లు కనఁబడుచున్నది.

కృష్ణా ముష్ణాతు సిష్ణాస్వభిజనవృజినా
న్యాశు దుర్వారవారా
వారాశేరాదిదారా రుచిరరుచి రహీ
భేనభేనాచ్ఛఫేనా
శుభ్రాశు భ్రామ్యదూర్మిభ్రమకరమకర
గ్రామణీగ్రామనీడా
గాధాగాధారరోధోవివరభువి వల
ద్దీవరౌఘా వరౌఘా.

—కృష్ణాస్తుతి: సా. ర. ఆఱవతరంగమునం దుదాహృతము.

బాలభాగవతము.

ఇదియొక మహాకావ్యము. ధర్మసూరి బాలభాగవతమును రచించినపిమ్మటనే నరకాసురధ్వంసనవ్యాయోగమును రచించెను. కావుననే నరకాసురవధప్రస్తావనయందు,

"అస్తిఖల్వత్రాఽప్యమృతనిష్యందీ సకలతమ
స్తోమపరిపంథీ నరనారేర్నరకాసురనిబర్హ
ణోదాహరణరూపో గుణశిరోమణిః ఇత్థమే
వైతత్కవినా స్వకావ్యే బాలభాగవతేఽ
ప్యుదీరితమ్

వినిందితాః కేనచ పంకజన్మనా
జడేన దోషాపహితా అపి స్వతః
మమోత్తమా విష్ణుపదస్పృశో బుద్ధేః
కళా ఇవ గ్రాహ్యతమాః కళానిధేః"

అని యున్నది. మరియు

నివిశ్య నీరంధ్రనికుంజమధ్యమా
నమీ నమీరారా స్సవాసాసనంభ్రమాః,
న శక్నువంతీహ పునర్వినిర్గమే
లతాంగనాలింగనలాలసా ధ్రువమ్.

—సా. ర. ఏడవతరంగమునం దుదాహృతము.

అగస్త్యపండితకృతమగు బాలభాగవత మను కావ్య మింకొకటి గలదు. కంపభూపాలుని భార్య గంగాదేవి రచించిన మధురావిజయమునందు బహుమానముగఁ బేర్కొనఁబడిన యగస్త్య విశ్వనాథ గంగాధరపండితులు మువ్వురిలో గంగాధరపండితునికి విశ్వనాథపండితుఁడు కుమారుఁడు. ఈతఁ డగస్త్యపండితుని మేనల్లుఁడు. అగస్త్యుఁడు విజయనగరసామ్రాజ్యాస్థాన పండితుఁడు. ఈతఁడు బాలభారతము రచించినట్లు బ్రహ్మశ్రీ కుప్పుస్వామిశాస్త్రిగారు వ్రాసిరి. బాలభాగవతమును గూర్చి శాస్త్రిగారు ప్రశంసింపలేదు. కారణము మృగ్యము. రాజశేఖరకృతమగు బాలభారత నాటకము (రెండంకములు మాత్రము) సుప్రసిద్ధము. అగస్త్యపండితుని బాలభారతము లభింపలేదు.

రవిశతకము

మయూరమహాకవి తనశరీరపీడ తొలంగుటకు సూర్యశతకమును రచించి సఫలమనోరథుఁ డైనట్లే ధర్మసూరి యును శరీరారోగ్యముకొఱకు రవిశతకమును రచించెనేమోయని తోఁచుచున్నది. రవిశతకమునకు సూర్యశతకమను నామాంతరమును గలదు.

"నాగబంధస్త్వస్మాభి స్సూర్యశతకే బింబవర్ణనప్రస్తావే కథితః"

నాగబంధము:—

బింబం ధ్వాంతవ్యధాదం కనకధరశిర
శ్చారిశోణద్యుదాత్తం
పద్మాధిప్రేమసోమక్షతద ముహుముదః
కర్తృకవ్యూహహారి,
శేముష్యా దాతృవైతాత్యాధిపతుదతులక
ర్మామయాధానకల్పాఢ్యం

కస్స్నేహాత్క్షీణతాం ముక్త్వా పతు పటుపరం
దైవ మర్చిః కదంబమ్.
"అష్టదళపద్మబంధ స్తత్రైవాశ్వాఽవర్ణ నేకథితః"

పద్మబంధః—

యా దానత్రాణరక్తాతతి రినహారితాం
జ్ఞాభినవ్యాప్తమాయా
యా మాస్తవ్యానభిజ్ఞానవతు మరకత
గ్రామసశ్రీ రజే యా,
యా జేరశ్రీ సమగ్రాయ దరితతిరస
క్తానరచ్ఛాజరాయా
యాంరాజచ్ఛారసక్తా నిశమియమషు ముక్తా
రణత్రాసదావ్యాః.

సా. ర. అలంకారరంగమునం దుదాహృతము.

## నరకాసురవధము.

ఇదియొక వ్యాయోగము. దీనికి నరకధ్వంసన మనియును నరకాసురవిజయ మని యును పేర్లు గలవు.

## కంసవధము.

ఇది నాటకము. కంసవధనాటకమని శేషకృష్ణ మహాకవి రచించిన యేడంకములనాటక మింకొకటి కలదు. శేషకృష్ణమహాకవి మహారాష్ట్రబ్రాహ్మణుడు; నృసింహపుత్రుడు. అక్బరుచక్రవర్తిమంత్రి యగు రాజా తోడరమల్లునకు కుమారుడైన గోవర్ధనధారి యను నపర నామముగల రాజా గిరిధారి ప్రేరణమున గాశీపట్టణము నందాతం డీనాటకమును రచించెను.

"(ఇందుశేఖర) పాదపద్మపరిచర్యాపర్యాప్త సామ్రాజ్యధురంధరో గోవర్ధనధారి రాజః"

* * * *

"(శర్వరీసార్వభౌమస్య) తస్యాఽస్తితండనకులా మలమండనస్య శ్రీతోడరక్షితిపతే స్తన యో నయజ్ఞః, నానాకళాకులగృహం సవి దగ్ధగోష్ఠీ మేకోఽధితిష్ఠతి గురు ర్గిరిధారి నామా. తేన చాఽహం సబహుమాన మాహూయ సనమాజేనాఽఽదిష్టోఽస్మి."

—శేషకృష్ణకృతకంసవధము, ప్రథమాంకము.

రాజా తోడరమల్లు క్రీ. శ. పదునారవశతాబ్దిలోని వాడు. ధర్మసూరి సాహిత్యరత్నాకరమున నస్పటస్పటం జేర్కొనిన విద్యానాథపండితుడు ఓరుగంటి ప్రతాపరుద్రునినాటివాడు. ప్రతాపరుద్రుడు క్రీ. శ. ౧౨౯౫–౧౩౨౩ సంవత్సరములలో నాంధ్రదేశమును బరిపాలించెను. శేషకృష్ణకవి అక్బరుపాదుషాసమకాలీనుడు గాని, యించుకతరువాతివాడు గాని యై యుండవలెను. కావున ధర్మసూరి శేషకృష్ణునికన్న ప్రాచీనుడని యూహింపం గియుండును.

ధర్మసూరికృతమగు కంసవధనాటకమున

వక్షోజాంగణచుంబితుంబిరుచిరా
మాబిభ్రతీ వల్లకీ
మాపద్దర్శితబాహుమూలసుషమా
తంత్రీ స్స్పృశంతీ నఖైః,
మందస్పందితకుండలాలకధరా
మాధుర్యధుర్యస్వరా
కించిత్కుట్మలితేక్షణా స్మితముఖీ
కేయం శనై ర్గాయతి.

—సా. ర. సప్తమతరంగమునం దుదాహృతము.

## హంససందేశము

ఇది ధర్మసూరికృతమగు ప్రాకృతకావ్యము. వేంకటనాథకవికృతమగు హంససందేశమను సంస్కృతకావ్య మొకటియు, కృతికర్తపేరు తెలియని హంససందేశమను నింకొక సంస్కృతకావ్యమును గలవని తెలియ వచ్చుచున్నది. కృతికర్తపేరు తెలియని హంససందేశము చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందుం గలదు. కాళిదాసకృతమగు మేఘసందేశము ననుకరిం

మను యోగమార్గమునఁ గైవల్యసిద్ధిని సూచించు నీవే దాంతగ్రంథములోని కథాసారసంగ్రహ మేమనిన;—

ద్వాదశారచక్రమునం దధివసించియున్న ముక్తి కన్యాయుతుఁడగు శివునికడకు జీవుఁడు హంస(ఇదిశ్లిష్ట రూపకము) ముఖమున సందేశమును బంపును. ముక్తికన్య తనపరిచారికలగు శాంతిశ్రద్ధాశ్రుతులతో శివసన్నిధి నుండఁగా వచ్చుటకే! జీవునిసందేశమును గొనిపోవు హంసకు షట్చక్రమార్గము వివరింపఁబడినది.

వేంకటనాథకృతమగు హంససందేశకథాంశము తెలియరాలేదు.

"మమైవప్రాకృతభాషావిరచితే హంససందేశే

జాఅం సీఆణఅణజుఅళం
 లోహిఅం జాఅరా ఆ
కింవా తమ్మం మఅణదహణ
 జాళజాలాహిదావా
చిత్తారద్ధే సురఅవిహవే
 చుంబణాణం పభేఏ
రత్తం కింవా రహుపఇముహే
 పీడిఆరాఅజో ఆ.

(ఛాయా)

జాతం సీతానయనయుగళం
 లోహితం జాగరాద్వా
కింవా తామ్రం మదనదహన
 జ్వాలజాలాభితాపాత్,
చిత్తారబ్ధే సురతవిభవే
 చుంబనానాం ప్రభేదే
రక్తం కింవా రఘుపతిముఖే
 పీటికారాగయోగాత్.

—సా. ర. రసతరంగము ౧౬.

నరకాసురవిజయవ్యాయోగమును రచించిన ధర్మసూరియే దత్తరత్నాకర మను గ్రంథమును రచించెనని డాక్టరుహూల్ష్ (Dr. hultzsch) గారు చెప్పుచున్నారని తెలియవచ్చినది. దత్తరత్నాకరము లభించినఁగాని దాని కర్తృత్వము స్పష్టపడదు.

బ్రహ్మశ్రీ నృసింహశాస్త్రిలవారు వ్రాసిన వ్యాసములో సాహిత్యరత్నాకరమునందు "నవకం విద్యానాథాదిన ద్భుక్షింథగయః" యని ధర్మసూరి వ్రాసెనని యుదాహరించిరి. సాహిత్యరత్నాకరమునందు నా వాక్య మెచ్చటను లభింపలేదు.

---

# ని రా శ

దివాకర్ల వేంకటావధానిగారు

(మాతృగుప్తుఁడు విక్రమార్కుని యాస్థానకవి. చాల దరిద్రుఁడు. స్వాతివానకు ముత్యపుఁజిప్పవలె నోరు తెఱచుకొనియుండుటయే కాని నరపాలునివలన లాభ మించుకయుఁ గలుగలేదు. ఒకనాఁటిరాత్రి భూపాలుఁడు నిద్రించుచున్న గదియందలి దీపము లన్నియు గాలిచే నారిపోవఁగా మాతృగుప్తుఁడు వానిని మరల వెలిఁగించెను. ఇంతలో రాజునకు మెలఁకువ వచ్చి ప్రశ్నింప నిదియే సమయమని కవియుఁ దనయవస్థను దెల్పుకొనెను. కాని భూనాథుఁడు మాత్ర మోర్మి పండితులకు సహజభూషణ మని పల్కు టాలకించి యీవలకు వచ్చి కవి యిట్లు చింతించెను.)

అవనీపాలురయందు నెవ్వనికొ విద్యాగంధ మొక్కింత పు
 ణ్యవశంబై లభియించు వేత్త యగువాఁ డైనన్ సమూలంబుగాఁ

కవితామాధురిఁ గ్రోల నేరఁ డది శక్యం బయ్యు నొక్కండుఁ గా
వ్యవిధాత్మస్థిరగౌరవంబు నొసరింపం బోవఁ డేపాపమో?

ఖలముఖాలాపములఁ ద్రోసివేయుచు విద్వజ్జనుల గౌరవించువాఁడు
పాత్రానుగుణముగాఁ బారితోషికముల నెలమిమై బుధుల కందించువాఁడు
తోఁచిన దిచ్చి సంతోషింపఁ జేయుచు యాచకావళికి లే దననివాఁడు
కవితారసమ్ముఁ జక్కనిరీతి గ్రహియింపఁజాలువిద్వత్తచేఁ గ్రాలువాఁడు
విక్రమార్కునిసాటి పృథ్వీశు లెవరు-భాగ్యము ఫలించె నాకు వైభవము గల్గుఁ
దప్ప దని వచ్చినాఁడ వృథాప్రయాస-నాయవస్థకు మార్పు గన్పడదు సుంత.

ఈనృపాలునివలన నీ కింత యేని-లాభ మది కల్గ దను జనాలాపములను
నరకు సేయకపోయితిఁ జాలఁగాల-మింతకును మొండిచేయి చూపింపఁబడితి.

దాసీజనంబుపైఁ దమిఁ జూడ్కి నిడఁబోక కలను నృపద్వేషిఁ గలయఁబోక
నృపునమతంబున నీచకథ ల్చెప్ప కధికప్రసంగంబులందుఁ జొరక
నను విరక్తునిఁ జేయ మొనయుదుష్టుల విన కాగ్రహం బించుకే నరయఁబోక
ఆస్థానవిద్వాంసు లన్న నీర్ష్య వహింప కాత్మతిరస్కృతి కవయఁబోక
తన్నృవిభునిసేవ ద్విగుణితోత్సాహ మొప్పఁ-జేయుచుంటిని గాయంబుఁ జిక్కుచుండె
హరిహరీ! నేటి కైనను ధరణిపాలు-మానసం బేనిమిత్తమొ మాఱదయ్యె.

అనిలమే తమకు నాహారంబుగాఁ గల్గు నాగగణంబుల భోగు లనియు
మధురగాన మొనర్చు మధుపంబుల విదల్చుగజముల విస్తీర్ణకర్ణము లని
ఓచ్మవికృతి లోన నొప్పుశమీభూజములఁ జాల నుత్కృష్టములు నటంచు
నైశ్వర్యమదమత్తులైన భూపాలుర స్వర్గాధినాథుని సము లటంచు
నజ్ఞులై పల్కెదరు లోకు లదియుఁగాక-మూఢులై భక్తిభావంబు మోసులెత్తఁ
గొల్చెదరుగాని పరికింపఁ గొంతవఱకు నచటఁ-జేర్కొనఁబడినగుణాళి కలదె?

మన్నీఁ డెన్నఁడు నన్నుఁ జూచు దయతో మాత్సర్యముం బూనె న
న్నన్నా! లేమియు దూరమై తొలఁగు టెన్నాఁ డన్న చింతాభర
చ్ఛన్నం బయ్యె మనం బాకించుక భవిష్యత్కాల మేరీతి నె
ట్లున్నం బోదు నిరాశయే సుఖద మేమో నాకుఁ జర్చింపఁగన్.

ఇతరభూపాలు రొసఁగినకతిపయబహు-మానములఁ జూపికొనుచు భూజానికడకు
వచ్చినకవీంద్రు లందఱు నిచ్చకొలఁది-భోగభాగ్యంబులం గొని పోయినారు.

తనజలపాళిఁ గ్రోలి జలదంబులు చండనిదాఘవేళ నా
వెనుక సువృష్టిరూపమునఁ బ్రీతిమెయిన్ జిలికించు నీటిబొ
ట్లను గ్రహియించి మాత్తిఃవిలాసము వాని కొసంగుఁ గాని యం
బునిధి స్వకీయవారికణముం గని యాగతి గారవించునే?

అన్యరాజన్యకృతగౌరవాతిశయము-నందఁజాలనివారల నవనిపతులు
కడుఁ దిరస్కారబుద్ధితోఁ గాంచుచుందు-రీనృపుల సేవచే ఫల మేమిఁగల్గు.

కననగు రాజహాళిపదకంజముసన్నిధి భస్మరాశి త
ద్ఘనవృషవాహనంబు వెనుకం జనఁ గాంచిన మబ్బు భూవరుల్
బనిగొని కొల్చుచో శ్రమయు వార్యము తన్నృపరోషజీవితుల్
గనుచు సపర్యఁ జేయ నధికం బగు సంపద లబ్బ నర్థికిన్.

* * * * *

ఎంత యోజించుకొన్న నొకించుకైన-దోషభావంబు నాయందుఁ దోఁపదాయెఁ
బ్రీతితో సంతతంబు సేవింపుచుండ-నీనృపాలునకు విరక్తి యెట్లు లొదవె?

నాకన్నన్ మహనీయులౌ బుధులకున్ నాకన్న విద్యాయశః
ప్రాకట్యంబున లోఁగువారలకు నీ రాజేంద్రుఁ డత్యంతసు
శ్రీకల్యాణసమృద్ధిఁ గూర్పఁడె మహాశ్రేయోంతరాయంబుగా
నాకున్ నాగ్రహచారమే యలరు భూనాథుండు నిందార్హుఁడే?

అంబుధిలోఁ దరంగ ముదయంబయి తీరముఁ జేరుచుండ ర
త్నంబులుఁగూడ వెంటఁబడు దానిమహోన్నతిఁ గాంచి భీతి చే
తంబునఁ గ్రమ్మఁ గైకొనఁగ దార్ఢ్యము గాంచఁ డొకండు, దాని క
బ్ధిం బడఁదిట్ట నౌనె ప్రయతింపనిదోషము మీఁద నుండఁగన్.

ఎఱిఁగి భూమీంద్రుఁ డీపలె నెఱుఁగనప్పు-డడిగినను మాత్ర మిచ్చు భాగ్యం బదెంత
యేల్బడికి నొక్కచో కానిపించుఁ గాని-తిఱిపెమున కున్న గ్రాసము త్తఱిఁగిపోవు.

కరఁగదయ్యెను ధారుణీవరుఁచిత్త-మెంత ప్రయతించినను ఫలహీన మయ్యె
నింక నాశాపిశాచంబు నెడఁదఁ ద్రోసి-యెచటికేనియుఁ బోవుటయే శుభంబు.

---

# కాళిదాసుఁడు—జ్యోతిర్విదాభరణము

సూరి రామసుబ్బరాయశాస్త్రిగారు

శ్రీ కాళిదాసమహాకవివిరచితగ్రంథములు సర్వశాస్త్రములందును గన్పట్టుచున్నవి. కావ్యత్రయ మనఁబడు రఘువంశకుమారసంభవమేఘసందేశములను, ఋతుసంహారము, అభిజ్ఞానశాకుంతలము, మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము అను నాటకములను, నళోదయ మను ప్రబంధమును చంద్రాలోక మను నలంకారశాస్త్రమును వృత్తరత్నావళి యనుఛందశ్శాస్త్రమును కోలంబరాజీయ మను వైద్యగ్రంథమును, తారావళి, పూర్వోత్తరఖండరూపక కాలామృతము జ్యోతిర్విదాభరణము అను జ్యోతిషగ్రంథములను, శ్రుతికర్మవాద మను ధర్మశాస్త్రమును రచియించె నని తెలియుచున్నది. ఒకానొకసమయంబున గౌతమశిష్యులచేఁ బ్రార్థితుఁడై వారలకుఁ దన్మహర్షివిరచితతర్కశాస్త్రము నుపదేశించుచు నం దీకవీంద్రుండు చేర్చినవాక్యములు దురవగాహము లైనను నిప్పటికిని దచ్చాస్త్రాభ్యాసకులు కంఠగత మగునటులు చదువుటచే ఋష్యాదులకుసహిత మిమ్మహనీయునియందుఁ గల గౌరవము విశద మగుచున్నది. ఈపైగ్రంథములందుఁ గొన్నిటిశైలి విభిన్నముగాఁ గాన్పించుటచే నిరువురు కాళిదాసు లుండవచ్చునని కొందఱూహించుచున్నారు. కాని శ్రీకాళిదాసవిరచితగ్రంథముల నన్నిటిని బరిశీలించినఁ గాని యీవిషయమును దృఢముగా నిరూపించుటకుఁ దగిన యవకాశము లేకుండుటచేఁ బరిశోధకు లీవిషయమునఁ దగుపరిశ్రమఁ జేయుదురుగాక యని హెచ్చరించుచు నిందు "జ్యోతిర్విదాభరణము"ను విమర్శించుచున్నాను.

1. ఈగ్రంథ మీరాజధానియందు ముద్రితమై యుండకపోవుటచేతను, ఇది జ్యోతిషగ్రంథ మగుటచేతను శ్రీకాళిదాసగ్రంథపరిచితులకు కేవలము నూతనముగాఁ గాన్పింపవచ్చును. కావున దీనిని విపులముగా విమర్శింప నెంచితిని. ఇది మాళవదేశాధీశ్వరుఁడగు శ్రీవిక్రమాదిత్యునికిఁ గృతి యొసఁగఁబడినది. ఇందు గ్రంథకర్త తా నదివఱలో రఘువంశపూర్వకకావ్యత్రయమును దత్పూర్వముగ శ్రుతికర్మవాదమును రచియించినట్లు దెలిపెను. ఆవిషయములను శ్రీవిక్రమాదిత్యునిఁగూర్చిన మఱియొకవ్యాసమునఁ దెలిపెదను.

2. రఘువంశాదికావ్యములవలెఁ గాక యీగ్రంథము నారికేళఫలతుల్యవాక్యసమన్వితమై యున్నది. సుఖబోధికాఖ్యవ్యాఖ్యను రచియించి యీగ్రంథసారమును సర్వజనవేద్యముగాఁ జేసిన శ్రీభావరత్నమహనీయుని పాండిత్యగరిమ మిగులఁ బ్రశంసనీయము. ఇది మౌహూర్తికగ్రంథ మగుటచే నిం దేయేకార్యాచరణము నం దేయేతిథ్యాదికము లుచితానుచితము లైనవియుఁ జెప్పఁబడినవి. శ్రీమచ్చింతలపాటి వేంకటయజ్వవిరచితసంస్కృతవ్యాఖ్యానసమేతమై సర్వజనసుపరిచితమై యున్న "కాలామృత" మను మౌహూర్తికగ్రంథము శార్దూలవృత్తాంచితమై సులభశైలియం దున్నది. అందు వివాహోచితవారాదిప్రసంగంబున,

శ్లో. శుక్రార్కేందుజవాసరేషు శుభదో మందారకౌ—సౌరి ర్మధ్యమః

అనియును, ఉపనయనప్రకరణమునందు

శ్లో. శుక్రార్కేందుజవాసరేఽర్క—శశినో ర్వారౌ చ మధ్యౌ తయోః

అనియును జెప్పఁబడియున్నది. ఇందొకశ్లోకమును జ్ఞప్తికిఁ దెచ్చుకొనుసమయంబున రెండవశ్లోకములోని పదములు స్ఫురణకు వచ్చుటచే పాఠకులకు తడఁబాటు గల్గుచుండును. కాని జ్యోతిర్విదాభరణపాఠకుల కిట్టిక్లేశము కలుగనేరదు. ఇది వివిధవృత్తసమన్వితమై యుండుటయే కాక యిందొకపర్యాయ ముపయోగింపఁబడినపద మింకొకసమయమున సామాన్యముగా నుపయోగింపఁబడి యుండలేదు. కావున నీగ్రంథ మిట్టిశైలి నందుటకుఁ గారణ మనియుఁ దోఁచుచున్నది. ఇందుల కుదాహరణము—

శ్లో. సర్వత్రపూజితపద్విదుశేవనసా
మాహు రహాని వరాణ్యభిరూపాః,
విద్యాలయా విధుమిహిరదినేవా
రంభే క్వచిదనసామ్యఫలేఽస్మిన్.

సాధారణవిద్యారంభమునందు దేవేంద్రసేవితపాదుండగు బృహస్పతియొక్కయు, బుధునియొక్కయు, శుక్రునియొక్కయు, వారములు వరము లని పండితులు చెప్పుచున్నారు. విధుమిహిరదినములును అనఁగాఁ జంద్రరవివారములును నొకప్పుడు శుభములే యని చెప్పఁబడుచున్నవి.

శ్లో. ద్యుమణేశ్శుద్ధిశేఽత్రీశజనాఙ్కజాహ్ని ప్రబుద్ధా విదో క్షేవ గాణిత్య మాచుః.—ఇందు గణితశాస్త్రారంభమునందు రవిబుధవారములు శుభము లని బుధులు చెప్పి రని తెలుపఁబడినది. రవివారమం దనుటకుఁ బూర్వశ్లోకమునందు "ద్యుమణేశ్శుద్ధిశే" అనియును నీశ్లోకమునందు "మిహిరదినే" అనియుఁ జెప్పఁబడినది. బుధవారమం దనుటకుఁ బూర్వశ్లోకమున "విద్దినే" అనియు నీశ్లోకమునందు "అత్రీశజనాఙ్కజాహ్ని" అనియుఁ జెప్పఁబడినది. ఇట్టివిపరీత మిఁక మం దుదాహరించు శ్లోకములందును గానవగును.—

రవ్యాదిగ్రహములకు మేషాదిరాశులందుఁ గల యాధిపత్యములఁ దెల్పువాక్యములు:—

శ్లో. పడంభ్ర్యూర్భధయో రసాభవః
భృగుర్ఘటభకాంకరాహ్వయోః
వశాజితుమయోర్విదీశ్వరోఽవసో
భవతి కర్కిణో భవః.—
భగో నక్రరహితినాయ
కశ్చరాసనవనాలయాఖ్యదః
గురుస్తిమిరవైరిజో బుధైస్సతం
కలశనక్రభేశ్వరః.—

వృశ్చికమేషములకుఁ గుజుఁడును, తులావృషభములకు శుక్రుఁడును, కన్యామిథునములకు బుధుఁడును, కటకమునకుఁ జంద్రుఁడును, సింహమునకు రవియును, ధనుర్మీనములకు గురుఁడును కుంభమకరములకు శనియును నధిపతు లగుదు రని భావము. ఈశ్లోకములవలన నీగ్రంథశైలి విశదమగుచున్నది. ఈగ్రంథమునందే గ్రంథకర్త తాను రఘువంశాదికావ్యత్రయమును రచియించినట్లు చెప్పియుండెను కావున శైలీభేదముగాఁ గాన్పించుకారణమునకే, కవిభేదమును గల్పించుట యసమంజసము. సంస్కృతవాణిని నిజముఖవాసినిఁ జేసికొని, నిఘంట్వాదుల సహితము వ్రాయు సామర్థ్యముగల ధీమంతులకు వివిధశైలీసమన్వితగ్రంథరచనము విలాసక్రీడవంటిది. ప్రాథమికులకుఁ బఠనీయములుగ నుద్దేశింపఁబడిన రఘువంశాదికావ్యములును భాషాప్రౌఢులవిమర్శనముల కుద్దేశింపఁబడిన నలోదయాదిప్రబంధగ్రంథములును నొక్కశైలి నుం డేల కాన్పింపవలయును?

3. ఈజ్యోతిర్విదాభరణమునందలి ప్రథమశ్లోకమువలన శ్రీకాళిదాసుఁడు శివభక్తుఁ డని విశద మగుచున్నది:—

శ్లో. రైభ్యత్రితహారితవసిష్ఠపరాశరాద్యై
ర్నత్తోద్భవితం జనఘనవ్యవహారసిద్ధ్యై,
గ్రథ్నామ్యహం నను గిరంతు యశేవ మార్క్యం
జ్యోతిర్విదాభరణ నామ్ని మహేశ్చ శైవమ్.

కాళిదాసవిరచిత మనెడు 'ఉత్తరకాలామృతము' నందును మంగళాచరణశ్లోకము లిట్లు కాన్పించుచున్నవి:—

శ్లో. శ్రీమద్వక్త్రసరోజయాచ్యుతహర
బ్రహ్మేంద్రముఖ్యామరైః
కార్యారంభవిధౌ సమర్చితపద
ద్వంద్వం ద్విపేంద్రాననమ్,
పాశాద్యాయుధలడ్డుకప్రవిలస
ద్ధస్తైశ్చతుర్భిర్యుతం
శ్రీమద్విక్రమసూర్యపాలనపరం
వందే భవానీసుతమ్.—

శ్లో. కామేశస్య సువామభాగనిలయాం
భక్తాభిలేష్టార్థదాం

శంఖం చక్ర మథాఽభయంచ వరదం
హస్తైర్దధానాం శివామ్,
సింహస్థాం శశిఖండమౌళిలసితాం
దేవీం త్రినేత్రోజ్జ్వలాం
శ్రీమద్విక్రమసూర్యపాలనపరాం
వందే మహాకాళికామ్.—

ఇందుచే నీగ్రంథకర్త కేవలము కాళిదాసుఁడే కాక ద్వితీయశ్లోకమునందలి "కామేశస్య సువామభాగ నిలయాం" ఇత్యాదివిశేషణములవలన, రఘువంశాదికావ్యములందుఁ దెలియుకీర్తిని పార్వతీపరమేశ్వరభక్తియుక్తుఁ డనియుఁ దెలియుచున్నది. ఈయుత్తరకాలామృతము పీఠికాపురసంస్థానజ్యోతిర్విద్వాంసులగు శ్రీ వేమూరి సూర్యనారాయణశాస్త్రులవారిచే నాంధ్రటీకాతాత్పర్య సమేతముగాఁ బ్రచురింపఁబడినది. కాని యిది యసమగ్రముగ లభించుటచే నిందు గ్రంథకర్తృనామాదివివరమగపడదు. ఇందలి తృతీయశ్లోకమున:—

శ్లో. ప్రాగేవాద్యదశే సమస్త ముదితం
రాశ్యాదికం విస్తరాత్
జ్ఞేయం జాతకపద్ధతిం
బుధముదేఽథ ప్రాశ్నికంచ క్రమాత్,
స్పష్టం సూక్ష్మతరం త్రికాలఫలదం
శార్దూలవృత్తాంచితం
సంపద్వశ్యకరం ప్రవచ్మి బహుధా
కాలామృతే తూత్తరే.

అని చెప్పఁబడినవిధమున నీగ్రంథ మంతయు శార్దూలవృత్త సమన్వితమై సుబోధకముగ నున్నది. దీనిపూర్వఖండ మింత సులభమగు శైలియం దుండ దని యూహింపఁదగి యున్నది. కాని య దెచ్చటఁ బ్రచారమున నున్నదియుఁ దెలియుటలేదు. ఇట్టిమహనీయులచే రచియింపఁబడిన యుత్కృష్టగ్రంథజాల మెంత కాలవాహినీగతమై యుండెనో యని స్ఫురించుచున్నది. భావిపరిశోధకు లీలోపముఁ బాటింతురుగాక. పరిశోధనఫలితముగ నింక నెన్ని మహోత్కృష్టగ్రంథరాజములు లభింపనున్నవో?

౮. జ్యోతిర్విదాభరణమునందును శ్రీకాళిదాసుని ధర్మకర్మాసక్తి విశదమగుచున్నది. ఇందు "వర్ణాశ్రమధర్మసాధనప్రకరణ" మను నొకయధ్యాయముఁ జేర్చి యందు శ్రీ విక్రమనృపు నిట్లు స్తుతించెను:—

శ్లో. కాంభోజగౌడాంధ్రమాలవానాః
శ్రీవిక్రమార్కస్య సురాజ్యగౌర్జరాః,
స్వవర్ణధర్మక్రియయోజ్జ్వలీకృతం
యశోఽభిగాయం త్యధునాఽపి తే జనాః.

కాంభోజ, గౌడపద మాలవ సురాజ్య గౌర్జరాదిదేశీయులు, శ్రీవిక్రమచక్రవర్తియొక్క స్వవర్ణధర్మక్రియోజ్జ్వలితయశమును గానము చేయుచున్నారు.

పర్వప్రకరణాంతమునందు:—

శ్లో. పర్వాణ్యమానీహ సదాఽపవర్గసై
శ్రీవిక్రమార్కేణ దినాదికం ప్రతి,
తద్ధోమబోధాయ తథాఽపి సత్కృతా
విదుస్సదా సత్కృతినా హ్యమానిత.

కోవిదుఁడగు విక్రమాదిత్యుఁడు పర్వాదికముల విధానము నెఱింగి తత్సమయములం దుక్తవిధమున దానాదికముల నాచరించి విద్వాంసుల సత్కరించుచుండెను.

గృహప్రవేశప్రకరణమునందు:—

శ్లో. అనేకదేవాయతనాని భారతే
కృతాని యేనా ప్రతతోఽధిదేవతాః,
సంస్థాపితా దేవవిధానదానతః
శ్రీవిక్రమార్కోఽవనిపో జయత్యపి.

భారతదేశమున ననేకదేవాలయముల నిర్మించి యందు శాస్త్రోక్తవిధానమున దేవతాప్రతిష్ఠాపనములఁ జేయించి యశముఁ గాంచిన విక్రమార్కభూపాలుఁడు ప్రకాశించునుగాక.

ఇట్లు విక్రమభూపుని ధర్మకర్మాచరణపరాయణత నభివర్ణించుటచేఁ గాళిదాసుని ధర్మాసక్తియుఁ దెలియుచున్నది. ఇంతియకాక "శ్రుతికర్మవాద" మను గ్రంథమును దా రచియించినట్లు నిందే చెప్పియున్నాఁడు.

౫. కాళిదాసకవిస్వాతంత్ర్యము.—కాళిదాస సమకాలికుఁడును విక్రమభూపసభాసదుఁడును నగు వరాహమిహిరాచార్యుఁడు బృహజ్జాతకమును రచియించుచు నందు సేనివుఁడుమున నైన భిన్నమతము లుండు నపుడు వానిఁ దెలిపి యూరకుండును గాని విమర్శన పూర్వకముగ నందు సదసత్పక్షనిరూపణముఁ జేయ డని చెప్పెను. కాళిదాసు గారు తనగ్రంథమునందు సత్పక్షమును స్వీకరించుచు నసత్పక్షమును నిరాకరింతు నని యిట్లు చెప్పెను:—

శ్లో. అన్యాసదుక్తివిహితోద్గమపక్షరాశీ
న్వ్యర్థా నహం విరచయామి పరోక్తియుక్తైః,
మత్వా వరాహమిహిరాదిమతై రసేకైర్
జ్యోతిర్విదాభరణ మప్యనసన్మతార్హమ్.—

వ్యర్థము లగు నసదుక్తియుక్తపక్షజాలమును, పరోక్తియుక్తము లగు వరాహమిహిరాదిసత్పక్షసమూహములను జూచి, సన్మతార్హ మగునటు లీ జ్యోతిర్విదాభరణమును రచియించుచున్నాఁడ నని ప్రతిజ్ఞ యొనర్చెను. అసత్పక్షములుగఁ గాన్పించినచో ఋషిమతము నైనను ఖండించుటకు వెనుదీయు లేదు. ఇందులకు దృష్టాంతము:—

శ్లో. ఇష్టాతిచారాన్నృజావివాహే
వివాహతోఽన్యేషు న మంగలేషు
గురో రువాచేత్యముగాలవోఽప
త్సోవాత్ర జీవోద్గతవైకృతం స్యాత్.

గురునిక్రాంతిచారగమనములు వివాహమున నిష్టము లనియుఁ దనితరశుభకర్మములం దనిష్టము లనియుఁ జెప్పుగాలవునివాక్యము లసమంజసములు. గురునివలనఁ గలుగు వికారము సర్వశుభకర్మములందును నగును.

శ్లో. భగోడు వాల్మీకి రిహోహ సౌమ్యం
సీతా సిషేవే న సుఖం తదూఢా,
హైమీ తథైవాభిజిదృక్ష మత్రి
స్తచ్ఛాప మాపోడు తదీయ మస్మాత్—

వాల్మీకిమహర్షి పూర్వఫల్గునీనక్షత్రము వివాహమునకు సౌమ్య మని చెప్పెను. కాని యందు వివాహిత యైన సీత యెట్టి సౌఖ్యము నందలేదు. అట్లే అత్రిమహర్షి సౌమ్య మని చెప్పిన అభిజిన్నక్షత్రమున వివాహిత యైన దమయంతియు నెట్టి సుఖమును నందియుండలేదు. కావున నా నక్షత్రములు వారిశాపముల నొంది వివాహమున నిషేధింపఁబడుచున్నవి.—

శ్లో. స విశ్వక్రృ చ్ఛౌరివనూడుదాస్రం
బభాణ కశ్చిత్త్రిత్వహ వేదభేదాత్,
ఫలాన్యభావా దపరాగముక్తైర్
ముక్తం తదృక్షం హ్యనుషఙ్గలోకైః

"చిత్రాశ్రవణధనిష్ఠాశ్వనీనక్షత్రములు వేదభేదముచే వివాహమున కుచితము లని యొకరనిరి. కాని ఫలరహితము లగుటచే నవి యిపుడు సర్వజనులచే వర్జింపఁబడుచున్నవి". ప్రకృతిశాస్త్రములందు నుత్కృష్టమగు నీజ్యోతిశ్శాస్త్రము ప్రత్యక్షానుభవప్రమాణములచేఁ గ్రమక్రమముగ నెట్లభివృద్ధిఁ గాంచినదియు దీని వలన స్పష్టమగుచున్నది.

శ్లో. నహోరిరఙ్ఘోభమభూదుదీరితం
యదేవకీ తత్రచ వాసుదేవసూః,
ఊఢా జగన్మంగళకారిణీ తతః
ప్రగర్హణం మూల మిహోచితం స్మృతిమ్—

మూలనక్షత్రమునందు వివాహ మైన దేవకీదేవి శ్రీకృష్ణునిఁ గనుటచే జగన్మంగళకారిణి యయ్యెఁ గావునఁ బూర్వము నిషిద్ధ మైనదైనను మూలనక్షత్ర మిపు డుచిత మైనదిగా స్వీకరింపఁబడుచున్నది.

శ్లో. కరగ్రహే చేత్పిత్రకర్మగర్హితం
కథం తదృక్షం కథితం కలం బుధైః,
దాక్షాయణీ కశ్యపలబ్ధమంగళా
దృష్టేతి సద్వర్గఫలాదృతా మఘా.

వివాహమునఁ బిత్రకర్మ గర్హిత మగుచుండఁ బిత్రనక్షత్ర మగు మఘ, వివాహమున నేల యంగీకరింపఁ బడినది?—ఆనక్షత్రమునఁ గశ్యపమహర్షికి వివాహ మైన

దాక్షాయణి శుభఫలముల నొందుటచే నదియును స్వీకరింపఁబడుచున్నది. ఈవిషయములు చారిత్రకపరిశోధకులకుఁ బౌర్వాపర్యనిర్ణయమున కుపయోగించు నని తలఁచెదను.

శ్లో. సమస్తకర్మోచితకాలపుష్య
దుష్యో వివాహే మదమూర్ఛితత్వాత్,
సహస్రపత్రప్రసవేన తస్మా
ద్విహోఽపి ముక్తో భువి లోకసంఘైః—

బృహస్పతి యధిదేవతగాఁ గల పుష్యమీ నక్షత్రము సమస్తకర్మలందు నుచిత మని చెప్పఁబడుటచే మదమూర్ఛిత మయ్యెను. కావున వివాహమున బ్రహ్మదేవునిచే దూషింపఁబడియె. తత్కారణమున భూమియందు సర్వజనులచే వర్జింపఁబడినది. సమస్తకర్మోచితపుష్యము వివాహమునను, ఈ చిత్రమగునను భ్రమ కలుగకుండుటకై యిట్లు చమత్కరింపఁబడినది.—

౬. ఇది జ్యోతిషగ్రంథ మైనను నవకాశము కలిగినపు డెల్ల నిందును గవి తనచాతుర్యము ననేకవిధములఁ గన్పఱచుచునే వచ్చెను.

శ్లో. అనేకదోషైరపి హీనయోగో
న హన్యతేఽనేకగుణైః శుభయోగః,
గ్రాహ్యస్సదా యేన గుణా బుద్ధైర్య
త్యాజ్యాః స్వదోషాః ఖలు వర్జనీయాః—

అనేకదోషములచే నొక హీనయోగ మైనను ననేకగుణములచే నొకశుభయోగ మైనను గొట్టివేయఁబడనేరదు. కావున, శేకార్యములం దెవ్వి బలవత్తరగుణము లని చెప్పఁబడుచున్నవో యవి గ్రహింపఁదగినవి. బలవత్తరదోషములు వర్జింపఁదగినవి. ఈవిషయమునకు విరోధాభిప్రాయములు గలుగఁజేయునట్టులు సోపమానంబుగ నిందుశ్లోకములఁ జెప్పుచున్నాఁడు.—

శ్లో. ఏకో గుణో దోషగణం సమేత్య
స్వాహాప్రియం స్వామతిహేతిమంతమ్,
నిగూహతీవాఽతులగవ్యబిందు
మూర్తిం తతిష్టా బహవో గుణాః స్యుః—

స్వచ్ఛమగు గవ్యబిందు వతిప్రకాశవంత మగు నగ్నిహోత్రమునందు హరించుచందమున నొక్కగుణము దోషగణమునందు హరించుచున్నది. కావున బహుగుణములు వాంఛనీయములు:—

శ్లో. దోషైకదేశో గుణసన్నిపాత
మతో దహత్యగ్నిరివ సంశయోఽస్తి,
ధనంజయాంశో వనరాజ్యగోష్ఠ
మివాఽగణాంశోఽపి వివర్జనీయః—

అగ్నికణము మహారణ్యమందలి వృక్షసంఘము నంతను దహించువిధంబున దోషైకదేశము గుణసంఘమును నశింపఁజేయు ననుటలో సందియము లేదు. కావున దోషము లేశ మైనను వర్జింపఁదగినది. ఈవిరోధ ప్రసంగోచితముగ "దోషైకదేశో (ఏకోహిదోషః-అని పాఠము. భా. సం.) గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః" అని కుమారసంభవము. భా. సం.) రఘువంశమునందును జెప్పియుండెను.

ఉత్ప్రేక్షాలంకారము:—

శ్లో. నగ ముపాస్య యమాశ మనోజ్ఞగో
రవి రుపాగతిజక్ల మధువ్యథః,
కిమితి కారయితుం భువి మంగలం,
వసుపదిగ్గతిమా న్వినివర్తతే.

దేవతలకు దక్షిణాయనము రాత్రియు, నుత్తరాయణము పవలును నగుచున్నది. రాత్రిసమయ మగు దక్షిణాయనగమనమునఁ గలిగిన పరిశ్రమచేఁ బీడితుఁడైన సూర్యుఁడు భూమియందు మంగళకార్యములఁ జేయింపుటకా యనునట్లు కుబేరదిగ్గమనార్థము మరలుచున్నాఁడు —అనఁగా నుత్తరాయణము శుభకర్మాచరణమునకుఁ బ్రశస్త మని భావము.

౭. అనేకములగు శబ్దాలంకారములుగూడఁ గానవచ్చుచున్నవి:—

శ్లో. నాదీర్ఘనిద్రామరమేతిహాయనే
పురోఽష్టమే పాణిః పోదయగ్రహాత్,
నాదీర్ఘనిద్రామరమేతిహాయనే
పురోఽష్టమే పాణిః పోదయగ్రహాత్—

ఏడవసంవత్సరమునను ఎనిమిదవసంవత్సరమునను గర్భాజ్ఞ గ్రహణమువలన వరుఁడు మృత్యువుఁ బొందును. ఇచట "పుర్వోష్ట మేషాంతుక్షే" అనుటలో నెనిమిదవవత్సరమునకుఁ బూర్వవత్సర మగు నేడవవత్సర మని యొక పారియు, నెనిమిదివత్సరములకుఁ బూర్వ మని యొక పారియు సమన్వయింపఁదగి యున్నది.

శ్లో. ద్వేషివిక్రమవినాశగో హరిర్
ద్వేషివిక్రమవినాశకృ ద్భవేత్,
అత్రిభస్థితి రభీష్టదోఽత్రిజో
మంగలోఽరిబలగోఽతి మంగలః—

శత్రుస్థానమగు షష్ఠమునందును, విక్రమస్థానమగు తృతీయమునందును, నాశస్థానమగు నష్టమమునందును నుండు సూర్యుఁడు శత్రువిక్రమములను నశింపఁజేయును. ప్రథమద్వితీయతృతీయములందుండు చంద్రుఁ డభీష్టము నిచ్చును. శత్రుస్థానమగు షష్ఠమునను బలస్థానమగు తృతీయమునను నుండు వంగారకుఁడు మంగళము నొసఁగును.—

శ్లో. సమిషే నృమిషాఽబలావివాహేఽ
నువభోగేహీనభోగ మీతిభిన్మ్యస్,
శుచిగే రుచిమార్జహాని మూర్జే
మధుపా సాచ మఘా సహాస్యసస్యా.

ఆశ్వయుజమాసమున వివాహ మాడినకన్య భోగము నందఁజాలదు. శ్రావణమాసవివాహముచే గృహముఁ బొందదు. ఆషాఢమున దుఃఖము నొందును. కార్తికమున బలనాశము గల్గును. చైత్రమాసమున మద్యపాయిని యగును. మార్గశీర్షమున సస్యహీనురా లగును.—

ఇ. విషయప్రదర్శనాకాశల మిం దొకవిశేషాంశమై కన్పట్టుచున్నది.

శ్లో. ఐశే తనా గూఢపయోధరేందిరే (?)
యమాచ్చతుష్కం త్యజ రాజపంచకమ్,
లయే రిపౌ చాంగపరాజభార్గవా
వష్టే సమస్తా న నిషిద్ధనిద్ధురూన్,

వివాహసమయమున లగ్నమునందు శన్యాదిచతుష్కము వనఁగా శని, రవి, చంద్ర, కుజు లను సప్తమమున చంద్రాదిపంచకమును, వనఁగా చంద్ర, కుజ, బుధ గురు, శుక్ర, శను లను, షష్ఠమున లగ్నాధిప, చంద్ర శుక్రులను, సప్తమమున బుధగురులు గాక తదితరులను వర్జింపవలయును. ఈవిషయము కాలామృతాదిగ్రంథములందు ద్విత్ర్యాదిశ్లోకములచేఁ జెప్పఁబడినది. కాని యిందు సులభమార్గముచే గ్రహక్రమమున నొక్కశ్లోకమునఁ దెలుపఁబడినది. ఇందుపయోగింపఁబడిన...... "గూఢపయోధరేందిరే" అను సంబోధనవలన వివాహోచితకన్యకయొక్క వయఃపరిజ్ఞానము గోచరమగుచున్నది. వివాహభేదములును దత్తచిత్రకాలములు నిందు విశదీకరింపఁబడియేయున్నవి.

శ్లో. అతిమిద్విశరీరభస్థితా
మదయా నా హరగా రవేశనే,
చరపత్స్యలవాన్యభాగగా
నభిరూపా శ్శుభయోగవీక్షణాత్.

మేషాదిరాసులు క్రమముగాఁ జరస్థిరద్విస్వభావము లనఁబడుచున్నవి. అందుఁ జరరాసు లగు మేష కర్కాటకతులామకరములును, ద్విస్వభావములందలి మీనమును తన్నవాంశలును గృహప్రవేశమున నిషేధింపఁబడుచున్నవి. తదితరరాసులును దదంశలును శుభము లని చెప్పుటకై యిందు 'మీనవర్జితద్విస్వభావములును స్థిరములును శుభము' లని చెప్పి యుత్తరార్ధమున శుభరాశ్యంశలు దెల్పుటకై చరరాసులయొక్కయు మీనరాశియొక్కయు నంశలు గాక తదితరాంశలు శుభము లని చెప్పెను. ఇట్లు శుభాశుభరాసుల నన్నిటిఁ జెప్పుటయైనది. స్వమతమునకుఁ బ్రామాణ్యము నిరూపించుచున్నాఁడు:—

శ్లో. స్థిరరాశ్యుదయే ప్రవేశనం
విదధీతేతి జగాద గాలవః
అపజాకవరోదయే క్వచి
త్పదితీహోభయ మాదృతం మయా.

"స్థిరరాసులందు గృహప్రవేశము చేయఁదగినదనియు నొకప్పుడు కుంభావర్జితచరరాసులందును దగునని యు గాలవుఁడు చెప్పెను. అందు, నేను రెంటిని

నాదరించుచున్నాను"—వరరాశులన మిథున, కన్యా తులాధనుఃకుంభములు. ఇందు కుంభము స్థిరరాశ్యంతర్గత మగుటచేత, నిందుంచి తులను విడువఁగా మిగులు మిథున కన్యాధనూరాశులు స్థిరరాసులతోఁ జేరి "అతిమిద్వికేరిరభస్థిర"రాసు లగుచున్నవి. ఇట్లు గాలవునిచే ద్వివిధములఁ జెప్పఁబడిన రాశినామము లన్నియు "అతిమిద్వికేరిరభస్థిర"ము లని నూతనవిధమునఁ జెప్పఁబడినవి. గణిత ప్రక్రియయందు నుత్తరకాలామృతమునందును నిట్టి లఘుమార్గప్రదర్శనము లద్భుతములై కానవచ్చును. ఈశ్లోకమునందు "ఉభయ మాదృతం యుతా" నాచే వివి రెండును నాదరింపఁబడిన వనుచు, కవి తనస్వాతంత్ర్యము నెట్లుద్ఘాటించుచున్నదియుఁ దెలియుచున్నది.

---

## సంపెఁగ

గోరుగంతు అచ్యుత సూర్యనారాయణశర్మగారు

ఘుమఘుమవిూరఁ దావులను గ్రుమ్ముచు నాసకు విందుఁ జేసి చి
త్తమున ననీదృశంబగు ముదంబునుగూర్చితి త్రోవఁబోవు వా
రి మనమునైన రాఁబిలచి ప్రీతిని గూర్చితి, గాన యా సతుల్
రమణ శిఖావతంసముగ రాజిలఁ జేసిరి నిన్ను సంపెఁగా!

అలరులమిన్న! సంపెఁగ! యొయారముగా నినుఁ గేలఁ బూని, యే
లలితఫలంబు నెమ్మదిఁ దలంపుదు, వా సనఁజూచినంత, నా
ఫలముల తావి గ్రుమ్ముచు విభాసిలు దీ వటుగాన నీకు నా
జలరుహసూతి సర్వఫల వంచకనం చభిధేయ ముంచెఁ బో!

అలరుల నారితేరి, యనయంబుఁ జెలంగెడి దెమ్మెరేఁడు, ని
గ్గలియఁగ రాఁడటంచు మదిఁగాంచఁగఁబోకు మొకింతఁ జింత నా
యలికుల వేణులోఁ దరల నందముగా నినుఁ బూనలేదొ! యా
మలినుఁడు జేరకుండు టదె మంచిది నీ సిరి కెల్ల సంపెఁగా!

---

పరమేశ్వరునిచే సృజింపఁబడిన జీవరాసులలో మనుజు లగ్రగణ్యులై యున్నారు. అట్టి మనుజు లొండొరులు తమ యభిప్రాయముల బోధించుకొనుటకు భాషయనునది ముఖ్యసాధనమై యున్నది. అభిప్రాయ బోధకమై వ్యక్తధ్వన్యాత్మకము నగునది భాష. అట్టి భాష రానురాను పరిపుష్టమై వాఙ్మయముగ బరిణమించును. ఆవాఙ్మయమును సాధించుట కుపయోగించునది యే వ్యాకరణము. వ్యాకరణమున ఆయాకాలములందలి సుశబ్దాపశబ్దము లాయాకాలములోని శిష్టవ్యవహారమువల ననే తెలిసికొనుట సుకరమైనను బూర్వపూర్వకాలములలోని భాషను, దానిసౌష్ఠవమునుమాత్ర ముత్తరోత్తర కాలములందలి వ్యవహారమునుబట్టి తెలిసికొనుట సుకరముకాకుండుటచేతను, వాఙ్మయస్థ భాషయంతయు వ్యవహారమునుబట్టి తెలిసికొనుటయు శక్యముకాకుండుటచేత నట్టి పూర్వపూర్వకాలములందలి భాషను, దానిసౌష్ఠవమును, వాఙ్మయస్థ ప్రపంచమును దెలిసికొనుటకు విశేష పరిశ్రమ యక్కఱలేకుండ, వ్యాకరణకర్త తానట్లు శ్రమించి సంపాదించిన యాజ్ఞానమును పాఠకులకు జాలవరకు సులభముగను నిస్సంశయముగను లభించునట్లు చేయునది యే. భాషలలోఁ బ్రాచీనమైనది గీర్వాణభాష. ఆభాష మొదట నార్యులీదేశమునకు వచ్చినపు డీదేశమున నారంభమై వ్యావహారికభాష యన బరఁగుచుఁ బరిపుష్టిని జెందినది. పరిపుష్టమై శిష్టవ్యావహారిక భేదముఁ బొందిన భాషలో శిష్టభాషతో నార్యులు దేవతాస్తుత్యాదుల జేయుచుండిరి. ఆస్తుత్యాది స్వరూపమే వేదము. ఆవేదముఁ బ్రాచీనమైనది ఋగ్వేదము. అది రచించుకాలమున వ్యావహారికభాష నుపయోగించు వారలకుఁగూడ నర్థమౌనట్లు శిష్టులు వ్యావహారికముతోఁ గొంచెము భేదముఁగల్గిన శిష్టభాషతో దానిని రచించిరి. ఋగ్వేద రచనాకాలమునుండియే గ్రాంథికవ్యావహారిక భేదమును భాషపొందినది.


వ్యావహారికభాష సహజముగాఁ బరిణామమును బొందుచునే యుండును. రానురాను వ్యావహారికము ఋగ్వేదభాషతోఁ జాలభేదమును బొందినది. ఆ కాలీనులకు ఋగ్వేదభాషయర్థము జేసికొనుట కష్టమగుటచేఁ జాల శ్రమించి శాకల్య శాకటాయన గార్గ్యాదులు పదపాఠము, ప్రాతిశాఖ్యలు మొదలగునవి రచించి భాషకుఁ బ్రకృతి ప్రత్యయవిభాగమును గొంతవరకుఁ జెప్పిరి. ఆగ్రంథము లిప్పుడు లోపించినవి. అట్టి ప్రాతిశాఖ్యలు లోపించుటచేతనో లేక మఱే యేకారణముచేతనో యాస్కుఁడు నిరుక్తమును రచించెను. ఆపిశలి కాశ్యపాదులు వ్యాకరణముల రచించిరిగాని యవి లోపించినవి. తరువాతఁ బాణినిమహర్షి తనకుబూర్వము నున్న వ్యాకరణములును సమగ్రములుగ లేకపోవుటచేతను గొన్ని లుప్త వ్యాకరణ ప్రాయము లగుటచేతను విపులమగు వ్యాకరణమును రచించెను. ఇతఁడు వ్యాకరణము వ్రాయునపుడు వైదికభాషనే మనస్సున నిడికొని కర్మాచరణసమయమం దుపయోగించు శిష్టభాషను గ్రహించి వ్యాకరణము వ్రాసినట్లు తెలియుచున్నది. అంతియకాని వైదిక గ్రాంథిక సాధారణముగ వ్రాసినట్లు తోఁపదు. కర్మాచరణసమయమునందు ప్రయుక్తమగు శిష్టభాష నుపయోగించునట్లు పాణిని వ్యాకరణము వ్రాసెననియు, కర్మాచరణ సమయముల నాభాష నుచ్చరించినఁ బుణ్యాదులు లభించుననియు, మహాభాష్యకారుఁడు దెలిసియున్నాఁడు. ప్రధానముగ వైదికభాషను సాధించు నుద్దేశము మనస్సున నిడికొనియే పాణిని వ్యాకరణము వ్రాసినట్లు కొంతమంది యీదిగువకథ నుదాహరించుచున్నారు.

బ్రహ్మదేవుఁడు తనతండ్రి యగు విష్ణుమూర్తిని "తండ్రీ! నా వేదముల సమగ్రముగ సాధించు వ్యాకరణ మొకటియుఁ గానరాదు. ఇప్పటివారలు కొంతశ్రమపడి యైన నెట్లో సమర్థించుకొన్నను ముందు వారలు తమకు పరియగునర్థము కాకుండుటచే యల్పమగు వ్యాకరణజ్ఞాన

ముచేఁ దప్పులుగ భావింతురు గాన వానిని సమగ్రముగ సాధించు వ్యాకరణమును భూలోకమునఁ బ్రసాదింపు"మని ప్రార్థింప "సరియే! సరస్వతిని భూలోకమున జన్మింపఁజేసి యీశ్వరునిగూర్చి తపముచేయించిన లభ్యము" నని చెప్పఁగా సంతసించి సరస్వతిని భూలోకమున వేదముల సమగ్రముగ సాధించు వ్యాకరణముకొఱకై పాణినిగోత్రమున జన్మింపఁజేయు సరస్వతి శివునికొఱకు తపస్సుచేసి ప్రధానముగ వైదికమునకు వ్యాకరణమును రచించెననియు చెప్పుచు యీక్రింది యుదాహరణల నుపష్టంభకములుగ నిచ్చుచున్నారు. ఛందసి, ఆమ్నాయే, నిగమే, మన్త్రే, ఋచి, యజుషి, కాఠకే, సాను, అథర్వణిక సంహితాయాం, బ్రాహ్మణే, ఉపనిషది, ఆర్షే, ఇత్యాదు లనేకములు. పైకథయేకాకుండఁగా ఇతఁడు సాధించిన వాఙ్మాలములోఁ జాలభాగము వైదికమే యను విషయము సర్వజనవిదితమే. వైదికశబ్దములనే ప్రధానముగ సాధించుచున్నను లౌకికమును గొంతము సాధించునట్లును, "ఇత్థం లౌకిక శబ్దానాం దిఙ్మాత్రమిహదర్శితమ్" అను సిద్ధాన్తకౌముదిలోని కారికవలననే తెలియుచున్నది.

ఈపాణిని చాలశ్రమపడి విపులమగు వ్యాకరణమును వ్రాయుటచేతనే కాఁబోలు, వ్యాకరణాదుల పారాయణకుఁ బుణ్యఫలము తత్తదాచార్యులు కల్పింపసాగిరి. ఇట్టి యభిప్రాయమే శబ్దేందుశేఖరమునఁ జూపబడినది. భాష్యకర్త కొన్ని కొన్నిచోట్ల సూత్ర సూత్రాంశములఁ బ్రత్యాఖ్యానము చేసిన నతఁడు వ్యర్థసూత్రాదులు లేవని చెప్పియుండుటచేత నతని యభిప్రాయానుసారముగ నాప్రత్యాఖ్యాతములగు సూత్రములకుఁ బారాయణాఫలమును వైయాకరణులు కల్పించిరి. మహాభాష్యకారుఁడుసూడ "వేదాన్నో వైదికాః శబ్దాః సిద్ధాలోకాచ్చ లౌకికాత్, అనర్థం వ్యాకరణమ్" అని యాక్షేపించి, వ్యాకరణశాస్త్ర పఠనమునకుఁ బ్రయోజనములఁ జెప్పుసందర్భమున వైదికకర్మలం దుచ్చరించుటవలనఁ బుణ్యమును గలిగించునట్టియుఁ బాపమును గూర్చునట్టియు సుశబ్దముల నుపదేశించుట మున్నగునవి వ్యాకరణశాస్త్ర పఠనమునకు ముఖ్యఫలములనియు, నితరములైనవి యానుషంగికములనియు చెప్పెను. "కాని పునశ్శబ్దానుశాసనస్య ప్రయోజనాని...రక్షోహాగమలఘ్వసందేహాః... స్వర్గేలోకే మహీయతే" (భాష్యము) ఇత్యాదులచే వైదికమునందే ప్రయోజనముల నెక్కుడుగ వ్రాసెను. ఇంతియుగాక శాస్త్రమునకు పరమేశ్వరమూలకత్వము నపౌరుషేయత్వము ననాదిత్వమును తత్కర్తకు దివ్యదృష్టిసంపన్నత్వాదులను గల్పించుటయుఁ బురాణయుగము వారి కలవాటు. అట్టి యలవాటుచొప్పుననే పాణినికి సర్వజ్ఞత్వదివ్యదృష్టిసంపన్నత్వ యీశ్వరవరలబ్ధ విద్యావైభవత్వాదులను పాణినీయమునకు పరమేశ్వరమూలకత్వాదులను గల్పించిరి. మఱియు పాణినీయమే యాదియనియు, పాణిని దివ్యజ్ఞాన తపోమహిమాదులచేత క్రొత్తగా లోకమున వ్యాకరణము నవతరింపఁజేసెననియు నుడివిరి. అది యుక్తముగా నున్నట్లు తోఁపదు. పాణినికంటె పూర్వమున వ్యాకరణములుండుటచే వ్యాకరణము క్రొత్తగా నవతరింపఁజేసినవాఁడు పాణినియనిన నెట్లని నమ్ముదురా? ఆయావ్యాకరణములఁ జదివి గొప్పపాండిత్యమును సంపాదించి విపులమగు వ్యాకరణమును వ్రాసెనే గాని యపూర్వమైనది కాదనియు, నితనికి పూర్వమున శాకల్యశాకటాయన గార్గ్యాదులపదిమంది వైయాకరణులుండినట్లు పాణినియే తెలియఁజేసెననియు, కాననిదియే క్రొత్తదిగాదనియు విమర్శకులయాశయము. మఱియు పాణినిగ్రంథములోని కొఱతల భాష్యవార్తిక కాశికాకారాదులు పూరించుటచేతను, నింకను వాఙ్మయపారజ్ఞులు పూర్తిచేయవలసి యుండుటచేతను, పాణినికి సర్వజ్ఞత్వదివ్యదృష్టి సంపన్నత్వాదులు గల్పించుట యుక్తమా? యనియు, వ్యాకరణశాస్త్రజ్ఞుల కీవిషయము బాగుగా తెలియుననియు, అష్టాధ్యాయికి వేదాంగత్వము చెప్పుట యుక్తముకాదనియు నుడివిరి. కాని కొందఱు పాణినికి సర్వజ్ఞత్వాదుల నీక్రింది విధముగ నిలుపుచున్నారు.

పాణిని దివ్యదృష్టికలవాఁడనియుఁ, దనకు పూర్వమందున్న భాషను సమర్థించెననియు, ముందు ప్రయోగింపబడు భాషను వార్తికకారాదులు సమర్థించెదరని తెలిసికొని ముందురాబోవు భాషను సమర్థింపలేదనియుఁ జెప్పుచున్నారు. తనకుఁ బూర్వమందున్న భాషనుగూడ



శ్రీ కీ. శే. దామెర్ల రామారావుగారు

౧౯౨౫ సంవత్సరమున

చిత్రకారుడు: ఓ. హాల్డేన్‌గారు.

వతఁడు సమర్థింపకపోవుటచే పైవాక్యము యుక్తిబాహ్యమగుచున్నది. ఒకటిరెండు ప్రయోగములున్నచో నతని ప్రయోగముచేతనే సాధువులని చెప్పిన నొకసంధినే వదలినచో నతఁడు దానివిషయమున బొరపాటు పడినాఁడని చెప్పకతప్పదు. చూడుఁడు. కులటాశబ్దమును తనసూత్రముల (కులటాయాం వా) ప్రయోగించినాఁడు అతనిసూత్రములచే కులటాశబ్దము సాధింపఁబడదు. అతనికి పూర్వమీశబ్దము లేదనుటకు వీలులేదు. పూర్వమందున్నదిగాన నితఁడు ప్రయోగించియున్నాఁడు. దాని నేడియాకీతిని మనవైయాకరణులు సమర్థించుచున్నారు. "అతఏవనిపాతనాత్సిద్ధః" అనియో, "పృషోదరాదిత్వాత్సిద్ధః" అనియో చెప్పుచు సమర్థించుచున్నారు కాని యిట్టి యుదాహరణలకై పరరూపసంధి తాను చెప్పవలయును. అట్టిది లేకపోవుటచేతనే "శకన్ధ్వాదిషు పరరూపంవాచ్యమ్" అనువది వెలువడినది. ఆపరరూపసంధి చేయవలసిన ప్రయోగము నొకదానిని పాణినిచేసిన నెట్లో సమర్థించిను "సర్వత్ర లోహితాదికతన్తేభ్యః" "ప్రోహాభ్యాం సమర్థాభ్యాం" ఇత్యాదుల నెన్నిటినో యట్లు సమర్థించుట యుక్తముకాదనియు, పరరూపసంధిని వదలివేయుట బాగులేదనియు చెప్పకతప్పదు. ఇంకనెన్నియో కన్యాశబ్దాదులును సమర్థింపఁబడనివియున్నవి. ఇదియును గాక తన పూర్వముగనున్న రామాయణాదుల భాషను కూడ సమర్థింపలేదు. అనేక ప్రయోగములు సాధింపనివే యున్నవి. ఆదికావ్యమును, తనకు పూర్వముందున్న వాఙ్మయములో నగ్రగణ్యమును నగు దాని భాషను సమర్థింపకపోవుట కడిదేమి విషమిదెనా? లేక దానియందు శ్రద్ధత్వమా? కాబట్టి యీ పాణిని మహర్షి చాలశ్రమపడి వ్యాకరణమును వ్రాసెననుట కెవ్విధమైన యభ్యంతరము లేదనియు, నితఁడు వైదికమును సాధించు నుద్దేశ్యముతో సమగ్రముగ లౌకికమును సాధింపలేదనియు, నాసాధించిన లౌకికమునుకూడ కర్మాచరణసమయమున నుపయోగింప చాలవరకుపయుక్తముగుదానినే సాధించెననియు, నందుచే లౌకికమునకు సమగ్రమగు వ్యాకరణము లేదనియు చెప్పకతప్పదని కొందఱి యాశయము. పాణినిమహర్షి తరువాత వార్తికకారుఁడగు వరరుచి, పాణినితరువాత పరిణామముబొందిన భాషను సమర్థింపఁబూనుకొని నాల్గువేల సూత్రములకు సుమారు పదిహేనువందల వార్తికముల రచించి యప్పటిభాషను సమర్థించెను. ఇతఁడు వ్యాకరణమున పూర్వపుభాషను సమర్థించుటయే యనుకొని తానట్లు చేసియున్నాఁడు. వార్తికకారుని తరువాతనున్న వాఙ్మయమును సాధించు భాష్యకారుఁడు కూడ పై యభిప్రాయమునే తలంచెనని చెప్పుటకు సందేహము లేదు. వీరికాలములనున్న వాఙ్మయమును వీరు సాధించుటచేతను, వీరికాలమున నశించిన ప్రయోగములకొఱకుపయోగించు సూత్రము లనవసరములని ప్రత్యాఖ్యానము చేయుటచేతను వారు వాఙ్మయమును సమర్థించుటయే వ్యాకరణమునకు ఫలమని తలంచిరని చెప్పుట నిర్వివాదము కాని వారు పాణినియందు భక్తిశ్రద్ధాతిశయముగలవారైన నవసరములగు విషయముల ఖండించి వారిమతమును నిలబెట్టుకొనుట చేతను "యథోత్తరం మునీనాం ప్రామాణ్య"మ్మని చెప్పి పాణిని మతముకన్న తరుత్తరులగు వరరుచి భాష్యకారుల మతమునకే ప్రాధాన్య మితర వైయాకరణులిచ్చుట చేతను, వైయాకరణులే పాణినియందు గొంతవరకరుచిని జూపిరనుటకు సంశయము లేదు.

ఈమునిత్రయము తరువాత చాలమంది వ్యాకరణగ్రంథముల నెన్నిటినో వ్రాసిరి. కాని వారు వారి కాలమందున్న వాఙ్మయమును సమర్థింపకపోవుటయే గాక వ్యాకరణమున శాస్త్రీయదృష్టి యుక్తముగు నదియేయని తలంచి యుక్తిపై యుక్తులతో గ్రంథముల వ్రాసిరి. ఇట్లు వ్రాసినవారిలో భట్టోజిదీక్షితులు మాత్రము దుర్గ్రాహ్యమగు నష్టాధ్యాయికి "సిద్ధాన్తకౌముది" యను పేర సుబోధకముగునట్లు వృత్తిరచించెను. అతఁడుగూడ మునిత్రయము సమర్థింపనిభాష సమర్థింపఁగూడదని తలంచెనని చెప్పుటకు సందేహము లేదు. వ్యాకరణమున పై వారలే యభిప్రాయమునుపడిరో యితఁడు నట్లే యనుకొనెను.

మహాకవులెన్నియో సహజపరిణామమును బొందినరూపముల నుపయోగించిరి. వారుకూడ శిష్టులే; పాణి

వ్యాది మనిశ్చయమేకాక ప్రయోగకుశలులందఱు శిష్టులేయని చెప్పకతప్పదు. ఈయభిప్రాయమును మహాభాష్యకారుఁడు "శిష్టానామ శబ్దప్రయోగకుశలాః" అని చెప్పియున్నాఁడు. కాన కాళిదాసాదిమహాకవులుకూడ శిష్టులేయని చెప్పుటకు సందేహము లేదు. కాళిదాసాదులు మహాకవులని యానందవర్ధనాచార్యుఁడు చెప్పియున్నాఁడు. "ద్విత్రాః పఞ్చషావా మహాకవయః కాళిదాసాద్యాః" వారిచే నుపయుక్తమగుభాష చాలవరకు నసాధితమైయున్నది. వానిని కొంచెము నిరూపింతును. విశ్రామః—"విశ్రామం లభతామిదంచ శిథిలజ్యాబంధ మస్మద్ధనుః" (కాళిదాసు) "విశ్రామో హృదయస్య" (భవభూతి) మున్నగువారలు ప్రయోగించిరి. దానివిషయమున దీక్షితులు నిశ్శంకముగ "విశ్రామ ఇతి త్వపాణినీయమ్" అని వ్రాసినాఁడు. అట్లుచెప్పక దానిని సాధించిన బాగుండునేమో?

త్రియంబకమ్— "త్రియంబకం సంయమినం దదర్శ" (కాళిదాసు,) మహ్రభుః—"విరూపనాథుభ్రుకుటః పితుర్గృహే" (కాళిదాసు) "హోపికః కాప్యసిహేమభ్రుః" (భట్టి) ("ప్రమాదవీవాఽయమ్" అని వ్రాసినాఁడు) అపైహి:- "అపైహిమాంకింకర నష్టమూర్తేః" (కాళిదాసు) ("వృద్ధిరసాధురేవ" అని వ్రాసినాఁడు.) ఇంకనెన్నియో ప్రయోగము లసాధితములున్నవి. వానిలోఁ గొన్నిటిని సాధింపటకుఁ బ్రయత్నించినాఁడు. గొన్నిటిని ప్రమాదములని వ్రాసియున్నాఁడు. "తం తస్థివాంసం నగరోపకంఠే' "శ్రేయాంసిసర్వాణ్యధిజగ్ముషస్తే". ఛాందసములగు క్వసుకానచ్ప్రత్యయములు లౌకికమునఁ బ్రయోగించిరి. వానినిగూడ సమర్థింపలేదు. "క్వసుకానచౌ ఛాన్దసావితి త్రిమునిమతం, కవయస్తు బహుళం ప్రయుంజతే" అనిమాత్రము వ్రాసియున్నాఁడు. ఇంకనెన్నియో యున్నవి. కాని వానిలోఁ గొన్నిటి నధ్యాహారములతోను, విపరిణామములతోను, బహుళగ్రహణములతోను, చకారములతోను సమర్థించుచువచ్చిరి. సమాధానము చెప్పలేక యేవేవో కల్పించిరేగాని వానిని సరిగ సమర్థింపలేకపోయిరి. వాని నెట్టిటులో సమర్థించినను "తం పాలయాం ప్రథమమాస పపాత పశ్చాత్" (కాళిదాసు) "ఉత్తస్థాం ప్రచక్రము ర్నగరస్య మార్గాః" (భట్టి) "ప్రభ్రంశయాం యోనహుషంచకార" ఇత్యాదులును సాధింపఁబడకేలేదు. ఇట్టి ప్రయోగముల నెన్నిటినో సాధింపకుండుట వారికిని వారి వ్యాకరణమునకును లోటని చెప్పితీరవలయును. అందుచేతనే సంస్కృత వ్యాకరణ మసమగ్రమని చెప్పుచున్నారు. కాని మహాకవుల ప్రయోగముల మతికొందఱు నిఘంటుకారులు నితరవ్యాకరణకర్తలును సమర్థించిరి. "విశ్రామః" అనుదానిని ముగ్ధబోధకారుఁడగు బోపదేవుఁడు సమర్థించెను. వాచస్పత్యమను నిఘంటువునందు త్రియంబక శబ్దార్థనిరూపణసమయమున ఈపదము వైదికమని త్ర్యంబక, త్రియంబక అను రూపద్వయముగా నున్నదనిచెప్పి (గంగస్యథయథా) లౌకికమున శిష్టప్రయోగములుండుటచే "క్వచిల్లోకే పివా ఇయఙ్" అని వ్రాసి కాళిదాసుని ప్రయోగము నుదాహరించెను. ఇటుల సమర్థించినందులకు వీరు కొంత ప్రశంసనీయులు. నాగేశభట్టుకూడ శాస్త్రార్థదృష్టి నుంచుకొనియే వ్యాకరణగ్రంథముల రచించెను.

పాణినీయముగురించి యిటులుండఁగా "ముగ్ధబోధ"యను మరియొక వ్యాకరణము గలదు. దానిని గురించి నాకు దోచినరీతిఁ గొంత విమర్శింతును.

బోపదేవుఁడు ముగ్ధబోధవ్యాకరణమును రచించెను, ఇతడు లౌకికప్రయోగముల సమగ్రముగ సాధింపవలయునను నూహచేతను, సూత్రములు, వార్తికములు సుమారు వేలవరకు నుండుటచే వానిని తగ్గించు నూహచేతను సుమారు పదిరెండువందలతో తన వ్యాకరణమును ముగించెను. కాని యితనిసూత్రములచే పాణినీయాసాధితములు కొన్ని సాధింపఁబడినను నతనికాలపు లౌకికవాఙ్మయము చాలభాగము సాధింపఁబడలేదు. కాని దానికి వ్యాఖ్యాకర్తలగు దుర్గాదాసు, శ్రీరామ తర్కవాగీశు మున్నగువారు బోపదేవసూత్రములచే సాధితములుగాని ప్రయోగములను, పాణినిచే నసాధితములగు వానిని బహుళగ్రహణాదులచే సాధించినట్లు కొంతవరకు సాధించిరి. అదియు క్తముగానున్నట్లు తోఁపదు. చూడుఁడు:-"మనీషా" "బహుళవచన గ్రహణాంగణార్థం, గణక్ప్రద

శాభ్యామియా సూత్రాప్యత్యాగ్యమయః. నచతదా అధ్యా యాన్తరే నిపాతనసూత్రైర్గలమితి వాచ్యమ్, తేషాను స్యైవ ఉదాహరణార్థకత్వాత్, యల్లక్షణే నానుత్పన్నం తత్సర్వం నిపాతనాత్సిద్ధమితి భాష్యం. నిపాతలక్షణం యథా:"వర్ణాగమో వర్ణవిపర్యయశ్చ ద్వౌ చాపరౌ వర్ణవికారనాశౌ, ధాతోస్తదర్థాతిశయేన యోగస్తదుచ్యతే పంచవిధం నిరుక్తమ్"మితి ప్రాహుః. అని సూత్రములకు వ్యాఖ్యానమొనర్చి, బోపదేవసూత్రాసాధితములను, పాణిని ప్రత్యేకసూత్రసాధితములు నగు ప్రయోగముల నీగణమునఁ బఠించిరి. "పృషోదరాదీని యథోపదిష్టమ్" "పారస్కర ప్రభృతీని చ సంజ్ఞాయాం" "గోష్పదం సేవితాసేవిత ప్రమాణేషు" "మస్కర మస్కరిణౌ వేణు పరివ్రాజకయోః" "అపస్కరో రథాంగమ్" "ఆశ్చర్యమనిత్యే" "విష్కిరశ్శకునౌ వా" "కా నా ప్రేంకితే" "హేసపరే వా" "అన్యోరహోభ్యాం ద్వే" "దీర్ఘాదాచార్యాణామ్" "అవశ్యశ్యశీయా...చ్ఛేషు" ఇత్యాదిపాణిని ప్రత్యేక సూత్రసాధితములను ప్రయోగము లీగణమునఁ జెప్పఁబడియున్నవి. మఱియు గణసూత్రము కానిచోటులకూడ "క్వలాత్... సాధవః" అనుచో "బహువచనగ్రహణం గణార్థ మ్మని వ్యాఖ్యానము చేసి, బోపదేవసూత్రాసాధితములును, పాణినిప్రత్యేకసూత్రసాధితములునగు ప్రయోగములు నీగణమునఁ బఠించిరి. "అగ్నేస్స్తుత్స్తోమసోమాః" "భీరోః స్థానం" "సమానేంద్రులేస్సంగః" "ఈదగ్నేస్సోమవరుణయోః" "గవియుధిభ్యాం స్థిరః" "జ్యోతిరాయుషః స్తోమః" ఇత్యాదుల నేకములు. వాళిద్రాముల కనేకార్థము లగల్పించిరి. ఇటు లొనర్చిన పాణిని సూత్రములు చాలా భాగము తీసివేయవచ్చును. ఒక గణసూత్రమును జెప్పి యేయే కార్యములైనను దాని చే సమర్థించిన బాగుండును? అటు లొనర్చిన పాణినిసూత్ర మొకదానికంచిన పరిపోయుండునా? ఇంక నెన్నియో యిటులే సేసిరిగాని కొన్నిటిని మాత్రము "క్వచిద్విశేషే సామాన్యోవశాధ్యతే" అనిచెప్పి "సఖినావాసకేస్త్రేణి" "పతినానీయమానాయాః" "గతేష్వృతే...పతౌ" "సీతాయాః పతిరేవచ" ఇత్యాదులను, "సుభ్రూ...స్వాః" అని చెప్పి "విమానసాసుభ్రు" "క్వాసి హే సుభ్రు" ఇత్యాదులను సమర్థించిరి. త్రియంబకమిత్యాదుల సమర్థింపనే లేదు. కాబట్టి పాణినిసూత్రముల నన్యథాగాచేసి బోపదేవుఁ డొనర్చిన యుపకృతియేమో తెలియకున్నది. కొంతవరకు శ్రమించి వ్యాకరణము రచించినందులకు ప్రశంసనీయుఁడే కాని యితఁడు వ్యాకరణము రచించుటను నే యభిప్రాయమును బెట్టుకొనెనో యది యుక్తముగానున్నట్లు దోఁపదు. ఇతనికన్న వ్యాఖ్యాకర్తలు కొంత శ్రమించి వాఙ్మయము నెట్టులో గొంతవరకు సమర్థించుటచే ప్రశంస్యులు.

ఇటుల వ్యాకరణకర్తలును నిఘంటుకారులును సంస్కరించుటచేతనే యీ గ్రాంథికవాఙ్మయము సంస్కృతమని వ్యవహరింపఁబడుచున్నది. అట్టిసంస్కృతము నుండి పుట్టినది ప్రాకృతము, "ప్రకృతిః సంస్కృతం, తత్రభవం ప్రాకృతముచ్యతే" అని చెప్పఁబడియున్నది. కొందఱు "ప్రకృతిః ప్రాకృతం తత్రసాధితం సంస్కృతమ్" అని చెప్పుచున్నారు. ఏది యెటులైనను ప్రాకృతభాషకు సంస్కృతమునకు సంబంధము కలదు. ఆప్రాకృతభాషకు మొదట వరరుచి వ్యాకరణమును వ్రాసెను. ఇది చాలవరకు నసంబద్ధముగానున్నదని దానిని సరిగఁజూచినవారు తప్పక చెప్పుదురు. సంస్కృత వ్యాకరణాచారముగ బహుళగ్రహణములను (దాధాదయో బహుళమ్) (సంధౌ...బహుళమ్) ప్రాయగ్రహణములను (కగచజతద...ప్రాయోలోపః")విభాషలను పెట్టుకొని వాఙ్మయమును సమర్థించెను. అవి యింకను సరిపడవు. అందుచేత నీ వ్యాకరణమునకు మొదటిసూత్రమగు "ఆదేశతః" అను దానికిమును "బహుళం" అను సూత్రమును బెట్టి వాఙ్మయమును సాధించిన చాల బాగుండును. ప్రాకృతము వ్యవహారములో నున్నప్పుడు వ్యాకరణము వ్రాయఁబడుటచేత నట్లున్నదని కొందఱు చెప్పుచున్నారు. ఎట్లయినను ప్రాకృతమునకుఁగూడ సమగ్రవ్యాకరణము లేదని విమర్శకుల యాశయము.

సంస్కృతప్రాకృతములతో విశేషసంబంధ ముండునది తెలుఁగు. ఆ తెలుఁగునకు నన్నయ మొదట వ్యాకరణమును రచించెను. ఇతఁడు తన వ్యవహారా

సుగుణముగ నాచ్ఛికముల సంస్కరించుకొందురను మూహచే ఆ విషయమున నెక్కువగ ప్రసంగింపలేదు. ఈవిషయమునే "సిద్ధిర్లోకాద్ధ్వన్యాః" అను సూత్రము చెప్పుచున్నది. కాని సంస్కృతశబ్దముల తెనుఁగున నెటులు ప్రవేశపెట్టుకొనవలయునో తాను విషయమును విపులముగఁ జర్చించినాఁడు. సంస్కృతవ్యాకరణమునకు పాణిని యెట్టివాఁడో తెనుఁగున కితఁడట్టివాఁడు. ఇతఁడు సంస్కృతభాషతో "ఆంధ్రశబ్దచింతామణి" యను నాంధ్రవ్యాకరణమును రచించెను. ఇతనికాలమువారు తెనుఁగున దభిరుచికలవారు కాకపోవుటచేతనే యిటులఁజేసె నని యందురు. ఇతఁడు సంస్కృతవ్యాకరణవాసనా వాసితుఁడగుటంజేసి సంస్కృతవ్యాకరణసూత్రముల తన యాంధ్రవ్యాకరణమున నెక్కుడుగ వాడియున్నాఁడు. తెనుఁగునలేని సుప్రత్యయములకు కొన్నిటికి చెప్పి లోపము విధించియుండుట సంస్కృతవాసన యెక్కుడుగ నున్నదని తోఁపకమానదు. "అనుతాం స్త్రియాం సమాసాం స్త్రీమప్యచసులోపః" అని చెప్పియున్నాఁడు. "ద్విత్వసుదీర్ఘతో బహుళమ్" "లఙ్ సంశ్లేషో నాచి" "కర్మప్రవచనీయకేతు ర్వి:" "అన్యతరస్యామ్" "వా" ఇత్యాదులలోకములు సంస్కృతవాసన యెక్కుడుగనున్నదని నిరూపించుచున్నవి.

ఇతఁడు తత్పూర్వపు గ్రంథములు లభింపమి భాషాస్వరూపమును దెలిసికొనుట దుర్ఘటమైనను తద్విషయమున నెక్కువపరిశ్రమచేసి యాంధ్రవ్యాకరణమురచించి ముందు వారల కుపకృతి గావించినఘనుఁడు.

ఇతనితరువాత తెనుఁగును కొంతవరకు సంస్కరించుమూహచే కేతన "ఆంధ్రభాషాభూషణ" మనుదానిని రచించెను. అదియు సమగ్రవ్యాకరణము కాకపోవుటచే తరువాత నథర్వణుఁడు "వికృతివివేక" మను నథర్వణకారికావళిని రచించెను. ఇతఁడు కొంతవరకు శ్రమపడి చింతామణిలోని నిగూఢాశయముల, వా, హి, మొదలగు వానిచే వివరించి పెక్కింటిని సాధించినాఁడు. తరువాత నహోబలుఁడు "అహోబలపండితీయ" మనుపేర వ్యాకరణము రచించెను. ఇతఁడు చింతామణిని యథర్వణునికన్న నెక్కుడుగ వివరించెను. నన్నయ ప్రథమాచార్యుఁడనియు, నథర్వణుఁడు ద్వితీయాచార్యుఁడనియు, తాను పతంజలిననియు, నితఁడభిప్రాయపడినట్లు యితని వ్రాతలఁబట్టి తెలిసికొనవచ్చును. తెలుఁగపద్యంశమునుబల జడిలో నీపండితుఁడు తెనుఁగుభాషయు, సంస్కృతము వలె వ్యక్తిత్వముకలదని నిరూపించుటకు చాలప్రయత్నించినాఁడు. ఇతఁడు చాలరూపములఁ జక్కగ సాధించినాఁడు. కాని కొన్నికొన్నిటసాధుత్వము చూపింపక పోలేదు. ఉదా: కలకంఠుఁడు. ఇది గ్రామ్యశబ్దము. రెండు స్త్రీసమశబ్దములకే బహువ్రీహి సమాసమని పూర్వాంధ్ర వైయాకరణుల నిర్ణయము. ఇంకొకటి స్త్రీసమము. రెండవది తత్సమము. రెంటికిఁగలిపిన సమాసము నితఁడు మిశ్రబహువ్రీహియని సమర్థించుచు, కల కంఠశబ్దములోని తకారము సమాసాంతప్రత్యయముగ నంగీకరింపవలెనని వ్రాసినాఁడు. ఒక్కపదమునకై మిశ్రబహువ్రీహి నంగీకరించుట, తకారము సమాసాంతప్రత్యయమని యంగీకరించుటకన్న, చిన్నయసూరివలె నీపదము ననిందగ్రామ్యమని యంగీకరించిన బాగుండెడిది. ఇతని తరువాత తిమ్మకవి, సూరకవి, మున్నగువారలు కొన్ని లక్షణగ్రంథములఁ బద్యరూపముగ వ్రాసిరిగాని యవి సమగ్రములుగాను, సుబోధములుగాను లేవు.

తరువాత వ్యాకరణమును జక్కనిశైలితో బాలావబోధముగ రచించినవాఁడు చిన్నయసూరి. ఇతని సూత్రములు సంగ్రహముగానుండి ధారణానుకూలముగ నుండును. ఇతఁడు సంస్కృతవ్యాకరణముల బాగుగఁ జదివినవాఁడగుటచే నెక్కుడుగ సంస్కృతవ్యాకరణ సాంప్రదాయముల నెఱుఁగి తనవ్యాకరణమును సాగించెను. "ప్రత్యాహారము, ఇత్సంజ్ఞ, స్థానివద్భావము, బహుళగ్రహణములు, విభాషలు, అధికారసూత్రములు. సంప్రదానాది సంజ్ఞలు ప్రాయికగ్రహణములు" మొదలగువాని నితఁడు తన వ్యాకరణమున నెక్కుటముగ వాడియున్నాఁడు.

ఇతఁ డేకని యుమతో వ్యాకరణము రచించినట్లు కాన్పడదు. కేవలభారతకవుల ప్రయోగములే సాధింతుమను నూహతో నీవ్యాకరణమును రచించెనందమా? యందలి "ఎంగిలిముతులు" "నూకలు" "కావ్యసంప్ర

యోగము పొందెన్" "పుచ్చికోలు" మొదలగు ప్రయోగముల సాధించినట్లు కాన్పడదు. అట్లుకాదు, 16 వ శతాబ్దమువరకు గల సుప్రసిద్ధకవుల ప్రయోగముల సాధింపదలంచితనికిగల దండమా? శ్రీనాథుని "యెల్లన్ శిష్యులతోడ" ఇత్యాదులు సాధింపఁబడవు. 16 వ శతాబ్దమువరకు నున్న కవులప్రయోగముల సాధించుతలంపు లేదందమా? "ఏకాంతమునందు నున్న జనరాంధ్ర"నని పెద్దనార్యునిపద్యము నుదాహరించి జన్యనశబ్దమునకు జవాదేశము విధించును.

తరువాత నాంధ్రమున కించుమించుగ సమగ్ర వ్యాకరణరచనకు బ్రయత్నించినవారు బ. సీతారామాచార్యులుగారు. వీరి వ్యాకృతి "త్రిలింగలక్షణశేషము" ఇందు చిన్నయసూరి సాధింపని ప్రయోగము లెన్నియో సాధింపఁబడెను. మఱియు సూరిసూత్రములకు కొన్ని సవరణలను, కొన్ని వివరణలను నీతడు చేసియున్నాఁడు. ఏపూర్వాంధ్ర వైయాకరణులు రచింపని వాక్యపరిచ్ఛేదమొండు రచించి వన్నెగాంచెను. వ్యాకరణరచనలో నీతనిమార్గ మభినన్దనీయము. సంస్కృతాదివ్యాకరణకర్తలుగాని తెలుఁగువ్యాకరణకర్తలు గాని యింతటి ప్రయోగవృష్టితో వ్యాకృతులు రచింపలేదని నొక్కి వక్కాణింపవచ్చును. ఈతని వ్యాకరణము కొన్ని భారతప్రయోగములను, కొన్ని యితరకవిప్రయోగములను సాధింపలేదు. "మారేపి" "నొంచినావు" ఇత్యాదులసాధితములు. కాని యయ్యవి యల్పములగుటచేఁ గొంతవర కాంధ్రమున కిదియే సమగ్రవ్యాకరణమని చెప్ప నొప్పును. తరువాత క్రొత్తపోకడలతో విపులవ్యాకరణమును రచించినవారు మ. సూర్యనారాయణశాస్త్రిగారు. వీరి వ్యాకృతి "సూర్యనారాయణీయము" మను నాంధ్రభాషానుశాసనము.

ఇటుల వ్యాకరణములు కొన్ని యసమగ్రములై, కొన్ని సమగ్రాసమగ్రములై యున్నవి.

సంస్కృతమున నూతనగ్రంథములు విశేషముగ బయలువెడలకుండుటను, సంస్కృతము వ్యవహారభ్రష్టమగుటచే భాష మారకుండుటను గాన పూర్వమందున్న భాషనంతయు సమగ్రముగ సాధింపవీలగుటను, సంస్కృతమునకు లక్ష్యలక్షణయుక్తముగ సమగ్రవ్యాకరణము చేయుహేతుభావులేని రచించుట యావశ్యకము. అట్టిది బయలువెడలినచో తిరుగ వ్యాకరణము రచింప నవసరముండదు. ఆరచించు వ్యాకరణము "త్రిలింగలక్షణశేషము"వలె లక్షణమునకు లక్ష్యము నిచ్చుచుండవలయును. ఆరీతిని వ్యాకరణమున్నచో చాల బాగుండును. ఇటులనే ప్రాకృతమునకు సమగ్రవ్యాకరణము రచించుట చాల యావశ్యకము. తెలుఁగునఁగూడ కొన్ని పూర్వకవుల ప్రయోగములు మిగిలిపోవుటచేతను, ప్రబలవ్యవహారములో నున్న కొన్ని పదములు సాధింపవలసియుండుటచేత నింకొక విపులవ్యాకరణము రచించిన బాగుండును.

కాఁబట్టి యిట్టి వ్యాకరణరచనకు నే మహారాజులో, యూనివర్సిటీవారో పండిత ప్రకాండుల తగురీతి ప్రోత్సహించి సంస్కృత ప్రాకృతాంధ్రవాఙ్మయములకు మహోపకార మొనర్చి తద్వ్యుత్పిత్సువుల నుద్ధరించి వారి కృతజ్ఞతకు పాత్రులయ్యెదరుగాతమని విశ్వసించుచున్నాను.

# లోకబాంధవుఁడు

జి. జాషువకవిగారు

అది, సముద్రప్రవాహవీచ్యంతరమున - నశుభదేవత, జీవుల నాహరింపఁ
బ్రకృతినిం డాగి, యాస్యగహ్వరము లిచ్చి - తాండవించెడు, మట్టమధ్యాహ్నవేళ.
అది, భయంకరమృత్యుదంష్ట్రాంతరాళ - జనితవిషవహ్ని వెఱసిపోయినప్రదేశ
మది, విషాదనీరదపూరితాంబరమునఁ - బ్రభవమందిన పిడుగులుపడిన తావు.

మృగతృష్ణల్ బాగదమ్ములో మెఱసి భూమీమండలిం గ్రమ్మ, పై
కెగసెం, నాల్కలుముద్దగట్టుకొనిపోయెం, జీవులల్లాడె, వి
ష్వక్ కేరెగెఁ వగుడాకుతోడ సుడిగాడ్పుందయ్యాలల్, ప్రొద్దుర్వ
బాగిరెక్కెఁ, బదిరెండుగొట్టినపు డెండకఁ గంట లుత్కంఠతోఁ.

గుబురుగొనియున్న తింత్రిణీకుజములందు - నాకుగొడుగులనీడల నధివసించి,
పులుఁగుపడుచులు, గుసగుస లొవ్వుచుండె-మలయుసుడిగాడ్పు టురవడి కులికిపడుచు.

సవితృమండలకిరణఘర్షణమువలనఁ - బ్రత్తికాయలు చిటపట బగులుచుండె
'టింగు'మనిమింటికెగసి యేట్రింతపిట్ట - యీలవేయుచు నొగిపల్లటీలుగొట్టె.

గాలిఁదిను నుక్కురబ్బరుకత్తలాని - నెక్కి, శరవేగమున వీటికేగువేడ్కఁ
బయన మొనరించునను తెప్పపాటులోనఁ-దాకె, మరపించిదుష్ప్రమాదము పిశాచి.

రబ్బరుబండికొమ్ములు కరంబులజారెను, దృష్టికడ్డమై
మబ్బులు గ్రమ్మె, నాదట ప్రమాదమెఱుంగను గాని లేదినా
జబ్బనుసప్తలోకములు సాగరముల్ మెరుముల్ విపద్ధ్వనుల్
గుబ్బటిలం గ్రహించితి, దిగుల్పడి, దయ్యము లీనుచోటునం.

యోచనాశూన్యమై, బాధయో! భయంబొ! -యనుభవించెడు, నాహృదయమున సోకె
"అయ్యయో!" యనుకరుణ కిల్లైనపలుకు - కుటిలతీక్ష్ణాతపముఁ జీల్చుకొనుచువచ్చి.

అదియొక దేవదూతపలుకా! యని కొంచెము నిబ్బరించి, క
న్నుదెఱచిచూచినాఁడ నొకనూతనపాంథుని కేమిసెప్ప, నా
నదయుఁడు బొమ్మగొట్టుకొనసాగెఁ బదింపదిమాటలేల? నా
కొదవినకష్ట మచ్చుపడియున్నది వాని ముఖాంబుజంబునం.

కిరణములతోడ ననుఁగంటగించిచూచు - తరణి కెవఁడిచ్చె లోకబాంధవసమాఖ్య
పరులబాధలు గని గుండెగిఱఁగి వగచు - పాంథ! నీవయ్య! ముల్లోకబాంధవుఁడవుం.

---

# స్వరకల్పన

శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు

"ఓహో! తెగ ప్రశంసిస్తున్నారే మిటి? సరికే మైనా ఉన్నదా? లేక యీరదంపే గా" అని శ్రేయోభిలాషులగు గురుపుంగవులు ప్రశ్నించినారు. భారతికాగితములు నలుపుచేయడము నాయాశయము కాదు. కాని అవసరమైన దానికంటె విపులమై యుంటవేమో నా వ్యాసాలు. నాయుద్దేశ్యములను పూర్తిగా వెలువరించే యత్నములో ఈపొరపాటు రావచ్చును. పాఠకులు క్షమించవలెను.

"అయితే స్వరకల్పనకి మాధుర్యము లేదా? ఈపాటికే పండితులందరి యాశయమూ ప్రజ్ఞా ప్రకటన మేనా?" అని స్నేహితులడిగారు.

రెండో భాగానికి మొదట జవాబిస్తాను. స్వరకల్పనచేసేవారిలో ముప్పాతికమూడువీసాలు ప్రజ్ఞాప్రకటనాభిలాషులే. ఈమధ్య నొకగాయకులు స్వరకల్పనను సమర్థించుచూ వాదించివాదించి చివరికి అది ప్రజ్ఞయే నని సెలవిచ్చినారు. కేవలము ప్రజ్ఞకోసము కాక ఆచారము పాలించడానికి స్వరకల్పనచేసేవారిని నేనెరుగ దును. ఇంకమాధుర్యము మాటనా రెండు వ్యాసాల్లోను విపులముగా చర్చించాను. స్వరచిహ్నలు వినబడకుండా చేర్చే కొంత మెప్పుబడవచ్చును. ఈగొప్ప స్వరకల్పనకి తగిలించడ మన్యాయము.

"కోయంబత్తూరు తాయారమ్మ, మహావైద్యనాథయ్యరు స్వరకల్పన బాగాచేసేవారు. వారికల్పనలో మాధుర్యము హెచ్చు. ప్రజ్ఞాప్రకటనాభిలాష తక్కువ. ప్రస్తుత గాయకులు వారి యౌన్నతిని సాధించినప్పుడు స్వరకల్పన శాస్త్రవాసన వదలించి కళాభాగము గనే విస్తృతముకాగలదు. అట్టి యౌన్నత్యము వారి కలవడేవరకూ వారికల్పన శాస్త్రాధారముగానే యుంటుంది. దానిని ఖండించుట భవిష్యత్కాల కనర్థదాయక"మని యొక విమర్శకులు అడ్డినారు. వాదము గొప్ప తెలివిని చూపిస్తున్నది. వారు పేర్కొన్న గాయకులు కీర్తిశేషులైనారు. తలిదిలు చూచుట కవకాశములు లేవు. కాబట్టి ప్రజ్ఞాప్రకటనమున కవకాశము కల్పించు నుద్దేశ్యముతో వారి యఖండవాదము వదలినారు దీని ననుసరించి స్వరకల్పనను పల్లెత్తుమా టనుటకు వీలు లేదు. ఏలనన "అది భవిష్యత్కాల కనర్థదాయకము." భేష్! చాల యుక్తికలవాదమే. కాని ఇది నిలువనేరదు. అధర్మము ననుసరించు నాగరికతవలెనే, అసత్యమును దన్నుగాగల నవాదములు నిలువవు. ఈవాదము దేనికైనా ప్రయోగించవచ్చును. ఏలనంటే, దీని పరిణామము భవిష్యత్తునమన్నది. భవిష్యత్తంతము లేనిది. "ముందు ముందు నాటకములలో పద్యములనుపాడి, నృత్యము నర్చి మెప్పించేవారు పుట్టగలరు. కూచిపూడిభాగవతులు సంగీతసాహిత్యనృత్యములందు సమాన ప్రజ్ఞ గలిగియుండే వారు. రసికాగ్రగణ్యులగు రాజులనుకూడ వారు మెప్పించినారు. అందువల్ల సంగీతనృత్యములను నాటకమునుండి వెలిపెట్టుట భవిష్యత్కాల కనర్థదాయకము." ఆ నేవాదము నాటకములో నృత్యమును జొప్పించగలదు. ఏమంటే కూచిపూడివారెట్లు నృత్తము నర్చియుండిరో ఎవరి కరుక? నిజమారయుటకు వీలులేని వాదములు సమర్థనార్హములా?

అయితే పై వాదమునకు తిరుగులేదా? అని పాఠకుల ప్రశ్నకలదు. దాని నసందర్భము సేయుటకు ఇప్పుడు కాకున్నా ఎప్పుడేనా సరే స్వరకల్పనము మెప్పించలేదు రసికుల నని నిర్ధారణముచేయవలెను. సంగీతమున మెప్పించగల యంశమేది? అని తర్కించి అది స్వరకల్పనలో నిముడదని చూపవలసి యుండును. దానితో "కాలో హ్యయం నిరవధి ర్విపులా చ పృథ్వీ" యను భవభూతి మహాకవియొక్క వాక్యము నీడను చేరిన స్వరకల్పనాభిలాషుల కానీడకూడ దొరకదు.

కళానుభవమున కేదియాధారము ? ఒకపద్యము పఠించి, ఒకబొమ్మచూచి, ఒకపాటవిని మానవు లెట్లానందించుచున్నారు. వానిలో మానవు లాకర్షించు విపరీతాంశ మేది? అది స్వరకల్పనలో నున్నదా? అనియే మనవితర్కము. మున్ముందు చిత్రకళ తీసుకొందాము. కళలన్నిటిలోను చిత్రకళ శీఘ్రగామి. చిత్రకారుడు గాలిమీది తరంగములపై నస్తమితార్కుని రాగవ్యాప్తియో, నీలిసంద్రముపై ఝంఝామారుతి మొనరించు వికట తాండవమో శరచ్చంద్రపూర్ణచంద్రికలోన మాతృస్తన్యము గ్రోలగోవత్సమో, తన్ను వేరెవ్వరూ చూడలేదను చిన్నతనము వదలి నిజసౌందర్యమును తటాకమందు తొంగిచూచుకొను వనకుసుమమునో చూచి ఒక వింతరకపు ఆనందము ననుభవించి బొమ్మ వ్రాస్తాడు. ఎందుకని తనవలెనే చాలామంది అదృశ్యమును చూచి ఆ "వింత రకపు" ఆనందము పొందవలెననేనా ? ఇది మనస్సులో నుంచుకొంటే కళ ఎలాగున నానందదాయక మౌతుందో బోధపడుతుంది. పైనచెప్పిన చిత్రకారుడు వ్రాసినబొమ్మ మనము చూస్తాము అప్పుడు నిజచిత్రమును చూచినప్పుడతనికెట్లో అట్లే ప్రతికృతిచూచిన మనకీ ఆనందము వస్తుంది. కళాకారుడు ప్రకృతిచూచినప్పుడు పొందిన ఆనందమే ప్రతికృతి చూచినమనలో పుట్టడమే కళానుభవము. దీనిని సంగీతానికి ఒత్తుదాము. గాయకుడు ఆనంద తన్మయావస్థలలో సుందరముగా గానము చేయును. పూజసేయు నుత్సాహముతో చెప్పినాడట త్యాగరాజు పెక్కుకీర్తనలు. రామదాసు బందిఖానా బాధలతో, కబీరు ప్రబోధానందముతో, ఇట్లే పలువురు. రూపరహితమైన అంతరోత్సాహము అందరియందును ఒక్కటే. నాదము దానికి దగ్గరి చిహ్నము. అందువల్ల పైనచెప్పిన యుత్సాహము నాదరూపమున వ్యక్తమౌతుంది మొట్టమొదట. ఇట్లు వ్యక్తమైనది విన్నప్పుడు—ఏడ్పువిన్నప్పుడు కొందరికి కన్నీళ్లు వచ్చినట్లు—మనకు, కర్తను జనించి పాడించిన ఊహాలో ఉత్సాహంలో—ఏదైతే అదే—కలుగుతాయి. తయారయినవాడు కాబట్టి ఆ ఊహలు కర్తచేత పాడించాయి. శ్రోత అంత పరిపక్వదశలో లేకపోతే అతనిచేత పాడించకపోయినా లోపల తహతహ పుట్టిస్తాయి. ఇదే ఆనందానుభవము, కళానుభవము, ఆలంకారికుల భాషలో రసానుభవము. గాయకుడు భావోద్బోధనచే పాడితేనే గాని అతడు వెలువరించేపాటలకు భావోద్బోధన చేసేశక్తి యుండదు. ఒక ఉత్సాహమును వెలువరించుటకు—కుస్తీపట్టినప్పుడు పుట్టేఉత్సాహముతప్ప స్వరకల్పనచేసితినని యే గాయకు డంటాడో అనమనండి. పీకకోసేటప్పుడు మేకఅరిచే అరుపులో రసానులున్నాయి. నట్టడవిలో విడువమన్న పతియాజ్ఞ విన్నప్పుడు సీతపలికిన మాటలలో బల్లెములున్నవి. అంటే, నాదము, శబ్దము వేర్వేరుగా "తహతహ" పుట్టించగలవు. రెండూకలిపితే రసాభాసము. శబ్దము, నాదము, రంగు, గీత చిహ్నములనీ, వీటి నుపయోగించడమువల్ల కవిత, సంగీతము, చిత్రకళ మొదలైన లలితకళ లుత్పన్నము లయినవి. అవి యిదివరకు వ్యాసములలో వివరించుకున్నాను. రెంకురెండు కలిపితే ఏదీ వ్యక్తము కాదు. స్వరకల్పనలో, భావ, నాదము చిత్తము వచ్చిన పాళ్లలో కలుస్తాయి. అందువలన అంతరోత్సాహమునకు స్వరకల్పనవాహకము కానేరదు. కాబట్టి గతించిన గాయకులు స్వరకల్పన బాగాపాడేవారన్న విమర్శకశిఖామణు లసత్యవాదులనుట కెంతమాత్రము సందేహములేదు. ఈమాట వొప్పించినేని తమపలుకుల సత్యము నిర్ధారణచేసుకొందురు గాక !

---

(వెనుకటిసంచిక తరువాయి)

### అంకము ౪.

### రంగము ౧.

### కోటలో నొకదారి

(ప్రవేశము. పెలియాజ్ మెలిజాండా లొకరి నొకరు కలుసుకొందురు.)

పెలియాజ్—ఎక్కడికి వెళ్లుతున్నావు? ఈ సాయంత్రము నీతో మాట్లాడాలని వుంది. నన్నుకలుస్తావా?

మెలిజాండా—అలాగే.

పెలియాజ్—నేనిప్పుడే మాతండ్రిగదినుండి వస్తున్నాను. అతనికిప్పుడు కొంచము నయముగా నుంది. వైద్యుడు జబ్బువలసిన అవస్థ దాటిపోయిందని చెప్పేడు. అయినప్పటికీ యీవుదయం నాకొకశకునం కనిపించింది: ఈ రోజు విచారకరంగా ముగుస్తుందని. కొంతకాలంనుంచి దురదృష్టదేవత నాచెవులలో విరామంలేకుండా రోద చేస్తున్నాది...అప్పుడు హటాత్తుగా నొకమార్పొచ్చింది. చెడ్డో రేపో రావలసిందే—ఇప్పుడతడున్న గది కిటికీతలుపులన్నీ తెరిచారు. అతడు మాట్లాడుతున్నాడు. కులాసాగానున్నాడు. ఇంకా మనలాగ మాట్లాడలేడు. కాని యిప్పుడతని యూహాలన్నీ వేరేప్రపంచంనుంచి వచ్చినట్టుండవు...ఇప్పుడు నన్ను పోల్చుకున్నాడు. నాచెయ్యిపట్టుకొని, వ్యాధివచ్చినప్పటినుంచీ అభ్యాసపడిన ఒక వింతచూపుతో నావైపుచూచి, "నువ్వేనా పెలియాజ్? ఇదివరకు నే నెప్పుడూ చూడలేదు. నీముఖంలో చాల కాలం జీవింపనివానివలె, విచారయుక్తమైన దయారసమొలుకుతూవున్నది. నువ్వు విదేశయాత్రచేయ్యాలి." అన్నాడు....చాల ఆద్భుతంగానుంది. నేను అతనిఆజ్ఞ పాలిస్తాను......మాఅమ్మకూడావింటున్నాది. ఆనంద బాష్పములుకార్చింది.—నీకుకనబడలేదూ? ఇంటికంతటికీ తిరిగీ ప్రాణంవచ్చినట్టుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసముల ధ్వని, మాటలశబ్దము, అడుగులసద్దు వినబడుతున్నది... విను, ఆతలుపువెనుక నాకు కంఠస్వరములు వినబడుతున్నాయి. త్వరపడు; త్వరపడు. నాకేదో ప్రత్యుత్తరము చెప్పు. మనమిద్దర మెక్కడకలుద్దాము?

మెలిజాండా—నీ కెక్కడిష్టము?

పెలియాజ్—ఉద్యానవనములో గుడ్డివారి బావిదగ్గర.—నీకిష్టమేనా?—వస్తావా?

మెలిజాండా—అలాగే.

పెలియాజ్—ఇదే మనకడపటి సాయంకాలము,—నాతండ్రిచెప్పినట్టు నేను విదేశయాత్రకు వెళ్లిపోతున్నాను. ఇకమరి నన్ను నువ్వుచూడవు...

మెలిజాండా—నువ్వాలా అనకూడదు పెలియాజ్!......నిన్నెప్పటికప్పుడే చూస్తాను. నిన్నెప్పుడూ నేనుచూస్తునే వుంటాను......

పెలియాజ్—చూడగలిస్తే చాలమంచిదే...... నువ్వెప్పుడు నన్ను చూడడానికి వీలులేనంత దూరంలో నుంటాను...... నేను చాలదూరం పోవడానికి ప్రయత్నిస్తాను......నే నానందంతో నిండి వున్నాను. ఈవేళ పృథివ్యాకాశముల బరువంతా నామీదనున్నట్టు కనిపిస్తున్నాది......

మెలిజాండా—ఏమిసంగతి పెలియాజ్? నువ్వేమిటి చెప్తున్నావో నాకర్థము కాలేదు.

పెలియాజ్—లే, లే, మనం వెళ్లిపోదాము. ఆ తలుపువెనుక కంఠస్వరములు వినబడుతున్నాయి...... నేటివుదయం కోటలోనికివచ్చిన క్రొత్తవారిప్పుడు వెళ్లిపోతున్నారు. పోదాం పద. అదిగో క్రొత్తవారక్కడనున్నారు.

[వేరువేరుగా నిష్క్రమింతురు.]

## రంగము ౨.

### కోటయందలి ఒక గది

[ఆర్కెల్ మెలిజాండాలు కనబడుదురు.]

ఆర్కెల్—ఇప్పుడు పెలియాజ్ తండ్రి మరణ భయమును దాటుటచేత, ప్రాత చెలికత్తెయైన రోగము కోటను విడిచిపెట్టింది. ఇక సంతోషము, కాంతి కొంచెము కొంచెం మాగృహములో ప్రవేశింపగలవు...... అది తీరికలేని సమయం. ఏమంటే నువ్వు వచ్చినదగ్గర నుండీ, మూసేసిన గదిచుట్టూ, గుసగుసలాడుకుంటున్నట్టే కాలం గడిపేం......నిజంగా నిన్ను చూచి జాలివేసేది. మెలిజాండా......ఆనందాన్ని వెదుక్కుంటూ వచ్చిన పిల్లలాగ నీవెంతో సంతోషంతో నిక్కడకు వచ్చావు; కాని నువ్వు చావడిలోనికి ప్రవేశించగానే, నీముఖంలో నొకమార్పు చూచేను—నీ ఆత్మలోగూడ మార్పు కలిగి వుండవచ్చును—మిట్టమధ్యాహ్నము అంధకార బంధురమైన గుహలో ప్రవేశిస్తే ముఖంలో అప్రయత్నంగా నెటువంటిమార్పొస్తుందో అటువంటిది ... ... అప్పటి నుంచీ, ఈ అన్ని కారణాలచేత నీసంగతి నేను తెలుసుకోలేకపోయాను......నేను నిన్ను నిదానించి చూస్తూ వుండేవాడిని. నువ్వు అక్కడ నిలబడేదానివి. బహుశా పరకునే యకుండానే—కాని ఏదో ఒకఘోరమైన దుఃఖాని కెదురుచూస్తూ భ్రమ కుందినదానిలాగు, వింత చూపులుచూస్తూ ఎండవేళలందు సుందరోద్యానవనములలో నుండేదానివి......నా పట్టుకు నాకే బోధపడలేదు......కాని నిన్ను చూచినప్పుడల్లా నాకు విచారం కలిగేది. అహోరాత్రము లీ మరణవాయువును పీలుస్తూ కాలంగడపడానికి, నువ్వు చిన్నదానివి, అందకత్తెవున్న......కాని యిప్పు డిదంతా మారిపోతుంది. నా వయస్సులో!—బహుశా యిది నాజీవితసంచయ ఫలము—ఈనావయస్సులో ఈకర్మసిద్ధాంతముపై నిట్టి నమ్మక మెలాగు కలిగినదో నాకు తెలియదు; కాని నేను చూస్తునే వున్నాను, అందమైన ప్రతి నూతనప్రాణియు, తన చుట్టూ తన కనుకూలమై, జగన్మోహనమై, ఆనందదాయకమైన నూతనకర్మసంచయములనే నిర్మించుకొనుచున్నది......ఇప్పుడీ దృశ్యాదృశ్యమైన నూతన శకమునకు తలుపు తెరవ నున్న దానవు. నువ్వు ఇలారా, ప్రత్యుత్తర మియ్యకుండా, కళ్లయినా పైకెత్తకుండా ఎందుకలా నిలబడ్డావు?—ఇప్పటివరకు నిన్నొక్కసారే ముద్దుపెట్టుకున్నాను. అయినప్పటికీ ముసలివాళ్లొక్కప్పుడు స్త్రీలయొక్క సంతతనవీనత్వమును గ్రహించి, ఒక్క క్షణకాలమైనా మృత్యువుకలని భయమును పారదోలుటకు, కాంతలయొక్క కనుబొమ్మలపై గానీ, బిడ్డలయొక్క చెక్కులపైగాని చుంబనము సేయుట ఆవశ్యకము......నువ్వు నా పెదవులకు జడుస్తావా? ఇన్నిమాసాలనుండీ నిన్ను చూచి నే నెలాగు కనికరించేవాడినో......

మెలిజాండా—తాతయ్యగారు! నే నానందంగా లేకపోలేదు.

ఆర్కెల్—పాపం! నువ్వొకొందరిలాగ దుఃఖపడుతూ దుఃఖపడుతున్నావని తెలుసుకోలేవు. అట్టివారు మరీ నిర్భాగ్యులు......ఒక్కక్షణం నిన్ను దగ్గరగా నిదానించిచూడనీ......మరణం ప్రక్కను వేచియున్నప్పుడే యిటువంటిచక్కదన మావశ్యకము...

[ప్రవేశము గొలాడ్]

గొలాడ్—పెలియాజ్ ఈ సాయంకాలము వెళ్లిపోతాడు.

ఆర్కెల్—నీనుదుటిమీద నెత్తురున్నది—ఏంచేస్తున్నావు?

గొలాడ్—ఏమిలేదు. ఏమీలేదు...ముళ్లడొంకలోనుండి వచ్చాను.

మెలిజాండా—తలకొంచెము వంచండినాథా!... మీనుదురు తుడుస్తాను.

గొలాడ్—[ఆమెను తోసేస్తూ] నువ్వునన్ను ముట్టొద్దు. వినబడ్డాదా? పో...పో...—నీతో నేనేమి మాట్లాడలేదు. నా ఖడ్గమేదీ?—నేను నా కత్తికోసం వచ్చాను......

మెలిజాండా—ఇదిగో నిక్కడ, పూజచేసు కున్న బల్లమీద.

గోలాడ్—తీసుకురా. [ఆర్కెల్‌తో] మరి యొక నిర్భాగ్యపు ప్రాణి సముద్రతీరమున ఆకలిచే చచ్చి పడివుంది. వారందరూ మన కళ్లయెదుటనే మరణించ డానికి సిద్ధపడ్డట్టు కనబడుతున్నారి. [మెలిజాండాతో] ఏదీ నాకత్తి!—ఎందుకలా వణుకుతున్నావు?—నిన్ను నేను చంపను. పదును పరీక్షించా లనుంది. ఇటువంటి వాటికి నేను కత్తి ఉపయోగించను. ఎవడినో దుష్టివానిని చూసినట్టు ఎందుకు నన్నలా ఎగా దిగా చూస్తావు. నే నేమి బిచ్చమడుగడానికి రాలేదు. నీ కళ్లనుండి నేనేమి పోల్చుకోడానికి వీలులేకుండా నాకళ్లల్లోనుండి నాభావం పోల్చాలనివుందా యేమిటి?—నాకేమైనా నిన్ను గూర్చి తెలుసుననుకుంటున్నావా యేమిటి?—[ఆర్కెల్‌తో] ఆవిడల్పయిన కళ్లుచూశారా? ఐశ్వర్యమును కోరి, గర్వ ముతో కూడుకున్నట్టు కనిపిస్తున్నాయి.

ఆర్కెల్—ఉత్త అమాయకత్వము తప్ప నా కేమి కనిపించడము లేదు.. ...

గోలాడ్—ఉత్తఅమాయకత్వమా?...అవి అమా యకత్వాన్ని మించున్నాయి!...లేడికళ్లకంటే చంచలం గా నున్నాయి!...అమాయకత్వంగురించి దేవునికి పాఠం చెప్పినట్టు!...అమాయకత్వమా! వినండి. రెప్ప లల్లార్చ నప్పుడు కనుపాపల నవీనమాధురి గ్రోలనంతచేరువలో నే నున్నాను. అయినప్పటికి నాకు పరలోకముయొక్క దుస్తరరహస్యము తెలుసుటకంటె ఆ కన్నులయొక్క స్వల్పరహస్యనర్తనము కొంచెమైనా యెరుకట కష్ట తరంగానుంది!...ఉత్త అమాయకత్వమా! ... అమాయ కత్వమును మించివున్నది!—స్వర్గమునందలి దేవులందరు నచ్చట సంతతము వినోదములు సల్పుతున్నట్టుంది...నేను వాటి నెరుగుదును. నాకా కళ్ల సంగతి తెలుసును. అవి చూశాను!...మూయ్యి, కళ్లు మూయ్యి; లేకపోతే మరి తెర వకుండా మూయిస్తాను!...నీ కుడిచెయ్యి గొంతుకమీద నుండి తియ్యి! నేను చాలా తేలికయైన సంగతి చెప్పు తున్నాను...నాకు రెండాలోచనలు లేవు ... నాకు మరొకఆలోచన వున్నట్టయితే నేనెందుకు మరిచెప్పను? హా, హా. తరిగొత్తిపోడానికి ప్రయత్నించకు. ఏదీ! ఆ చెయ్యియ్యి...అబ్బా...నీచేతులు చాలవేడిగా ను న్నాయి...నీ మస్తిష్కము నాకు చికాకు కలిగిస్తు న్నాది... ఇదిగో యిక నువ్విప్పు డెక్కడికి పారి పోతావు? [ఆమె జుత్తుపట్టుకొనును] నీ మోకాళ్లమీద పడి నావెంట వస్తున్నావా? నాకాళ్లమీదపడి నన్ను ప్రార్థిస్తున్నావా? అదిగో నీ దీర్ఘ కేశములు ఇప్పుడు కొంత ఉపయోగమునకు వచ్చాయి. కుడిప్రక్క ఎడమ ప్రక్క. ప్రార్థించు; ప్రార్థించు. భూమిమీద సాష్టాంగ పడు; సాష్టాంగపడు. చూశావా...చూశావా...అప్పుడే ముసలివానిలాగ నే నెలా నవ్వుతున్నానో...

ఆర్కెల్—[ముందుకుపరుగెత్తుచు]గోలాడ్!...

గోలాడ్—[తక్షణమే శాంతినిపొంది] నీయిష్టం వచ్చినట్టే చెయ్యి. తెలిసిందా—నాకు దానితో నేమి పనిలేదు—నేను మిక్కిలి ముసలివాడిని— అదిగాక నే నేమి రహస్యద్రష్టనుకాను. కొంచెమాగి యే దెలావస్తుందో చూస్తాను. ఆతరువాత...అయ్యో! ఆ తరువాత...అది లోకాచారం కాబట్టి. అది లోకాచారంకాబట్టి.

[నిష్క్రమించును.]

ఆర్కెల్— ఏమిటి జరిగింది? ఏం తాగేడా యేమిటి?

మెలిజాండా—[కన్నీరు కార్చుచు] లేదు, లేదు, నన్నాత డిప్పుడు ప్రేమించడము లేదు...నాకు సౌఖ్యం లేదు; నాకు సౌఖ్యంలేదు.

ఆర్కెల్—నేను భగవంతుడనై వుంటే మానవుల హృదయదౌర్బల్యాన్ని తొలగించివుందును.

## రంగము 3.

### కోటముందట ఒకయెత్తుస్థలము

(న్యియాల్డు ఒకరాయినెత్తుతూ కనబడును.)

న్యియాల్డు—అబ్బా! ఈరాయి మిక్కిలిబరు వుగానుంది!...నాకంటేకూడా బరువుగానుంది...ఈప్ర

పంచమంతటికంటేకూడా బరువుగానుంది...ఇప్పుడు జరిగినదానంతటికంటేకూడా బరువుగానుంది...నా బంగారు బంతి యీరాత్రి తుక్కుకున్న ఆవేశపరాత్రికన్నీ మధ్య నాకనిపిస్తు నేవుంది. కాని నాకుఅందదు...నాచిన్ని చెయ్యి కందదు. రాయాయెత్తబడదు... నేను దానినెత్తలేను... మరియిక్కడ దానినెత్తేవాళ్లెవళ్లూ లేరు...అది యీయింటంతటికన్నా బరువుగానుంది...ఎవరైనా భూమిలో దానివేళ్లు నాటున్నా యనుకుంటారు... (కొంతదూరమున గొఱ్ఱెలమంద అరుపు వినబడును) హోయ్‌హోయ్! నాకు గొఱ్ఱెలకూపు వినబడుతున్నాది. (దిబ్బచివర కరుదు చూచుటకైపోవును) అప్పుడే సూర్యుడస్తమించేశాడే! అదిగో గొఱ్ఱెపిల్లలొస్తున్నాయి...ఎన్నున్నాయో!... ఎన్నున్నాయో!—అవిచీకటిలో జడుస్తున్నాయి... దగ్గరగా చేరుకుంటున్నాయి, దగ్గరగా చేరుకుంటున్నాయి. ఇంక మరిదూరం అవి పోలేవు...అవి అరుస్తున్నాయి అరుస్తున్నాయి. అతిత్వరగా పరిగెడుతున్నాయి... పరిగెడుతున్నాయి. అవి అప్పుడే పెద్దఅడ్డుకొడ్డుదగ్గరకువచ్చాయి! అయ్యో! అయ్యో!...వాటికెటువెళ్లడమో తెలీయదు. అవి యిప్పు డరవడములేదు. అవి ఆగిపోయాయి...అందులో కొన్ని కుడికెట్టు వెళ్లబోతున్నాయి...వెళ్లలేకపోతాయేమో! గొల్లవాడు వాటికెట్టు మట్టినిరిమరుతున్నాడు. ఆహా! అవి యీతట్టేవస్తున్నాయి...అవి అనుసరిస్తున్నాయి...చెప్పినట్టు వింటున్నాయి. ఈ డాబామున్నుండే వెళ్లబోతున్నాయి... ఈరాళ్లకుముందునుండి వెళ్లబోతున్నాయి...వాటిని దగ్గరగాచూస్తాను. అబ్బా! అబ్బా! ఎన్నున్నాయో! దారంతా వాటితోనే నిండిపోయింది...అవియిప్పుడు నిశ్శబ్దముగా నున్నాయి...గొల్లవాడా! గొల్లవాడా! అవియెందుకు మరిమాట్లాడవు?

గొల్లవాడు—(కనబడకుండా) ఇది మందకుపోయే దారికాదు కాబట్టి.

య్నీయోల్డు—అవియెక్కడకు పోతున్నాయి? గొల్లవాడా! గొల్లవాడా! అవి యెక్కడికిపోతున్నాయి?—వాడు నామాటవినిపించుకోలేదు...అవి అప్పుడే చాలదూరం వెళ్లిపోయాయి...చాలవడిగా పరుగెత్తుతున్నాయి. ఇప్పు డేమీ చప్పుడు చెయ్యడములేదు... ఇది మందకు దారికాదు. పాపం! ఈరాత్రెక్కడ పడుకుంటాయో! అబ్బా! చాల చీకటైపోయింది. నేను పోయి యెవరికైనా చెప్తాను.

[నిష్క్రమించును]

రంగము ౪

ఉద్యానవనంలో నొకబావి

[ప్రవేశము పెలియాజ్.]

పెలియాజ్—ఇదే కడపటి సాయంకాలము... కడసారి సాయంకాలము. ఇక్కడితో అంతా ముగియవలసినదే...అనుమానం లేకుండా పిల్లవానిలాగ ఆడుకున్నాను......విధినియోగముయొక్క బాగోగులను గూర్చి కలగంటూ ఆడుకున్నాను... ఈ అవస్థనుండి నన్నెవరు హఠాత్తుగాలేపేరు! గుడ్డివాడు కాలుతున్న ఈ యింట్లోనుంచి పరిగెత్తిపోయేటట్టు నేనున్న ఆనంద దుఃఖాలతో అరుస్తూ పరిగెత్తిపోతాను...నేనెక్కడకో పోతున్నానని ఆమెతో చెప్తాను. నా తండ్రి మరణభయంనుండి దాటినాడు. ఇప్పుడు నాకొంటరిగా పడుకొనుటకే తోచదు. అప్పుడే చాల ఆలస్యమైపోయింది. ఆమె రావటము లేదు...ఆమెను తిరిగిచూడకుండా వెళ్లిపోవడమే మంచిది...ఆమె నీసారి చక్కగా చూడాలి...నాకు జ్ఞాపకముండని హంశములున్నాయి... ఒక్కొక్కప్పు డామెను నూరుసంవత్సరములై చూడనట్టనిపిస్తుంది...ఇప్పటికి ఆమెదృష్టివైపు నిదానించి చూడలేదు...ఇలాగు వెళ్లిపోతే నాకేమి జ్ఞాపకముండదు. ఈజరిగినదంతా...ఇదంతామాత్రే నేనొక గుడ్డ పంచీతో కొంచెము నీరు పట్టుకుపోబోతున్నట్టున్నది. ఆమె నొక్కసారి యీకడపటిమాటు చూడాలి. ఆమె హృదయాంతరాళాన్ని శోధించిచూడాలి... నే నిదివరకు చెప్పలేకంతా చెప్పేయాలి...

[ప్రవేశము, మెలిజాండా]

మెలిజాండా—పెలియాజ్!

పెలియాజ్—మెలిజాండా! నువ్వేనా మెలిజాండా?

మెలిజాండా—అవును.

పెలియాజ్—ఇక్కడకురా, ఆ చంద్రకిరణాల దాపున నిలబడకు. ఇటురా, మన మెంకరితోనొకరు చెప్పుకోవలసిన దెంతోవుంది, ఈనిమ్మ చెట్టునీడలోనికి రా.

మెలిజాండా—నేను వెలుగులోనే వుంటాను.

పెలియాజ్—ఎవరైనా బురుజు కిటికీలలోనుండి చూస్తారు. ఇటురా, ఇక్కడ మనం భయపడవలసిన పనుండదు. జాగ్రత్త; వాళ్లు మననిచూస్తారు.

మెలిజాండా—వాళ్లు చూడాలనే నాకుంది.

పెలియాజ్—ఎందుకు, ఏమిటి సంగతి? నువ్వు ఎవరూ చూడకుండా రాగలిగేవా?

మెలిజాండా—అవును, మీ అన్నగారు పడుకున్నారు...

పెలియాజ్—ఇప్పుడు చాలవేళైంది. ఇంకొక ఘుంటలో వాళ్లు తలుపులు వేసేస్తారు. మనంజాగ్రత్తగా నుండాలి. నువ్వెందుకింత ఆలస్యంగా వచ్చావు?

మెలిజాండా—మీఅన్నకొక పాడుకల వచ్చింది. ఆతరువాత వస్తూవుంటే నాచీర తలుపు మేకుకు తగులుకుంది. ఇదిగో చూడు, చిరిగిపోయింది. ఇలా కాలమంతా వ్యర్థమైంది నేను పరుగెత్తుకువచ్చాను......

పెలియాజ్—అయ్యో! మెలిజాండా!...... నిన్ను ముట్టుకోడానికే భయంగా నంది...వేటాడబడిన పిట్టలాగ ఇంకా నీకూపిరి లేదు...ఇదంతా నాకోసమేనా? నాకోసమేనా ఇలా చేసేవు?... నీ హృదయ స్పందము విస్పష్టముగా, నా హృదయస్పందమో అన్నట్టుగా వినబడుతున్నది. రా దగ్గరకు. నాదగ్గరకు రా.

మెలిజాండా—నువ్వెందుకు నవ్వుతున్నావు?

పెలియాజ్—నేను నవ్వడము లేదు; లేదా సంతోషముచేత తెలియకుండానే నవ్వుతున్నాను... ఇంతకంటే యేడవడానికి కారణముంది.

మెలిజాండా—మన మిక్కడ కింతకు పూర్వ మొకసారి వచ్చాము......నాకు జ్ఞాపకముంది......

పెలియాజ్—అవునవును...ఎన్నో నెలల క్రిందట ...అప్పుడు నాకు తెలియదు ... ఈ సాయంత్రము నిన్నిక్కడ కెందుకురమ్మన్నానో నీకు తెలుసునా?

మెలిజాండా—తెలియదు.

పెలియాజ్—బహుశా ఇదే నిన్ను కడసారి చూడడము...ఈస్థలము నా జీవితాంతమువరకు విడిచిపెట్టేయాలి.

మెలిజాండా—ఎందుకు నువ్వెప్పుడు వెళ్లిపోతాను వెళిపోతానని అంటూవుంటావు?...

పెలియాజ్—ఇదివరకు నీకు తెలిసిన సంగతే. తిరిగి నేను చెప్పాలా? నే నిప్పుడేమిచెప్పబోతున్నానో నీకు తెలియదు?

మెలిజాండా—తెలియదు. నాకేమీ తెలియదు.

పెలియాజ్—నే నెందుకు వెళ్లిపోవలసివచ్చిందో నీకు తెలియదు? అది...[అకడామెను తటాలునముద్దిడుకొని] నిన్ను నేను ప్రేమించడముచేతనే...

మెలిజాండా—[హీనస్వరముతో] నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను...

పెలియాజ్—ఆఁ. ఆఁ. ఏమిటి చెప్పుతున్నావు మెలిజాండా?...నువ్వు చెప్పినది నాకు సరీగా వినబడలేదు...మంచుగడ్డ తప్తశాలాయసదండముచే పగులగొట్టబడ్డాది...లోకాంతరమునుండి వచ్చినట్టున్న కంఠస్వరముతో చెప్పుతున్నావు!...నీమాట వినబడనే లేదు... నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా? నువ్వుకూడా నన్ను ప్రేమిస్తున్నావా?... ఎప్పటినుండి నువ్వు నన్ను ప్రేమిస్తున్నావు?

మెలిజాండా—చాలకాలమునుండి......మొదట నిన్ను చూచినప్పటినుండి.

పెలియాజ్—ఆహా! ఎంతబాగా చెప్పుతున్నావు. నీకంఠస్వరము వసంతకాలమందు సముద్రము నతిక్రమించిపోవుతున్నట్టుంది...ఇట్టి స్వరము ఇప్పటి

వరకు చేసెన్నడు వినలేదు...అమృతవృష్టి నాపై గురిసి నట్టున్నది...నువ్వెంత సులువుగా చెప్పుతున్నావు... ఒక దేవతనడిగితే చెప్పినట్టు...నేను నమ్మలేను మెలిజాండా...నువ్వెందుకు నన్ను ప్రేమించాలి? నువ్వేల నన్ను ప్రేమిస్తున్నావు? నువ్వుచెప్పినది సత్యమేనా? మోసముచెయ్యలేదు గదా? నన్ను సంతోషపెట్టాలని కొంచెం అబద్ధమాడుచుండలేదు గద?

మెలిజాండా—లేదు. నే నెప్పుడూ అసత్యమాడను. మీ అన్నగారిదగ్గరనే నే నసత్యమాడుదును.

పెలియాజ్—ఆహా! నువ్వెలాగు చెప్పుతున్నావు! నీకంఠస్వరము! నీకంఠస్వరము! అది నీటికంటె నిర్మలముగాను వాస్తవికముగాను ఉన్నది. నా పెదవులకు నిర్మలోదకమువలె తాకుతున్నది...ఏదీ నీచేతులియ్యి...ఆహా! నీచేతులు చిన్నవి...నువ్వింత అందముగానున్నావని నాకు తెలియదు...ఇదివరకు నే నెప్పుడు నిట్టి యందమైనవస్తువును చూడలేదు...నావంట్లో నస్వస్థతగానుండుటచేత నిల్లల్లా వెతికాను... దేశమల్లా వెతికాను...కాని యిట్టియందమును నే నెక్కడా చూడలేదు...ఇప్పుడు నువ్వు కనబడ్డావు. నువ్వు కనబడ్డావు... భూమిలో నింతకంటే చక్కనివారుంటారని నేను నమ్మను...ఎక్కడున్నావు? నీఊపిరి నాకు వినబడదు.

మెలిజాండా—నీతట్టే నేను చూస్తూవుండడము చేత.....

పెలియాజ్—నువ్వు నాతో స్థైర్యము కంత నిదానించిచూస్తున్నావు? మన మప్పుడే నీడలోకివచ్చాము. ఈచెట్టుక్రింద మిక్కిలి చీకటిగానవుంది. వెలుగులోనికి రా. మన మెంత యానందముగా నున్నామో ఒకరి నొకరు చూచుకోలేము. రా, రా, మనకు వ్యవధి చాల తక్కువ...

మెలిజాండా—వద్దు, వద్దు. ఇక్కడనే వుందాము. ఈ చీకటిలోనే నీచేరువ నున్నాను.

పెలియాజ్—నీకళ్లేవి? నువ్వు నాదగ్గరనుండి పారిపోవుగదా? ప్రస్తుతము నువ్వు నాగురించి తలుస్తూ వుండడములేదు.

మెలిజాండా—నిన్నే తలుస్తున్నాను. నిన్నే తలుస్తున్నాను. నిన్నుగూర్చి ఆలోచిస్తున్నాను...

పెలియాజ్—నువ్వేటుకట్టో చూశావు.

మెలిజాండా—నిన్ను మరొకదగ్గర నేను చూశాను...

పెలియాజ్—నువ్వు మగ్నమైపోయావు... ఏమిటి జరిగింది? నువ్వు సంతోషంగా కనబడలేదు.

మెలిజాండా—లేదు, నేను సంతోషంగానే వున్నాను. కాని నాకు విచారంగానుంది ..

పెలియాజ్—ఒకరిని ప్రేమించేటప్పుడు, తరుచుగా, విచారంగానే వుంటుంది...

మెలిజాండా—నిన్ను తలుచుకుంటే నే నెప్పుడూ ఏడుపువస్తుందే...

పెలియాజ్—నేనుకూడాను... మెలిజాండా, నేనుకూడాను... నేను నీకు చేరువగానేవున్నాను. నే నానందబాష్పములు కారుస్తున్నాను. అయినప్పటికి... (మరల అతడామెను ముద్దిడుకొనును)...నిన్ను నేను ముద్దుపెట్టుకున్నప్పుడు నువ్వు చాల వింతగానున్నావు. నిన్నుచూస్తే నువ్వుస్వల్పకాలంలో చచ్చిపోతావన్నంత అందంగానున్నావు.

మెలిజాండా—నువ్వుకూడాను.

పెలియాజ్—అక్కడ. అక్కడ...మనంకోరినట్టు చెయ్యలేము...నిన్ను మొదటిసారి నేనుచూచినప్పుడు ప్రేమించలేదు.

మెలిజాండా—నేనున్నూ... నేనున్నూ... నేను భయపడ్డాను...

పెలియాజ్—నీచూపు నేనుభరించలేక పోయివాడిని...నాకు తక్షణమే వెళ్లిపోవాలనుండేది...అప్పుడు...

మెలిజాండా—నాకు రావాలనేలేదు... రావడాని కెందుకు జడిసేనో యిప్పటికి నాకు తెలియదు...

పెలియాజ్—మనుష్యులకు తెలియని సంగతు లెన్నో వున్నాయి...మన మెప్పుడూ నిరీక్షిస్తూనే వున్నాము. అప్పుడు...అదప్పుడేమిటి? కోటతలుపులు వేసేస్తున్నారా?

మెలిజాండా—అవును తలుపులు వేసేశారు...

పెలియాజ్—మనము తిరిగివెళ్లలేము. నీకు గడియలచప్పుడు వినబడ్డాదా? విను విను. ఆ పెద్దగొళ్లెలు... ఆలస్యమైపోయింది. ఆలస్యమైపోయింది.

మెలిజాండా—అదీ ఒకమంచికే. అదీ ఒక మంచికే.

పెలియాజ్—నీకా? చూడుచూడు...ఇంకా దానిని కోరవలసినది మనముకాదు. అంతాపోయింది... రారా...నాగొంతుకలో నాహృదయం, పిచ్చివాడి గుండెలాగు కొట్టుకుంటున్నాది...(అత డామెను కౌగలించుకొనును) విను విను. నాహృదయం స్తంభించిపోడానికి సిద్ధంగానుంది!...ఆహా యీచీకటిలో నెంత యందముగానుంది!...

మెలిజాండా—మనవెనుక నెవరో వున్నారు!...

పెలియాజ్—నాకెవరు కనబడలేదు...

మెలిజాండా—నాకేదో ధ్వనివినబడింది...

పెలియాజ్—నా కీచీకటిలో నీహృదయస్పందమమాత్రమే వినబడుతున్నాది.

మెలిజాండా—ఎండాకుల మర్మరధ్వని నాకు వినబడ్డాది...

పెలియాజ్—వాటిని హటాత్తుగా గాలివొక్కంది...అది మనం ముద్దుపెట్టుకున్న సమయంలో కొట్టింది.

మెలిజాండా—ఈసాయంకాలము మననీడ లెంత దీర్ఘముగానున్నాయి!...

పెలియాజ్—అవి తిన్నగా నీతోట కొనకు పెనుకున్నాయి—ఆహా! అవి మన కెంత దూరంలో ముద్దులాడుకుంటున్నారయో. చూడు. చూడు.

మెలిజాండా—[నిరుద్ధస్వరముతో] ఆ...హా... అత డొక చెట్టువెనుక నున్నాడు.

పెలియాజ్—ఎవడు?

మెలిజాండా—గోలాడ్.

పెలియాజ్—గోలాడా! అయితే యెక్కడ?—నాకేమి కనబడలేదు...

మెలిజాండా—అక్కడ, మననీడల చివరను.

పెలియాజ్—అవు నవును. నేను వానిని చూశాను...మనము ఠటాలున వెనక్కి తిరిగి పోరాదు...

మెలిజాండా—అతనిచేతిలో కత్తికూడా నుంది.

పెలియాజ్—నాచేతిలో నేమీ లేదు.......

మెలిజాండా—మనము ముద్దుపెట్టుకుంటూ వుండడ మతడు చూశాడు.

పెలియాజ్—మన మతనిని చూశామని, అతనికి తెలియదు...కదలకు...నీతల త్రిప్పకు...మన మీదికి పరిగెత్తుకువస్తాడు... మన మతనిని చూడలేదని అనుకున్నంతకాలము అత డక్కడే వుంటాడు ... అతడు మనని కనిపెడుతున్నాడు...అత డింకా కదలలేదు... ఈదారిని నువ్వు వెంటనేపారిపో...నే నతనికోసంవుండి అతనిని పట్టుకుంటాను.

మెలిజాండా—వద్దు. వద్దు.

పెలియాజ్— పారిపో. పారిపో. అతడంతా చూచేశాడు; అతడు మనని చంపేస్తాడు...

మెలిజాండా—అదీ ఒకమేలే; అదీ ఒకమేలే.

పెలియాజ్—అతడు వస్తున్నాడు, అతడు వస్తున్నాడు...ఏదీ నీమూతి...నీమూతి...

మెలిజాండా—ఆఁ...ఇదిగో [తగిలీ తగలకుండా నొకరినొకరు ముద్దాడుదురు.]

పెలియాజ్—అయ్యో! అయ్యో! నక్షత్రాలన్నీ రాలిపోతున్నాయి...

మెలిజాండా—నామీద కూడాను... నా మీద కూడాను...

పెలియాస్—మరొక్కసారి...మరొక్కసారి ...ఏది యియ్యి...యియ్యి.

మెలిజాండా—అంతాసరి. అంతాసరి. [గొలాడ్ ఖడ్గపాణియై వారిపై ప్రసరుగత్తి పెలియాస్‌ను కొట్టును. పెలియాస్ బావిప్రక్కను పడిపోవును. మెలిజాండా భయోద్రేకముతో పరుగెత్తును.]

మెలిజాండా—[పరుగెత్తుచు] అయ్యో!అయ్యో! నేను ధైర్యవతినికాను. నేను ధైర్యవంతురాలను కాను. [గొలాడ్ నిశ్శబ్దముగా నడవియందు దామెను తరుమును.]

## అంకము ౫.

## రంగము ౧.

### కోటయందలి ఒకలోతుచావిడి

[దాసీలు గుంపుగా కూర్చొని కనబడుదురు. బయట నొక గాలిగొట్టాము ముంగట కొందరు బాలురు రాడు చుందురు.]

ఒకముసలిదాసి—ఓర్చిచూడండి. ఓర్చిచూడండి. అమ్మాయిల్లా! ఈసాయంత్రమే వారు వచ్చి యిప్పుడే మనకి చెప్తారు...

మరొకదాసి—వారు వచ్చి మనకు చెప్పరు... వాళ్లెందుకున్నారో వారికే తెలియదు...

మూడోదాసి—ఇక్కడ మనం కొంతసే పుందాము.

నాలుగోదాసి— మన మెప్పుడు మీదకు వెళ్లడమో మనకే బాగా తెలుస్తుంది.

అయిదోదాసి—అవసరంవస్తే మనమట్టుకుమనమే మీదకు వెళ్లిపోదాము.

ఆరోదాసి—ఇంట్లోనుండి యేవిధమైన శబ్దం విన బడడంలేదు.

ఏడోదాసి—గాలి గొట్టాని కెదురుగుండా ఆడు తున్న పిల్లలను ఊరకోమని చెప్పాలి.

ఎనిమిదోదాసి—ఒక్కగదియుంటే వారిమట్టుకు వారే పూరుకుంటారు

తొమ్మిదోదాసి— ఇంకా సమయం కాలేదు

[ప్రవేశము-ముసలిదాసి]

ముసలిదాసి— ఇప్పు డెవరూ గదిలోనికి వెళ్ల డానికి వీలులేదు. నేను సరీగా ఒకఘంట విన్నాను. తలుపులమీద ఈగలు ప్రాకడంకూడా వినవచ్చు...కాని నాకేమి వినబడలేదు.

మొదటిదాసి—వారామె నొక్కర్తనే గదిలో నుంచేశారా?

ముసలిదాసి—లేదు. లేదు. గదినిండా మనుష్యు లున్నా రనుకుంటాను.

మొదటిదాసి—వాళ్లిప్పుడేవెళ్లిపోవస్తూవుంటారు

ముసలిదాసి— అయ్యో! దైవమా! ఆనందము కాదు. ఈగృహమున ప్రవేశించినది. ఎవరూ మాట్లాడ కూడదు. నాకు తెలిసినది గాని చెప్పగలిస్తే.

రెండోదాసి—నువ్వేకదూ వారిని ద్వారంవద్ద చూశావు?

ముసలిదాసి—ఆఁ. ఆఁ. మరేమి? నేనే వారిని చూశాను. ఆద్వారపాలకునకు చెప్తాడు. వాడేట వారిని మొట్టమొదట చూచినది. అసలు వానిని లేపినది నేను. వాడు బోరగిలపడుకుని లేవనే లేదు—ఇప్పుడు వాడొచ్చి చెప్తాడు. "నేను వారిని మొట్టమొదట చూశాను." అది బాగుందా?— గదిలోనికి వెళ్లడానికి దీపం వెలిగించే టప్పుడు నేను కాల్చుకున్నాను. తెలిసిందా? — నేను గదిలోఏంచెయ్యడానికి వెళ్లాను?—గదిలో ఏం చెయ్య డానికి వెళ్లినో యిప్పుడు జ్ఞాపకం లేదు — ఏలాగైనప్పటికి వేగమే లేచాను. అప్పటి కింకా వెలుగురాలేదు. నాలో నే ననుకున్నాను.—"నేను కచేరిచావడి దాటిపోయి తలుపుతీస్తా"నని. సరే, అప్పు డు వేళ్లమీదనడుస్తూ మేడదిగి సాధారణమైన తలుపు తీసినట్టుగా దానితలుపుతీశాను. అయ్యో! దైవమా! అప్పుడు నేనేమిచూశాను? నేనేమిచూశానో పోల్చు?...

మొదటిదాసి—వారు సరీగా తెలుపుముందరే వున్నారా?

ముసలిదాసి—వారిరువురు తెలుపుముందరే పడుకున్నారు!...చాలకాలంనుంచీ ఆకలిచేత్క్రుశించిన పేదవారిలాగ...వారు, జనిస్తే పిల్ల లెలా గొకరినొకరు గట్టిగా కౌగలించుకుంటారో, అలాగు కౌగలించుకున్నారు. ఆ చిన్ని రాజకుమార్తె యించుమించుగా చచ్చిపోయింది. ఆ గోలాడ్ మాత్రం ఇంక తన ప్రక్కను కత్తి వ్రేలకేసుకునే వున్నాడు...రాళ్ల మీద నెత్తురుపడివుంది.

రెండోదాసి—ఆపిల్లలనుఊరుకోమనిచెప్పాలి...గాలికొట్టానికెదురుగా వాళ్ల శక్తికొద్ది ఊదుతున్నారు...

మూడోదాసి—ఎవరేమిచెప్పినది వినబడకుండా వున్నాది...

నాలుగోదాసి—ఇంక మరిచెయ్యవలసింది లేదు. నేను ప్రయత్నించేచూశాను. వారూరుకోరు...

మొదటిదాసి—ఇప్పుడతనివింట్లో నెమ్మదిగానే వున్నట్టు తోస్తుంది.

ముసలిదాసి—ఎవరివింట్లో?

మొదటిదాసి—గోలాడ్ బాబుగారివింట్లో.

మూడోదాసి—అవునవును. అతనిని తన భార్యామందిరానికి తీసుకునివెళ్లారు. వారి నిప్పుడే దారిలో కలిసేను. తొంగినవానికి ఊతయిస్తున్నట్లు అతనికూత యిస్తున్నారు. అతడొక్కడూ యింకా నడవలేడు.

ముసలిదాసి—అతను తనచుట్టుకు చంపుకోలేకపోయాడు. అతడు చాల పెద్దవాడు. కాని ఆమెకు దెబ్బతగలే లేదు. అయినప్పటికి ఆమె మరణావస్థలో వుంది...మీకది తెలిసిందా?

మొదటిదాసి—నువ్వాగాయము చూశా?

ముసలిదాసి—నిన్నిప్పుడెలాగు చూస్తున్నానో అలాగు—నా చిన్నారి! నేనంతా చూశాను—నీకు తెలిసిందా? ఎవరూ చూడకమునుపే నేను చూశాను. ఆమె హృదయమందు ఎడమభాగములో నొక చిన్న దెబ్బ—ఒక పావురానికి తగిలినా చచ్చిపోనంత చిన్న దెబ్బ. ఇది స్వాభావికముగా కనబడుతున్నాదా?

మొదటిదాసి—అవునవును. దీనంతటికి అంతర్గతాన్నేదో వుంది.

రెండోదాసి—అవును కాని మూడురోజులక్రిందట ఆమె ప్రసవించింది.

ముసలిదాసి—ఆలాగా!...ఆమె మరణశయ్యపై. అదియొక అరిష్టసూచకముకాదా? — ఎటువంటిబిడ్డ! నువ్వుచూశావా?—ముష్టిదైనా ప్రపంచకానికి రేడాని కిష్టపడ నటువంటిపిల్ల...కొంచెముత్వరగా లోకములోనికివచ్చిన ఒకచిన్న కేలువస్తువు...గొర్రెపున్నిలో పెరుగవలసిన మైనపుబొమ్మ...అవునవును. ఈగృహమున ప్రవేశించిన దానందముకాదు...

మొదటిదాసి—అవునవును. దేవుని చెయ్యి కదిలింది.

రెండోదాసి—ఇదంతా కారణంలేకుండా జరగలేదు.

మూడోదాసి—అతరువాత మన ముద్దులసామి పెలియాజో!...ఎక్కడున్నాడు? ఎవరికీ తెలియదు.

ముసలిదాసి—అవునలాగే. అందరికీ తెలుసును. కాని రెవరూ చెప్పడానికి సాహసింపరు...ఎవరూ దానిగురించి మాటాడకూడదు...ఎవరూ దేనిగురించైనా మాట్లాడరు...ఎవరు సత్యమైన దానిగురించి మాట్లాడరు...కాని గ్రుడ్డివారి బావివద్ద కనబడ్డాడని నాకు తెలుసును. కాని రెవరు? ఎవ్వరూ అతన్ని చూడలేకపోయారు...అక్కడ. అక్కడ. కడపటిరోజునే అందరికీ అంతా తెలుస్తుంది.

మొదటిదాసి—నాకిక్కడ పడుకోడానికి భయం వేస్తున్నాది.

ముసలిదాసి—ఒకసారి దురదృష్టదేవత యింట్లో ప్రవేశించిన తరువాత, ఊరుకోడమే యింట్లో అందరికీ క్షేమము.

మూడోదాసి—అవును. అది అన్నిటివంతు నిన్ను వెతుక్కువస్తుంది.

ముసలిదాసి—కాని మనంకోరినట్లు మనంపోలేము.

నాలుగోదాసి—మనంకోరినట్లు మనం చెయ్యలేము.

మొదటిదాసి—ఇప్పుడు వారు మనని చూసి జడుస్తారు.

రెండోదాసి—వాళ్లందరూ సభ తీర్చారు...

మూడోదాసి—వారల్లో వారు కళ్లు వాలుస్తారు.

నాలుగోదాసి—వాళ్లిప్పుడు గుసగుసలాడుతుంటారు.

ఐదోదాసి—వాళ్లందరూ కలిసే చేసేరనుకుంటారు.

ఆరోదాసి—వాళేమిచేసేరో ఎవరికీ తెలియదు.

ఏడోదాసి—ప్రభువులే జడిసిపోయినప్పుడు మిగిలినవాళ్లేమిటిచెయ్యడము... [నిశ్శబ్దము.]

మొదటిదాసి—పిల్ల అరుపు ఇప్పుడు నాకు వినబడ్డంలేదు.

రెండోదాసి—వాళ్లందరూ గాలిగొట్టాని కదులకుండా కూర్చున్నారు.

మూడోదాసి—ఒకరినొకరు తగులుతూ దగ్గరగా కూర్చున్నారు.

ముసలిదాసి—నాకింటినుండి యిప్పుడేవ్వనీ వినబడ్డంలేదు.

మొదటిదాసి—పిల్ల ఊపిరితియ్యడమే నాకు వినబడ్డంలేదు.

ముసలిదాసి—రండి, రండి మేడమీదకి పోడానికి వేళైంది......

[నిశ్శబ్దముగా నిష్క్రమింతురు.]

రంగము ౨.

కోటలో నొకగది

[గదిలో నొకమూల ఆర్కెల్, గోలాడ్, వైద్యుడు కనబడుదురు. మెలిజాండా తన పరుపుమీద పడుకొనియుండును]

వైద్యుడు—ఈ చిన్నదెబ్బచేతమాత్రమే ఆమె మరణింపజాలదు. ఇంత చిన్నదెబ్బ కొక పక్షికూడా చావదు...కాబట్టి ప్రభూ! ఆమెను చంపినది మీరు కాదు; మీ రలాగు విచారింపరాదు......ఆమె బ్రతికియుండజాలదు....ఆమె యకారణముగా జన్మించినది...ఇప్పు డామె యకారణముగా మరణించుచున్నది......అదిగాక, ఆమెను రక్షింపలేమని మనం చెప్పలేదు...

ఆర్కెల్—లేదు లేదు. మనం ఇంతవరకిమా ఆవిడగదిలోనుండి కూడా ఉత్తినే పూరకున్నట్టు కనిపిస్తుంది...అదిమొక యవకాశము......ఆమె యెలాగు నిద్రపోతున్నదో చూడండి!...మెల్ల మెల్లగా...శాశ్వతముగా నా మెయాత్మ చల్లబడిపోయినట్టున్నది...

గోలాడ్—నేను నిష్కారణముగా చంపితిని. నేను నిష్కారణముగా చంపితిని...రాళ్లే డ్పించడము చాలదా! . వా రొకరి నొకరు పిల్లలలాగు ముద్దుపెట్టుకున్నారు...వా రొకరినొకరు ముద్దుమాత్రమే పెట్టుకున్నారు...వారు అన్నాచెల్లెండ్రు...మరి నేను, నేను ఒక్కసారిగా...నాచిత్తమునకు వ్యతిరేకముగా, మూకాను; నాచిత్తమునకు వ్యతిరేకముగా చంపేశాను.

వైద్యుడు—జాగ్రత్త; ఆమె లేస్తున్నట్టుంది.

మెలిజాండా—కిటికీ తెరవండి...కిటికీ తెరవండి.

ఆర్కెల్—ఈ కిటికీయా తియ్యమంటావు మెలిజాండా?

మెలిజాండా—కాదు కాదు...పెద్దకిటికీ.....అవతలంతా చూడడానికి.

ఆర్కెల్—ఈ సాయంకాలము సముద్రపుగాలి మిక్కిలి చల్లగా లేదా?

వైద్యుడు—ఆమె యెలాగుచెప్పితే అలాగు చెయ్యండి.

మెలిజాండా—నమస్కారము...అది సూర్యాస్తమయమేనా?

ఆర్కెల్—అవును, సూర్యుడు సముద్రముపైన స్తమిస్తున్నాడు. చాల వేళైందిః నీవంట్లో ఎలాగున్నాది మెలిజాండా?

మెలిజాండా—సరే, సరే; అది మీరెందు కడుగు తున్నారు? నాకింతకంటే యెప్పుడు బాగు లేదు. అయి నా మీరెందు కడుగుతున్నారో నాకు తెలుసును.

ఆర్కెల్—ఏమంటున్నావు? నీవు చెప్పినది నాకేమి బోధపడ లేదు.

మెలిజాండా—నేను చెప్పినదంతా నాకే బోధ పడదు. చూశారా... నే నేంచెప్తానో నాకే తెలియదు... నాకేం తెలుసునో నాకే తెలియదు... నాకేం కావాలో నేను చెప్పను...

ఆర్కెల్—లే. లే... నువ్వు మాట్లాడడంవింటే మాకందరికీ సంతోషంగానుంది. ఈ మూడురోజులై నీకు కొంచెము సన్నిపాతంచేసింది. నిన్ను మేము బోధ పరుచుకో లేకపోయినా వాళ్లము. ఇప్పుడదంతాపోయింది.

మెలిజాండా—నాకు తెలియదు... ఇంతసేపు మీరొక్కరే యీగదిలో నున్నారా తాతగారు?

ఆర్కెల్—లేదు. నిన్ను బాగుచేసిన వైద్యుడు కూడా వున్నాడు.

మెలిజాండా—ఆహా.

ఆర్కెల్—ఆ తరువాత మరొకరుకూడా నున్నారు.

మెలిజాండా—ఎవరది?

ఆర్కెల్—అతడు... నువ్వు జడవకూడదు... అతడు నీకొక పిసరంతైనా హానిచేయునుద్దేశములో లేడు. నమ్ము... నువ్వు భయపడితే అతడు వెళ్లిపోతాడు... అతడు చాల విచారంగానున్నాడు.

మెలిజాండా—ఎవరతడు?

ఆర్కెల్—అతడు... నీభర్త... గొలాడ్.

మెలిజాండా—గొలాడుగారిక్కడ నేవున్నారా? అయితే నాదగ్గర కెందుకురాలేదు?

గొలాడ్—(పరుపుదగ్గరకు జరుగుతూ) మెలిజాండా!... మెలిజాండా...

మెలిజాండా—మీరేనా గొలాడ్.. మిమ్ములను నేను గురిపోల్చుకో లేకపోయాను... నాకళ్లల్లో వస్తమిస్తున్న సూర్యకాంతి పడుతున్నాది... మీరెందుకు గోడవైపు చూస్తున్నారు?... మీరు సన్నముగాను ముసలిగాను అయిపోయినారు .. మన మొకరినొకరు చూచుకొని చాలాకాలమైందా?

గొలాడ్—(ఆర్కెల్ తోను వైద్యునితోను.) మీరీగదిలోనుండి ఒక్కమాటవతలకు వెళతారా? మీరాయిష్టమైతేనే, మీరాయిష్టమైతేనే... నేను తలుపు బారలాతీసేవుంచుతాను... ఒక్కక్షణంమాత్రమే. ఆమెతో కొంచెంచెప్పవలసివుంది. లేకపోతే నేనుమరణించలేను... వెళతారా? సందుకొనకు వెళిపోండి. మీరు వెంటనే వెళ్లిపోరావచ్చు... ఈప్రార్థనమన్నించండి. నేను పరమదౌర్భాగ్యుడను... (ఆర్కెల్ వైద్యులు నిష్క్రమింతురు.)

మెలిజాండా! నీమీద నాకున్నట్టు నామీద నీకు కనికారంవుందా?... ఉందా మెలిజాండా?... నన్నుక్షమిస్తావా మెలిజాండా?

మెలిజాండా—అలాగే, అలాగే. క్షమిస్తాను... క్షమించడాని కేముంది?

గొలాడ్—నీయెడ నేను మిక్కిలి అపరాధం చేసేను. మెలిజాండా...... నేను చేసిన అపచారం నేను చెప్పలేను... కాని దాని నీరోజున ప్రత్యక్షంగానే చూస్తున్నాను ... మొదటిరోజునుండి... ఇదివరకు తెలియనిదంతా ఒక్కసారిగా నా కండ్లలో నేటిసాయంకాలము నాట్యమాడుతున్నాది... ఇదంతా నాతప్పే... జరిగినదీ జరగబోతున్నదీ... నేనొక్కసారిగాని చెప్పగలిస్తే నేనెలాగుచూస్తున్నది నీకే తెలుస్తుంది... నేనంతాచూశాను; నేనంతాచూశాను: కాని నిన్ను నే నలా ప్రేమించాను... నిన్ను నే నలా ప్రేమించాను... ఇప్పుడొకరు చనిపోను న్నారు... నేనే చనిపోనున్నాను... నాకు తెలుసుకోవాలనుంది... నాకు నిన్నడగాలనుంది... నువ్వు తప్పుగా తలపవుగదా?... నాకు కావాలి... చనిపోడానికి సిద్ధంగానున్నవారికి సత్యంచె

ప్పాలి...అతనికి నిజం తెలియాలి. లేకపోతే నిద్రపో లేదు...నువ్వు నాకు నిజం చెప్తానని ప్రమాణం చేస్తావా?

మెలిజాండా—అలాగే.

గోలాడ్—నువ్వు పెలియాజ్‌ను ప్రేమిస్తున్నావా?

మెలిజాండా—తప్పకుండాను. అతనిని నేను ప్రేమిస్తున్నాను. వీడీ ఎక్కడున్నాడు?

గోలాడ్—నువ్వు నన్ను బోధపర్చుకోలేవా?... నువ్వు నన్ను బోధపర్చుకోలేవా? నా కిదంతా సరిగానే...సరీగానే...కనబడుతుంది నే నడుగుతున్న దిది. నువ్వుగాని వానిని తలపరాని ప్రేమతో ప్రేమించావా?...ప్రేమించావా?...నువ్వు దోషంచేసేవా? చెప్పుచెప్పు. ఆః. ఆః. ఆః.

మెలిజాండా—లేదు. లేదు. మేము దోషులము కాము. అదెందుకు నన్నడుగుతున్నారు?

గోలాడ్—మెలిజాండా! యథార్థంచెప్పు. దేవుని ప్రేమసాక్షిగా.

మెలిజాండా—ఏమి నేను నిజంచెప్పలేదా?

గోలాడ్—ఈలా గీచచ్చిపోయేసమయంలో అబద్ధమాడకు.

మెలిజాండా—ఎవరా మరణించబోతున్నారు? నేనేనా?

గోలాడ్—నువ్వే నువ్వు. ఆతరవాత నేను. నేను కూడాను...మనకు సత్యంకావాలి. మనకు కట్టకడపటికి సత్యంకావాలి? విన్నావా?...అంతా చెప్పు. అంతా చెప్పు. నేనుక్షమిస్తాను...

మెలిజాండా—నే నెందుకు మరణించబోతున్నాను? నాకు తెలియదు.

గోలాడ్—ఇప్పుడు నీకు తెలుస్తుంది. వేళైంది. వేళైంది. లే. వేగం. వేగం. నిజంచెప్పు.

మెలిజాండా—నిజమే...నిజమే...

గోలాడ్—ఎక్కడున్నావు మెలిజాండా! ఎక్కడున్నావు? ఇది సహజంకాదు. మెలిజాండా. ఎక్కడున్నావు? ఎక్కడికి వెళుతున్నావు? (ఆర్కెల్‌ను వైద్యుని తలుపువద్దమాచి) ఆః. ఆః. మీరు లోపలికి రావచ్చును...నాకేమి తెలిసిందికాదు. అంతానిష్ప్రయోజనమే...వేళమించిపోయింది. అప్పుడే ఆమెమనకు చాలదూరమై పోయింది...నాకింక తెలియదు. నేనిక్కడ మరణిస్తాను.

ఆర్కెల్—ఏంచేశావు?...ఆమెను చంపేస్తావు.

గోలాడ్...నేనిప్పుడే ఆమెను చంపేశాను...

ఆర్కెల్—మెలిజాండా...

మెలిజాండా—మీరేనా తాతయ్యగారు?

ఆర్కెల్—అవునమ్మా!...నన్నేమిటి చెయ్యమంటావు?

మెలిజాండా—ఇక్కడ చలికాలం తీవ్రంగా నుంటుందన్నమాట నిజమేనా?

ఆర్కెల్—అదెందు కడుగుతున్నావమ్మా?

మెలిజాండా—చలి మిక్కుటంగానుంది, ఆకులేమి కదలకపోవడంచేతను...

ఆర్కెల్—నీకు చలిగానుందా?—కిటికీతలుపులన్నీ మూసేమన్నావా?

మెలిజాండా—వద్దు వద్దు...సూర్యుడు పూర్తిగా సముద్రంలో మునిగిపోయిందాకవద్దు—అతడు మెల్ల మెల్లగా క్రిందకు దిగిపోతున్నాడు. అప్పుడే శీతకాలం ప్రవేశించిందన్నమాట నిజమే?

ఆర్కెల్—అవును—అయితే నీకు శీతకాలం యిష్టంలేదా?

మెలిజాండా—అబ్బే! కాదు! నాకు చలివేస్తున్నాది...నాకు మిక్కిలి చలివేస్తూవుండడంచేత...

ఆర్కెల్—ఇప్పుడు కొంచెము హాయిగానుందా?

మెలిజాండా—ఆః, ఆః; నాకు మునుపటిచికాకులన్నీ లేవు.

ఆర్కెల్—నీబిడ్డను చూస్తావా?

మెలిజాండా—ఏంబిడ్డ?

ఆర్కెల్—నీబిడ్డ—నువ్వు ఇప్పుడు తల్లివ య్యేవు. నువ్వొక ఆడపిల్లను కన్నావు.

మెలిజాండా—అదేదీ?

ఆర్కెల్—ఇదిగో...

మెలిజాండా—చాల వింతగానుంది......దాని నెత్తుకుందామంటే చేతులు లేవకుండావున్నాయి...

ఆర్కెల్—అదెందుకంటే నువ్వు మిక్కిలి నీరసంగా నుండడంచేత... నేనే యెత్తుతాను చూడు—

మెలిజాండా—అది నవ్వడంలేదు......చాల చిన్నదిగానుంది...అది యేడవబోతున్నాది కూడాను... దానినిచూస్తే నాకు జాలికేస్తున్నాది...[కొంచెము కొంచెముగా, దాసీలు అగది నాక్రమించుకొని, నిశ్శబ్దముగా గోడలదరిని పంక్తులుదీర్చి నిలచియుందురు.]

గొలాడ్—[తటాలున లేచి] ఏమిటిది?—ఇక్కడీ యాడవాండ్రంతా యేమిటి చేస్తున్నారు?

వైద్యుడు—వాళ్లు దాసీలు...

గొలాడ్—వారి నెవరుపిలిచారు?

వైద్యుడు—నేనుకాను...

గొలాడ్—మీరందరూ ఇక్కడ కెందుకువచ్చారు?—మిమ్మ నెవ్వరూ పిలవలేను...మీ రిక్కడేమిటి చేస్తూన్నారు?—కానీ, ఏమిటి చెప్పండి...[దాసీలు నిరుత్తరులగుదురు.]

ఆర్కెల్—అంతగట్టిగా మాట్లాడకు...ఆమె నిద్రపోతున్నాది. కండ్లుమూసుకున్నాది...

గొలాడ్—ఇది దీర్ఘ...?

వైద్యుడు—కాదు కాదు చూడండి; ఆమెఊపిరి తీస్తున్నాది...

ఆర్కెల్—ఆమెకండ్లు నీళ్లతో నిండున్నాయి—ఇప్పు డామెయాత్మ యేడుస్తున్నాది...ఎందు కామె చేతులుచాచుతున్నాది? ఆమెకేమికావాలి?

వైద్యుడు—అచాచడం పిల్లకోసమే. సందేహం లేదు. అదిబిడ్డలనుగూర్చి తల్లియాతన...

గొలాడ్—ఇప్పుడో?—ఇప్పుడో? మీరు చెప్పాలి. చెప్పండి. చెప్పండి.

వైద్యుడు—బహుశః—

గొలాడ్—తత్క్షణమే?...అయ్యో! అయ్యో! నేనామెకు చెప్పవలిసుంది...మెలిజాండా! మెలిజాండా!...నన్ను విడిచిపెట్టేయండి. నన్నొక్కడినే ఆమె వద్ద విడిచిపెట్టండి...

ఆర్కెల్—లేదు. లేదు. దగ్గరకురాకు...ఆమెను మరిబాధించకు...ఆమెతో మరి మాట్లాడకు...ఆత్మ యెటువంటిదో నీకుతెలియదు...

గొలాడ్—అది నాదోషంకాదు...అది నాదోషంకాదు.

ఆర్కెల్—ఊరుకో!...ఊరుకో!...మన మిక మెల్లిగా గొంతుకలో మాట్లాడుకోవాలి—ఆమెను మరి మనంబాధించకూడదు...జీవుడు ప్రశాంతంగాపోవాలని కోరుకుండి. అది బాధకు పిరికితనం పడుతుంది...కాని యీదుఃఖమంతా, గొలాడ్! కాని యీదుఃఖమంతా చూసినవాళ్లదే. అయ్యో! అయ్యో! అయ్యో!(అంతట దాసీలు గదికొనను సాష్టాంగపడుదురు.)

ఆర్కెల్—(తిరిగి) అదేమిటి?

వైద్యుడు—(పక్కపుదగ్గరకుపోయి దేహమును తాకి) అవునంతే.

[దీర్ఘకాలము నిశ్శబ్దము.]

ఆర్కెల్—నేనేమిచూడలేదు.—మీకు నమ్మకమేనా?...

వైద్యుడు—ఆఁ. ఆఁ.

ఆర్కేల్—నాకేమి వినిపించలేదు...అంతవేగ మే. అంతవేగమే...హటాత్తుగా...ఒక్కమాటైనా లేకుండా...వెళ్లిపోయింది.

గొలాడ్—(వెక్కివెక్కి) అయ్యో! అయ్యో! అయ్యో!.

ఆర్కేల్—ఇక్కడుండవద్దు. గొలాడ్...ఆమె కిప్పుడు ప్రశాంతి కావాలి...రా, రా...అది మిక్కిలి దారుణమైనదే. అయినా నీదోషముకాదు...ఆమె శాంతిగల, నెమ్మదైనపిల్ల...పాప మామె యీప్రపంచము వలెనే ఒక యద్భుతమైనజీవి...అక్కడామె తనబిడ్డకు అక్కవలె పండుకొన్నాది. రా, రా...అయ్యోదైవమా! అయ్యోదైవమా!...నాకుకూడా యేమియుబోధపడదు...ఇక్కడనుండి పోదాం పద. రా, ఆబిడ్డ యిక్కడీగదిలో నుండకూడదు...ఆమెకు ప్రతిగా నీమె జీవించియుండాలి...పాప మిక నీ చిన్నిబిడ్డవంతు వచ్చింది.

[అందరు నిశ్శబ్దముగా నిష్క్రమింతురు.]

---

## ఎందుకోయి

అడివి బాపిరాజుగారు, B. A., B. L.

"ఓ శిల్పి! నీవిద్య ఉపదేశ మిచ్చేటి
నీతులే" మని నన్ను నిలిపి ప్రశ్నించావు
"సౌందర్యవిన్యాస చారురేఖల్లోన
నారాణి మూర్తింప నావిద్య" లన్నాను
"ఓ కవీ! నీపాట ఒదుగుమెలుపుల్లోన
చెలువారుసత్యమ్ము సెలవీయు"మన్నావు
"జ్వలితగీతాతటిచ్చలితకాంతుల్లోన
నారాణి దీపింప నాతప" స్సన్నాను
"ఓహో సంధ్యానటా! నీహస్తముద్రాత్మ
సూక్ష్మమే" మని నీవు సూక్తిస్తి చూపులో
"కిణితకిణితంకిటా కేళీమహాగతిని
దేవి! నిన్నభినయించ చద్వాయితు" డన్నాను.

---

౧

ఏమాట కామాటయే చెప్పవలె; సూపర్నింటు అంతకుముందు బేడీలు వేయింపకయే ఖైదీలచే తనవాకిట పని చేయించుకొనుచుండెడివాఁడు. ఇటు లుండఁగా ౧౩౪౭ వ నెంబరు ఖైదీ అందఱికంటె నమ్మకముగా పని చేయుచు తప్పించుకొని పాఱిపోయెను. ఎంత ప్రయత్నము చేసినను వాని యానుపానులు దొరకలేదు. ఈ దుర్నయముచే ఖైదీ లందఱును చురల బేడీలు వేయించుకొని పనిచేయ వలసినవా రయిరి.

౧౩౪౭ తప్పించుకొని పోయినందువలన సూపర్నింటుకు మాటరాలేదా? యని శంక కలుగవచ్చును. సూపర్నింటు చాల చతురుఁడు. దిక్కులేని బిచ్చగాని నొకని దెచ్చి ౧౩౪౭ గాఁ జేసెను.

నాఁటినుండియు ఖైదీలకు వదులుగా గొలుసులు వేయఁబడుచుండెను. ఆ గొలుసులను గొంచె మటునిటు సర్దుకొనుచు నడుమ నడుమ మాటలు చెప్పుకొనుచు జీతనాతములు లేక సూపర్నింటు వాకిట పనిపాటలు చేయుచున్న ఖైదీలు కొంద ఱొక్కపర్యాయము లికిపడిరి. జైలుసూపర్నింటు తన బంగళాలో డ్రాయింగురూమునుండి రీడింగురూము లోనికి వెళ్లెను. ఖైదీలకన్నులలో వైర్‌లెస్ టెలిగ్రాములు నడచెను. ఖైదీలందఱును తమ తమ పనులలో మునిఁగిపోయిరి.

సూపర్నింటు తన వ్రాఁతబల్లకడ నిలిచి దానిమీఁద నున్న ఉత్తరముల నన్నిఁటిని దీసికొని పయిపేరు మాత్రము చూచుచు ఒక్కొక్క యుత్తరమునే బల్లమీఁదఁ బడ వయిచుచుండెను. తుద కాయుత్తరములనన్నిఁటిని కట్టగా కట్టి నేలకు విసరికొట్టెను. కోపము చెందినటులు ఆకట్ట ప్రిదిలెను. ఉత్తరములన్నియు చిందరవందరగా నేలపైఁ బడెను.

సూపర్నింటు వట్టిమాటలప్రోగు కాఁడు; కార్యశూరుఁడు. పిదప నతఁడు నిస్సహాయములయి పడియున్న ఆయుత్తరములపై తాండవమే చేసెనో, మఱి యేమిచేసెనో కాని ప్రతి యుత్తరమును అతని కాలిజోడుక్రింది లాడముల చేఁపగుఱుతులను తల దాల్చెను.

అతని యీపనివలన భూదేవి యేడుపువలె నొక శబ్దము బయలుదేఱెను. నేల మీఁదిగచ్చు ముక్కలు ముక్కలై లేచెను. అతఁడు తనబలమునకు సంతసించి కాఁబోలు ఆ గచ్చుముక్కలను చేతఁబుచ్చుకొని పరీక్షించెను.

వాకిటఁ బనిచేయుచున్న ఖైదీల మోములలో అతికష్టముగా ఆఁపుకొనఁబడిన నగవు వారి దవడల నుబికించి ముక్కులను వెడద చేయించి నోరుమూయించెను. సూపర్నింటు

పదధ్వని నియతతాళమానములతో ద్వారము కడకు వచ్చుచుండెను. ఖైదీలు కుక్కినపేల వలె తమతమ పనులలో నప్రమత్తు లయి యుండిరి.

సూపర్నెంటు వాకిటికి వచ్చి కుర్చీలో కూర్చుండి ఒకరొక్కరినే చూచెను. దొర గారి కందఱును సలాము చేసిరి. ఒకఁడు మాత్రము పనిపోవునని కాఁబోలు సలాము చేయ లేదు. అతని నంబరు౧౫౨౭.

నూటయాభై యేడూ, అని సూపర్నెంటు పిలిచెను. అతఁడు ఉలికిపడి చూచి దాపునకు వచ్చెను. సూపర్నెంటు తనబూట్సులుచూచు కొనెను. బూట్సులుగూడ నతని కడలి కొంత చినిఁగెను. 'ఈబూట్సులు విప్పు' అని సూపర్నెం టనెను.

సలాము చేయనందులకు చెప్పుదెబ్బల వ్రాఁత వీని మోమున వ్రాసియున్నదని వా రంద ఱనుకొనిరి.

౧౫౨౭ సూపర్నెంటు కడకు వెళ్లి వంగి చూచి—'ఏలినవారిపాదాలు చెప్పులను కఱచినవి. ఇంకా వాట్లకోపం చల్లాఱినట్లు లేదు; రక్తం కక్కుతున్నవి' అని నోటిమీఁద చేయి వేసికొనెను.

సూపర్నెంటు ౧౫౨౭ బుజమును తట్టి 'విప్పు' అనెను. ౧౫౨౭ విప్పి మేజోళ్లతో బూట్సులను తీసెను.

ఖైదీ లందఱును ౧౫౨౭ ఒంటిమీఁద చెప్పుదెబ్బలనువినుటకు సంసిద్ధులయి యుండిరి.

చప్రాసీ యొకఁడు లోపలినుండి కొత్త మేజోళ్లను కొత్తబూటుసులను తెచ్చినిలిచెను. సూపర్నెంటు ౧౫౨౭ ను చూచి ఆ బూటుసులకు సలాము చేయుమనెను. ౧౫౨౭ బూటుసులకును, పిదప సూపర్నెంటునకును సలాము చేసెను. ఖైదీలు లోలోపలనే నవ్వు నాఁపుకొనిరి. 'ఆబూట్సులతో ఆదవడ ఈదవడ కొట్టుకో' అని సూపర్నెం టనెను.

'నాయంతట నేను కొట్టుకొను నలవాటు లేఁగద నాకు లేదు' అని అతఁడు వడివడిగా తన రెండు దవడలను కొట్టుకొనుట నభినయించెను. సూపర్నెంటు ౧౫౨౭ మొగము నొకతూరి చూచెను. అతఁడు మఱొకమాఱు సలాము చేసి తనపనికి వెళ్లిపోయెను.

చప్రాసీ మేజోళ్లను బూట్సులను సూపర్నెంటుకు తొడిగెను. సూపర్నెంటు మెల్లగా అడుగులు పెట్టుకొనుచు రీడింగురూములోనికిఁ బోయి కూరుచుండెను. అతని వెనువెంటనే చప్రాసీకూడ వెళ్లి నిలువఁబడియుండెను.

'కారు తీసికొనిరమ్మను పో' అని సూపర్నెం టనెను. సెలవు దొరకినటులు చప్రాసీ పరువెత్తెను.

పదినిమిషములలో కారు వచ్చి వాకిట నాఁగెను. తూనీఁగవలె సూపర్నెంటు కారు లోని కుఱికెను. జయఘోష మొనరించుచు కారు పరువిడెను.

ఖైదీల కాలిగొలుసు లన్నియు ఒకతూరి గలగలమనెను. పనులు ముగించి యెచటివా రచటఁ గూలఁబడిరి.

'ఇవ్వాళ నాటయాత్రయేడుకు గండం చిత్రంగా దాటిందిరా' అని ఒకఁ డనెను.

'దొరకు పిచ్చియెత్తెనేమోరా! గదిలో ఒకటేగంతులు' అని ఒకఁ డనెను.

'కాదురా, పెళ్లికి డేన్సు నేర్చుకుంటు న్నాఁడురా' అని ఒకఁ డనెను. అందఱును ఆమాటనే సిద్ధాంతము చేసిరి.

౨

మోటారుకారు స్త్రీల చెఱసాలకడ నాఁగఁగనే మొగసాల తెఱవఁబడెను. సూపర్నెంటు దిగి లోని కేఁగెను.

అచట పెద్దయుద్యోగమునందున్న ఆంగ్లో ఇండియన్ దొరసాని డిక్సు అనునామెయు సూపర్నెంటును కరస్పర్శ గావించుకొనిరి. కాసుపాసు మని మాటలాడుకొనిరి. దొరసాని తనపనిమీఁదఁ బోయెను. ఆఫీసుగదిలోఁ గూరుచుండి సూపర్నెంటు కాకితములుచూచు కొనెను.

దొరసాని ఖైదీల నందఱను బారుగా నిలువఁబెట్టెను. సూపర్నెంటు వారిని పరీక్షించుటకు వెళ్లెను. ఖైదీలుపలువు రతనికి సలాము చేసిరి. కొందఱు కరస్పర్శగావించిరి. కొందఱు స్తంభములవలె నిలువఁబడిరి. కొందఱు ప్రక్కకుఁ దిరిగి చూచుచుండిరి. కొందఱు తల గోఁకుకొనుచుండిరి. మఱికొందఱు వంగి నేలను పాదములను జూచుకొనుచుండిరి.

దొరసాని సూపర్నెంటుకుఁ దెలియకుండ 'తిన్నగా నిలువుఁ' డని సైగచేసెను. దాని నెవరును పాటింపలేదు.

సూపర్నెంటు 'మిస్ డిక్!' అని పిలిచెను.

దొరసాని కొంచె ములికిపడెను. తనకు పిలుపు వచ్చునని యామె యనుకొనలేదు. ఎవరిమీఁద సూపర్నెంటు కోరడా పడునో యనియే యామె భీతిల్లుచుండెను. ఇట్టిస్థితిలో ఈపిలుపు. 'యెస్ మిస్టర్ హెన్రీ!' అని యామె యనెను.

'చూచితివా రేఖను?'

'చూచితిని' అని బదులుపలికి 'అమ్మా! తిన్నగా నిలు!' అని రేఖతో ననెను. రేఖ నిశ్చలముగా నిలువఁబడియుండెను.

సూపర్నెంటు రేఖ లలాటమును ఆచి చూచెను. అతనిచూపు మొగమునుండి పాదములవఱకును మెల్లఁగాఁ బ్రసరించెను. రేఖకు ఆచూపు తొండ్రపాఁకినటు లుండెను. ఆమె Insult!-Insult!(అవమానము!అవమానము!) అనుచు అనుజ్ఞగొనకయే వెళ్లిపోయెను. పిదప నొకరితరువాత మఱియొకరు ఖైదీ లందఱును వెళ్లిపోయిరి.

సూపర్నెంటుముఖ మంతయు మసి పూసినటు లాయెను. ఇంతలో డిక్సు కల్పించుకొని యేదోమాట యెత్తనిచో నతఁ డచేత నుండే యుగువాఁడో, లేక ఉగ్రుఁడే యగువాఁడో యెవరు చెప్పఁగలరు?

'౩౭౫ నెలరోజులు జ్వరపడి యిపుడిపుడే కోలుకొనుచున్నది' అని డిక్కనెను.

'ఓ యెస్ మదామ్, ఓ యెస్ మదామ్' అనుచు సూపర్నెంటు డిక్కుచేయి పట్టుకొని యూఁపెను.

వెనువెంటనే అతఁడు మొగముచిట్లించుకొని 'చూచితివా ఈఖైదీలు నా కెంత తిరస్కారము చేసిరో!'

'ఔ నౌను.'

సూపర్నెంటు అవుడు కలచి ఆలోచించుచు నిలువఁబడెను. కొంతవడి కాలము స్తంభించిపోయెను. డిక్కు గుండియ లుడ్డుగుడుచుకొనెను.

'హిందూస్త్రీలను నేను Fair-sexఅనను.'

'ఔ' నని డిక్కు నవ్వెను.

'నాముందర ఆఁడువా రింకెటె అవినయము చేయుదురా? పశువులు!'

'పశువులు!' అని డిక్కు అనువదించెను.

'కాఁబట్టి...కాఁబట్టి......' అని యేమేమో అనఁబోవుచు సూపర్నెం టొకసారి డిక్కు మోమును జూచెను. ఆమె బిక్క మొగము కళాయిలేని అద్దమువలె నుండెను.

'చూచితివా?'

'ఆఁ.'

'వంను లీ బుపోటులతోఁగాని మరలవు. ౩౭౫ తప్ప తక్కిన వీరందఱకును ఈరాత్రి నుండి మూఁడురాత్రులవఱకును నిలువు బేడీలు వేయింపుము. వీరికి నడుమ నడుమ ఇట్టి పాఠములు చెప్పుచుండవలయును.'

'౩౭౫ తప్ప తక్కినవారికా?'

'ఔను.'

'సరియ' అని డిక్కు లోలోపల నవ్వుకొనెను.

'డిక్!'

'ఆఁ.'

ఏమో అనవచ్చి ఆఁగిపోయి సూపర్నెంటు డిక్కుచేతుల నొకపరి ఊఁపి ౩౭౫ గది కడకు వెళ్లెను.

౩౭౫ పాలిపోయియుండెను. తలముడుచుకొనుట కోపికలేక ఎఱ్ఱబాఱిన వేసవి నామె యొత్తి కట్టుకొనుచుండెను. బొట్టు పెట్టుకొనుటకు చెఱసాల నియమము లంగీకరింపవు. ఈ రీతిగా నున్న ౩౭౫ మోము పున్నమనాఁటి వేకువ చందమామ.

సూపర్నెంటా చందమామను జూచుచు నిలువఁబడెను. అతనిహృదయానందము కన్నులకుఁ బెట్టని కాటుకగా మాఱెను. కొంతవడి చూచి యతఁడు గదిగుమ్మముమీఁదికి కాలిడఁబోయెను. వెనుకనుండి డిక్కు వడిగా వచ్చెను. లోపల పరధ్యానముగా నున్న ౩౭౫ సూపర్నెంటును హఠాత్తుగా చూచి గదితలుపును గభాలున వైచెను. ఆతలుపు హాహాకారము చేసెను. సూపర్నెంటు తొందరపడి వెనుదిరిగెను. డిక్కును తప్పించుకొని ఆఫీసు గది

లోనికిని, పడఁపడి మోటారులోనికిని బోయెను. మఱునిముసమముననే మోటారు 'బుయి' మనెను.

ఢిక్కు ౩౭౬ గదిలోనికి వెళ్లెను. ౩౭౬ ఎడమొగము పెడమొగముగాఁ గూరుచుండెను. ఢిక్కు దాపున కేఁగి కూరుచుండెను. కొంతసేపటులు కూరుచుండి — 'చూచితివా లక్ష్మీ! దొరగారికి మామీఁద చాల ప్రేమ.'

'ఛీ పాడుప్రేమ! నామీఁద ప్రేమఏమిటి? నీమీఁద కాదూ?'

'ఔను. నామీఁదనూ ప్రేమే. ఐనను మామీఁద ఎక్కువ.'

'ఇఁకొకతూరి ఇటు లనవలదు. ఇప్పటికి క్షమించితిని.'

'కాదమ్మా! తొందరపడవలదు. మఱేమియు తప్పు లేదు. నీ మొగమున కేతరీను పోలికయున్నది. కేతరీను ఎవరో తెలియునా? దొరగారు ఇఁక ఆమెను పెండ్లిచేసికొందురు.'

'ఏమీ, చెప్పకపోతివి!' అని లక్ష్మి రంయిమని లేచి రెండుబొగ్గులు నూఱి మొగమంతయు పులుముకొనెను.

ఢిక్కు తెల్లఁబోయెను. 'నయమే, ఇచట కత్తులును కటారులును లేవు' అని అనుకొనెను. 'లక్ష్మి! నీవు తొందరపడకు! నేనుండఁగా మీకే యపాయమును లేదు. మీ రందఱును మామూలుగా ఆడుకొనుఁడు. దొరగారు వచ్చినపుడు మాత్రము బడిపిల్లలవలె నుండుఁడు' అని ఆఫీసుగదిలోనికి వెళ్లిపోయెను.

పరిచారకుఁ డొకఁడు వాకిట వ్రేలాడుచున్న కంచుసిబ్బిమీఁద నాలుగుమాఱులు కొయ్యగూటముతో కొట్టెను.

ఆఁడువా రందఱును ఆటలకు లేచిరి. ఖైదీలకు కాలిబేడీలు చెప్పకయే ఢిక్కు ఆఫీసుగదినుండి వెళ్లిపోయెను.

సూపర్నెంటు ఢిక్కు ఈ యిరువురును ఆస్థలమును ఖాళీ చేయఁగనే స్వాతంత్ర్యము కొంచె మాస్థలము నాక్రమించెను.

## ౩

కారు మగవారి జైలుగోడలకు ఫర్లాంగు దూరమున ఆఁగెను. సూపర్నెంటు దిగి కొంతదవ్వు నడచిపోయి చెఱసాల బయటి గోడల బీటికలనుండి పొంచి చూచుచు నిలువఁబడెను.

చెఱసాల మొగసాల తెఱవఁబడెను. తలమీఁద నీలి పోలీసుపాగాయును, పావురాయి రంగు గల చొక్కాలాగూలును, చేతిలో లాటీయును దాల్చిన వార్డ రొకఁడు గర్వముతో బయటికి వచ్చెను. ఆవార్డరులను ఖయిదీలు సిపాయీ లని వ్యవహరింతురు. ఆసిపాయి వెనుక నలుగురుఖయిదీ లొకబరువు బండిని లాఁగికొని వచ్చి బయటి పిట్టగోడ ప్రక్క నున్న చెట్టుక్రింద దింపిరి. సిపాయి దాపున నున్న ఒకచిన్నయింటిలోని కేఁగెను.

ఆబండి కెదురుగా నొకద్వారము కలది. దాని తలుపులు తెఱవఁబడియుండెను. తమ బంధువులగు ఖయిదీలనుకొందఱినుజూడవచ్చిన యిద్దఱు ఆఖయిదీలను బరువుబండిని బెరుకు బెరుకుగా చూచుచు వెలుపటి రోడ్డుమీఁద నిలువఁబడియుండిరి.

ఇంటిలోని కేఁగిన సిపాయి చాటుగానిలిచి ఖయిదీలను జూచుచుండెను. రోడ్డుమీఁద నిలువఁబడిన ప్రేక్షకులు ఖయిదీలను విచిత్రముగాఁ జూచుచుండిరి. జమఖాణపుగీటులు గల పొట్టిచొక్కాలును, మట్టిలాగులును, నెత్తి కంటుకొనియున్న పిచ్చికుల్లాయిలును గల ఖయిదీల వేసములు వారిమనస్సు కరఁగించెను.

ప్రేక్షకులు తమదెస నదేపనిగా చూచుచుండుట ఖయిదీలలో నొకఁడు కనిపట్టెను.

'పొగాకుకు ఏదయినా ఒకడబ్బు ఇయ్యండి. సిపాయి వస్తాఁడు. వాఁడు చూస్తే మాకు దక్కదు. దబ్బునఇయ్యండి' అనిఖయిదీఅనెను.

ప్రేక్షకుఁడు బేడకాసొకటి విసరెను. ఖయిదీ దానిని కాలిబొటవ్రేలితో నొక్కిపట్టుకొని అటు నిటు చూచి తీసికొనెను.

'సిపాయి చూచుచో మీకిది దక్కదా? పాపము!' అని రెండవప్రేక్షకుఁడనెను.

'దయ్యంముందర బిడ్డలా అండి! నాకో డబ్బు పారెయ్యండి' అని రెండవఖయిదీఅనెను.

'అదేమి? ఆబేడ మీరు పంచుకొనుఁడు!' అని మొదటిప్రేక్షకుఁడనెను.

'బాబూ! వాఁడింకా మాకిస్తాఁడాండీ!' అని రెండవఖయిదీ అనెను.

'ఏమిరా ఈయప్పా?' అని మొదటి ప్రేక్షకుఁడనెను.

'ఇది నాకు అర్ధాకలి. ఇందులో జవానుకు భాగం. సిపాయికి భాగం. ఒకఅణా మిగిలితే కోమటి ఒకతుంపు ఇస్తాఁడు' అని మొదటి ఖయిదీ అనెను.

'పోనీ పాపము!' అని రెండవప్రేక్షకుఁడొకబేడకాసు గిరవాటువైచెను. మూఁడవ ఖయిదీ దానిని పాదముతో నొక్కిపట్టి లాఁగుకొనెను.

'చూచితిరా బాబయ్యా, వీఁడు లాఁగుకున్నాఁడు. మఱొకటీ పారెయ్యండి.' అని రెండవఖయిదీ అనెను.

'ఓరీ మీదుంపలు తెగ! మీరు నలుగురూ నాలుగణాలు పంచుకొనుఁడు! మీరు గజదొంగలు కాఁబట్టీ మీకీగతి పట్టింది' అని మొదటిప్రేక్షకుఁడనెను.

'బాబూ వాళ్లు మాకియ్యరు. సిపాయి వచ్చే వేళయింది. మఱిరెండుబేడలు పారెయ్యండి' అని రెండవఖయిదీ అనెను.

'మీ రేమినేరము చేసితిరిరా!' అని యడుగుచు ప్రేక్షకు లిరువురును చెరియొకబేడ విసరిరి. ఆరెంటిని రెండవఖయిదీ డేగవలె పట్టుకొని బొడ్డులో దాఁచికొని —'అయ్యా మేము దొంగతనం చేశాం; ఇహా బుద్ధివచ్చింది' అనెను.

'అయ్యా, చూశారా, బేడలు రెండూ మీరు చూస్తూండంగానే వీఁడు దొంగిలించాఁడు. ఇహ దొంగతనం చెయ్యఁడఁట! చూచారా! బుద్ధివచ్చిందఁట! బాబయ్యా! నా కో బేడా పాఱెయ్యండి!' అని నాలుగవ ఖయిదీ అనెను.

'ఛీ ఛీ మీ కిచ్చుట మాదే తప్పు. మాకే బుద్ధి వచ్చినది' అని ప్రేక్షకు లనుచుండఁగా సిపాయి వడివడిగా నచటికి వచ్చెను. ఖయిదీలు ముగ్గురు బండిచాటునకు వచ్చి దాఁచిన డబ్బును దీసి మ్రింగిరి.

సిపాయి ప్రేక్షకులను బిలిచి 'ఏమి మాటలాడుచున్నారు? ఖయిదీలతో మాటలాడఁగూడ దని మీ రెఱుఁగరా? మీకు శాస్తి జరుగును' అనెను.

'మాకు తెలియదు మాకు తెలియ'దని ప్రేక్షకులు వసిగిరి. 'మీరు వారి కేమి యిచ్చితి' రని సిపాయి యడుగుచుండఁగా ఖయిదీ లొక రొక రొకరొకరిని చాటుచేసికొని ప్రేక్షకులకు చేతులు త్రిప్పుచు సైగలు చేసిరి. గ్రహించి ప్రేక్షకులు 'ఏమియు ఈయలేదు' అనిరి. సిపాయి తల యూఁచెను.

ఖయిదీలు పొండని ప్రేక్షకులకు సైగ చేసిరి ప్రేక్షకులు వడివడిగా పోఁదొడఁగిరి.

'భయము లేదు, ఉండుఁడు.' అని సిపాయి యనెను. ప్రేక్షకులు నిలువఁబడిరి.

సిపాయి ఖయిదీల కుళ్లాయితీసి తల తడవెను. లక్ష్మి సామాన్యముగా దాఁగులాఁడి కదా! చెవులలోనికి చిటికెన వ్రేలు పోనిచ్చి శష్కులివఱకు వెతకెను. ముక్కు మూలము దాఁక శోధించెను. ఒడ లెల్లెడ పరీక్షించెను. సిపాయిలకు సిగ్గులేదు; ఖయిదీలకును సిగ్గు లేదు. తుద కతఁడు విసికి ఒకఖయిదీని వంచి మెడమీఁద ఒక గ్రుద్దు గ్రుద్దెను. కొంత రక్తముతో కలిసి రెండు బేడలు నేలపైఁ బడెను. తక్కిన యిరువురును ఓక్కరోక్కరు మని కాఁడి యుమిసి కంఠకూపమునుండి రెండు బేడలఁ దీసిరి. సిపాయి వానిని వారిచేతనే తుడిపించి తీసికొని జేబులో వేసికొనెను. ప్రేక్షకులు నిలువున నీఱయిపోయిరి.

ఆసమయమున సూపర్నెంటు రంగమునఁ బ్రవేశించెను. పొండు పొండని ఖైదీలు సంజ్ఞ చేయులోపలనే సూపర్నెంటు కొరడా వారి వీఁపులమీఁద ముద్ర వేసెను.

సిపాయి నాలుగు బేడలను దెచ్చి సూపర్నెంటు ముంగల నిలిచెను.

సిపాయి చేయి వాచెను. ఖైదీల కాళ్ల నుండి రక్తము కురిసెను. ప్రేక్షకులు తమ బంధుగులను జూచుట కనుజ్ఞ గోరకయే పరుగెత్తిరి. సూపర్నెంటు కొరడా తెగిపోయెను.

౪

అచటినుండి అన్నిమూలలు పరిశీలించుచు సూపర్నెంటు మొగసాలకడకు వచ్చెను. డ్రైవరు మోటారునుగూడ నచటికి తోలి నిలిపెను.

వాకిట పారాయిచ్చుచున్న సిపాయులు అప్రమత్తులయి సెల్యూట్ చేసిరి. సూపర్నెంటు చూపులు ముండ్లా యేమి?—ప్రతి వానికిని గ్రుచ్చుకొనియెను. సూర్యుఁ డతని తేజమున కోడి చెఱసాల గోడచాటునకేఁగెను. సిపాయులు బాకాలూఁదిరి. ఉద్యోగుల వందనము లందికొనుచు సూపర్నెంటు చెఱసాల లోని కేఁగెను. అతఁడు లోని కేఁగఁగనే మోసాల తలుపులు మూయఁబడెను.

చెఱసాలచుట్టును తాటియెత్తురాతిగోడ. గోడలోపల వందల యెకరముల నేల. అర్ధచంద్రాకారముగాఁ గట్టఁబడిన ఖయిదీల గదులు. ఉరి తీయఁదగిన వారి గృహాలు. మాఱుమూల వధ్యశాల. సూపర్నెంటుకు అన్నియు కనువిందొనర్చుటకు గోపురాకారముగాఁ గట్టఁబడిన ఎత్తగు మేడ. దుమ్ము దూగర లేని ఘంటాపథములు. లోఁతు లేని నూతులు. గోశాలలు. అచ్చు కూటములు. తివాచీ నేఁతసాలలు. గానుగలు. ఇట్టి చెఱసాల మొగము స్వర్గము; గుండె నరకము. అందు పయివానికి వింతలు వినోదములు; లోపలి వారికి చింతలు, చికాకులు. అందు మానవులతోపాటు మహావృక్షములును జన్మశిక్ష ననుభవించుచుండెను. వానితోపాటు అందు బంధింపఁబడిన ఘంటాపథముమాత్రము అనేకులను చెఱలోనికిఁ దెచ్చుచున్నను కొందఱ విడుదలకు దారి నిచ్చుటచేఁ గలకలలాడుచుండెను. సూపర్నెంటు ఆరస్తామీఁద నడచిపోయి ప్రత్యేకముగా కట్టఁబడియున్న ఒక గుహచెంతకుఁ జనెను.

ఆగుహ గ్రుడ్డిది. దానికి తలలేదు. దాని క్రింద చవుడు. దానికొక వ్రేలెఁడుకంత గలదు. దానిలోనుండి చూచినచో కను లంధకారమయి పోవును.

ఆ గుహలో నొక పురుషుఁడు కలఁడు. అతఁ డాజానుబాహువు. అతనికనులుచేరెఁడు; రొమ్ము బారెఁడు. కంఠము శంఖము. ముఖము సూర్యబింబము.

అతఁడు బయటి యలికిడి విని వంగి కంతలో నుండి చూచెను. ఎట్టెదుట సూపర్నెంటు.

అతఁ డా సూపర్నెంటును జూచి గాలికి ముగ్గని పర్వతశిఖరమువలె నిలువఁబడెను.

తనకు సలాము చెప్పక నిలువఁబడి యున్న ౨౫౬౭ ను జూచి సూపర్నెంటు లోలోపల మండిపడెను. ౨౫౬౭ ఆమంట నార్పను లేదు; ఎక్కువ చేయను లేదు కావున ఆమంట యినుపగుండువలె మండి మండి తనలోఁ దానే చల్లాఱఁజొచ్చెను.

కొంతవడికి సూపర్నెంటు 'ఇరువది యయిదువందల అరువదియేడూ' అని పిలిచెను.

'ఆఁ.'

'నీ కురి రేపే'

'నే నెల్లుండి యనుకొనుచున్నాను. రేపే యగుచో చాలమంచిది. బంధుదర్శనమువలనఁ గలుగు శోకము తప్పిపోవును.'

'నీ బంధువు లెవరు వత్తురు?'

ఆప్రశ్నకు సమాధానము రాలేదు. సూపర్నెంటు కొంచె మాగ్రహముతో 'ఎవరా బంధువులు?' అనెను. సమాధానము రాలేదు. సూపర్నెంటు 'మీకుటుంబము వారి కెవరికిని ఇచటికి వచ్చుట కనుజ్ఞ లేదు. ఇంక బంధువు లెవరు?' అనెను. మరల సమాధానము రాలేదు. ముమ్మాఱులకును సమాధానము రానందువలన సూపర్నెంటు కన్నులు రక్తము కురిసెను. మఱి చేయునది లేక అతఁడు 'రేపు సిద్ధముగా నుండుము' అనెను.

'నేను సిద్ధముగా నుండున దేమి? మీరే సిద్ధముగా నుండవలయును.'

ఈసమాధానము నాలోచించుకొనుచు సూపర్నెంటు వెనుదిరిగెను. అచటనచట దీపములు వర్షాకాలనక్షత్రములవలె మిణుకు మిణుకుమని వెలుగఁదొడఁగెను. తమతమ పనులనుండి గూండ్లకు మరలుచున్న బందీలు చేతులయి సూపర్నెంటుకు వంగి వంగి సలాములు చేయుచు తప్పుకొనుచుండిరి. 'మీరే సిద్ధముగా నుండవలయును, మీరే సిద్ధముగా నుండవలయును' అని యనుకొనుచు తల వంచుకొని సూపర్నెంటు దూసిన యమ్మువలెఁ బోయి కారులోఁ గూరుచుండెను. డెప్యూటీజైలరు జైలరు వైద్యులు మొదలగు ఉద్యోగులువచ్చి సెలవుగొనకముందే కారు వెళ్లిపోయెను. సిపాయీలు బాకా లూఁదిరి.

'ఇపుడు దొరగారు ఆఫీసుకాకితముల నయినను తిన్నగఁ జూచుటలేదేమి?' అని డెప్యూటీజైలరు జైలరును అడిగెను.

'దొరగారిపెండ్లి ఎల్లుండి. అదియే పది యాఫీసులంతపనిగా నున్నది.'

'దొరగారి కింతవఱకు పెండ్లి కాలేదేమి?'

'సూపర్నెంటుకు పిల్ల నెవరిత్తురు?'

'జైలరు కిత్తురేమి?'

'జైలరునకును ఈయరు. జైలరును గాక ముందే నాకు పెండ్లి అయెను. కొన్నియుద్యోగములకు బాల్యవివాహములు మంచివి.'

'సంతకములు చేయవలసిన కాకితములు చాల నున్నవి. రేపు టపాలో పంపవలెను. దగ్గఱకుఁ బోవుచోఁ బెండ్లికొడుకు చిర్రుబుస్సు మనుచున్నాఁడు. నడుమ నాపని పిడుచకట్టునట్టు లున్నది.'

'దొరపెండ్లి యెల్లుండి. ౨౫-౭ కు ఉరి యెల్లుండి. ఈదిక్కులో దొరగారి పెండ్లికి ముందు మనకు పెద్దపెండ్లిగా నున్నది. రేపు ప్రొద్దున బంగళాకు వెళ్లుఁడు. దొర మిమ్ముల నచట నిలుపఁడు. వెంటనే వ్రాలుపెట్టి మిమ్ము త్రోలివైచును. దీనికన్న వేఱుపాయము లేదు.'

'ఊహూ, నేను పోను. హిందువులకు ఎట్టికెట్ తెలియదని నిందించును. కాకితముల నింటికేఁ బంపుమను.'

వీ రిటులు మాటలాడుకొను చుండఁగా వైద్యులు వచ్చిరి. అందఱును వెడలిపోయిరి.

౫

సూపర్నెంటు ఆఫీసు-కాకితములమీఁద దస్కతులు చేసెను. వసారాలో అటు ఇటు పచారుచేయుచు నడుమనడుమ దారికేసి తల యెత్తి చూచుచుండెను.

తపాలావాఁడు వచ్చెను. సలాము చేసి ఒక ఉత్తరములకట్టను బల్లపయి నుంచెను. సెలవుగొని వెళ్లిపోయెను.

వెంటనే సూపర్నెంటు గబగబ ఆయుత్తరముల నన్నిఁటిని దిరుగవేసెను. వానిలో నుండి రెండు ఉత్తరములను దీసికొని డ్రాయింగురూములోనికిఁ జని తలుపులు మూసికొనెను.

అతఁ డాయుత్తరములలో దేనిని ముందు తెఱచుటకును పాలుపోక నాలుగయిదు నిమిషములు తటపటాయించెను.

అం దొక కవరు తీసికొని ఆ కేకరాతములతో తిలకించెను. పిదప మెల్లగా విప్పెను. రెప్పవాల్పక చూచెను. అందు మూఁడే బంతులు. మూఁడుబంతులను ముమ్మాఱు చూచి యతఁడు దానిని పుష్పపాత్రమున నుంచెను.

రెండవ యుత్తరమును విప్పుచుండఁగా నతనిచేతులు వట్టుపడెను. గుండియలు స్పందించెను.

'—మీ రెండవ దరఖాస్తుకూడ అందెను. ఇపుడు చాల చిక్కులు గలవు. ఈ తడవకూడ మీపెండ్లికి సెలవీయఁబడ దని చెప్పవలసివచ్చినందులకు చింతగా నున్నది.'

సూపర్నెంటు మొగము మొదటకొంచము వాడు చూపెను. పిదప గీచినకంద యాయెను.

అతఁ డా యుత్తరమును డ్రాయరుమీఁదఁ బడవయిచి యొకగ్రుద్దు గ్రుద్దెను. పిదప చేతితో లాఁగి నేలఁబడవయిచి కాలితో మట్టెను. అది యెంత మొండిదోగాని చినుఁగ లేదు.

అతఁడు చాల మితభాషి. కాని అతని మితభాషిత్వ మపుడు నడలెను. అవసరమున అసంభాషణము మాత్రము పాడియా?

అతఁ డిటులనెను :— సూపర్నెంటుకు రెండుమార్లకుఁగూడ సెలవు దొరకలేదు. అందులో పెండ్లికి. సూపర్నెంటు కీటకమా? అయినను సూపర్నెంటు ఒకరిసెలవు గతుక నేల? నాకు నేనే సెలవిచ్చికొందును; చూతును వీరు చేయునది.

నాకడ నాకు సెల వెందులకు? సెలవను మాట నీచము. నే నిచటనేయుండి అచట కేశరీనుమ పెండ్లియాడుదును.'

అతనిశరీరము చెమరు దోఁగెను. మోమును వంకరగాఁబెట్టి యతఁ డాయుత్తరమును జూచి—'ఛీ నీమొగము చూడరాదు' అని దాని నవలఁ బాఱవయిచి అచటికిఁజని మరల దూరముగా తన్ని త్రొక్కి తాండవించి

రెండవచీటి దీసికొని ఆగదిమూసి పడకగది లోనికి వెళ్లిపోయెను.

తరువాత ఆబంగాళాతలుపు లన్నియు మూయఁబడియెను. పట్టపగలు ఆ బంగళా నిద్రించెను.

సాయంసమయమున బంగళాముంగలకు డ్రైవరు మోటారును తీసికొనివచ్చెను. తలుపు తెఱచికొనివచ్చి సూపర్నెంటు అందధిష్ఠించెను. అది పెద్దజైలునకుఁ బోయెను.

సిపాయులు జైలుముంగల డేరామేకుల వలె నిలువఁబడియుండిరి. వారి 'సెల్యూటు' గూడ వారివలెనే నిలువఁబడియుండెను.

మొగసాల తెఱవఁబడఁగనే సూపర్నెంటు గోపురాకారముగా నున్న నడిమేడమీఁది కేఁగి కాకితములపని కొంతచూచుకొనియెను. సిమ్మట నతఁ డుద్యోగుల నందఱను అచటి కాహ్వానించెను. ఒకరితరువాత మఱియొక రందఱును అచటికి వచ్చిరి.

వ్రాసిన కాకితము నొకటితీసి వారికిచ్చి సూపర్నెంటు—'దీనిని చదివికొని మీ యందఱ సమ్మతిని తెలుపుఁ' డనెను.

ఒకరితరువాత మఱియొక రా కాకితమును జదివికొనిరి. అందఱు నొకవిధమగు సంకోచముతో ఒకరి మొగము మఱియొకరు చూచుచు తలలూఁపుచు బయటికి వచ్చుచు లోపలికిఁ బోవుచు నుండిరి.

సూపర్నెంటు వారిని బిలిచి—'మీకొక పావుగంట గడు విచ్చితిని. బాగుగా ఆలోచించుకొని మీ నిశ్చయమును ఏకగ్రీవముగాఁ దెలుపవచ్చును' అనెను. ఈమాటలు విని వారాలోచించుకొనుటకు వెళ్లిపోయిరి.

వారందఱటు వెళ్లిన వెంటనే సూపర్నెంటు ముంజేతిగడియారమును ముందుంచుకొని ఒకొక్క నిముసమునే పరికించుచు—ఒకటి, రెండు, మూఁడు, నాలుగు, అయిదు, ఊ. దీనికడుపు కాల! నడవదు' అనుకొనెను.

వలయువాని కేడాది యొక నిముసము. అక్కఱలేనివానికి నిముస మొక యేడాది.

పట్టుమని పదినిముసములు కాకముందే డెప్యూటీజైలరచటికి వచ్చెను.

'మీ రయిదునిముసము లు కాకముందే వచ్చుటవలన సమ్మతించితిరని భావింపవచ్చునా?'

'మే మందఱమును సమ్మతించితిమి గాని జైలరుమాత్రము........'

'మంచిది. నాకు చాల సమయమును కూడఁదీసిపెట్టినాఁడు. అతని నొకతూరియిటకు బంపుఁడు!'

డెప్యూటీజయిలరు వెళ్లెను. జయిలరు వచ్చెను.

'ఉరికాకితముమీఁద రేపటి తారీఖువేసి సంతకము చేయువా?'

'రేపు నేఁడుగా మాఱునా?'

'చెడకు. ౨౫౬౭ నేరము తెలియునా? రాజద్రోహముకన్న పెద్దది. Lese Majeste. రేపు జరుగవలసిన ఉరి నేఁడే జరుగును. రేపు నేనిచట నున్నచో నాపెండ్లికి ఉరి.'

'ప్రాణములు నేఁడు పోయినచో రేపు రావు. పెండ్లి రేపుగాకున్న నెల్లుండి. ఎల్లుండి గాకున్న నేఁడాదికైన కావచ్చును.'

'రేపు నీ వతనికి ప్రాణములు తెచ్చి యిత్తువా?'

'రే పీయఁజాలనుగాని ఈ యిరువదినాల్గు గంటలు ఇత్తును.'

'దానికేని నీకు స్వాతంత్ర్యము కలదు కాఁబోలు. కలరా వచ్చి చచ్చుచో? ఇఁకఁ జాలు. చదువులు చదువకు. సూపర్నెంటు కీ చదువులు తెలియును. నీకు ఇష్టము లేదేని వెళ్లి పోవచ్చునుగాని ఇదిగో నీ ప్రమోషనుకు ఆర్డరు తెప్పించితిని. తీసికొని పొమ్ము.'

జైలరు తీసికొనెను. అతని మొగము చెలువాఱెను. సూపర్నెంటు కనిపట్టెను.

'ఇఁక నీవు వెళ్లవచ్చును.'

జైలరు బొటవ్రేలితో నేల రాచుచు 'సంతకము చేయుదును' అనెను.

'ఇష్టములేనిచో బలాత్కారము లేదు.'

చిఱునగవుతో జైలరు 'చేయుదును' అనెను.

'మంచిది' అని సూపర్నెంటు కలమును కాగితమును కొన్ని కాకితములను అతనికిచ్చి వధ్యశాలలోనికిఁ బోయెను.

ఆకాశమునుండి వ్రేలాడు నురిత్రాడు, దానికిసూటిగా క్రింద రాతితోఁ గట్టఁబడిన పెద్దగోయి, దానిలో వేసియుంచిన ఎత్తుబల్ల, బరువునకుఁ గాను రెండు కాళ్లకును కట్టఁదగిన రెండు ఇసుకబస్తాలు మొదలగు పరికరము నంతయు నతఁడు పరీక్షించి ౨౧౬౭ కొఱకు ప్రతీక్షించుచుండెను.

జైలుసూపర్నెంటు పెద్దపెద్దపరీక్షలిచ్చిన వాఁడే. ఉరిశిక్ష ఉండదగునా, ఉండఁగూడదా యని విచారణము చేయఁగలవాఁడే. వేలాది జీతము తీసికొనువాఁడే. సంఘమునందు చాల మరియాదగలవాఁడే. కాని దుఃఖదగ్ధులగు జీవులతో నతని క్రీడ. ఈక్రీడ నాఁడిపై చుట కాతనికన్న నధికారి యెవఁడు?

యమవాహనపు ఘంటాధ్వనులతో ౨౧౬౭ ఆగుహాలోఁ బ్రవేశించెను. 'సిద్ధముగ నుంటివా?' అని సూపర్నెంటనెను. 'మీరే సిద్ధముగ నుండవలయును' అని ౨౧౬౭ అనెను. పనిబాగులవారికీయవలసిన సొమ్మిచ్చి సూపర్నెంటు తలుపులుమూసి బయటికి వచ్చి పనులుచూచికొని మోటారెక్కి వెళ్లిపోయెను. తానుపోయిన పొడుగునను 'మీరే సిద్ధముగ నుండవలయు' ననుమాట అతనిని వెంబడించుచునే యుండెను.

౬

డెప్యూటీజయిలరు వైద్యులు మొదలగు నుద్యోగు లందఱు పెండ్లికి వెళ్లిరి. రేపు రాఁగలరు.

నేఁడు జయిలరే డెప్యూటీజయిలరు, వైద్యుఁడు, మఱియు సూపర్నెంటు. ఖయిదీల

కును పనిబాగులవారికిని చిల్లర మల్లర ఉద్యోగులకును అతఁడు నేఁడు పెద్ద.

పంతులు లేనపుడు బడిపెద్దయే పంతులు. బడిపెద్ద తాను పంతు లనుకొనును. కాని బడిపిల్ల లతనిని వెక్కిరింతురు.

జయిలరు సూపర్నెంటుపనులు చూడ దొరకొనెను. నేఁటి సూపర్నెంటు దేనికిని అనుజ్ఞ యిచ్చుటలేదు. విజిటరులకు ఖయిదీలను జూడ ననుజ్ఞ లేదు. ఖయిదీలకు వచ్చిన ఉత్తరములను చింపి చదివించికొని వినుటలేదు. ఖయిదీలపరీక్ష లేదు. ఖయిదీల మనవులను చిత్తగించుటలేదు. ఏమియు లేదు. కాని అతఁడు సూపర్నెంటు. దానికి చిహ్నముగా నతఁడు సూపర్నెంటు కుర్చీమీఁదఁ గూరుచుండెను. సిగరెట్లు కాల్చుచుండెను.

అతని కేమియు తోఁపలేదు. మేడ దిగి క్రిందికి వచ్చెను. పాకశాలలోనికిఁ బోయి చూచెను. మొగసాలముంగిలికి వచ్చెను. వీథి దెస చూచుచు నిలువఁబడియెను. కొంతవడి కొకతె యతనిచూపునఁ బడెను. ఆమెముఖము గాండ్రిల్లియుండెను. కలువరేకులవంటి కనుల నుండి నీరు జాలుచుండెను. గండస్థలములు రక్తోత్పలములు. వాఁడిపోవఁగా నీటఁ బడవయిచిన గులాబీరేకు లా పెదవులు.

తాను సూపర్నెంటనుమాట నతఁడు మఱచిపోయెను. మామూలు మనుష్యుఁడై వాకిటికి వచ్చెను.

ఆమె కట్టుకొనినచీరెను, తొడిగికొనిన రైకను, మేనిమార్దవమును, సౌందర్యమునుజూచి ఒకడుగు వెనుకకు వయిచెను.

దూరముగా నొకచెట్టుక్రింద తలలువంచుకొని దుఃఖించుచుఁ గూరుచుండిన స్త్రీలు కొందఱును పురుషులు కొందఱును అతనికిఁ గానిపించిరి.

'అమ్మా! ఏలదుఃఖించెదవు? దుఃఖము గూడ భయఁపడుప్రదేశమే యిది.'

'కాఁబోలును. కాని నాదుఃఖము భయ మెఱుఁగదు. నా కీక దుఃఖ మెంతసేపో ఉండదు.'

'ఏ మది?'

'నేఁడు ఉరితీయఁబడువారి శరీరమును నా కీయఁగోరెదను. తాము నా కిందులకు సాయము చేయఁ గోరెదను.'

జయిలరు నేలదెసఁజూచి మూగవాఁడై పోయెను.

ఆమె యతనిని ఆచి చూచుచుండెను.

'అయ్యా! మాటాడరు.'

జయిలరు మాటాడలేదు. వెనుదిరిగిపోవఁ జూచెను.

'వా రసలు రాజద్రోహ మేమియుఁ జేయలేదు. ఉరి తప్పిపోవుచో మీకు శ్రమయే లేదు.'

'ఉరి తప్పు నను ఆశ మీకుఁ గలదా?'

'తప్పక కలదు.'

'ఎటులు ?'

'ఆయన ద్రోహి కాఁడు. సత్యమే సాక్షి. ఉరితప్పుట కింతకంటె ప్రబలమగు నుపాయము వేఱేది?'

'పిచ్చితల్లీ! ఈ కాలమున సత్యము కూట సాక్షి. ఒక అసత్యమును సత్యము చేయుటకు పదిమంది చెప్పుటయే తరవాయి. ఇది వోట్ల యుగము.'

'కాదు, సత్యమునకే జయము.'

'ఆమాట నిక్కమే. సత్యము బయటఁబడ వచ్చును. ఫలము మాత్రము శూన్యము.'

'పోనిండు! వారిశరీరమును నాకిప్పింపరా?'

'అదియు వీలుండదు. అతఁడు రాజద్రోహి.'

'ఆమె కనులనుండి ధారాళముగా నీరురులఁజొచ్చెను.

'మీ రిచట నిఁక నుండరాదు. అవలికి పొండు.' అని యతఁడు వెనుదిరిగి పోఁజొచ్చెను. ఆమె వెక్కివెక్కి యేడ్చుచు వెంబడించుచుండెను. అతఁడు ముందు, ఆమె వెనుక.

ఇంతలో టపాజవా నొకఁడు త్రొక్కుడు బండిమీఁద వడివడిగా వా రిరువురను తప్పించుకొని మొగసాలకడ నాఁగి 'సార్ సార్' అని పిలువఁదొడఁగెను.

జయిలరు వడిగా నడచి 'ఏమిటోయీ ఆగోల? మెల్లగా పిలువరాదూ?' అనెను.

'మెల్లగా గాదు. బిగ్గరగా పిలువవలెను. నే నొక ప్రాణాన్ని రక్షించడానికి నురుఁగులు కక్కుకుంటూ వచ్చా. సూపర్నెంటుగా రేరీ? సార్ సార్!'

'ఏమిటోయ్ గడబిడ! మెల్లగా చెప్పు.'

'ఆ జమీందారుకు రాయనకు ఉరిశిక్ష తొలఁగించ దని అర్జంటు టెలిగ్రాము వచ్చింది. నాకు జమీందారుగారిదగ్గఱ ఈనాముకూడా దొరుకుతుంది. ఏరీ ఏరీ, దొరగారు?'

'నాయనా! నూతేండ్లు బ్రతుకు! ఇదిగో నీకు ఈనాము' అని వెనుక నిలిచియున్న యామె తనమెడలోని హారమును టపాజవానుకు ఈయ చేయిజాఁచెను. తెచ్చపడి టపాజవాను తీసికొనుటకు తటపటాయించుచుండఁగా ఆమె దాని నతనిమీఁదికి విసరివైచెను.

అతఁడు పుచ్చుకొని 'అమ్మా మీరెవరు?' అనెను.

ఆమె మాటాడలేదు.

'అమ్మా, మీగులాముతు నన్ను మఱవకుఁడు!' అనెను.

జయిలరు తెల్లఁబోయి చూచుచుండెను.

'ఏడయ్యా సూపర్నెంటు' అని టపాజవాను గద్దించెను.

'జయిలులో పని చూచుకొనుచున్నారు. అక్కడ పడవయిచి పొమ్ము!'

'మీరయినా కొంచెం చెయ్యి దులపండి.'

'సరే' అని జయిలరు సంతకము చేసెను. టపాజవాను మఱియొకమాఱు ఆమెకు నమస్కారము చేసి 'రాజావారిని రైలు దగ్గఱ దర్శనం చేసుకుంటాను.' అని వెళ్లిపోయెను.

'అమ్మా! మీరీ చుట్టుప్రక్కల నుండ రాదు. బయటి పిట్టగోడ కావల నుండుఁడు. ఊఁ. వడిగా పొండు! సిపాయికి పని కల్పింపకుఁడు!'

ఆమె నగుమోముతోఁ గోడయావలి కేఁగెను.

కొంతవడి కాపె బంధుగుల మొగము లన్నియు ఆనందముచే దీపించెను. వారంద ఱును వాకిలిని కనులతోఁ కాపలా కాయుచుండిరి.

తమతమ పను లయినపిదప వార్డరులు రాకపోకలు చేయుచుండిరి. జయిలరు వెళ్లి పోయెను.

ఆమెయు ఆమె బంధుగులును సూపర్నెంటునుగుఱించియు, [illegible] నుగుఱించియు ప్రశ్నించిరి. కాని వారి కెవరును సమాధాన మొసఁగలేదు. ఇటు లారాత్రి గడఁచెను.

మఱునాఁడు సూపర్నెంటు పెండ్లికొడుకై వచ్చెను.

అతడు కురిచీలోఁ గూరుచుండి వ్రాఁత బల్లమీఁద ఎదురుగా పడియున్న టెలిగ్రాము ను విప్పి చూచికొని అప్రయత్నముగా కురిచీ వెనుక కానుకొనియెను.

---

# వన దేవతలు

ఎ. వి. రత్నముగారు

ప్రకృతి కాంత యనంత విలాసలీల
విశ్వనాట్యరంగమునను విశ్వమోహ
నముగ సల్పెడి నృత్యమునకు దగనట
రాజు పట్టిన మాయతెరయన మున్ను,—

గగనము వెలసె క్రమముగఁ గ్గలై నందు
స్పర్శరసరూప సురభుల పరిమిత మహి
మాన్విత మహాపదార్థము లనిల వహ్ని
సలిలధాత్రులు, ప్రకృతిలాంఛనము లనఁగ.

వెలిఁగె తేజము, పరమాత్మ విమల దివ్య
సత్త్వరూపము, విశ్వవిస్తారమై, ది
గంతరాళములందు నిరంతరముగ
ప్రకృతి ముఖమండల మనోజ్ఞ రాగమనఁగ.

దివ్యతేజుల్ నభోమణి దినకరుండు
మోహనరజత మృదుకాంతిమూర్తి రజని
కరుఁడు జ్యోతిర్మణులు తారకలును గడు ర
హించెను బ్రకృతి మాళిధరించె ననఁగ.

తేజమున నుదయించిరి దేవవిభులు
పావనులు మహేంద్రాది దిక్పతులు మహిత
యశు లమృతభోజనులు భక్తివశులు, మఱియు
స్వర్గధాములు విశ్వభాస్వరులు సురలు.

ఒనర సత్త్వమూర్తికి వాయువునకు నుద్భ
వించిరి మరుత్తు లురుబలాన్వితులు; కుసుమ
కోమలస్పర్శలు మరుద్వతీమహిళలు;
యక్షవిద్యాధరాదివియచ్చరులును.

జలజగాత్రలు తరళలోచనలు వరుణ
కాంతలు మనోజ్ఞలాస్యలు కాంతిమతులు
చారుచంచలలీలావిహారిణు లుద
యించిరి జలదేవతలంత యంచితగతి.

వారి కమృతాంశుతేజమువలన నుద్భ
వించి సురలోకము నలంకరించిరి యన
మానరూప కాంతిమతులు మానినుల్ సు
రాసుర కలహకారణ లప్సరసలు.


పవనపావకసలిలసంభవలు దేవ
తాంశజనితలు లోకకల్యాణులు వన
దేవతాసతు లతనుతనూ విలాస
వైభవోపేతలు సుగంధవతులు దివ్య
మానిసేవ్యలు ధారుణీమహిత భూష
లనఁగ వెలసిరి భాసురంబైన గతుల.

వీకతో వారలకు సర్వలోక జీవ
నప్రదాయినులకు నిచ్చె నయము మీఱ
తరళకాంతిని తారలు; వరమృగాంక
రవులు భవసుధారస రాగకళల
సొగసుగా నిచ్చి రింద్రాది సురవరేణ్యు
లరసి నందన సిరులను; నప్సరసలు

దివ్యభవ్యరహస్యము లవ్యయముగ;
ఘనత గంధర్వు లొసఁగిరి గానకళల
సరస జలదేవతలు సఖీజనము లైరి;
యవనిరాజిత వనరాజులయి వెలయఁగ.

రాణవనములఁ బాలించి రాణు లైరి
ఖగసమూహము వందిమాగధులు కాఁగ
వరలు హేలావిలాససంపదలఁ దనరి
రమ్యవనరమతో మనోరమలు కాఁగ.

అనుదినము నవ్యకాంతి కళానురాగ
ములను గాంచి యతిథి సత్క్రియల నుదార
చరితలై యాశ్రితుల కనవరతశాంతి
సుఖము గూర్చుచుందు రెలమి సుస్థిరముగ.



తీర్థం

"రేపు కాదుటే అమావాస్య?" అని సీత సూరిని అడిగింది.

"రేపనే అమావాస్య. తెల్లారకుండానే నాన్న బండి తీసుకొస్తాట్ట. ఆబండిలో ఎక్కి మనంఅంతా సముద్రానికి స్తానానికి వెళ్లాలిట" అంది సూరి.

"అక్కడే కాదుటే తీర్థం సూరీ" అంది సీత.

"అక్కడే నే. సీతోయి, అక్కడకేం ఎన్ని దుకాణాలు వస్తాయనుకొన్నావు. బొమ్మలూ, బూరాలూ, బుడగలూ, అన్నీ ఉంటాయి" అంది సూరి.

"ఎంచక్క, ఎంచక్క" అంది సీత చంకలు గుద్దుకుంటూను.

"నేనూ వత్తా" అంది వెంకి.

"మరి నేనేం నాన్ననడిగి ఇన్ని డబ్బులుచ్చు కొని అన్నీ కొనేసుకుంటాను " అంది సీత.

"నాన్న నాకుమాత్రం ఇవ్వడా ఏమిటి" అంది సూరి.

"నాకూ ఇత్తాలు" అంది వెంకి.

"సాగరాలమావాస్య కాదుటే సూరీ " అంది సీత.

"అవునే" అంది సూరి.

"ఒనే మరీ సముద్ర మెలాఉంటుందే అక్కయ్యా" అంది సీత.

"నీళ్లు ఉప్పగా ఉంటాయి. కెరటాలొచ్చి తోసేస్తాయే. భయమేస్తుందమ్మా నాకు"అంది సూరి.

సీత ఆలోచించడం మొదలుపెట్టింది.

"మనం స్తానం చేస్తాం కాదుటే" అంది సీత.

"నాన్నా అమ్మా అన్నయ్యా నువ్వూ నేనూ వెంకీ అందరూ స్నానంచేస్తాము" అంది సూరి.

సూరీ, సీతీ, వెంకీ కలిసి పెరట్లో తులసెమ్మ కోటదగ్గిర కూర్చుని మాట్లాడు కుంటున్నారు. వాళ్లమ్మ వాళ్ల దగ్గిరే కూర్చుని బియ్యంలో బెడ్డలేరుతోంది. వాళ్ళ తువ్వాయి దొడ్లో గంతు లేస్తూ ఆడుకొంటోంది. వాళ్ల నాన్నగారు కచేరీ కెళ్లారు. వాళ్లన్నయ్య ఆడుకో బోయాడు.

"అమ్మా మరి నన్నుకూడా తీర్థానికి తీసుకెళ్ల వుటే" అంది సీతి

"అందరం వెడదాము. సూరోయి, మీరేం పాతపరికిణీలతో స్నానంచేద్దురుగాని, ఉతికిన పరికిణీలూ జుబ్బాలూ తలొకటి తీసుకోండి. తీసుకొని చిన్నమూట కట్టుకోండి. తుడుచుకోడానికి నేతెస్తాలే" అంది వాళ్లమ్మ.

"మరి నీబట్టలో అమ్మా" అంది సూరి.

"నావీ నాన్నగారివీ అన్నయ్యవీ నేమూట కడతానులే" అంది వాళ్లమ్మ.

సూరీ సీతీ వెంకీ లోపలికి పరిగెత్తుకు వెళ్లారు. సూరి ఒక ఎర్రపరికిణీ తీసుకొని సీతికి ఒక ఎర్రపరికిణీ తీసింది.

"దానికి చిరుగులున్నాయే, అది వద్దు" అంది సీతి. ఇంకోపరికిణీ బాగులేదంది సీతి. చివరకి ఒక తెల్లపరికిణీ సీతికి తీశారు. వెంకికి ఒకపట్టుపరికిణీ తీశారుగాని 'అమ్మ కొడుతుంది' అని అది మళ్లీ పెట్టెలోపెట్టి ఒకగళ్ల పరికిణీ తీశారు. తరవాత ముగ్గురికీ చార్ల జుబ్బాలు తీసుకొన్నారు. అవన్నీకలిపి ఒక గుడ్డలో మూటకట్టుకొని ఆమూట వాళ్లనాన్నగారి బల్లమీద దాచుకొన్నారు.

తరవాత వాళ్లమ్మ వాళ్ల ముగ్గురికీ జడలు విప్పి చమురురాసి తలదువ్వింది. తరవాత ముడి వేసింది.

"ముడేస్తావేమే అమ్మా, జడెయ్యవుటే" అంది సూరి.

"రేపు స్నానాలు కాదూ" అంది వాళ్లమ్మ.

దీపాలుపెట్టాక వాళ్లనాన్నా అన్నయ్యా కూడా వచ్చారు.


అందరూకలిసి భోజనాలుచేసి పడుక్కొన్నారు. సూరీ సీతీ రాత్రి ఒకమంచంమీదే పడుక్కొన్నారు. మధ్యమధ్య సీతి లేచి "తెల్లారిందే అక్కయ్యా" అని అడిగేది. "ఇంకాలేదే పడుక్కోవే" అనేది సూరి.

... ... ... ... ...

తెల్లారింది. రెండెడ్లబండి గుమ్మంలో నిలబడి ఉంది. నారాయణ వాళ్లమ్మ ఇచ్చిన బట్టల సంచీ మూట పట్టుకొని బండి ఎక్కి కొరడా పుచ్చుకొని చల్ చల్ అంటున్నాడు. తరవాత వాళ్లమ్మ వెంకినీ సీతినీ బండి ఎక్కించి తను కూడా బండెక్కింది. సూరి తన బట్టలమూట పట్టుకొని బండెక్కింది. వాళ్లనాన్నగారు తలుపులు తాళమువేసి వచ్చి బండి చివర ఎక్కి కూర్చున్నారు.

బండివాడు బండితోలాడు.

సూరీ సీతీ ఒకచోటే కూర్చుని పక్క ఇళ్లూ రోడ్డూ తొంగి తొంగి చూస్తున్నారు. వెంకి



అంకోరునందు పాడుపడియున్న మహా హిందూ దేవాలయము.

(A Silhouette)

చిత్రకారుడు: శ్రీ తలిశెట్టి రామారావుగారు.



షణ్ముఖదైవము (విచిత్ర - ఛాయాచిత్రము)

'లైఫ్స్ ఆఫ్ ఇండియా' సాప్తాహిక సంచికనుండి.

వాళ్ళమ్మ పక్కని కూర్చుని బండి ఎద్దులకేసి చూస్తూ ఎద్దులమెళ్లో గంటలమోత వింటోంది. నారాయణ చల్ చల్ అంటున్నాడు.

"అబ్బాయీ లోపలకూడో. బండీలోంచి పడతావురా నిర్భాగ్యుడా" అన్నాడు వాళ్ల నాన్న. నారాయణ లోపలికి వచ్చాడు.

"ఈమూట ఎవరిదే" అన్నాడు వాళ్ల నాన్న.

"ఇది మాది" అంది సూరి.

"ఇదికూడా ఆ సంచిలో పెట్టుకోరాదూ" అన్నాడు వాళ్ల నాన్న.

"ఇలా తేవే సంచిలో పెడతాను" అని వాళ్లమ్మ పుచ్చుకొని సంచీలో పెట్టింది.

సముద్రానికి ఎన్నో బళ్లు వెడుతున్నాయి. ఆ బళ్లతోపాటు ఈబండీ వెడుతోంది. తోవలో బొమ్మలదుకాణాలూ, మేడలూ, బట్టలదుకాణాలూ, మిఠాయిదుకాణాలూ, ముష్టివాళ్లూ అందరూ వాళ్లకి కనిపించారు. సీతి వెంకీ అందరినీ వింతగా చూస్తున్నారు. తాళాలూ తప్పట్లూ వాయించుకొంటూ కొందరు వెడుతున్నారు. కొందరు అచ్చుకాకితాలు పంచిపెట్టుతున్నారు. కొందరబ్బాయిలూ అమ్మాయిలూ ముస్తాబై నడిచి వెళ్లుతున్నారు.

"చూడవే సూరీ, ఆ అమ్మాయి మిఠాయిఉండ తింటూ వాళ్లమ్మ వెనక్కాలే నడిచి వెళ్లుతోంది" అంది సీతి.

"చూడొసే ఆ అమ్మిని. పిల్లకు పాలిస్తూనే నడిచి వెళ్లుతోంది" అంది సూరి.

"ఊరుకో" అన్నాడు వాళ్ళనాన్న. సీతి నిమ్మళంగా వాళ్ళనాన్నకు వినబడకుండా సూరిని గిల్లి పిలిచి "చూడొసే, ఆ అబ్బి, కొరడా పుచ్చుకు ఎలాకొట్టుకుంటున్నాడో. ఆపెట్టెలో దేమిటే" అంది సూరి.

"అదేదో అమ్మవారే. వాళ్లు అడుక్కునే వాళ్లు" అంది సూరి.

"ఇంకా ఎంతదూరమే సముద్రం" అంది సీతి.

"నాకు తెలియదమ్మా, నాన్న కోప్పడుతారు ఊరుకో" అంది సూరి.

కొంతసేపటికి వాళ్లబండి సముద్రం దగ్గిరికి వచ్చింది. అందరూ అక్కడ స్నానం చేస్తున్నారు. బండివాడు బండాపి దిగమన్నాడు. అందరూ దిగారు. సీతి నేను దిగగలనని బండిలోంచి ఉరికింది. వాళ్లనాన్న కోప్పడ్డాడు. వెంకిని వాళ్లమ్మ దింపింది.

బట్టలన్నీ బండిలోనేఉంచి చూస్తూ ఉండమని బండివాడితో చెప్పి వాళ్లు స్నానంచెయ్యడానికి సముద్రందగ్గిరికి వెళ్లారు.

"ఇదేనుటే సముద్రం. అమ్మయ్యో! నాకు భయమేస్తోందే" అంది సీతి. వెంకి వాళ్లమ్మ బట్ట గట్టిగా పట్టుకొంది. వాళ్లమ్మ చేతితో కంచెంబు పట్టుకొని వెంకిని రెండోచేత్తో పట్టుకొని స్నానంచెయ్యడానికి సముద్రంలో దిగింది.

సీతి, సూరి చెయ్యిపట్టుకొని సముద్రాన్ని చూచి నవ్వుతూ "నాకు భయమేస్తోందే" అంది. వాళ్ల నాన్నగారు "దిగండి ఈపాటి. స్నానం చెయ్యండి" అన్నారు.

నలుగు రైదుగురు బ్రాహ్మలు నేను స్తానం చెయ్యిస్తానంటే నేను స్తానం చేయిస్తా నని వాళ్ల చుట్టూ మూగారు.

వాళ్లమ్మ మోకాలిలోతు నీళ్ళల్లోకి వెళ్లింది. వెంకి వాళ్ళమ్మ వెనక్కాల నిలబడింది బట్ట గట్టిగా పట్టుకొని. వాళ్ళమ్మ వెనక్కాలే పరికిణీలు పైకిపట్టుకొని సూరీ సీతీ నిలబడ్డారు. కొంగున మూటకట్టుకొన్న పసుపుపొట్లం తీసి వాళ్లమ్మ పసుపు నీటితో తడిపి తన మొహానికి రాసుకొని సూరి మొహానికీ సీతి మొహానికీ వెంకి మొహానికీ రాసింది. తరవాత సూరినీ సీతినీ నీటిలో కూచోబెట్టి జుట్టుముడివిప్పి చెంబుతో నీళ్లుముంచి వాళ్ల నెత్తిమీద పోసింది. అలాగే వెంకినికూడా స్నానం చేయించింది. నీళ్లెలా వుంటాయో అని సీతి ఎవరికీ చెప్పకుండా కొంచెం నోట్లో పోసుకొని ఉప్పగా ఉండడంవల్ల ఉమ్మివేసింది.

సముద్రపు కెరటాలు చిన్నవి ఒకదాని వెనక ఒకటి వచ్చి వాళ్లను ఉక్కిరిబిక్కిరి చేశాయి. వాళ్లు భయపడి గట్టుమీదకు వెళ్లి నిలబడి గచ్చులా ఉన్న ఇసుకమీద కాళ్లదువ్వుతూ తీస్తూ నవ్వుతున్నారు.

వాళ్ళమ్మకూడా నీళ్ళల్లోకూర్చుని చెంబుతో నీళ్లుముంచి నెత్తిమీదపోసుకొని స్తానం చేసి గట్టుకు వచ్చింది.

వాళ్లచుట్టూ బ్రాహ్మలు మూగారు. వాళ్ల అమ్మకు స్తానం చేయించారు. వాళ్లమ్మకొంగు మూటవిప్పి సూరిచేతి ఒకడబ్బూ సీతిచేతఒక డబ్బూ వెంకిచేత ఒకడబ్బూ బ్రాహ్మలకిప్పించింది. తనుకూడా ఇచ్చింది.

వాళ్లనాన్నా అన్నయ్యా దూరంగా పెద్ద కెరటాలలో స్తానంచేసివచ్చారు. అందరూ మళ్లీ బండిదగ్గిరికి వచ్చారు.

వాళ్లమ్మ అందరితలలూ తుడిచి సూరిమూట తీసి పరికిణీలూ జుబ్బాలూ తొడుక్కోమని ఇచ్చింది. సూరీ, సీతీ, వెంకీ తడిపరికిణీలు వదిలివేసి కొత్తపరికిణీలూ జుబ్బాలూ తొడుక్కున్నారు. తడిజుత్తు విరిబోసుకున్నారు ఆరడానికి. మొహంమీద కుంకుంబొట్టు పెట్టింది వాళ్లమ్మ ముగ్గురికీని.

వాళ్లమ్మ తడిబట్ట వదిలేసి పట్టుచీర కట్టుకొంది. వాళ్లనాన్నా అన్నయ్యాకూడా కొత్త బట్టలు కట్టుకొన్నారు.

తరవాత వాళ్లన్నయ్య అరటిపళ్లూ, కొబ్బరికాయా, హారతికర్పూరం తేవడానికి వెళ్లాడు. "అమ్మా, మరి ఎక్కడికే వెళ్లడం" అని సూరి అడిగింది.

"దేముడిగుళ్లోకి" అంది వాళ్లమ్మ.

"దేముడిగుళ్లోకి వెడదామే, వెంకీ?" అంది సీతి.

"ఊఁ" అంది వెంకి.

ఆదారిని ఒకముసలమ్మ స్తానంచేసి తడిబట్టలతోనే వెడుతూ వాళ్లమ్మనుచూచి ఆగింది. ఆగి వాళ్లమ్మకేసి నిదానించి చూస్తోంది. వాళ్లమ్మ ఆవిడకేసిచూచి, "దొడ్డమ్మా" అంది.

"నువ్వాటే నాతల్లీ. అవునో కాదో అని చూస్తున్నాను. ఎన్నాళ్ల కనిపించావమ్మా. ఎన్నాళ్లకనిపించావమ్మా తల్లీ" అంది.

సూరీ నీతీ వెంకీ ఆవిడ కేసి చూచి నవ్వుకొంటున్నారు.

"స్నానాని కొచ్చావా, దొడ్డమ్మా" అంది వాళ్లమ్మ.

"అవునే నాతల్లీ. ఇలారా అమ్మా, ఇలారా. ఎప్పుడో చిన్నప్పుడు చూడ్డమే. మళ్లీ చూడనే లేదు. న నొక్కమాటు చూచుకోనియ్యి, ఇలారా" అంది ఆవిడ.

వాళ్లమ్మ ఆవిడదగ్గిరికి వెళ్లింది. ఆవిడ వాళ్లమ్మ ఒంటిమీద చెయ్యివేసి తడుముతూ, "ఈవేళ ఎంతపుణ్యమమ్మా, నాతల్లిని చూశాను. మీ ఆయన ఏడే అమ్మా" అంది ఆవిడ.

"అదుగో బండిదగ్గిర ఎవరితోనో మాట్లాడుతున్నారు" అంది వాళ్లమ్మ.

"ఏం, నాయనా, బాగున్నావా. ఒకమాటు తల్లినీపిల్లలనూ తీసుకురమ్మంటే తీసుకొచ్చావు కాదు గదా. చచ్చే ముసలిదాన్ని ఒకమారు చూడాలని ఎంతో మనస్సు పీకుతూ ఉంది. పోనీ ఇక్కడైనా కనిపించారు" అంది ఆవిడ.

"బాగున్నా అత్తయ్యా. ఏదో తీరుబడి లేక పిల్లల్ని తీసుకురాలేదు" అన్నాడు వాళ్ల నాన్న.

"ఒస్సే నర్సమ్మా, నీకెంతమందే పిల్లలూ" అంది ఆవిడ.

"ఒక మగపిల్లాడూ ముగ్గురు ఆడపిల్లలూను. అబ్బాయి పళ్లు తేవడానికి వెళ్లాడు. అమ్మాయిలు వీళ్లే" అంది వాళ్లమ్మ.

"వీళ్లేనటే. చెప్పావు కావు. రత్నాల్లాగ ఉన్నారమ్మా పిల్లలూ. రా అమ్మా ఎత్తుకుంటా రా" అని వెంకిని పిలిచింది. వెంకి రాలేదు.

"నీ పేరేవరే" అంది సూరిని ఆవిడ.

"సూరి. మా చెల్లాయి పేరు నీతి. చిన్ని చెల్లాయి పేరు వెంకి" అంది సూరి.

"మా అమ్మే, ఎంత బుద్ధిమంతురాలో. చచ్చి నీకడుపున పుడతానే. అవునే నర్సమ్మా, పెద్దమ్మాయికి మీ అమ్మ పేరేనే ఏమిటే పెడత" అంది.

"అవును దొడ్డమ్మా" అంది వాళ్ళమ్మ.

"ఏదో పదిపువ్వులూ పదికాయలూ కాసి పది కాలాలపాటు అయిదోతనం గల్గి బతకడం కావాలి" అంది ఆవిడ.

వాళ్లన్నయ్య పళ్లూ అవీ తెచ్చాడు. వాళ్ల నాన్నా, వాళ్ళఅమ్మా, దొడ్డమ్మా అందరూ కలిసి దేముడిగుళ్లోకి వెళ్లి కొబ్బరికాయా అరిటిపళ్లూ హారతికర్పూరం దేవుడికిచ్చారు. సూరికీ నీతికీ వెంకికీ దేవుడు కనిపించనేలేదు. అంతా జనమే. లోపలికి వెళ్ళడానికి స్థలమే లేదు. ఎలాగో వాళ్ల నాన్న లోపలికి తీసుకెళ్లాడు. కొబ్బరికాయముక్కా అరటిపండూ దేవుడు ప్రసాదం ఇచ్చాడు. పూజారి అందరికీ శఠగోపం పెట్టాడు.

"నాకూ టోపీపెట్టాడే" అంది సీతి.

"నాకూను" అంది వెంకి.

"టోపీ అనకూడదు. శఠగోపం అనాలి" అంది సూరి.

"దేవుడుగుళ్లోనుంచి వచ్చింతరవాత వాళ్లమ్మ వాళ్ళదొడ్డమ్మతో, "దొడ్డమ్మా, వెడతామే. బండొచ్చింది. బండిమీద వెడతాము. పోనీ నీవొకమారు రాకూడదూ, ఒక నెల్లాళ్లపాటు మా ఇంట్లో ఉండవచ్చును గదా" అంది వాళ్లమ్మ.

"అమ్మకుకూడా అమ్మ ఉంటుందా" అని సీతి సూరిని అడిగింది.

"అవ్వకి అమ్మేంటీ" అంది వెంకి. సూరి నవ్వింది.

దొడ్డమ్మ అందికదా "ఇప్పుడు వెళ్లడమేమిటే నాతల్లీ. పిల్లలుండగలరా. వద్దు. వద్దమ్మా ఎండలో వెళ్లకండి. ఇక్కడికి అరకోసేగా మాఇల్లు. అక్కడికి రండి. పిల్లలకు కడుపు నిండా అన్నంపెట్టుకొంటాను. మీరూ తిందురుగాని. తరువాత తీర్థంచూచి సాయంత్రానికి ఇంటికి వెడుదురుగాని" అంది ఆవిడ.

"మాకు ఉపోష్యంకాదు దొడ్డమ్మా" అంది వాళ్లమ్మ.

"పోనీ పిల్లలే తింటారు. అయినా కనీ పెంచీదానవు నీ కుపోష్యం ఎందుకుతల్లీ" అంది ఆవిడ.

"నాకు రావడాని కేమిటే దొడ్డమ్మా. నే వస్తాను. మాఆయనతోకూడా చెప్పు" అంది వాళ్లమ్మ. వాళ్లనాన్నకూడా దొడ్డమ్మగారింటికి వెళ్లడానికి ఒప్పుకొన్నాడు.

అందరూ కలిసి వాళ్ల ఇంటికి వెళ్లారు. దొడ్డమ్మా వాళ్లమ్మా కలిసి మసికట్టుకొని వంట చేశారు.

సూరీ, సీతీ, వెంకీ, వాళ్లన్నయ్యా, వాళ్ల నాన్నామాత్రం భోంచేశారు. వాళ్లమ్మ ఉపోష్యం ఉండి ఫలారంచేసింది. దొడ్డమ్మా వాళ్లమ్మా కలిసి చాలాసేపు కబుర్లు చెప్పుకొన్నారు.

సూరీ సీతీ వెంకీ నిద్రపోయారు. వాళ్లన్నయ్య ఊరుచూడ్డానికి వెళ్లాడు. వాళ్లనాన్న వీధరుగుమీద తాటాకుచాపమీద కూర్చుని ఆపూరి మునసబుతో మాట్లాడుతున్నాడు.

చల్లబాటువేళని మళ్లీ బండికట్టించుకొని అందరూ తీర్థాని కెళ్లారు.

"అమ్మా, మరి ఆవిడెవరే" అని సీతి అడిగింది.

"నాతల్లి నాతల్లి నేనెవరని అడుగుతున్నావా" అంది దొడ్డమ్మ.

"ఏమే అమ్మా" అంది సీతి.

"ఆవిడ మాఅమ్మ పెత్తల్లికూతురే. నాకు దొడ్డమ్మవుతుంద" అంది వాళ్లమ్మ.

"అమ్మా నీకుకూడా అమ్ముందా" అంది సీతి.

"నాకుమాత్రం అమ్మలేదూ." అంది వాళ్ళమ్మ నవ్వుతూ.

బండి తీర్థపుదుకాణాల దగ్గిరికి వచ్చి ఆగింది. అందరూ దిగారు. వాళ్లమ్మ రవికలగుడ్డలూ,

పసుపుకుంకుమం అన్నీ కొంటోంది. సూరీ సీతీ వెంకీ వాళ్లమ్మ వెనకాలే అన్నీ చూస్తూ బయలుదేరారు. వాళ్లనాన్న అన్నయ్యా ఇంకోదుకాణంమీద ఒకచాకూ ఒక ఈలా కొనుక్కొన్నారు.

దొడ్డమ్మా, వాళ్లమ్మా వాళ్లన్నయ్యా కలిసి గరిటెలూ, రాచ్చిప్పలూ కొనుక్కోడాని కెళ్లారు.

వాళ్లనాన్నా సూరీ సీతీ వెంకీ బొమ్మలు అవీ కొనుక్కోడానికి ఇంకోవేపు వెళ్లుతున్నారు. "నాన్నా నాకేమేనా కొనుక్కోడానికి డబ్బు లియ్యవూ" అని సూరి అడిగింది.

నాకూ్కడా ఇయ్యవు నాన్నా" అని సీతి అడిగింది.

"నాకో నాన్నా" అంది వెంకి. వాళ్ల నాన్న ముగ్గురికీ తలోపావలా ఇచ్చి పారేసుకోకండి సుమా అన్నాడు. పావలాపుచ్చుకొని చేతుల్లో గట్టిగా పిటకరాయిలాగ పట్టుకున్నారు.

వాళ్ళనాన్న దుకాణాలన్నీ చూపెడుతున్నాడు. అన్నీ చూస్తున్నారు. ఒకచోట దొమ్మరి వాళ్లు మొగ్గలువేస్తూంటే కొంతసేపు నిలబడిచూశారు. దొమ్మరి అబ్బి తాడు నిపాముచేశాడు. వాళ్లు ఆశ్చర్యపోయారు. ఒక దొమ్మరిఅమ్మి ఒకపెద్ద వెదురుగడఎక్కి ఆగడమీద బోర్లాపడుకొని గిరునతిరిగింది. సూరీ సీతీ వెంకీ చూచి ఎంతోనవ్వారు. వాళ్లనాన్న దొమ్మరివాళ్లకు ఒకడబ్బు ఇచ్చాడు.

ఇంకోచోట రంకులరాట్నము ఉంది. లక్కగుర్రాలమీద కూచుని అందరూ గిరున తిరుగుతున్నారు. సూరీ సీతి వెంకీ కూడా కూచుంటామన్నారు. "వద్దమ్మా పడతారు" అన్నాడు వాళ్లనాన్న. వాళ్లు మారాం చేశారు. అప్పుడు వాళ్లనాన్న ఊరికే ఒక మాటు గుర్రాలమీద కూచోబెట్టాడు. లక్కగుర్రంమీద కూచుని సీతి "చల్ చల్ గుర్రం" అంది. వెంకిని వాళ్లనాన్న పట్టుకొన్నాడు. సూరి ఇనపఊచ గట్టిగాపట్టుకొని నవ్వుతూ కూచుంది. ఒక్కమాటు రాటం తిప్పించి వాళ్లనాన్న దింపేశాడు. వాళ్లు ఎంతో సంతోషించారు.

ఇంకోచోట ఒకఅబ్బి ఒకపెట్టె నిలబెట్టి అందులో కన్నాల్లోంచి బొమ్మలు చూపిస్తున్నాడు.

చూడుతమాషా వింతతమాషా
కాశీపట్నం చిత్రంచూడు
మధురాపట్నం చిత్రంచూడు
చూడుతమాషా చిత్రంచూడు
చూడుతమాషా వింతలుచూడు

అంటూ డబ్బామీద వాయిస్తున్నాడు.

"అదేమిటినాన్నా" అంది సూరి.

"అదిచూపించవునాన్నా" అంది సీతి.

"అది బాగుండదు. అది వద్దన్నాడు వాళ్ల నాన్న.

కొంతదూరం వెళ్లాక వాళ్ళ నాన్నని ఎవరో ఆపి, "ఏమిరోయి రామ్మూర్తీ. పిల్లలిని వేసుకు ఎక్కడికి బయలుదేరావు" అన్నారు.

"పిల్లలకి తీర్థంచూపుతున్నానురా" అన్నాడు వాళ్ల నాన్న.

"వాళ్ళకు చూపించేదేమిటి. ఒక అరుగుమీద కూచోబెట్టవోయి, వాళ్లే చూస్తారు. మనం ఒకమారు అలా తిరిగి వద్దామురా" అన్నాడాయన.

"ఎక్కడ కూచోబెట్టడం" అన్నాడు వాళ్ల నాన్న.

సూరీ సీతీ వెంకీ కొత్తాయన్ని చూచి మంచి వాడు కాడనుకొన్నారు.

"అదిగో మా వాళ్లరుగే అది. అక్కడకూచోబెట్టు. మా వాళ్లు చూస్తూ ఉంటారులే" అన్నాడు.

"సరే"అని వాళ్ల నాన్న ఒప్పుకొన్నాడు. సూరీ సీతీ వెంకీ అరుగుమీద కూర్చున్నారు. వాళ్ల నాన్న "నే వచ్చేదాకా కదలకండేం" అని చెప్పి వెళ్లిపోయాడు. ఆయింటివాళ్లు"చూస్తూ కూచోండమ్మా భయం లేదు" అని లోపల పని చేసుకుంటున్నారు.

సూరీ సీతీ వెంకీ కబుర్లు చెప్పుకుంటూ అరుగు మీద కూర్చున్నారు. ఆదారిని పోయీ నెత్తి కోతలవాణ్ణి చూచి భయపడ్డారు. కాని వాడు దూరంగా పోయాడు. వాళ్లు చాలా సేపు కూచున్నారు. ఎంతకూచున్నా వాళ్లనాన్న రాలేదు. ఆ దారిని డక్కీలు అమ్మే వాణ్ణిచూచి "నాక్కొనిపెట్టు"అంది వెంకీ. ఆ అబ్బిని పిలిస్తే వచ్చాడు కాదు. మళ్లీ అరుగు మీదకు రావచ్చుననుకొని ముగ్గురూ చేతులు పట్టుకొని డక్కీలవాడిదగ్గిరికి వెళ్లారు. ముగ్గురూ మూడు డక్కీలు కొనుక్కొన్నారు. డక్కీలబ్బి మూడుడబ్బులూ తీసుకొని మిగిలిన డబ్బులు ఇచ్చాడు. వాళ్లు డక్కీలు వాయించు కొంటూ రాబోతూంటే "మంచిఖర్జూరం తియ్యఖర్జూరం మంచిఖర్జూరం" అని ఒక దుకాణంఅబ్బి కేకలువేయడంచూచి అక్కడకు వాళ్లు ముగ్గురూ వెళ్లారు. ముగ్గురూ మూడుడబ్బులిచ్చి మూడు పొట్లాలు పుచ్చుకొని అవి విప్పితింటూ చుట్టూ చూస్తూ నిలబడ్డారు. దూరాన్ని లక్కపిడతల దుకాణం కనిపించింది.

"రావే లక్కపిడతలు కొనుక్కుందాం" అంది సీతి.

"నాన్న వస్తాడేమో" అంది సూరి.

"మళ్లీ ఇప్పుడేవద్దాం" అంది సీతి.

సూరీ సీతీ వెంకీ లక్కపిడతల దుకాణందగ్గిరికి వెళ్లారు.

సూరి ఒకలక్క మరచెంబూ, రెండు గంధం గిన్నెలూ కొనుక్కొంది. సీతి రెండు లక్కపిడతలూ ఒక గంధంగిన్నీ ఒక పెద్ద దొండకాయా కొనుక్కొంది. వెంకి ఒక గంధంగిన్నె రెండు దొండకాయలు రెండు లక్కపిడతలూ కొనుక్కొంది. లక్కపిడతలన్నీ వెంకి రుమాలులో పోసి మూట కట్టి సూరి పట్టుకొంది. ఖర్జూరం తింటూ వాళ్లు మిగిలినడబ్బులు పట్టుకొని అరుగుకోసం తిరిగారు. అరుగు కనిపించింది కాదు. అక్కడ ఒక

పాములాడు పాములని నాగస్వరం ఊది ఆడిస్తూంటే కొంచెంసేపు దూరంగానిలబడి పాముకేసి చూశారు. తరవాత వాళ్లు ఒక గంగిరెద్దును చూశారు. గంగిరెద్దులబ్బి "దూడూ వెంకన్నా, దూడూఅప్పన్నా" అంటూ పాడుకొంటూ వెడుతున్నాడు. గంగిరెద్దును చూస్తూ వాళ్లు కొంతదూరం దానితో నడిచివెళ్లారు. గంగిరెద్దునిండా బట్టలూ గంటలూ చూచి వాళ్లు సంతోషించారు. మళ్లీ వాళ్లు కూర్చున్న అరుగు కోసం వెతికారు. కనిపించింది కాదు.

చాలాసేపుతిరిగారు. అరుగు అవుపించింది కాదు. వాళ్లు ఏడుస్తూ రోడ్డుపక్కని నిలుచున్నారు.

వాళ్లనాన్న తిరిగి తిరిగి అరుగుదగ్గిరికి పిల్లల కోసం వచ్చాడు. పిల్లలు అరుగుమీద లేరు. ఇంటివాళ్ల నడిగితే "ఇప్పటిదాకా ఇక్కడే కూర్చున్నారండీ. ఎక్కడికి వెళ్లారో కాని" అన్నారు.

వాళ్లనాన్న వాళ్లబండి ఉన్నచోటికి వెళ్లాడు. అక్కడ వాళ్లమ్మా, అన్నయ్యా దొడ్డమ్మా ఉన్నారు. గరిటెలు రాచ్చిప్పలూ పెట్టుకు కూచున్నారు.

వాళ్లనాన్నను చూచి వాళ్లమ్మ నిలబడి "పిల్ల లేరీ" అంది.

"పిల్లలిక్కడకు రాలేదూ" అన్నాడు వాళ్ళ నాన్న.

"అయ్యో అయ్యో తప్పిపోయారా ఏమిటి. కొంపములిగింది. ఏమిటి తోవ" అని వాళ్లమ్మ బిక్కమొహం వేసింది.

"తప్పిపోయారు కాబోలే తీర్థంలోనూ. రావే చూద్దాము" అని వాళ్ల దొడ్డమ్మ అంది.

"మీరిక్కడేకూచోండి నేను వెళ్లి చూస్తాను" అన్నాడు వాళ్లనాన్న.

"నేనూవస్తాను. అయ్యో నాపిల్ల లేమైపోయారో అమ్మో"అని వాళ్లమ్మ ఏడ్చింది.

"అబ్బాయీ నేనూ వెడతాము మీ రిక్కడుండండి" అని చెప్పి వాళ్లనాన్న వాళ్లన్నయ్యను తీసుకొని వెళ్లాడు.

ఉండబట్టక వాళ్లమ్మా దొడ్డమ్మా ఆ చుట్టుపట్ల వెదుకుతున్నారు.

వాళ్లనాన్నా అన్నయ్యా దుకాణాలన్నీ వెదుకుతున్నారు. ఒకచోట ఒకపెద్దమనిషి వాళ్లకగపడి,

"ఎవరికోసంఅండీ వెదుకుతున్నారు"అన్నాడు.

"మా అమ్మాయిలు ముగ్గురు తప్పిపోయారండీ తీర్థంలోను"అన్నాడు వాళ్లనాన్న.

"మీపేరు రామమూర్తిగారా" అన్నాడాయన.

"అవును"అన్నాడు వాళ్లనాన్న.

"ఎవరో రామ్మూర్తిగారి పిల్లలమని చెప్పారు. ముగ్గురుపిల్లలు ఏడుస్తూ రోడ్డుపక్క నిలబడ్డారు" అన్నాడాయన.

"ఎక్కడ" అని వాళ్లనాన్న అడిగాడు.

"అదిగో అక్కడ నూకాలమ్మగుడిదగ్గిర" అని వెళ్లిపోయాడు.

నూకాలమ్మ గుడిదగ్గిరికివెళ్లి వాళ్లు కనుక్కొన్నారు. అప్పుడే ఎవరో ముగ్గురు పిల్లలు ఏడుస్తూఉంటే వచ్చి తీసుకువెళ్లారని చెప్పారు. వాళ్లు వెళ్లినదారినివెళ్లి వాకబు చెయ్యగా చెయ్యగా ఒకగృహస్తు ఇంట్లో వాళ్లు ఉన్నట్లు తెలిసింది. అక్కడ ఆయింట్లో ఆడవాళ్లదగ్గిర సూరీ నీతీవెంకీ ఉన్నారు.

వాళ్లనాన్నను చూడ్డంతోనే వెంకి ఏడ్చింది. సూరీ నీతీ నవ్వారు.

రోడ్డుపక్క ఏడుస్తూ ఉంటే ఆ ఇంటి ఆయన అక్కడకు తీసుకువచ్చి బొమ్మలూ మిఠాయీ పెట్టి "మీ నాన్నను తీసుకువస్తా నన్నా"డని చెప్పారు.

"మాఅమ్మాయిలిని మళ్లీ మా కిచ్చారు. మీ మేలు మరిచిపోలేను" అని వాళ్లనాన్న చెప్పి ముగ్గురు పిల్లలనూ తీసుకొని బండి దగ్గిరికి వచ్చారు. బండిదగ్గిర వాళ్లమ్మ ఏడుస్తోంది. దొడ్డమ్మ ఊరుకోబెట్టుతోంది.

పిల్లలను చూడడంతోనే వాళ్లమ్మ గబగబా వచ్చి వాళ్లను ఎత్తుకొని కౌగలించుకొని ముద్దెట్టుకొంది.

"వచ్చారా నాతల్లులు. తప్పిపోయారా నాతల్లీ" అందిదొడ్డమ్మ. వాళ్లమ్మ పిల్లలకోసం కొన్న బొమ్మలూ జిలేబీపొట్లాలూ వాళ్ళకుపెట్టింది. దొడ్డమ్మకూడా కారప్పూసపొట్లాలు వాళ్ళకు ఇచ్చింది. వాళ్లా పొట్లాలు తీసుకొన్నారు. బొమ్మలూ పొట్లాలూ చేతుల్లో ఇమడకపోవడంవల్ల వాళ్ళమ్మ అవన్నీ మూటకట్టిపెట్టింది. వాళ్లు కొనుక్కొన్న లక్కపిడతలూ డక్కీలు అవన్నీ వాళ్లమ్మకు చూపించారు సూరీ నీతీ వెంకీని.

"అయ్యో మీబొడ్డుపొక్క! మీరే కొనుక్కున్నారర్రా ఇవన్నీని" అందివాళ్లమ్మ.

"మేమే కొనుక్కున్నాం" అంది నీతి.

"నేకొనుక్కున్నా" అంది వెంకి. వాళ్లు ఏమేమిచేశారో ఎలా తప్పిపోయారో అంతా వాళ్ళమ్మతో చెప్పారు.

తరవాత వాళ్ళందరూబండిఎక్కారు. దొడ్డమ్మ మాత్రం బండెక్కలేదు.

"వెడతా దొడ్డమ్మా" అంది వాళ్లమ్మ.

"ఉంటానే నాతల్లి. పిల్లలసంగతి ఓ ఉత్తరం రాస్తూండుమా" అంది దొడ్డమ్మ.

"వెడతా అమ్మమ్మా" అన్నాడు వాళ్లన్నయ్య.

"మంచిది నాయనా. బాగాచదువుకో" అంది దొడ్డమ్మ.

"వెడుతున్నా అత్తా" అన్నాడు వాళ్లనాన్న.

"ఉత్తరం రాస్తూండుమా నాయనా" అంది దొడ్డమ్మ.

"వెడుతున్నా అమ్మమ్మా" అంది సూరి.

"వెడతా అమ్మమ్మా" అంది నీతి.

"వెలతా అమ్మమ్మా" అంది వెంకి.

"మాతల్లులు మాతల్లులు వెళ్ళండమ్మా. అల్లరి చెయ్యకుండా బాగాఆడుకోండి. బదికి బాగుంటే సూరిపెళ్లికి రావాలి"అంది దొడ్డమ్మ.

బండి కదిలింది.

"సూరిపెళ్లి" అని నీతి నవ్వింది.

"చూరిపెళ్లి" అని వెంకినవ్వింది.

సూరి సిగ్గుతో తనలోతాను నవ్వుకొంది.

# *విద్యార్థిప్రబోధము

ఉభయభాషాప్రవీణ, తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు

ఆద్యాఖండయశోధనం బెడసి దాస్యస్ఫూర్తిఁ జింతాభరా
పాద్యంబై భరతోర్వి నేఁడు విలపింపన్ సాగెఁ దద్రోదన
ప్రోద్యద్ధ్వానము వీనులం జొరదొ? యేబుద్ధుల్ నినుంజుట్టెనో?
విద్యార్థీ! నినుఁగన్నతల్లి మొఱ నీవే యిట్లుపేక్షింతువా.

చెలఁగి మార్తురఁ జించి చెండాడి వైచిన యభిమన్యుఁ డేతల్లి యంకమెక్కె
చిచ్చఱపిడుగు పుంజీభూతశౌర్యంబు బాలుఁ డేయమ జోలపాట మెచ్చె
నెఱజోదు పగఱగుండెలలో నిగాలమై మనిన శివాజి యేజననిఁ గొల్చె
జగదేకవీరప్రశస్తతేజోరాశి జవహరుఁ డేమాత చన్నుగుడిచె?
నమ్మహాసాధ్వి సకలలోకైకజనని-భారతాంబకుఁ బండినపంట వీవు
అన్నలకు మచ్చఁ దేఁబోకు మెన్నఁడేని-నుతగుణాధార! వీరభారతకుమార.

నవయుగమేగుదెంచెఁ బరిణామము నొందె జగంబు నూతన
చ్ఛవులు నటించుచున్నవి దిశావలయంబుల ముక్తికామినీ
నవనవదివ్యయౌవన మనంతముఖంబుల నిండి భారతీ
యువజనచిత్తవిత్తముల నూపుచుఁ జూపుచునుండెఁ దళ్కులన్.

లెమ్మిఁక మీనమేషముల లెక్కలుమానుము భావదాస్యబం
ధమ్మును ద్రెంపివేయుము వితండవివాదము లుజ్జగింపు ద
ద్దమ్మల భేదవాదసముదాయముతోడఁ బనేమి నీకు నీ
యమ్మ ఋణమ్ముఁ దీర్చి చరితార్థత నందుము మిత్రసత్తమా.

అమరులు గుంపుఁగూడి "విజయో"స్తని నందనచందనస్ఫుర
త్సుమనసముదాయముం గురియఁ జొచ్చిరి నీపయి దిక్తటంబులం
కుములములై ధ్వనించె జయదుందుభిఘోషలు మందిలగ్నమీ
సమయము లెమ్ము లెమ్ము పటుసాహసదోహల దుర్భరార్భటిన్.

---

* ఈపద్యములు 18-2-51 తేదిని గుంటూరులో జరిగిన "కమ్మవిద్యార్థి వసతిగృహ వార్షికోత్సవసభ"లోఁ బఠితములు.

లోకు లిసీయనన్ జగతిలోఁ గలకాలము నూఁగులాడుచున్
గాకములై వడిం బ్రదుకుకంటె బుధుల్ తలలూఁప గంటయేఁ
గోకిలమై వెలుంగుటది కూడదొ? విజ్ఞుఁడు కీర్తికాయముం
గైకొన రక్తమాంసమయకాయము హేయము నీసడింపఁడో.

ఆధివ్యాధిపరీత మంబుజదళవ్యాలోలపాథఃకణం
బీదేహంబు సమస్తభోగములు నిస్సీ హస్తికర్ణాంతముల్
సాధుస్తుత్య మఖండ మవ్యయదశాసంపూర్ణమక్కీర్తి యో
యోధాగ్రేసర! లెమ్ము సమరవ్యూహంబులం దీర్పఁగన్.

భావిచరిత్రకారుఁడు సెబా సని మెచ్చి సువర్ణవర్ణనం
భావితమై వెలుంగఁగ భవచ్చరితంబు రచింప నింపుమైఁ
ద్రోవలుదిద్దుచుండెఁ గరతోయజలేఖిని శీర్షకింకిణీ
రావపరంపరాకలకలధ్వని వీనులవిం దొనర్పఁగన్.

శంక లిఁకేల నీవిజయశాసనముల్ కకుబంతకామినీ
కుంకుమపంకసంకలితగాఢకుచాద్రితటంబులన్ నిరా
టంకతఁదీర్చి దిద్దుము హుటాహుటిఁ గట్టుము కంకణం బిఁకన్
జంకితివేని యెన్నఁటికి జాతికి మోక్షము లేదు సోదరా.

---

## మా వ్యాసకర్తలకు

వ్యాసములు చిన్న సైజు కాగితములపై ఒకవైపున మాత్రమే విడిఅక్షరములతో బంతులు దూరదూరముగా, దిద్దుబాట్లు లేకుండ, తిన్నగా వ్రాసి వర్ణక్రమమునను తప్పులు లేకుండ చూచుకొని పంప వేడికోలు. లేకున్న ముద్రణకార్యములయందు మిగుల కష్టము కలుగుటయే కాక తప్పులుకూడ నిలిచిపోవునని మనవి.

సంపాదకుడు, 'భారతి'.




యనమండ్ర సాంబశివరావుగారు

౧

"ఏమేవ్! నువ్వు గింజుకు చచ్చేదీ, ఊరవతల పెద్ద నూతులో పడేదీ, పీక్కి ఉరేసుకొనేదీ, నేను మాత్రం రంగారెడ్డికి తప్ప అమ్మాయిని మరోవాళ్లకిచ్చి పెళ్లి చెయ్యను" అన్నాడు గౌరరెడ్డి వీధి అరుగుమీద ఎదురుగుండా మోకాళ్లు ముడిచి కూచున్న పెళ్లాం పున్నమ్మతోటి.



"మీరంటే అన్నారు కాని నా బొందిలో ప్రాణం పెనుగులాడుతున్నదాకా, కాసుల్ని ఆ ముసలిముండాకొడుక్కి కట్టపెట్టనిస్తే ఛీ అనండి. పెళ్లి పీటలమీదకి ఎవర్ని తెచ్చుకుంటారో తెచ్చుకోండి. ఆకాశం బద్దలైనా నేను రాను" అంది చురచురలాడుతూ పున్నమ్మ.

"నువ్వు రాకపోతే నీలాటిది మరొకర్తి" అని చేతికర్ర వూతచేసుకుంటూ స్నానానికని వెళ్లిపోయేడు గౌరరెడ్డి.

పున్నమ్మ ఆవేళ వంట చేయడం మానేసింది కోపంవచ్చి. కేకవేస్తున్నా మొగుడికి కుంకుడు కాయలైనా కొట్టి ఇచ్చింది కాదు. అప్పుడు ఆడబొడుచు అంకమ్మ వెళ్లి నీళ్లుకాచి ఇంత చవురుముక్క ఇచ్చేదాక దిక్కే లేకపోయింది గౌరరెడ్డికి.

౨

కాసులి కిప్పుడు పదహారో ఏడు నడుస్తోంది. ఈవిడ తల్లికడుపులో వున్నప్పుడు

దీపావళి అమావాస్యకి పున్నమ్మ పుట్టింట్లో ఆవులసాల తగలడిపోయిందిట. అందులో చిక్కడ్డ బిడ్డను కోడి దూడని కాపాడ్దామని పున్నమ్మతండ్రి రామిరెడ్డివెళ్లి అందులో మాయమైపోయేడు. అప్పుడే యీసంవత్సరం జరిగి పదిహేనేళ్లు పూర్తయి రెండునెల్లయిందిట. ఆ లెక్కనిచూస్తే కాసులికినిండా పదహారేళ్లు లేకపోయినా అధమం పదిహేనేళ్లకి తక్కువ వుండ దంటుంది పున్నమ్మ. కాస్తో కూస్తో తెలివైందన్నీ చురుకైందన్నీ అవిడంచేత తనపెళ్లిగురించి జట్టీలాడుతూన్న తల్లినీ తండ్రినీ చూస్తూ తెలతెల్లబోతోంది కాసులు.

కాసులి అందం చెప్పడానికక్కడా తెనుగులో భాష లేదని చెప్పుతూండేవాడు మారెళ్ల సుబ్బన్నకవి ప్రయత్నంమీద వ్రాయగావ్రాయగా ఒక చిన్నగీతం ఆవిడమీద వ్రాసి మమ్మాటు చదివేవాడు. ముమ్మాటూ కూడా పున్నంచంద్రుడు అతనికి కనిపిస్తూండేవాడు. "ఛీ! చంద్రుడికీ కాసులికీ అందంలో సాటెక్కడ" అని ఆకాగితం చింపిముక్కలుచేసే డాయన.

బండగిరిచారి లోగిట్లో బసచేసిన నూకారెడ్డికి కాసుల్ని పెళ్లాడాలని వుండేది. కాని, వాళ్ల నాన్న పిల్ల నిమ్మని అడగొస్తే అరుగుపక్కనున్న ఆంబోతుని వెంటతరిమేట్ట గౌరరెడ్డి. సూరపరెడ్డి పెద్దబుల్లాకుగారి ముత్యాలు, కాసులు గోదావరిలో నీళ్లుతీస్తూంటే చూసి పెళ్లాడాలని మనసేసి పినతండ్రిచేత కబురుపెడితే పుల్లో పూరకుక్కల్ని ఉసికొల్పేట్ట గౌరరెడ్డి. సీతారామయ్యగారి యీసంగతి తెలుసుకుని, తనకి ఎదురు చెప్పగల డాగౌరరెడ్డి, అని ధైర్యంతోటి తనకొడుకు బుచ్చిరెడ్డికి కాసుల్నిమ్మని, అపూరికరణంగారిని, పసుపుకుంకం, కొబ్బరికాయలు, నేంచీర, కుంకుడు కాయలు, నువ్వునూని కావిడిచ్చి పంపిస్తే.

"కాసులు మాచక్కని చుక్కండి, దాని చక్కదనం పోషించే లక్షాధికారికాని దాన్నియ్యనండి" అని చెప్పి కావిడిని కరణాన్ని తిరగ్గొట్టేసేట్ట గౌరరెడ్డి.

ఎంతజమీందార్లో కేకపోతే మహారాజులుంగారికో ఇచ్చి పెళ్లిచేస్తాట కాసులికని కోరచూపులు చూస్తూవున్నారు పూళ్లో వాళ్లంతాను.

## 3

ఆవేళ మొగుడిమీద కోపంవచ్చి పున్నమ్మ అందరికంటే ముందు భోజనం చేసేసింది. అన్నగారు రాకుండా వొదినగార్కి కుంభం పోయాలని విసుక్కుంటూ అంకమ్మ నెయ్యి వెయ్యకుండా అన్నంపెట్టింది పున్నమ్మకి. ఈవిడమీద కోపం మొగుడిమీద కోపం జంటచేసి కుంభంమీద విరిగొట్టింది పున్నమ్మ. విస్తట్లో పదార్థాలన్నీ ఒకేమాటు కలిపేసుకుని మాంచి గేదెపెరుగుతోటి మర్దనాచేసి కష్టంమీద మింగి, యీతయాసం చేత వచ్చిన నిద్దర్ని ఆపరిస్తూ పరాటింట్లో పందిరపట్టె మంచంమీద తోర్లాడుక్కొని గుర్రెట్టుతోంది. గౌరరెడ్డిమాత్రం శాంతంగా భోజనం చేసేడు. భోజనం చేసినంతసేపూ దృష్టంతా పున్నమ్మమీదే వుంది. అవిడ మాటకాదని కొట్టేస్తే ఏమవుతుందనే జాలి ఒకపక్కాని, ఆవిడమాట విని పిల్లకి సంబంధం చేయడం మానేస్తె, ఇంతవయస్సున్న పెళ్లికాడకు దొంకడం కష్టం అనేమాటొకపక్క నీ పీడిస్తున్నాయి గౌరరెడ్డిని. ఎలాగైనా మంచిమాటలు చెప్పి పెళ్లాన్ని ఒప్పిద్దామని ఉద్దేశించుకొని, భోజనం చేసి, ఆవిడ పడుకున్న మంచంమీదే ఒకపక్కని ఇరికేడు.

ఒక అరగంటకి లేచింది పున్నమ్మ. నిమ్మళంగా లేచి మంగళసూత్రాలున్న నాను సర్దుకుంటోంది. తర్వాత మొగుణ్ణి దాటి అవతలపడ్డానికి ప్రయత్నం చేస్తూంటే గౌరరెడ్డి గట్టిగా పట్టుకు,

"ఏమే......" అని ఏమో అనబోతూంటే

""నన్ను వదిలెయ్యండి"అని అరుస్తూ కూచుంది పున్నమ్మ. ఎలాగో మంచిమాటలు చెప్పి ఆవిడ నోరు కట్టేసేడు రెడ్డి.

"నన్ను వదిలేయండి"అనే పున్నమ్మ కేక విని ఏదో కొంప మునిగిపోతూందని కాసులు పక్కగ

కిటికీదగ్గరకి వచ్చి చూస్తోంది. అప్పటికే ముసలాళ్లిద్దరూ ఇలాగ మాట్లాడుకుంటున్నారు:

గౌరరెడ్డి:—మరీ, వైద్యుడిగారి సంబంధం నీకెందుకు నచ్చలేదూ?

పున్నమ్మ.—ఆమాట నన్నెందుకు అడుగుతారు? కన్నపిల్ల తర్వాతగ క్షేమవుతుందో యీడొచ్చినవారు మీరాలోచించుకోవద్దూ?

రెడ్డి.— ముసలాడనేనా!

పున్నమ్మ.—అనేనా ఏమిటి ఇంకాను! నిండా ఎనభై ఏళ్లుండేను? తెల్లగడ్డం గుండెలమీదకి పాకడం కనపడదూ? అన్ని పళ్లువూడేయిటకూడాను.

రెడ్డి.—అవునే అతని కెంకెడు బ్యాంకో ఎరుగుదువా? ఇనప్పెట్టెనిండా అతని మేడలే! అతను ఇంగ్లీషువైద్యుడుకూడాను. రెండో పెళ్లయినా పిల్లలు లేరు. ఇంక కాసులి కేం?

పున్నమ్మ.— కాసులికేనా! హ! హూ! వాడి డబ్బూ వాడి మేడలూ గోదాట్లో పడెయ్యండి. కాసులిని రంగారెడ్డి కిచ్చి పెళ్లి చేస్తే నేనొప్పను.

రెడ్డి.—నువ్వ గింజుకచచ్చినాసరే, రంగబాబుకి పిల్లనియ్యకమానను. అది అక్కడెంతో సౌఖ్యపడుతుంది. కావలసినవన్నీ వస్తువులు, చీరలు, నగలు, బళ్లు మోటారుకార్లు, నీ అయ్యనాడైనా ఎరుగుదువా ఇవి?

పున్నమ్మ.—అయ్యనాడెరగ లేదు. యీనాటికి మీనాటా ఎరగలేదు. కాసులు మాత్రం వాళ్ల అయ్యనాడెరుగునా ఏమిటి?

రెడ్డి.—ఓసి, నీ అన్నగలగొట్టా! నా హయాంలో సుఖం అనుభవించలేదనే కాసులికి ముందుగతి మంచిది చూపిస్తున్నానే!

పున్నమ్మ.—ఈమాటమీద మళ్లీ మీతో మాట్లాడితే ఒట్టూ. మీయిష్టం వచ్చినట్లు చెయ్యండి. పిల్ల మీది. గోతులో దింపుతారో నూతిలో దింపుతారో నాకేం కావాలి? అని వెళ్లిపోయింది.

రెడ్డి.—'నూతులోనూ దింపను, గోతులోనూ దింపను. రంగారెడ్డి అయిదంతస్తుల మేడమీద దింపుతానని నవ్వుకున్నాడు. కాసులుకూడా తమన్నగదులోంచి పెరట్లోకి వెళ్లిపోయింది.

## ౪

కాసులికి యీడువచ్చినా స్వాభావికమైన సుగుణసంపత్తే కాని బాహ్యప్రపంచంలోంచి ఎరువు తెచ్చినదెంతమాత్రం లేదు. దీనికి కారణం ఆవిడ పుట్టిన దగ్గర్నుంచి తన ఊరు, తాతగారివూరైన "పూళ్ల" తప్ప ఇంకేవూరూ చూడలేదు. పాలికుంచాలు, గాడు పెదగొల్ల, దాసరి వెంకాయ, తోటకూర కనకం, పెమ్మరాజు మాణిక్యంను యీవిడ బాగా ఎరుగున్న పేదరాసి పెద్దమ్మలు. ఎప్పుడైనా వీధిలోకి వస్తే తరుచు కనిపించేవాళ్లలో భాగవతుల భావ్యంమాత్రం ఒకడు. ఇటువంటివాళ్ల ఇరుగుపొరుగులో కాపరంవుంటే కాసులెంత తెలివితేటల్దయినా ప్రపంచజ్ఞానం ఎక్కడనుంచి తెచ్చుకుంటుంది? పోనీ చదువుకుందా అంటే తండ్రికే లేనిచదువు బిడ్డకెలా వస్తుంది? శుభ్రంగా తలకి కొబ్బరినూని రుద్దుకొని మధ్య పాపిడి తీర్చి వెనకాల సిగేసికుని దానిమీద ఒకబంతి పువ్వుముడిచి వాళ్లమ్మకి సారితెచ్చిన రేకు అద్దంలో సొగసు దిద్దుకోవడమేకాని మాంచివాసనేసే తలనూనిలు, ఎడంపాపిళ్లు, రిబ్బనుముడిజడ, అందులో దూర్చేటందుకు ఎర్ర గులాబీపువ్వులూ యీసొగసంతా దూసుకుందుకు నిలువుటద్దం ఎక్కడేనా చూసిందా ఏమన్నానా? కాటిక పెట్టుకోందే ఒకనిమిషమేనా వుండేమో అడగండి ఇంకా గంగిరెద్దు బాబిగాడిని. ఆవిడ అంతా వెర్రిమాలోకం. పురాతన ఫక్కీ. ఈవిధంగానే వుంటాయి ఆవిడ భావాలనికూడా చెప్పడం ఎందుకూ?

ఆవేళ తల్లీ తండ్రీ తనగురించి జగడంఆడ్డం చూసి దానికారణం కనిపెట్టింది కాసులు. అక్కడ ఇంకా నిం లేకపోయి గబగబా కళ్లుతుడుచుకుంటూ పెరట్లో వున్న పెద్దగన్నేరుచెట్టుకింద కెళ్లి వెక్కివెక్కి రాగాలుపెట్టుతోంది. ఆవిడిన్ని దుఃఖంలోంచి మళ్లీటా

పని కాపోలా గన్నేరుపువ్వొకటి గాలికి వొంగి ఆనిడ కళ్లు నేసి కొట్టింది. ఆపువ్వును కోసి చేత్తో పట్టుకుని యీవిధంగా ఆలోచించుకుంటోంది కాసులు. "ఎన్నైనా ఏళ్లట—తన తాతకైనా లేవుటన్నేళ్లు—గడ్డం గుంజి లమీద కెగబాకుతోందిట—ఒకమాటు వాళ్ల వూరొచ్చిన చిటికెలక్షై రాగికి తప్ప ఇంకెవ్వరికీ అంతగడ్డం చూడలేదుట. పళ్లుపూడిపోయేయిటకూడాను. ఒకవేళ తాను చక్కిలాలు చేసిపెడితే ఎలాగతింటాడు పాపం-అని గోలుమని ఏడ్చింది కాసులు. తాను చుట్టి తాసల పాకు లతని కివ్వడానికి నోచుకోలేదా అనుకుంది. ఇంతకీ తండ్రి పెళ్లిచెయ్యాలని పట్టుపట్టేడు. అతని కెంతచెప్పినా వినడు. ఇంకా ఆదుర్దాపడితేమాత్రం ఏంకార్యం. తన అదృష్టాన్నెవళ్లు మళ్లిస్తారు. మందూ మాకూ తండ్రికిచ్చి మనసువిరిచే స్వభావం కాదు కాసుల్ది. కనక, తండ్రి ఎలాగ చెప్తేఆలాగ తలవంచడమే భావ్యం అనుకుంది. అంతకంటే వుద్దేశాలు పరిగెడితే కామా అనిమకి? డాక్టరుగారికి డబ్బు బాగావుందిట! పెద్దమేడలూ, పొలాలూ, కార్లూ, నౌకర్లూ, ఇంకా ఎన్నో వున్నాయిట. వాళ్లతండ్రి కున్నట్టు పురిల్లూ, మిద్దేనా? పోతులబండి, ఎడ్లబండీ, సవారీలూనామరి? రూతవెంకడిలాగ ఒక్కడేనా మరి పాలికాపు? ఇది కాకుండా వస్తువు లెన్నో పెడ్తారుట. అని అనుకుంటూ తన ఒళ్లంతా చూసుకుంది కాసులు. ఒళ్లంతా బంగారం మయం. ఇంకెందుకూ శరీరంలో చోటేలేదు. ఆనగిష్టీల ఒంటిపేటగడియారంగొలుసా! మోహర్లుకట్టిన కాసుల పేరా! పలకసర్లా! ముత్యాలవడ్డాణమా! ఆరత్నపులో లక్ష్యాలా! ఇవేవి టవేవిటి? ఎన్నో కనిపించేయి. ఇంక పైముచ్చట్లకా! తన "మొగుడే" వున్నాట్ట. తర్వాత దేవు డున్నాడంది కాసులు. అంతేకాని, తండ్రిమాట కాదన్డానికి తలంపే వచ్చిందికాదు పాపం.

ఆషాఢబహుళవిదియా సోమవారంనాడు, చిత్తా నక్షత్రంలో రాత్రిపదకొండుఘడియల ముప్పైఅయిదు విఘడియలకి రాజమండ్రిడాక్టరుగారు బాపినేని రంగారెడ్డిగారు పూరెళ్ల గానరెడ్డిగారి కూతురు కాసులు మెడలో మంగళసూత్రం కట్టేసేరు. అది కట్టబోయ్యేటప్పుడు పెళ్లికొడుక్కి వచ్చిన వణుకు చూడలేదు. కాని చేతినున్న "రిస్టువాచీ"నిమాత్రం చూచి పొంగిపోయింది కాసులు.

పెళ్లైనమర్నాడే కాసుల్ని సారిచ్చి అత్తింటికి పంపేరు. పెళ్లిసమయంలో డాక్టరుగారు చేయించిన వైభవానికి రాజమండ్రీపురవాసులంతా ఆశ్చర్యపడ్డారు. పెళ్లికూతుర్ని చూడ్డానికొచ్చిన ఆడాళ్లూ మొగాళ్లూ "చక్కనిచుక్క—రత్నంలాంటిపిల్ల—ఇంతందమైన అమ్మాయి ఎక్కడాలేదు" అనుకున్నారు. ఒకళ్లిద్దరు మొగాళ్లీమాట లనడం విన్నారు డాక్టరుగారు. ఇహానొచ్చెయెక్కడలేని కోపం, అనుమానంనూ. తను చేతకానివాడనీ ముసలాడనీ ఎంచి పెళ్లాం ఎవరివేపైనా చూస్తుందేమో అనేభయం, అనుమానంను అతన్ని పిశాచంలాగ పట్టుకుని బాధించేస్తున్నాయి. దీనికే "పడుచుపెళ్లాం,ముసిలిమొగుడు" నే సామెత. ఈ అనుమానంతోటి ఆయన ఇల్లుదాటి వెళ్లడానికి జంకేవాడు. రోగులు మొర్రెట్టుకుంటే, అయిదునిమిషాలు కారుమీద రయ్యని పోయి రివ్వున వచ్చేసేవాడు. కాంపౌండరు సాహేబు బజార్లోంచి బత్తాయిపళ్లు తెచ్చి అమ్మగారికి స్వయంగా ఇస్తే బాబుగారికి అనుమానం. గడ్డాం కిందకి దింపి నోరువెలిబెట్టి సాహేబుకేసి ఎగాదిగా చూస్తాడు. అప్పుడుపుట్టిన పిల్లాడైనా కాసులువేపు చూసి చిరునవ్వునవ్వితే, డాక్టరుగారికి మింగేద్దామా అనివుంటుంది. ఆపిల్లాడేమన్తాంటే, కాసులు తనకితేనే వంటాడేమంటున్నా డనుకుంటాడు రంగారెడ్డి. కాసులికీ ఆసుపత్రి వాళ్లకీ సంపర్కం లేకుండా ఆసుపత్రిని మరోమేడమీదికి మార్చేసేడు. తనుమాత్రం పెళ్లాన్ని కనిపెట్టుకూర్చునేవాడు. ప్రేమచేతకాదు అనుమానంచేతే. పెళ్లాడితే సౌఖ్యం వస్తుందనుకుంటే, మనస్సులో ఆవేదనా, అనుమానం, భయం ఎక్కువయ్యేయి పాపం మన వైద్యుడిగారికి. ఆదుర్దా ఇంకా తీరక మాసిలివీరన్నని దగ్గరెట్టేపెట్టి, డాక్టరుగారు పెళ్లాన్ని గదిలోపెట్టి పైని తాళం వేయడం మొదలెట్టేరు.


ఈవిధంగా రెండేళ్లు గడిచేయి. కాసులికి రాజ మంద్రవరం నీళ్లు వంటపట్టేయి. కొంచంవసివత, నాగ రికత అబ్బేయి. సిగమాసేసి బర్మాముడి వేస్తోంది. ఎడం పాపిడి దిద్దుతోంది. గులాబీపువ్వులు ముడుచుకుంటోంది. భుజంరవికలు తొడుగుతోంది. "భారతి" పుస్తకాలు చదువుతోంది. ప్రపంచజ్ఞానం కొంచెం అబ్బినతర్వాత, తవస్థితి గ్రహించుకుంది. ఆవిడ చాలా అంద మైందని ప్రపంచం అంతా అనుకుంటోందని గ్రహించింది. తన నిర్భాగ్యత మనసుకి నాటింది. ముసలాడ్ని చూస్తే ఇదివ రకున్న ప్రేమ తగ్గుతూంటే తన యౌవనం వృధా అయి పోతోందనుకుంది. ఇంకా ఏవేవో విమర్శించుకుని ఇంక మొగుడు పెట్టే బాధలకీ అదుపులికీ లొంగ ననుకుంది. ఆ రాత్రెలాగో దెబ్బలాడి తనగదికి తాళంవేయించడం మా నిపించేసింది. ఈ రెండేళ్లనుంచీ కాసులి ప్రవర్తన కని పెట్టుతూ లోపా ల్లేవనే గ్రహించి ఇంత సాహసం చేసే రు తాతగారు.

౬

యథాప్రకారం రంగారెడ్డిగారు భార్యని వీరమ్మ కప్పచెప్పి రోగుల్ని చూడ్డానికని పూరంట కారేసుకుని వెళ్లిపోయేరు. ఆయని ఇల్లుదాటిన కొంతసేపట్లో మేడ మీద వీధిగదిలో కిటికీ దగ్గరనించుని వీధివేపు చూస్తోంది కాసులు.

ఆ మేడ కెదురుగుండా మ్యూనిసిపాలిటీవారి పుస్త కభాండాగారం ఒకటుంది. అందులోకి రోజూ సాయం త్రంవేళ వెళ్లి "పేపరు" చదువుతూండే వాళ్లలో చం ద్రారెడ్డి ఒకడు. ఇతనికి ఇందుమించు ఇరవైఆరే ళ్లుం టాయి. మంచి జవాను, అందకాడున్నూ. సొగసుగా వుండేవాళ్లలో ఒకడని చెప్పొచ్చు.

"పేపరు" చదివేసి ఇంటికి వెళ్లిపోయేసమయం లో కాసు లితని కన్పించింది. హఠాత్తుగా పులిక్కి పడినట్టు ముందు బెదిరేడు. తర్వాత వింతచూపుల్తో మళ్లీ ఆవిడిని చూసేడు. కాసులుకూడా ఇతన్ని చూ ...ి. బిడియపడి చెవకంజేసి అతనివేపు గమ్మత్తుగా ...స్తానే లోపలికి వెళ్లిపోయింది. ఆచూపుల్లో వున్న అర్థంమ ఊహోన్ను గ్రహించేడు చంద్రారెడ్డి. కాసుల్ని తలచుకుంటూ ఇంటికి వెళ్లేడు. "ప్రేమ" అంటే ఒకా



'తర్వాత వింతచూపుల్తో ఆవిడిని చూసేడు'

నొకప్పుడు కాసులికి అంధకారంలాగ కనిపించేది. ఆ అంధకారాన్ని పోవుచేస్తే అదివరకు డాక్టరుగారి మూ ర్తి ఆవిడకళ్లకి కట్టినట్టుండేది ఈడొచ్చినకొద్దీ తాత గారిమూర్తిలో "ప్రేమ" స్వరూపంమారి "అసూయ" స్వరూపం వచ్చింది. ఏవిధాన్నీ కూడా కాసులికి డాక్ట రుగారి పొత్తు సౌఖ్యంగా లేదు. ముసిలిమొగుడ్ని పెళ్లా డినందుకొచ్చే కష్టాలు ఆవిడ కండ్లల్లో బాగా నాటే యి. తల్లివొద్దన్నా యీపెళ్లి పంతంతో చేసిన తండ్రి గౌరరెడ్డిని తిట్టింది. "నాకీపెళ్లొ"ద్దని ఆనాడే ఎందుకు చెప్పకపోయేనా అని ఏడ్చింది. ఇంకట్లోకి చంద్రారెడ్డి ఆవిడ ధ్యానన్లో కనిపించేడు. అతనికిన్నీ రంగారెడ్డికిన్నీ, వున్న భేదం కనిపెట్టింది. తానిప్పు డెంతందంగా వున్నా

ఎంత పెద్దబొట్టు పెట్టుకొంటూవున్నా, నిజంగా భర్తవున్నా లేనిలోపం గ్రహించింది. ఇంక బాహ్యప్రపంచంలోకి చంగున గంతేస్తావని నిశ్చయించుకుంది. చంద్రారెడ్డి భాండాగారాని కొచ్చేసమయానికి కాసులు మేడమీద కిటికీదగ్గిరే నించునేది. ఒక్క పదినిమిషాలు వారిద్దరూ కళ్లతోటి ప్రేమని కురిపించే ఉత్తరాలు పంపుకునేవారు. ఆ కాబుళు ఒకరినొకరు ప్రేమించుకున్నట్లు చెప్పాయి.

౨

చంద్రారెడ్డి కాసుల్ని చూసినప్పటినుంచీ స్థిరంగా వుండలేకపోతున్నాడు; మనస్సు చంచలం అయిపోతోంది; మరొక పనేదీ తోచడం లేదు. ఇదంతా ఒక జాడ్యంలోనికి దింపుతుందేమో అని గజగజలాడుతున్నాడు. తనఆవేదన స్నేహితు లెవ్వరితోనైనా చెప్పితే మనస్సు స్థిమితపడ్డమే కాకుండా కాసుల్ని తనదగ్గరకి చేర్చడంలో సహాయం అవుతారేమో అనుకుని కండువా వేసుకుని మ్యూజియంలోకి వెళ్లేడు. మ్యూజియంతోటలో చపటామీద చంద్రారెడ్డికొక ముసలిమనిషి కనిపించేడు. ఆయన ఆఊళ్లో ఒక డాక్టరుగారని కూడా అతనికి తెలుసును. ఈకారణంచేత, తనఅవస్థ ఇతనితో చెప్పితే వృద్ధుడుకనక తన అనుభవంమీద ఏమైనా సలహా ఇవ్వవచ్చును లేకపోతే, అవసరమైతే జబ్బుకుదర్చడానికి మందేనా ఇస్తాడని అనుకున్నాడు. నిండుగుండెతో డాక్టరుగారి దగ్గరకెళ్లి, నమస్కారంచేసి "అయ్యా! మీతో ఒకగొప్ప రహస్యం చెప్పదలచుకున్నాను. దాని విషయంలో నాకు తగిన సలహా ఇస్తేమీకష్టం పూరికే పోనియ్యను" అన్నాడు.

"అబ్బాయీ! మావైద్యపద్ధతుల్లో రహస్యం అనేది ఒకటి. మారోగుల జబ్బులవిషయంలో మేము రహస్యం వుంచకపోతే మాగౌరవానికి చాలా భంగం వస్తుంది. అటువంటి భయం ఏమీ వుంచుకోకుండా నీమనస్సులో వున్నదేదో చెప్పు. తగినచికిత్స చేస్తా" నన్నారు డాక్టరుగారు. ఇక నేముందీ, తన సలహాదారుడు తనమాట రహస్యంగా వుంచడానికి పూనీపడ్డ తర్వాత ఇంక తనకథ ఏకరువుపెట్టడానికి బిడియం ఎందుకనుకుని చంద్రారెడ్డి కాసులు కాపరంవున్న మేడనీ, కాసులు అందాన్నీ, పూర్తిగా వర్ణించి, ఆవిడ భర్త డాక్టరైనట్టున్నా, చాలా అనుమానస్వభావంకల వాడైనట్టున్నా చెప్పి,

"అయ్యా! ఆఅమ్మాయిని నేను మనసార ప్రేమించేను. ఇంకా పూర్తిగా ప్రపంచజ్ఞానం తెలియకపోవడంచేత, ఆవిడని పలకరించి ఏవిధాన్నీ మాట్లాడలేకపోతున్నాను. మీ రెలాగ చెప్పితే అలాగ నడుస్తాను. ఏదైనా దారివుంటే చూపించండి" అన్నాడు.

ఈకథంతా విన్నేసరికి రంగారెడ్డి నిలువునా నీరైనాడు. కొంప మునిగిం దనుకున్నాడు. కారణం, చంద్రారెడ్డి వరించినది తనపెళ్లాం కాసుల్నే. కాని, తనవుద్రేకాన్ని పైకి వెలిబుచ్చలేదు. ఈనాటకం ముందుకి ఇంకా నడిపితే తనభార్య కాసులు పతివ్రతత కూడా పైకి రాగలదని ఆలోచించి, తనగుట్టంతా గుట్టుగావుంచి, చంద్రారెడ్డివేపు చూసి,

"అబ్బాయీ! ఇంతమాత్రానికేనా నీవింత హడలిపోతున్నావు. ఆవిడని నీవలలో పడెయ్యడానికి మంచి సులువొకటి చెప్తాను విను. నువ్వు చెప్పినమనిషిని నేను బాగా ఎరుగుదును. ఆవిడభర్త ముసలిపండు, ఆవిడచూస్తే మంచి యౌవనంలో వుంది. ఈకారణంచేత నీఆటల్లో ఆడి, నీవలలో చిక్కడం అట్టే కష్టంకాదని తోస్తుంది. ఆవిడింటికి నువ్వువెళ్లి, ఆవిడముందు ఆవిడసౌందర్యాన్ని వర్ణించు; ఎక్కడలేని విశేషణాలు వేసి తనంత అందకత్తె లేదని, ఇంకెవ్వరినీ నువ్వింతగా ప్రేమించలేదని చెప్పి ఆవిడని మాయలో పడెయ్యి. అప్పటికీ నీవలలో యీచేపపడకపోతే నేనొక మంచి మందిప్పించి ఆపనిచేయిస్తాను. అన్నట్టు చెప్పడం మరిచిపోయేను. ఆవిడభర్త రోజూ మధ్యాహ్నం మూడు గంటలు మొదలుకుని ఆరుగంటలువరకూ ఇంటిదగ్గిర వుండడు. ఈసమయంలో ఎప్పుడైనా నీవు వెళ్లు. నీకింతగా నేను బోధపర్చడాని క్కారణం నేనూ నీవయస్సులో వున్నప్పుడిలాగే చిక్కులుపడేవాణ్ణి. మరొకటి సుమా! ఈసంగతిరహస్యంగా వుంచాలిస

నే నిటువంటి వృత్తుల్లో దిగేనని పైకి తెలిస్తే నాపరపతికి భంగంవస్తుంది జాగ్రత" అన్నాడు.

చంద్రారెడ్డి.— అయ్యా! నేను కావలసినంత జాగ్రతతో ప్రవర్తిస్తాను. రేపటిరోజున ఏమిజరిగినదీన్నీ మనవిచేసుకుంటాను యీవేళకే, ఇక్కడే మీదర్శనం చేస్తాను-అనిచెప్పి వెళ్లిపోయేడు.

రంగారెడ్డి ఒంటరిగా పూర్వపు జరిగినకథ మళ్లీ జ్ఞాపకంచేసుకుని విచారిస్తున్నాడు. ఆలోచిస్తూన్నకొద్దీ కాసులు తనకి దూరంఅయిపోతోంది. పిచ్చెత్తినట్టు తోటంతా తిరుగుతున్నాడు.

ఈలోగా, యథాప్రకారం చంద్రారెడ్డి భోంచాగారంనుంచి వస్తూ, కాసుల్ని కిటికీదగ్గరనుంచి చూసేడు. ఈరోజున మరింత ప్రేమపూరితమైన చూపుల్తోటి, ఆవిడ అతన్ని ఆదరించింది. ఇదికొంత రెడ్డికి ధైర్యంఇవ్వడంచేత ఆవిడగుమ్మంలోకి వెళ్లి తలుపు గుద్దేడు. వీరమ్మ తలుపుతీసింది. "మీ అమ్మగారిని చూడాలి" అన్నాడు చంద్రారెడ్డి. ఇంతలోకే కాసులు మేడదిగి, చంద్రారెడ్డిని ఆదరణతోటి తనగదిలోకి తీసుకెళ్లింది. ఇంకా చిన్నతనంచేతనో, మరి కొత్తగా వుండడంచేతనో చాలాబిడియంగా వుంది రెడ్డికి. కొంతతడువు ధైర్యం తెచ్చుకుని, కాసుల్ని చూస్తూ ఆవిడని తాను వరించినట్టున్నా, కలకాలం ఆవిడన్నే హితుడై వుండి సేవచేయడానికి ఆజ్ఞ ఇయ్యాలసినదనీన్నీ కోరేడు. కాసులు చంద్రారెడ్డిని ప్రేమించిందని ఇదివరకే చెప్పేం. కాని, పూర్తిగామాత్రం ఆవిడ మనసు వెలిబుచ్చలేదు. రేపటిరోజున నాలుగ్గంటలకి ఫలహారానికి రావలసిందని రెడ్డిని ప్రార్థించింది. తప్పకుండా వస్తానని మాటఇచ్చి వెళ్లలేక వెళ్లలేక రెడ్డి కాసులివేలికి తనవుంగరం తొగిలించి వెళ్లిపోయేడు.

డాక్టరుగారు, చంద్రారెడ్డి ఏమివార్త తెస్తాడో ఎదురుచూస్తున్నారు మ్యూజియంలో. ఇంతలోకే రెడ్డి అక్కడికి వచ్చేడు. ఇతన్ని చూసి డాక్టరు "ఏమయ్యా! చంద్రారెడ్డి, ఏమిటివింతలు? పాచికలా పారింది?" అన్నాడు.

చంద్రా.—మనం అనుకున్నట్టే, ఆవిడతో చాలా వరకు మాట్లాడేను. కొంత లొంగినట్టుగానే కనపడుతోంది. ఇంక ఆముసిలిగాడిదకొడుకుని రెండుచెవులూ పట్టుకుని ఈడ్చెయ్యొచ్చును.—ఈమాటలు వినగానే రంగారెడ్డి పడిన అవస్థ వర్ణించడానికి శక్యంకాదు. అసూయ అంటే ఎంతబలమైందో తెలిసినవారు వూహించవలసిందే కాని మేము చెప్పలేము. కాస్త స్థిమితపడి రంగారెడ్డి "మళ్లీ ఎప్పుడు రమ్మంది?" అన్నాడు.

చంద్రారెడ్డి.— రేపుసాయంత్రం నాలుగ్గంటలకి

రంగా—రేపు మళ్లీ కలుసుకుందాం అని చెప్పి ఇంటికి వెళ్లేడు. తనవిచారం అంతా నవ్వులో దాచుకుని తెల్లవారే వరకూ శాంతంగా పడుక్కున్నాడు.

౮

రంగారెడ్డి భోజనంచేసి, బట్టలువేసుకుని, ఎన్నడు నాలుగంటలవునా అని ఆ దుర్దాతో వూరల్లా తిరుగుతున్నాడు అతనిపట్టుదల, ఏమైనాసరే, చంద్రారెడ్డీ కాసులూ మాట్లాడుతూంటే చూసి పట్టుకుని తీవ్రమైనమార్గంగా ఇద్దరిమీదా పగతీర్చుకుందాం అని.

ఇంతలోకే డాక్టరుగారింట్లో లేని సమయం చూసి చంద్రారెడ్డి కాసులున్నగదిలో కెళ్లేడు. వీరమ్మ వీథితలుపు మూసేసింది. కాసులున్నూ చంద్రారెడ్డిన్నీ కూచుని మాట్లాడుతున్నారో లేదో హఠాత్తుగా వీథి తలుపు "బడబడ" చప్పుడైంది. అప్పుడే నాలుగ్గంటలయిందన్నమాట. బెదిరి బేజారైపోయి వీరమ్మ కాసుల్దగ్గర కెళ్లి "అమ్మా! డాక్టరుగారొచ్చేరు. లెండి! లెండి!" అని అరిచింది. కాసులు మొదట చాలా భయపడింది. కొంప మునగడానికి సిద్ధంగా వుండనుకుంది. కాని, ఆయుక్తులకి కాసులుకే పెట్టింది పేరు. వెంటనే చంద్రారెడ్డిని యీడ్చుకెళ్లి భర్త పరుపుకుట్టించుకుందుకు తెప్పించిన హంసయీకలున్న పీపాగొట్టంలో కూచోబెట్టి, మూతేసి, ఏమీ ఎరగనట్టుగా పూలుతో సంచులు కుట్టుకుం

టోంది. ఈలోగా రంగారెడ్డి కారుదిగి, హడిలిపోయి పడిపోయి, పీకో మరిచిపోయినట్టుగా, గదితాళాలు వుచ్చుకుని, ఇల్లంతా శుభ్రంగా ప్రతిమూలా వెతికేడు. చిన్న ఎలకబొర్రయినా తనచాటున పడలేదు ఇంట్లో చంద్రారెడ్డి కనపడకపోవడంచేత విసుగుపడి, కుర్చీలో కూలబడి, అస్వస్థతగా వుందని చెప్తూ విసుగుకుంటూ ఇంట్లోనే వుండిపోయేడు రంగారెడ్డి. అందరూ బాగా నిద్రపోయేక వీరమ్మ చంద్రారెడ్డిని పీపాలోంచి పైకితీసి పెరటితోవని పంపేసింది.

మర్నాడు మామూలుగా చంద్రారెడ్డి రంగారెడ్డిని మ్యూజియంలో కలుసుకుని రాత్రి జరిగిన కథంతా పూర్తిగా చెప్పేసేడు.

"ఎంతపని చేసిందిరా! కాసులు" అని అనుకుని ఏమీ ఎరగనట్టు నటిస్తూ,

"అయ్యోపాపం, కష్టం అంతా వృథాగా పోయిందే" అన్నాడు రంగారెడ్డి.

"అయితే నేమండీ! లక్ష్మీవారం వాడు ఆముసిలాయన వూరికి నాలుగుమైళ్ళలో వున్న స్నేహితుడింటికి విందుకని వెడతారుట. ఆవేళ నాలుగ్గంటలకి తప్పకుండా రావలసిందని దాసీదానిచేత ఇంటికి కబురు పంపించింది కాసులు" అన్నాడు చంద్రారెడ్డి.

"అలాగనా! ఎంత అదృష్టవంతుడివోయి నువ్వు" అంటూ ముఖంలోంచి రాలుతున్న అగ్నికణాల్ని చెమట చేత చల్లార్చేడు రంగారెడ్డి.

కథానాయకులకీ, సూత్రధారుడికీ కూడా ఎంతో కష్టంమీదట లక్ష్మీవారం వచ్చేసింది. ఇంచుమించుగా నాలుగ్గంటలకి రంగారెడ్డి ఇల్లువిడిచి, సమీపంలో వున్న స్నేహితుడింట్లో కూచుని, ఎదురుగుండా కనిపించే తన ఇంటి గుమ్మం కేసి చూస్తున్నాడు.

ఇంతలోకే చంద్రారెడ్డి ముస్తాబై తను ప్రేమించిన వనితతోటి కులాసాగా చాలాసేపు కాలక్షేపం చెయ్యొచ్చునని తలచి అతిగోటుగా వచ్చేడు కాసులింటికి. ఇతను రావడం ప్రత్యక్షంగా చూసేడు రంగారెడ్డి.

గదిలో కాసులూ చంద్రారెడ్డి ఒకరికౌగిట్లో ఒకరున్నారు. ఇంతలో వీరమ్మ గంతులేస్తూ "బాబు! బాబు" అని కేకలేస్తూ రంగారెడ్డిగారి రాక తెలియజేసింది. ఏమాత్రపు వుపద్రావనికేనా జాగ్రత్తగా వున్న కాసులు, చంద్రారెడ్డిని మళ్లీ యీడ్చుకెళ్లి, అటకమీద గుండిగల మాటున కూచోపెట్టి, తనబల్లదగ్గరకి వచ్చేసి పుస్తకం చదువుకుంటోంది ఏమీ ఎరగనట్టుగా.

చెమట్లు కక్కుకుంటూ, అగ్నికణాలు రాల్చుకుంటూ, వేడి నిట్టూర్పులు వదులుతూ, ఎక్కడా లేనిబలం తెచ్చుకుని పరుగెత్తుకొచ్చేరు డాక్టరుగారింటికి.

ఏదో కొంప మునిగిందన్నట్టుగా కాసు లెదురుగుండా వెళ్లి భర్తను పట్టుకుని, "అదేమిటి! ఎందుకనిపోయి ఇంతవేగిరం వచ్చేరూ" అంది.

రంగారెడ్డి. "ఒసేవ్! ఈవేళ చెప్పడం మరిచిపోయేను. నిన్నరాత్రి ఒక చెడ్డకల వొచ్చింది. ఎవడో దుర్మార్గుడుట, దురుద్దేశంతోటి మనింట్లోకి చొరబడి ఎక్కడో దాంకున్నాట్ట. ఎంతవెతికినా నాకు కనిపించేడు కాడుట. ఆవుగ్రంగాలంగా నాముక్కులోంచి రక్తం వచ్చిందిట. ఈసంగతి జ్ఞాపకానికి వచ్చి, భయంవేసి తిరిగివచ్చేసే. ఏదీ! చూదాం వుండు. ఇల్లంతా వెతికి ఏవడేనా గాడిదకొడుకు దాంకున్నాడేమో కనిపెడదాం" అన్నాడు.

కాసులు "అయ్యో! అంత పాడుకలే? ఏదీ వెతుకుదాం రండి" అంది.

వెంటనే డాక్టరుగారు అన్ని తలుపులూ మూయించి, ఇంట్లోవున్న గదులు, గాబులూ, భోషాణాలూ, కావిడిపెట్టెలూ శుభ్రంగా వెతికి, కనిపించిన బస్తాలు, దూదిని, హంసయీకలిని, పీపాలు, కర్రతో కొట్టికొట్టి, ఎవరూ కనపడకపోవడంచేత "అన్నీ అబద్ధపు కలలేనే, పాడుకలలు" అంటూగదిలో కూలపడ్డాడు. "అటకమీద వెతకడం మరచిపోయేరు" అనుకుంది కాసులు నవ్వుకుంటూను. తాతగారి కేమీతోచ తెల్లారేవరకూ నిద్దరపట్టలేదు. చంద్రారెడ్డి చెప్పిన యీాలు చూస్తే ఒకలాగున్నాయి. తాను వెళ్లి

లిస్తే ఆచోకీ ఏమీ దొరకదు. ఇంతకీ చంద్రారెడ్డీ తన గుమ్మం దాటి లోపలికి వెళ్లడం చూసేడుకాదూ! ఇల్లంతా వెతికి అతను లేకపోవడంచూసి అదివొట్టి భ్రమ అనుకున్నాడు పాపం ఈముసిలిమొగుడు. ముసిలి మొగుడూ పడుచుపెళ్లాం అయితే ఇదే గ్రహచారం. ఈవ్యూహాల్లోటి తెల్లవారేక నిద్దరపోయేరు డాక్టరుగారు. ఆసమయం కనిపెట్టి వీరమ్మ చంద్రారెడ్డిని ఇంటికి పంపేసింది.

చంద్రారెడ్డిని ఇంకపట్టుకోవడం దుర్లభం అనుకున్నాడు రంగారెడ్డి. ఇంటికట్టు ప్రమాదావస్థలోకి వస్తుందేమో అనుకున్నాడు. "ఇంతకీ గ్రహచారం కాకపోతే, ఎనభైఏళ్ల కొడుక్కి పెళ్లాంవుండేంటే, తిన్నగా బతకలేక? ఎవరు కొడుతున్నారో చెప్పుదెబ్బ బాగాకొడుతున్నారు" అనుకున్నాడు మర్నాడులేచి. అయినా పంతం, కోపం ఆపుకోలేకపోతున్నాడు. ఎలాగైనా చంద్రారెడ్డిని బహిరంగంగా పట్టుకుని మూడు చెరువులనీళ్లు తాగించితీరా లనుకుని బుర్రలో గొప్ప పన్నాగం ఒకటి పన్నేడు. అదేమిటంటే, తనభార్య కాసులదగ్గర కెళ్లి "ఓసేవ్! రేపువేళ సీతానగరం వెళ్లాలి పనిమీద. పదిరోజుల్దాకా రాలేను. అంతవరకు నువ్వు యీఇంట్లో వుండడం నాకిష్టం లేదు. ఆర్యాపురంలో మనపురింటిలో వుండు నేవచ్చేవరకు" అన్నాడు.

"సరే మీఇష్టం" అంది కాసులు.

ఈఏర్పాటు చేయించి రంగారెడ్డి మ్యూజియంలో చంద్రారెడ్డిని కలుసుకుని,

"ఏమయ్యా! ఇప్పటికి నువ్వు వరించిన శ్రీ నీపొత్తు చేరిందని తలుస్తా"నన్నాడు.

"ఏమి చేరడ మండి. ఆముసిలితుండాకొడుకు దగ్గర కర్ణపిశాచం వుంది కాబోలు. లేకపోతే ఏమిటండీ, నేనతనింట్లో అడుగుపెట్టేలో లేదో, వెంట తరిమినట్లు తానూ వచ్చేస్తున్నాడు. నిన్ననూ అలాగే అయింది. రాత్రల్లా అటుకమీద వుండి తెల్లారింతర్వాత లేచొచ్చా"నన్నాడు చంద్రారెడ్డి.

"అమ్మ! పీనీ సిగాతరగా, ఎంత పనైందిరా" అని అనుకుని రంగారెడ్డి, "అబ్బాయి! నీదినాలు బాగా లేవు." అన్నాడు.

"ఇదిగో తాతగారూ! ఇంకొక్కమాటు ఆఖరు ప్రయత్నం చేస్తాను. ఈవేళనుంచీ నాఅదృష్టం బాగుంటుంది. ఏమా! ఆముసలాడు సీతానగరం వెళ్లి పదిరోజులువరకూ రాడుట. అంతవరకూ ఆడాళ్లు ఆర్యాపురంలో బస. వాడు లేనిసమయం చూసి, నాకష్టాలు దాటేటట్టు నాపగ తీరేటట్టు, ఆర్యాపురంలో నేనూ బసచేస్తాను" అన్నాడు చంద్రారెడ్డి. "నీరోజులు దగ్గిర పడ్డాయిలే" అనుకుని రంగారెడ్డి, చంద్రారెడ్డితో వెడతానని చెప్పి వెళ్లేడు.

౬

మర్నాడు రంగారెడ్డి, భార్యనీ, వీరమ్మనీ వెంటబెట్టుకుని ఆర్యాపురంలో తన పురింటిలో దింపి, అందరతోటి చెప్పి, సీతానగరందారి పట్టేడు. సగందూరం పోయి కొంతవరకయితేల్ని పోవుచేసుకుని, వెనక్కి మళ్లి పురింటి వెనకాలున్న తుప్పల్లో దాగుని, ఇంట్లో ఏమి జరుగుతున్నదిన్నీ కనిపెడుతున్నాడు.

మధ్యాహ్నం అవగానే చంద్రారెడ్డి గుర్రం మీద ఆర్యాపురంవరకూ వచ్చి, "సైసు"చేత గుర్రాన్ని ఇంటికి పంపేసి, కాలినడకని కాసులున్న పురింటిలో దూరేడు. ఈతంతంతా కనిపెడుతున్నాడు రంగారెడ్డి చెట్లతోపులోనుంచి. కాసులు స్వయంగానే ఎదురుగా వచ్చి చంద్రారెడ్డికి స్వాగతం ఇస్తూ తిన్నగా తనపడక గదిలోకి తీసుకెళ్లింది. అక్కడ కాసులు,

"ఈచీకపురింట్లోకి రావడానికిమీరు సంకోచించవద్దు" అంది చంద్రారెడ్డితో.

"నిర్మలమైన ప్రేమ వుంటే పురిల్లైతే నేమి?" అన్నాడు చంద్రారెడ్డి నవ్వుతూ. ఇంతలోకే వీధిలో నుంచివీరమ్మ కేక లేస్తూ వచ్చి "అయ్యో! అయ్యో! బాబు వందరుందితో ఇల్లుసోదాచేయడానికి వచ్చేరు.

లే! లే" అంది. ఈమాటలు వినడంతోటే చంద్రారెడ్డి గుండెలుబద్దలైనాయి. తన ఆఖరుమాటగా, "కాసులా! నామృత్యువు తప్పదు. కడసారి ప్రార్థన, ఒకముద్దు" అన్నాడు.

కాసులు నవ్వుతూ "భయపడవద్ద"ని అతనిరెక్క పట్టుకుని పకగదిలోకి యీడ్చుకెళ్లింది. అందులో రంగారెడ్డి తాలూకు రికార్డువున్న భోషాణం ఒకటి వుంది. ఆభోషాణంలో చంద్రారెడ్డిని కుక్కి అతని మీద రికార్డుకట్టలు కప్పేసింది. ఆహా! చంద్రారెడ్డి అవస్థ. స్త్రీవాంఛాపరుల గతి ఇంతేకదా! క్షణక్షణము ఇటువంటివారికి ఆరోగ్యపరిమాణము తగ్గుచుండడమే కాకుండా, మానము, గౌరవమునూ అసలికే శూన్యం అయిపోతాయి. అయినా చంద్రారెడ్డి అదృష్టంబాగుంది. తాను వరించిన వనిత ఇంతికీ ఉద్దండురాలు.

చంద్రారెడ్డిని భోషాణంలో దాచి, భర్తకెదురెళ్లింది కాసులు. ఆవిడని చూసి మండిపడి రంగారెడ్డి,

"ఓసీ రాక్షసీ! నీమొగుడెక్కడున్నాడే? వాడీఇంట్లోకి రావడం మేము చూసేం. ఇక నీతంత్ర గొట్టుతనం పనికిరాదు. నీఅటక నీగోముసందులా నీపిపాలు ఇక్కడెందుకూ పనికిరావు. ఇంటికి చిచ్చుపెట్టేస్తున్నాను" అన్నాడు.

"నేనేమీ ఎరగను. అనవసరంగా నన్ను తూలనాడొద్దు. మీపిచ్చికి చేతనైన పనిచేయండి. నా అభ్యంతరం లేదు" అంది కాసులు. మరింత మండిపడి రంగారెడ్డి ఇంటికి చిచ్చుపెట్టేసేడు. పొగలో ఉబుకుతోంది పురిల్లు. ఆకాశాన్ని అంటుతూన్నాయి అగ్నిజ్వాలికలు. ఇటువంటి సమయంలో చంద్రారెడ్డి స్థితి ఎలాగ వర్ణించడమో తెలియకుండా వుంది. చేసేది లేక రామ నామం పఠిస్తున్నాడు భోషాణంలోపల. దుర్మార్గులకి కాలం అయినప్పుడు, వారు తలచినపని జయప్రదంగా అవుతుంది. న్యాయమైన ప్రవర్తన వుంటే ప్రపంచంలో జీవించడం కష్టంగావుంటుంది. అందేత, అన్యాయంగా ప్రవర్తిస్తూ నలుగురితో పాటు "నారాయణా" అని ఆఖరు గుటక వెయ్యడమో, లేక, అందర్లోనూ న్యాయస్థుడై నక్షత్రాల్లో చంద్రుడై వుండడమో చెయ్యాలి ఇట్టివారు ఇప్పట్లో చాలా అరుదు. కాకపోతే, చంద్రారెడ్డి అగ్నిలో వలమలమాడక ఎలాగ బయటపడ్డాడో చూడండి. తనప్రియుడు అగ్నిలో పడి చచ్చిపోతున్నాడని తెలుసుకుంది కాసులు. కాని ఏమాత్రం చలించక, వీరమ్మని చూచి, "వీరమ్మా' నీయజమాని అనూహ్యచేత మతిపోగొట్టుకుని ఇంటికి చిచ్చుపెట్టేసేరు. ఆభోషాణంలో మన ఆస్తిపాస్తుల విషయం అంతా కాగితాల్లో వుంది. అదికూడా ఇంటితోపాటు తగలబడితే, ఆయనా నేనూ చిప్పపట్టుకుని తిరగవలసిందే. ఇప్పుడైనా పోయి మనం మోసుకొద్దాం రా" అంది.

ఆహా! ఆడది ఎంత చమత్కారి. దానివ్యూహాలు కనిపెట్టగల పురుషుడు ప్రపంచంలో వున్నాడా? ఆ యుక్తులూ, ఆ తంత్రాలూ, ఆ ఆలోచనల్లా పైవారి కుండగలవా? దీనికి తార్కాణ మన కథానాయిక కాసులే కాదూ? "భోషాణం" "రికార్డు" అనడంతోటే వులిక్కిపడి చూసేడు రంగారెడ్డి. అదికూడా ఇంటితోపాటు తగలడితే కాసులు చెప్పినట్టు చిప్పచేతి? వస్తుందనుకున్నాడు. ఇద్దరి మనుష్యులచేత భోషాణాన్ని ఇవతలకీడ్పించి మామిడితోపులో వుంది కొత్త ఇంటికి పంపేసేడు. ఇల్లంతా పూర్తిగా కాలేంతవరకు అక్కడవుండి అందులోపడి, చంద్రారెడ్డి చచ్చిపోయేడని సంతోషిస్తూ, ఇక శాంతంగా నిద్దరపోవచ్చునని, రాజమహేంద్రవరం కుటుంబంతోటి వెళ్లేడు రంగారెడ్డి

కాసులికి రంగారెడ్డి ప్రవర్తనచూస్తే, అసహ్యం, భయంకూడావేసి, పుట్టింటికెళ్లి తలితండ్రులతో మొరపెట్టుకుంటూ, అన్యాయంగా తనమీద భర్త నిందఆరోపించేడని చెప్పింది. ఇదంతా తనకూతురికి మాసిలిమొగుడ్ని కట్టినందుకు వచ్చిన గ్రహచారంఅనుకుని, గారరెడ్డి అల్లుడిదగ్గరకి కుటుంబసహితంగా వచ్చి, కాసులు చెప్పిన విషయానికి సమాధానం అడిగేడు. ఒకరోజులో ఇదంతా నిశ్చయంగా జరిగిందని ఋజువుచేస్తానని మామగారివద్ద ఇరవై నాలుగుగంటలు గడువు పుచ్చుకొన్నాడు రంగారెడ్డి. ఇందుకంతా ఒప్పుకున్నారు. అమర్నాడు

విందుకు రావలసినదిగా పున్నమ్మ అల్లుణ్ణీ కూతుర్నీ కోరింది. విందుసమయం అప్పుడే అంతా బుజావు చెయ్యడానికి నిశ్చయించేరు.

## ౧౦

యథాప్రకారంగా డాక్టరుగారు షికారుకని మ్యూజియంలోకి వెళ్లేరు. అక్కడికి వెళ్లగానే చంద్రారెడ్డి మళ్లీ సిద్ధమయ్యేడు. అతన్ని చూసి తెల్లబోయేడు తాత. "చచ్చిపోయినవా డెలాగ బ్రతికివచ్చేడో" అని ఆశ్చర్యపడ్డాడు. జాగ్రతమనిషి కనక ఇదంతా కప్పి పుచ్చి,

"ఏమయ్యా! చంద్రారెడ్డి! విశేషా లేమి"టన్నాడు. "విశేషాలంటే విశేషాలా" అంటూ కడుపు పట్టుకుని నవ్వుతున్నాడు చంద్రారెడ్డి. అతని నవ్వొక్కొక్కటి రంగారెడ్డిని బొటనవేలినుంచి దహించేస్తోంది. కాని ఏమి చేయగలడు! ముసలిముండై బ్రతికి వుండకూడ దనుకున్నాడు పాపం. చంద్రారెడ్డి నిన్న ఆర్యాపురంలో జరిగిన వుదంతం అంతా చెప్పేడు. ఆశ్చర్యంగా చూస్తూ రంగారెడ్డి,

"భోషాణంలోం చెలా తప్పించుకున్నావు" అన్నాడు.

"భోషాణానికి తాళం లేదు. పురిట్లోంచి నేనున్న భోషాణాన్ని ఇంటికి యీడ్చుకెళ్లడం గ్రహించేను. ఖాళీ భోషాణం వొదిలి వెళ్లడంతోటే, నా అంతట నేనే తలుపుతెరుచుకొచ్చే"నన్నాడు నవ్వుతూ చంద్రారెడ్డి.

ఈమాటవినడంతోటే గుండెల్లో రాయిపడినట్టయింది రంగారెడ్డిగారికి. స్త్రీఅంటే ఏమిటో గ్రహించుకుని గజగజ వణికే డాయన. "తాచుపాముని పెళ్లాడితే బాగుండేది, ఇంతవయస్సులో కాసుల్ని పెళ్లాడేకంటే" అని అనుకుని,

"అబ్బాయీ! నేనీరోజున మాఅత్తారింటికి విందు కెడుతున్నాను. నువ్వుకూడా రావడం నాకోరిక. అక్కడ నీకున్నూ డాక్టరుగారి భార్యకిన్నీ వున్న సంబంధం విషయం సంతోషంగా ముచ్చటించుకుందాం" అన్నాడు చంద్రారెడ్డితో.

"అలాగే మీమాట కడ్డుచెప్తానా" అన్నా డాయన శిష్యుడు.

అత్తవారింటి కెళ్లగానే, భావమరదుల్ని, అత్తమామల్నీ చేరదీసి చంద్రారెడ్డిని చూపించి, ఈతనే కాసుల్ని వరించేడనిన్నీ, తాను కాసులు పెనిమిటనే సంగతతనికి తెలియదనిన్నీ, యీసంగతంతరూ గుట్టుగా వుంచాలనిన్నీ చెప్తూతూ రంగారెడ్డి విందుకి కాసుల్ని రానివ్వొద్దని ఆజ్ఞాపించేడు.

అత్తమామలు చంద్రారెడ్డికి స్వాగతం ఇచ్చేరు. విందు జరుగుతోంది. అందరూ ఒకపంక్తిని కూచున్నారు. చంద్రుడొక్కడూ ఒకపక్కని కూచుని, తన ఇష్టం వచ్చినట్టూ మతిలేని వాడిలాగ, వెనకాముందు ఆలోచన లేకుండా, తనకీ కాసులికీ వున్న సంపర్కం ఆదినుంచి తుదివరకూ చెప్పేస్తున్నాడు. ఈవుదంతం వింటున్న వారి అందర్లో నవ్వులేక, భయంగా చూస్తూన్నది ఒక్కకాసులే గడిమాటునుంచి. తన గుట్టంతా తెలివి తక్కువగా చెప్పేస్తున్నాడు. అన్నీ అంకాలూ చెప్పడం అయింది. ఇంక తనకీ కాసులికీ అయినసమావేశం గురించి చెప్పబోతూ మంచినీళ్లు కావాలన్నాడు చంద్రుడు. ఇదేసమయం కనిపెట్టి, ఒకగ్లాసులో నీళ్లుపోయించి, అందులో ఒకానొకప్పుడు, అనగా, వారిరువుర మొదటి సమావేశంలోనూ చంద్రుడు తనకిచ్చిన వుంగరాన్ని పడేసి పేరమ్మచెల్లెలిచేత పంపింది కాసులు. ఇంతలోకి చంద్రుడికథ, ఆర్యాపురంలో ఇల్లుతగలపెట్టడంవరకూ వచ్చింది. నిజంగా తనని కాసులు ప్రేమించిందని నిర్ధారణచేయబోతూ, గ్లాసెత్తి నీళ్లుతాగబోతూంటే ఉంగరం కనిపించిం దతనికి. ఆశ్చర్యంతో దానివేపు చూసేడు. నాలిక కరుచుకున్నాడు. తనభావమాత్రం వెలిబెట్టలేదు. "నాదీనా యీవుంగరం! ఇక్కడి కెలా వచ్చింది!" అనుకున్నాడు. ఆలోచించేడు. గ్రహించేడు చంద్రుడు. కాసులు తన సలహాదారు పెళ్లామేనా అనుకున్నాడు. చిరునవ్వు నవ్వుకున్నాడు. "డాక్టరుగారు

రంగారెడ్డిగారేనా ? ఎంతమోసం." ఉంగరం నీళ్లతో మింగేథ తవకథ ఇంకా చెప్పుతున్నాడు. కథంతా పూర్తిచేసి, గౌరరెడ్డికేసి చూసి

"అయ్యా! ఎలాగ వుంది నేను చెప్పిన నాచరిత్ర" అన్నాడు చంద్రారెడ్డి.

"మహాఅద్భుతంగా వుంది. ఇదంతా నిజంగా జరిగిందేనా బాబూ!" అన్నాడు వణుకుతూ గౌరరెడ్డి.

చంద్రారెడ్డి.—ఏమిటయ్యా! అలాగ అవమానిస్తారు. నిజంగా ఆవిడభర్తే ఇక్కడుంటే ఆయనదగ్గర మాత్రం దాస్తానా యీసంగతి.

గౌరరెడ్డి, రంగారెడ్డి తెల్లబోయి ఒకరివంక ఒకరు చూసుకుంటున్నారు. ఎవరేమనాలో తెలియడం లేదు. అప్పుడు చంద్రారెడ్డి మళ్లీ ప్రారంభిస్తూ,

"అయ్యా! రెడ్డిగారూ, కాసులిభర్తగారు యీ రంగారెడ్డిగారే అని నేను మొదటే ఎరుగుదును. ఈయన వట్టి అమాయకులవాడున్నూ, బుద్ధిలేనివాడనిన్నీ మా వూరిలో వాడుక. ఈయనికి యీవేమక కథలన్నీ చెప్తూ, కాసులిమీద ఏవిధమైన అనుమానంనూ లేకండా ఉండేటట్టు చేద్దామని యీకథలు చెప్పుతూ, ఈయన్ని ఒక మార్గంలో పెట్టేను. అంతేకాని, నిశ్చయంగా కాసులెవరో నేనెరుగను. ఆవిడెలా వుంటుందో నేనెరగను. ఆ విడతో నేనెన్నడూ మాట్లాడ లేదు. మీరు నిజంగా ఆవిడని తీసుకువచ్చి కాసులవునా కాదా అంటేకూడా నేను పోల్చలేను. రంగారెడ్డిగారికి తలతిక్క కలగడం తాను ముసలాయన వడంచేతనూ, పెళ్లాం పడుచుదవడం చేతనున్నూ, ఇంతేకాని సత్యంగా నేనూ కాసులూకూడా నిర్దోషులం. కాని ఒకటి; ఈయన ఇప్పటి చరిత్ర ప్రపంచంలో ఒక నిదర్శనం కాగలదు; ఎలాగంటే, ఎవతై వీళ్లు నెత్తికొచ్చి, గడ్డంబలిసి, పళ్లుపూడి, శరీరంకుష్ఠించి, ఒరదులాగ బ్రతికి, ఇంకా "పెళ్లాం పెళ్లాం" అని ఏడ్చే బుద్ధిహీనులతని కథవిని పెళ్లివద్దని ఒట్టుపెట్టుకుంటారని నాపూహ." అని చెప్పుతూ చమత్కారంగా దోషం అంతా రంగారెడ్డినెత్తి నేసి తను తప్పించుకుని, కాసుల్ని అమర్యాదనుంచి తప్పించేడు చంద్రారెడ్డి.

ఈకథంతా విని, కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుతూ బావమరదులందరూ "బావా! మతాబా కాల్చేవా" అని అడిగేరు. "ఇది నాగ్రహచారం" అన్నాడు రంగారెడ్డి. అంతా నవ్వేరు. వృద్ధుడైన రంగారెడ్డి అద్భుతంగా చూసి, "ఆ! ఆ!" అంటూనే నేలమీద పడి చచ్చిపోయేడు. ఉత్తరక్రియలైనాక కాసులు రాజమహేంద్రవరం చేరి, ఆస్తికి అధికారం పుచ్చుకుంది. విధవావివాహసమాజంవారు యీవిషయసిద్ధిమీద చంద్రారెడ్డికి ఆవిడకీ కులసంబంధం కనుక్కొని, ఇద్దరికీ శాస్త్రోక్తంగా పెళ్లిచేసి సంఘాన్ని వరపించేరు.

"తేనెటీగ పువ్వునున్న తేనెనే తాగుతుందికాని, ఏనుగుతలపైనున్న చముకు పీలుస్తుందా" అంటూ కాసులు దగ్గరకెళ్లి సంతోషంగా కౌగలించుకున్నాడు చంద్రారెడ్డి.

"బుద్ధివచ్చిం"దంటూ రంగారెడ్డి ఆత్మ, పైనుంచి కేకేసినట్టు వీళ్లిద్దరూ విని నవ్వుకున్నారు "ఎవరి పువ్వు వారితలలో వుందికదా" అని సంతోషిస్తూ.

పద్మినీవిలాపము సోమంచి వాసుదేవరావు గారు

ఏకార్ణవమున శయించు శేషశయాను నాభిఁ దొలుత జన్మంబు నొంది
సర్గక్రియాకళాసంపద్ధురీణుఁడౌ నజునకుఁ బుట్టినిల్లయి తనర్చి
కలశపాథోరాశి కన్యకామణియైన రమకుఁ గ్రీడామందిరముగఁ బరఁగి
హరిహరవిధిరూపధరునకు ఖరభానునకును బ్రేమపదంబనంగ నెసఁగి
యఖిలసుమనః ప్రకాండంబునందు నెందు-ననుపమవిలాసగౌరవం బంది తుదకుఁ
దోడఁబుట్టు విరోధంబుతోడఁబుట్టు-నకట! యిట్లు కళంకితంబయ్యెఁ గాదె.

తమ్ములు నాకపాదములఁ దాచుచు మాసిరి పెంపులెల్ల మా
ధ్యమ్మున దొంగిలించుచుఁ గటా! శశిసోదరుఁడయ్యు మాయెడన్
నెమ్మి నొకించుకేనియు గణింపఁడు; సజ్జనులైనవారు దుః
ఖమ్మునఁ గూరుపట్లఁ గృపఁ గాంతురు హా! పగవారలేనియున్.

శ్రీరామామణిఁ గన్నతండ్రి యల రాజీవాక్షురంవారు శృం
గారాగారము లేమిఁగల్మి నొకవేళన్ జెంది వర్తించు గం
భీర శ్రీనిధి నూత్నరత్నములకున్ బెన్నిక్కయై పొల్చు వా
క్షీరాంభోధికిఁ బుత్రుఁడయ్యు శశి తత్కీర్తుల్ గణింపండయో.

కల్లోలినీపతి గంభీరమూర్తి రత్నాకరేంద్రునకుఁ బుత్రకుఁడనయ్యు
శ్రీసుధాకల్పక చింతామణీ సురభులకు నెన్నంగఁదోఁబుట్టువయ్యు
భావజవైరి సర్వజ్ఞుఁడౌ గిరిసుతానేతకుమౌళి మాణిక్యమయ్యు
వివిధకళాకలాపవిదుండు ననఘుఁడౌ సురదేశికునకు శిష్యుండునయ్యు
వంశమును శీలమును వన్నెవాసి సుంత-యరయు లేనట్టి చెన్నంటి యయ్యెఁ జంద్రుఁ
డీను వియోగార్తిఁ గడుఁ దపియించు సహజ-బద్మిని గలంపఁ దన కేమిఫలముగలుగు.

ఇనునికరంబులన్ బెరిగి యెంతయు శోభవహించి ధాత్రిఁ గాం
తిని మెఱయించి రాజను సుకీర్ణవినిర్మలకీర్తిసంపదన్
దనరియుఁ బాను గేవలకృతఘ్నత మిత్రవియోగతప్త ప
ద్మిని బతిదేవతన్ గలఁచు; మేలుదలంతురె రాజులెన్నఁడున్.

రా జనినంతమాత్రమున రాజగునే యఁటచంద్రుఁ డక్కటా!
భ్రాజితసర్వచక్రపరిపాలనముల్ బొనరింప దక్షుఁడో?
రాజితసర్వధర్మపరిరక్షణముల్ బొనరింప దక్షుఁడో?
తేజముమీఱ సద్వ్రతులఁ దేకువఁ బొందఁగఁ జేయ దక్షుఁడో.


రమణీరమణీయముఖో-పమసందర్భమునఁ గలిగె వైరంబలచం
ద్రమునకు మాకును దానో-డి మదిన్ గడుఁగినుకనటమటించున్ మిగులన్.

హాలహలం బుదగ్రగతి నంబుధిలో నుదయించి కీలలన్
గ్రాలుచు లోకజాలము దెగన్ దగ్రమింగఁగడంగ దానినా
ఫాలవిలోచనుం డుచితభంగిని మ్రింగి శిరోధినుంచెఁ ద
ద్ధాలహలానుజున్ శశివిధాఁ దలనుంచెఁ ద్రినేత్రసన్నిధిన్.

కారణమింత లేకయు జగమ్ములఁ దమ్ముల బాధపెట్టియేఁ
గ్రూరుఁడనాఁట రుద్రుఁడు శిరోమణి యన్మిష మెల్లమెల్లనన్
జేరఁగఁదీసి క్రొవ్వడఁగఁ జేయఁ ద్రినేత్రము పొంతనుంచె నం
చారయుఁడాశశాంకుఁ డనయంబు శిరోమణినంచు నెంచెడున్.

అదిగాకుండిన నెన్నఁడేని గురుభార్యాలోలుపస్వాంతు దు
ర్మదుఁ జేతోజహితున్ వియోగిజనధైర్యశ్రీహరున్ బద్మవై
రి దయాహీను నిశాచరున్ గిరికుమారీ భర్త సర్వజ్ఞ మూ
ర్తి దయాంభోనిధి యుత్తమాంగమున నర్థిన్ మాలిఁగాఁ బూనునే?

చిత్రసంచయము



శ్రీ మార్గరోటా యెహాన్సన్ కన్య.

(చక్కని దేహపుష్టి గలదిగ ఖ్యాతిగాంచి ఫోటోలలో ముమ్మారు ప్రథమబహుమతి పడసినది) G. S. A.



మాడెలీన్ వెయిల్డిన్ బాల.

తనతోడిబాలి సముద్రప్రయాణముల జేయుచుండుట గాంచి యీ పసిబిడ్డ అనూయతో దానును సాహసించి యొక మోటారు తొట్టి నెక్కి నీట పయనము సాగించుచున్నది.

—G. S. A.

# చిన్నప్పుడు

కపిల కాశీపతిరావుగారు, B. A.

౧

"కృష్ణా! కృష్ణా!...గోపాలా!"

"ఓయి!"

"ఇదుగో, ఇల్లారా. పొద్దుణ్ణించీ..."

"అమ్మా! నా పిల్లంగోవేదే?"

"అన్నయ్య దాచేశాడు. వాడితో నువ్వు ఆడుకోవడం లేదుటగా? వెతికి వెదికి విసిగి పోయాడు, పాపం. నీకోసం."

"పిల్లంగోవేదే?"

"ఇస్తానుగానీ, ఎక్కడకి పికారుమళ్ళీ? ఆ యేటిగట్టున తిరక్కురా, నాయనా. చెట్లు పుట్టలూ ఎక్కితే యెప్పుడే కాలు విరుగుతుందో. ఏ పురుగు అంట పొడుస్తుందో? బయటికి వెళ్ళితే మళ్ళీ తిన్నగా ఇంటికొచ్చేదాకా నా ప్రాణం కొట్టుకొంటూనే ఉంటుంది."

"రాముడేడే?"

"అన్నయ్య నాన్నతో పొలం వెళ్లేడు. నువ్వు ఏంచేస్తున్నా వక్కడ? ఇల్లారా. తలదువ్వుకోలేదు నిన్నటినుంచీను. వారం రోజులయింది తలంటుకుని."

"ఎప్పుడూ తలంటే. నాకొద్దే."

"దొంగా! దొరికావు. ఎక్కడికి వెడతా వింక?"

"తలదువ్వుకున్నానే, అమ్మా, పొద్దున్న"

"అబద్ధాలు. బండా! దువ్వేదాన్ని నాకు తెలియదురా?"

"నువ్వేనా? ఇంకెవరూ లేరా?"

"అన్నీ పెద్దకభుర్లు. ఎవరున్నార్రా? నీ మేనమామ పెళ్లాం?"

"చూడవే, నిజంగా తలకూడా అంటింది."

"ఎవరూ?"

"రాధ"

"అన్నా! దేశద్రిమ్మరీ. 'సత్రా భోజనం, మఠా నిద్రా' అన్నట్టు వాళ్లపంచలోను వీళ్ల పంచలోను బతుకుతావా దిక్కులేని పిల్లాడిలాగ! పో. అక్కడికే వెళ్లు ఆతలంటిందాన్నే అన్నం కూడా పెట్టమను? నువ్వొస్తావు తినకుండా. తిన్నావా? ఇల్లాచూడు నా కేసీ......"

"ఊఁ"

"పట్టుమని నాలుగురోజులపాటు ఇంటిపట్టున అన్నం తిన్నావూ? నాన్న దగ్గిర అన్నయ్య తిన్నాడు ఈవేళ. నీ కోసం వెన్నపూస దాచాను. రా నాదగ్గిర తిందుగాని. ఎంతసేపయుందో—ఏదీ కడుపేదీ? చూడూ పొట్టఏడుస్తోంది. రా, నాన్నగదూ. కలిపి గోరుముద్దలు పెడతాను. చెప్పినమాట వినమ్మా మరీ— వాళ్ల కృష్ణమ్మ ఉట్టి అల్లరికుంక అంటున్నారు అంతాను."

"అమ్మా!"

"ఊఁ"

"రాధ నాకు ఏమవుతుందే?"

"అత్తయ్య."

"ఏమిటే, అమ్మా, అవీ?"

"మిరపకాయలు."

"ఎందుకు అల్లా తిప్పుతావు నా చుట్టూ?"

"దేశాలన్నీ తిరిగివచ్చావు గిలగిచ్చకాయ లాగ. ఎవరికళ్లు ఎటువంటివో?"

"రాధకళ్లు బాగుంటాయే, అమ్మా! వాట్లతోటి నాకళ్లలోకి చూస్తుంది."

"చూశావా, కాస్తగొడ్డైనా లేదు పోయి లోంచి?"

"అయితే రాధచూస్తే అల్లా అవుతుందా?"

"ఏమో, ఎవరికళ్లో నువ్వింక యిల్లుకదలకూ."

"అల్లాఅనకే, అమ్మా, రాధమంచిదే. నిన్న నేను వెళ్లలేదని ఏడ్చిందే. అమ్మ కోప్పడుతుందంటేను అడిగిరమ్మందే. వెళ్లొద్దుటే, అమ్మా? ఇంకెక్కడికీ వెళ్లనే, రాధగారింటికితప్ప. నిన్న కోపంవచ్చి నేనువెళ్లలేదే. అందుకనీ అన్నం తినలేదుట."

"కోపం ఎందుకు?"

"అదికాదే, చూసిచూసి గబుక్కుని రెండు చేతులు పట్టుకని ముద్దుపెట్టుకుంటుందే. అందుకని"

"చిన్నపిల్లాడవుగదా అనిముద్దూ. నేను పెట్టుకోనూ, ఇల్లారా. ఏమిటి మొహమిమ్మాద?"

"నువ్వుపెట్టుకున్నట్టుకాదే. నువ్వుపెట్టుకుంటే చల్లగా ఉంటుందే. రాధ వేడిగా ఊపిరిసలపదే. ఉక్కిరి బిక్కిరి అవుతుందే. ఎంతసేపటికీ వదల్దు."

"పాపం! ఇంతోటి నల్లబంగారం అంటించుకుందామనీ"

"రాధ నలుపుకాదేమిటమ్మా మరీ?"

"అందుకనే రంగులో రంగుకలిసింది."

"అమ్మా!"

"ఊఁ."

"రాధని పెళ్లిచేసుకోవద్దుటే?"

"ఏడిశావు. నీకంటె పెద్దదిరా. నీకు అత్తయ్య అవుతుంది."

"అవుతే ఏం? నే పెళ్లిచేసుకుంటాను."

"అదికాదు, రేపెళ్లినప్పుడే, అత్తా! అత్తా! ఓ మంచికూతుర్ని కని నాకిమ్మని అడుగు"

"ఇద్దర్నీ చేసుకుంటాగా."

"ఓరి నీఅఘాయిత్యం కూలా! ఎవరిదగ్గిర నేర్చుకున్నావురా ఈ పనికిమాలిన మాటలూ? పుట్టేకొన్నీ, పుట్టకకొన్నీ విపరీతపుబుద్ధులు..."

౨

"అత్తా! అత్తా!"

"..........."

"రాధా!"

"ఓయి."

"ఎంతపిల్చినా పల్కవేం? ఎక్కడ"

"దొడ్లో; ఇల్లా; పాకలో; అల్లరి చెయ్యకు మెల్లిగా రా."

"ఏం?"

"ఆవు బెదురుతుంది మాట్లాడితే ఎగచేపుతుంది"

"నువ్వో మరి?"

"నాదగ్గిరంటే అలవాటు. అదుగో చూడు. అప్పుడే అడుగు లేస్తోంది అమ్మవారు. అల్లా కూచో కొబ్బరిచెట్టుకింద."

"మాఅమ్మ రోటిమీద కూచోవద్దంది."

"రోళ్లు ఎక్కమందా? దొంగతనాలు చెయ్యడానికి.........అదుగో అదే వొద్దన్నది. జడ నెప్పిపెడుతోంది. అయ్యో! అయ్యో! పడిపోతాను. పాలొలికిపోతాయి."

"ఇల్లా ఇవ్వు, నాపొట్టలో వలకపోస్తాను."

"పూర్తిగా పితకనీ, నీకోసమే. కూచో మరీ ఒక్క నిమిషం......పోదూ, అంతా మోట సరసం. అయింది లే నా కేం. ఆవు బందం తెంపుకుంది ఇంకోగుక్కెడైనా ఇవ్వదు ...... ఇదుగో పిల్లంగోరు ఊదు, నుంచుంటుంది."

"అమ్మదొంగా, తెలిసిందిలే నీ వేషం. నువ్వు కూడా వినడానికి కాదూ? ఊరికే అడిగితే పాడవని"

"అయితే నేపాలివ్వను."

"బలవంతంగా తాగుతాను."

"చూద్దాం."

"................................"

"అత్తయ్యోయి! నీకుదణ్ణం, నీకుదణ్ణం, విడిచిపెట్టవూ?... బాబోయి, బాబోయి, ఊపిరి సలపడంలేదు. అత్తా! అత్తోయి!"

"అదేవొద్దన్నది. అత్తేంవిటి? అత్త. రాధ అనరాదూ. శుభ్రమైనపేరుంటే? అత్తట. అత్త."

"రాధోయి! రాధోయి! రాధోయి! రాధోయి!"

"తాగు. ఎల్లా తాగుతావో? పాలు...తప్పించుకుందా మనుకున్నావేం? ఇందుకే ఈ ఎత్తు. తెలిసిందా?"

"ఇంక చెయ్యను విడిచిపెట్టవు?"

"ఏమిస్తావు?"

"చాల్దేంవిటమ్మా? అన్నిమాట్లు పెట్టుకున్నావు, ఇంకెంత సేపు?"

"అయితే ఖయిదువిడుదలలేదు."

"సరే. ఇంకోమాటు. ఏం?"

"కాదు ముఖ్యంగా మూడుమాట్లు."

"ఊం......ఊం—ఒకటీ......రెండూ. పెట్టుకో దబ్బుని."

"నాయిష్టంవచ్చినప్పుడు పెట్టుకుంటాను, నీకెందుకు? అది దాచుకుంటాను. మొన్నటిదొకటి—ఇదొకటి రెండుముద్దులు బాకీ. తెలిసిందా?"

"సరే. విడిచిపెట్టు మరి."

"అప్పుడే అయిపోలేదు. ఇంకాఉంది."

"అబ్బా! విడిచిపెట్టమంటే. వేడిగా ఎర్రగా కళ్లా నువ్వూను. బాగున్నావులే."

"అందుకనే చల్లబడడానికే."

"ఈవేళ విడిచిపెట్టవా?"

"వేణువుమీద పాడతావా మరి?"

"నువ్విల్లాపట్టుకుంటే ఎల్లా పాడతాను?"

"విడిచిపెట్టినతరవాత పాడకపోతే?"

"నీయిష్టంవచ్చినన్ని ముద్దులుపెట్టుకో."

"ఇల్లా కూచునేపాడాలి మరి"

"నీవొళ్లోనా? నన్ను ముట్టుకోకుండాఉంటే."

"సరే."

... ... ... ... ...



"కృష్ణా! ముద్దుకృష్ణా! మురళీకృష్ణా! ఎవరు నేర్పారు నీ కీసంగీతం? పాట ఇంత బాగుందని నీకు తెలుసా కృష్ణా? మాట్లాడవేం? వినబడడం లేదూ? యక్షగానమా? కిన్నర గానమో యీ యిది? కృష్ణా, నీరాధని మింగేస్తోంది నీ పిల్లంగోరు. రాధని పట్టుకోవూ?"

"......................................."

"యమునానదికిమల్లె నాశరీరం వరదలై పారుతోంది, కృష్ణా కట్టెయ్యవూ? ఈ స్రవంతిని నీ చేతుల్లో...కృష్ణా...చూడు. నిజంగా. ఇప్పుడు వేడిగాలేను."

"..................................."

అదేమిటి, రాధా, అల్లా ఏడుస్తావెందుకు పిచ్చిదానిలాగ, కళ్లమ్మట నీళ్లు చూసుకో—ఎందుకు అల్లా చూస్తావు?"

"కాదుకృష్ణా, ఏడుపుకాదు."

"అదుగో కళ్లమ్మట నీళ్లూ నువ్వా ఏడవడంలేదూ? ఏడవకు, రాధా. నాకూ—డా ఏడుపొస్తుంది."

"ఎందుకు?"

"నువ్వేడుస్తే నాకూవొస్తుంది."

"నేను నవ్వితే"

"నాకునూ."

"నిజంగా? కృష్ణా! నిజంగా? నేనేడిస్తే నీ కేడుపొస్తుందా? అయితే నేనంటే యిష్టమేనా నీకు?

"ఊఁ"

"మరి నేనల్లాచేస్తే కేకలేస్తా వెందుకు?"

"ఊరికేనే. మరినువుచేస్తున్నావుగా నే కేకలేసినా? కేకలేస్తే కోపమూ? బాగుండదూ?"

"అదికాదు. నీకిష్టంలేదేమో అని"

"ఎందుకురాధా అల్లా కళ్లమ్మటనీళ్లు? కోపం వచ్చిందా ఇందాకా కేకలేశానని?"

"కాదు."

"మరి ఎందుకు?"

"నువ్వు వెళ్లిపోతావని"

"ఏడవకురాధా. నేవెళ్లను. ఎప్పుడూ ఇక్కడే ఉంటాను."

"ఏదీ మామయ్య రమ్మన్నాట్టగా మధురలో ఉండటానికి? అక్కడ రాజభవనంలో ఉండి నన్ను మర్చిపోతావేమో అని"

"రోజూ ఇక్కడికొస్తాను రాధా. ఏరుదాటి చెప్పకుండా వస్తాను. ఏం? ఏడవకింక. పోనీ నువ్వుకూడా రా ఎక్కడికెడితే అక్కడికి"

"ఎల్లాగా?"

"పెద్దాణ్ని అయాక నిన్ను పెళ్లి చేసుకుంటాగా.

"అందుకనే నువ్వు పెద్దవాడివయిపోతావని"

"అయితేయేం? నిన్ను పెళ్లి చేసుకుంటాగా? అప్పుడు మనిద్దరం ఉండొచ్చు ఎంచక్కా ఏం?"

"ఒద్దు. నువ్వు ఇల్లాగే ఉండాలి, కృష్ణా. ఎప్పుడూ ఇంతే. పాలు తాగుతూ, ఇక్కడే, నీ మురళీ నువ్వు, ఇదే మోస్తరుగా ఉండాలి. పెద్దవాళ్లయితే ఏంబాగుంటారు? పెద్దాళ్లయితే అసహ్యంగా ఉంటారు. కృష్ణా! అదేమిటో అంతా పెద్దాళ్లని పెళ్లి చేసుకుంటారు? నా చిన్నికృష్ణుణ్ణి చేసుకోకూడదూ, కృష్ణా! ముద్దుకృష్ణా! రాధాకృష్ణా!"

"మరెల్లాగ, అల్లాగే ఉన్నాననుకో. నీ కెప్పుడూ ఇల్లాగే కనబడతాను."

"కృష్ణా!"

"ఎందుకల్లా చూస్తావు?"

"తనివితీరదు, కృష్ణా! నీకునేను బాగుండను?"

"ఏం?"

"మరినాకేసి నువ్వల్లా చూడవేం?"

"ఎప్పుడునువ్వే చూస్తావుగా. నన్ను చూడనివ్వందే."

"చూసి ఏంచేస్తాను?"

"గట్టిగాపట్టుకుని ఊపిరిసలపకుండా ముద్దుపెట్టుకుంటావు. వేడిగా ఊపిరీ నువ్వూను"

"నువుకూడా అల్లాచెయ్యి. ఇంక నిన్నుకూడా చూడనిస్తాను. చూడు, కృష్ణా! నాకేసి, నీయిష్టం. నీకిచ్చేశాను నన్ను. రాధ నీదే. ఏంచేసినానరే దీనితోటి...ఇప్పుడే కావాలా?"

"ఊఁ."

# మద్యపానము : మనపూర్వులమతము

శీరిపి ఆంజనేయులుగారు

త్రావి త్రావి, పయింబయిఁ ద్రావి, ధరణి
మత్తునందూలిపడుచు, సొమ్మగొని లేచి,
మరలఁ ద్రావిన జన్మంబె మాయు[1] ననెడు,
ఖలుల పల్కులుఁ గల్లఁగాఁ దలఁపవలయు.

[2]ఎవఁడు మాంసభోజనము వర్జించి, యెపుడు
శుద్ధసాత్వికాహారము శుద్ధజలము
నెంచి, పక్వమ్మునర్చి సేవింపఁగనునో,
యాతఁడే మానవశ్రేష్ఠుఁ డనఁదనర్చు.

[3]బలియు నాహారశుద్ధిచే భావశుద్ధి;
భావసంశుద్ధి సుస్థిరప్రజ్ఞ వెలయుఁ;
గనుక నన్నపానముల మేల్మినిఁ దలంచి
విడువవలయు సురాపానవృత్తి నరుఁడు.

అసురభావమ్ముచేత మోహాన్వితాత్ము
యగుచు, నీచవ్రతమ్ముల మిగులఁదవిలి
మద్యమాంసాదులనుగొను మనుజవితతి
చెడుగతిం జరించునని [4]గీతనుడువుఁగాదె?

[5]ఎవఁడు, తనయింతి సుర సేవఁదవులఁగనునో
యాతఁ డాచారసంశీలుఁడయ్యుఁ, బతితుఁ
డగును, దనమేన సగముపా లఘవిశిష్ట
మగుడు, మిగులుభాగము శుద్ధమగు నదెట్లు?

[6]భూసురుఁడు కలుద్రావ, సముద్రగామి
యగు, నదీతీరమందుఁ జాంద్రాయణంపు
వ్రతము సల్పి, యిడునది సత్రంబు విప్ర
తతికి, గోమిథునంబు సద్బ్రాహ్మణునకు.

మద్యపానమ్ము, రుజయు, నున్మత్తవృత్తి,
పరవశత్వమ్ము, జరయును బాల్యదశయుఁ
జెందు నరుతోడి తగవెందుఁ జెల్లదంచు,
మును వచియింపఁడే జగమనువు [7]మనువు.

కడచు పంచమహాపాతకములు, నొకట
మలయుఁ ద్రాగుడు చేనంచు [8]మనువు పల్కె,
కల్లు నెఱచిని గొను నీచకార్యపరుని
మాలవలెఁ దోలునదియనె [9]హాని యొకఁడు

[10]సత్యమడుగంటు మధుపానసరణి కతనఁ,
గరుణ పొలివోవు మాంసభక్షణమువలన,
గరిమనశియించు నతిచార కారణమున
నంచు ఘోషించు వాక్యసంచయము వినము?

---

1. కాళిందీ గ్రంథ తంత్రము.
2. ఋగ్వేదము-మండ: ౧-అష్టక: ౨-సూక్త: ౧౬౩-మంత్ర: ౧౫
3. ఛాందోగ్యోపనిషత్తు.
4. భగవద్గీత-అధ్యా: ౧౬-శ్లో: ౧౦.
5. పరాశరస్మృతి-అధ్యా: ౧౧-శ్లో: ౨౬.
6. పరాశరస్మృతి- అధ్యా: ౧౨-శ్లో: ౭౫.
7. మనుస్మృతి-అధ్యా: ౧౧-శ్లో: ౧౬౩.
8. మనుస్మృతి ,, ,,
9. పరాశరుఁడు. చూడు, పరాశరస్మృతి అధ్యా: ౧౧-శ్లో: ౧౬౩.
10. "మద్యపస్య కుతస్సత్యం దయా మాంసాశినః కుతః"

మద్యమాంసాదులను గొనమరగి, దుష్ట
చరితుఁ డగువాని చెల్మి దోష మ్మటంచుఁ,
దొలిఁ [11]కణాదయతీంద్రుండు తెలియఁ బలికె
మదిర మన్నపు మలముగా [12]మనువు చాటె.

మద్యపాయి సర్వస్వనాశ మంటఁగల్పి,
తల్లిపిల్ల భావమ్మును దలఁపఁబోక,
ప్రాణిహింసారతుండయి పరఁగు నెందు
నంచు, మాణిక్యమాల శాసించుఁగనుము.

[13]వికలభావమ్ము పొరగుట, వెడఁగుపాటు,
జల్పనమ్ములు సల్పుట, చలనమాది
నన్ని పాతసంపూర్ణలక్షణములందు,
మానవుండు సురాపానమహిమవలన.

వైరూప్యమును జెందు వ్యాధిబాధలఁ గుందు
స్వజనులచేఁ బరిభవముఁబొందు
కార్యమ్ముపట్టునఁ గాలమ్ము నడలుచు
నెల్లరపగకుఁ దా నిక్కయగుచు
జ్ఞానమ్ముకోల్పోవు జ్ఞాపకశక్తియు
ధైర్యమ్ము నంతకంతకును బాయు
సజ్జనసాంగత్యసల్లాపములు రోయు
క్రూరులనీచుల కొలువుసేయు
భవ్యధర్మకామార్థసంపదలఁ ద్రోయుఁ,
బతితుఁడగుఁ గులమందు, సద్గతుల డిందు
నంచు, బానప్రియునిగూర్చి యార్యవరులు
[14]నుడివి రదిగాన మధుపాన ముడుగఁదగును.

నయనముల గిఱ్ఱునంద్రిప్ప, నాల్కయందుఁ
దత్తఱఁ జనింపఁజేసెడు, నుత్తకేస
మునకుఁ దుల్యము మధుపాన మనుచుఁజాటెఁ,
గాళిదాసుఁడు, భువనవిఖ్యాతయశుఁడు.

అరయ, మాంసమ్ము మద్యసు రాసవములు
యక్షరక్షఃపిశాచాళికైన [15]వనుట,
జ్ఞానవిదు లాడినట్టి వాక్యమ్ముగాన
మనుజఁ డిదిగని పెరఁచి మాను టొప్పు.

[16]త్రాగుడది యగ్గలంబు పాతకములందు
క్షితి హిరణ్యాదిదానసంగతుల నైన
జీవములువాయు ప్రతికృతి చేతనైనఁ
దఱుగ దద్దాని మనుజుండు దవులఁ జనదు.

[17]కల్లు గడు నగ్నివర్ణంబుగాఁగఁ గాచి
పాన మొనరింప, ననలంబులోన నుఱుక,
అలవుమై మహాప్రస్థాన మాచరింపఁ,
బాయునన్నదు సురద్రావిన పాతకంబు.

మధువుతోఁ దెచ్చు వస్తువెట్టిదియుఁ గొనఁగఁ
జోల [18]దన, హాలముంగ్రోల మేలె? వినుము
మరణ మందిన నేకాని మద్యపాయి
శుద్ధిఁ బొందఁ డటం[19]చార్య సూక్తి దెల్పు.

11. వైశేషిక-అధ్యా: ౬-ఆహ్ని: ౧-సూత్ర: ౭. ౨.
12. మనుస్మృతి-అధ్యా: ౧౧.
13. "వైకల్యం ధరణీపాత మయథోచిత జల్పనమ్..."
14. "వైరూప్యం వ్యాధిపీడా స్వజనపరిభవః కార్యకాలాతిపాతో విద్వేషో జ్ఞాననాశః, స్మృతిమతిహరణం విప్రయోగశ్చ సద్భిః, పారుష్యం నీచసేవా కులబలదలనం ధర్మకామార్థహానిః, కష్టంభో షోడశైతే నిరుపచయకరా మద్యపానస్య దోషాః"
15. "యక్షరక్షః పిశాచాన్నం మద్యంమాంససురాసవమ్."
16. భారతము-ఈభావమే పరాశరస్మృతి-అధ్యా: ౧౨-శ్లో: ౭౬వ జూడు.
17. ,, శాంతి-అశ్వా: ౧-పద్య: ౩౦౭
18. ,, ,, ,, ,, ,, ౩౭౨.
19. యాజ్ఞవల్క్యుఁడు.

[20] ఐహికములగుఁ బాపకృత్యమ్ములందు
మేదురంబగునది సురాస్వాదనంబు
గాన, నీమదిరాకాంత మానకున్న
జగము కడుమానహీనమై వగలఁ బొగులు.

[21] పూని మెటులేని మధుసేవ మాను టొప్ప
నెల్ల వర్ణజులకు; దాన నెసఁగుఁ గీర్తి
వైభవశ్రీలు; పుణ్యజీవనము నబ్బు
నంచుఁ, గాత్యాయినికి శివుఁ డాన తిచ్చె.

[22] మద్యభాండంపుఁ గంపు సామమునఁబోదు;
[23] మనసుకొంఅగాదు కల్లుద్రావ; [24] మాలదైవ
ములను సుంకయి పూజింప ముక్తిలేదు
సిద్ధ; మని వేమకవి నిర్వదించెఁగాదె?

[25] కానిపనులకెల్ల సుర కారణంబు,
[26] మిగుఁ ద్రావినపురుషునిఁ జేరఁదగదు,
తత్తసి మాటాడఁజనదు, మద్యమ్ము విడుచు
టొప్పటంచును వేమన చెప్పలేదె?

కల్లుభంగిసారాయము లెల్ల, దేహ
పరవశత్వమ్మునకె యంచు, [27] బ్రహ్మయోగి
పలికె; నథ కనర్హము మద్యపాన మనుచు,
నారసింహయోగీంద్రుండు కేరియాడె.

మద్యపానదుష్కృతము ధర్మజ్ఞులెల్ల
రిట్లు వేనోళ్ల ఘోషించు టెట్లెగిమెట్లెగి,
యాదురభ్యాసచితి కెరయుగుచు, నెప్డు
మానవుఁడు శలభక్రియ మ్రగ్గఁదగదు.

---

## మా చందాదారులకు

మా కార్యాలయమునకు వ్రాయు ఉత్తరములు మొదలయినవానియందు తమ 'చందా దారు' సంఖ్య వ్రాయవలెను. లేకున్న ప్రత్యుత్తరములు మొదలయిన పనులను జరుపజాలము. చందాదారుసంఖ్య భారతి కవరుకాగితముపై తమ విలాసమునకు ముందున్నది. చందా దారులకు భారతి ౧౦-వ తేది లోపల అందకపోయిన యెడల వెంటనే తపాలువారికిని, మా కార్యాలయమునకును తెలుప గోరెదము.


మేనేజరు,—'భా ర తి.'

---

20. భారతము "అనుశాసనిక-ఆశ్వా: ౫-పద్య: ౧౩౪-౧౩౫.
21. ,, ,, ,, ,, ,, ౧౩౬
22. వేమనపద్యములు (వావిళ్లవారిది) పద్య ౪౧౫.
23. ,, ,, ,, ౨౨౦౯.
24. ,, ,, ,, ౭౯౬.
25. ,, ,, ,, ౨౨౦౯.
26. ,, ,, ,, ౪౨౪.
27. శ్రీ పోతులూరి వీరబ్రహ్మము.



## పిట్ట కథలు



# వింతసాక్షి

### ముద్దా విశ్వనాథంగారు.

అనగా వినగా చెప్పగా చేయగా — ఒక ఊళ్లో ఒకజమీందారు. భూస్వామి. అది వసంత ఋతువు. ఆసంవత్సరం వారి అంటు మామిడితోట పుష్కలంగా ఫలించింది. సంతోషంతోటి మాంచిరకాలు ఏరి, రెండు బుంగలనిండా నింపి, ఒక కావటివాడిని పురమాయించి, ఉత్తరం ఇచ్చి జాగ్రత్తగా యిచ్చి రమ్మని ఈపళ్లు అల్లుడుగారి ఊరు పంపినాడు.

కూలివాడు ఉత్తరం బొడ్డున దోపుకొన్నాడు, కావడి వేసుకు బయల్దేరాడు. మధ్య దార్లోకి వచ్చేటప్పటికి మట్టమధ్యాహ్నమయింది. అంచేత, ఒకచెట్టునీడను కావడి దింపుకున్నాడు, విశ్రాంతి తీసుకుందామని. వాడు కూర్చోనేటప్పటికి ఒకఆలోచన తట్టింది. "ఇన్నోటిపళ్లున్నాయిగదా! నాలుగు తినేశి, ఆచెరువులో గుక్కెడు మంచినీళ్లు తాగేస్తే ఈపూటకు మొత్త తీరిపోతుంది. బత్తెకర్చు మిగుల్చుకోవచ్చు" అని ఎత్తుగక వేశాడు. చుట్టుపక్కల ఎవళ్లూ లేకుండాచూసి, తలుచుకొన్నపని కానిచ్చాడు.

సాయంత్రానికి కూలివాడు యజమాని అల్లుడుగారి ఊరు చేరాడు, పళ్లూ ఉత్తరం

వప్పగించాడు. అల్లుడుగారు ఉత్తరం చూసుకొని, పళ్లు లెక్కట్టించుకుని, "ఏమిరా, అబ్బాయీ! నాల్గుపళ్లు తక్కువున్నాయేం?" అని అడిగాడు. "బాబ్బాబూ! వాస్తవమేనండి నాలుగుపళ్లు తిన్నమాట. ఆకలికి ఆగలేక పోయానండి. మీకెవరు చెప్పారు, బాబూ! ఈ సంగతి?" అన్నాడు. "వెధవా! ఉత్తరంలో ఉందిగాదుట్రా?" అంటూ, పోనీ ఏమిటి, ఈ స్వల్పవిషయంలో గట్టిగా అడిగేదేమి టని, మరేమీ అనకుండా వారూ ఊరుకున్నారు. అక్కడి కేసో అయిపోయింది.

మళ్లొక్క పదిహేనురోజులకి జమీందారు ఇంకోదఫా పళ్లు సిద్ధపరిచి, నమ్మకమైన వాడుకదా అని, మునుపటివాడిచేతనే కావడి వేయించి, ఉత్తరంకూడాయిచ్చి మళ్లా పంపించారు. మధ్యదార్లోకి వచ్చేటప్పటికి కూలివాడికి పూర్వంలాగునే దురుద్దేశం కలిగింది. ఈసారిఒకయుక్తి ఆలోచించాడు: "క్రిందటి మారు నేను పళ్లుతిన్నప్పుడు ఎవ్వరూ చూడలేదు. కాని ఈ వెధవఉత్తరం చూసి చెప్పింది. అంచేత దీనికంటబడకుండా తినెయ్యాలి" అనుకొని ఒక చిన్నగొయ్యితీసి ఆఉత్తరం దాన్లో కప్పెట్టి, మామూలుగా పళ్లుతినేశాడు. తరువాత లేచి వెళ్లబోయేటప్పుడు పైకి తీశాడు, ఉత్తరం. ఊరుచేరుకున్నాడు. కావడిదింపాడు, ఉత్తరం ఇచ్చాడు.

అల్లుడుగారు ఉత్తరం చూసుకుని, పళ్లు లెక్కపెట్టించినారు. ఈసారికూడా తక్కువే వచ్చాయి, పళ్లు. కూలివాడి నడిగేటప్పటికి, వాడు భిడియపడుతూ ఇలా గన్నాడు:— "బాబూ! నీ తల్లికడుమ్మాడ, క్రిందటి మారు ఈ వెధవ ఉత్తరం చూసి చెప్పింది గదా అని దీన్నికప్పెట్టి మరీ తిన్నానండి, పళ్లు. మహాచెడ్డ జంతువండిఇది. రక్షించండి, బాబూ! ప్రభువులు."


కూలివాడి అమాయికపు యుక్తికి ఇంటిల్లిపాతీ, కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుకుని, "పోనీలే వెఱ్ఱివెధవా! ముందెప్పుడూ మాత్రం ఇల్లాంటిపన్లు చేయకేం?" అని మందలించారు. కూలివాడు తిరిగి వాళ్లింటికి పోయాడు. మనం మనింటికి వచ్చాము.



# మేకపోతు గాంభీర్యము

వారణాశి నరసింహశాస్త్రిగారు

ఒక గొల్లవానికి కొన్ని మేక లుండినవి. అనుదినము వాడు వానిని అడవికి తోలుకొని పోయి మేపుకొనుచుండెడువాడు.



అనుదినము.........మేపుకొనుచుండెడివాడు

ఒకనాడు ఒక మేకపోతు గుంపుననుండి తప్పిపోయినది. రాత్రిఅయినది. నాడు మంచి వానకూడ కురిసినది. వానకు బాగుగతడిసి ఆమేకపోతు చలికి వణకుచు ఒక కొండగుహ లోనికి పోయి పండుకొనినది.

మఱికొంతసేపటికి ఒక సింహము కూడ వానకు తడిసి చలికి వణకుచు మేకపోతున్న గుహలోనికి వచ్చినది. అక్కడనే పండుకొని ఉన్న మేకపోతు కన్నుల జిగిని, దాని పొడవయిన గుబురుగడ్డమును జూచి కొంచెము భయపడినది. 'ఇదయేదో వింత జంతువుగా ఉంది. నే నెప్పుడు ఇటువంటిదానిని చూడలేదు' అని అనుకొనుచు వెనకముందుల కడుగులు వైచుచు జంకి నిలుచుండినది. మేకపోతుకును సింహమును చూడగనే ప్రాణములు పోయినట్లయినది. అట్లే రాత్రిగడచినది. తెల్లవారుజామున మునిమునిచీకటిలోనే సింహము వెనుక వెనుకకునడచి గుహ వెలుపలికి వచ్చినది.

మేకపోతు సింహము జంకుట కనిపట్టి తానును బయటకు వచ్చినది. కొంచెము తెగువ తెచ్చుకొని 'నీ వెవరు' అని సింహము



'నీ వెవరు' అని సింహము నడిగినది.

నడిగినది. సింహము 'అయ్యా, నేను మృగ రాజు నగుసింహమును' అని చెప్పి 'తా మెవరు?' అని మేకపోతును అడిగినది.


'ఓహో, నీవు సింహమవా, ఇప్పటికి నేను వేయి మదపుటేనుగులను, నూరు పెద్ద పులులను చంపి తింటిని. ఒక్కసింహ మయిన నాకు దొరకినది కాదు. సింహమును చంపి తినువఱకు గడ్డమును గొరగ వని దీక్షను పట్టితిని. నా అదృష్టవశమున నేడు నీవు దొరకితివి. నిన్ను చంపి, తిని, నా దాడి పీడను వదలించుకొందును' అని తలను ఊపుచు ముందఱి కొక్కడుగును వైచినది. అదిచూచి భయపడి సింహము 'చచ్చితిని దేవుడా' అని పరువెత్తి



సింహము 'చచ్చితిని దేవుడా' అని పరువెత్తిపోయినది.

పోయినది. మేకపోతు నాడు అడవికి మేతకు వచ్చిన గుంపులోఁజేరి సాయంకాలము ఇంటికి బోయినది.

---




ఒక ఊళ్ళో ఒక పండితు డుండేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు, ఒక కూతురు నూను. కొడుకులంతా చాలా గొప్పపండితులు. ఆయన కూతురికి కూడా చిన్నప్పటి నుంచి సంస్కృతం చెప్పించాడు. ఆ అమ్మాయికీ మంచి సాహిత్యం కుదిరింది. ఒక్కతే కూతు రవటంచేత తండ్రి చాలా గొప్ప ఆస్తి ఉన్నవారి పిల్లవాని కిచ్చి ఆ అమ్మాయికి పెళ్లిచేసాడు. ఆ అల్లుడు చాలా రూపసే, కాని చదువు మాత్రం అంటింది కాదు.

కూతురుమాత్రం పెద్దమని పయ్యేటప్పటికి విద్వాంసురా లయింది. ఈలా ఉండగా కార్యం చేసారు. ఆ అమ్మాయికి మగడు చదువుకోలేదని, తానే చదువుకున్నా నని చాలా గర్వంగా ఉంది. గర్భాదానపు గదిలోనికి రావటంతోటే ఒక సంస్కృతశ్లోకం చదివి మొగుణ్ణి ఎత్తిపొడిచింది. 'నీవు చూడటానికి చాలా అందంగానే ఉన్నావు గాని విద్య లేకపోవటంచేత మోదుగపువ్వులాగే నీవు శోభించటం లే' దని. ఆ మాట లతని కర్థ మయ్యాయి. ఆ ఎత్తిపొడుపు చాలా బాధ కలుగజేయటంచేత ఆవేళ అర్థరాత్రి ఎవరితోటి చెప్పకుండా లేచి చక్కాపోయాడు. తిన్నగా కాశీకివెళ్లి అక్కడ చదువు ప్రారంభించాడు.

తెల్లవారిన తరువాత ఆ అమ్మాయి ఇవతలకు వచ్చింది. అల్లుడు లేకపోవటంతోటే అంతా కంగారుపడ్డారు. ఆ అమ్మాయిని 'యెక్కడకు వెళ్లాడో నీకేమైనా తెలుసునా' అన్నారు. 'నాకు తెలియ' దంది. రాత్రి తాను చేసిన గమ్మత్తుమాత్రం చెప్పిందికాదు. ఏ మొగము పెట్టుకొని చెప్పుతుంది? అల్లుడు మాత్రం ఎక్కడా కనబడలేదు. ఒక యేడుపు యేడిచి ఊరుకున్నారు. ఈలా ఉండగా అల్లుడు వెళ్లిపోయి పన్నెండేళ్ళు గడచిపోయాయి. అదివరదాకా 'యెప్పుడైనా తిరిగి వస్తాడేమో' అనుకునేవారు. అప్పటికి ఆ ఆశ కూడా పోయింది. 'చచ్చిపోయా' డనుకుని కర్మంతా చేసారు. ఆ అమ్మాయికి శాస్త్రోక్తంగా ముండనం చేయించి ముసుగుపెట్టి మూల కూర్చుండబెట్టారు. ఇదంతా తన తెలివి తక్కువవల్ల వచ్చిందేకదా అని యేడుస్తూ ఆ అమ్మాయి, ఇంట్లో అందఱకు వండి పెడుతూ వంటింట్లో కాలంపుచ్చుతూ వుండేది.

కాశివెళ్లిన అల్లుడు అన్నిశాస్త్రాలు చక్కగా చదువుకున్నాడు. చాలా గొప్పపండితు డనిపించుకున్నాడు. 'ఈసారి యేమాత్రం ఆక్షేపిస్తుందో నాభార్య చూద్దా' మనుకుంటూ ఇంటికి బయలుదేరాడు. త్రోవలో ఎక్కడ చూచినా ఆయన్ని మర్యాద చెయ్యనివారే లేరు. ఈలా ప్రయాణంచేస్తూ తనమామగారి ఊరు వచ్చాడు. తాను ఫలాన అని ఎవరికి తెలియనివ్వలేదు. తనభార్యకు జరిగిన గారవమంతా ముందే తెలుసుకున్నాడు. తగిన శాస్తిఅయిం దనుకున్నాడు. పండితుడవటంచేత ఈయన్ని మామగారింటి కాహ్వానించా రావేళ. 'సరే' నన్నాడు. వెళ్లి భోజనం చేస్తున్నాడు. ఆరోజున మామూలుప్రకారం వంట వడ్డన అంతా ఆ అమ్మాయే చేసింది. పండితుడు భోజనంచేస్తూ ఎల్లాగా ఆ అమ్మాయిని ఎత్తిపొడవటం అని చూస్తున్నాడు. ఏ పదార్థంలోను రుచిలోపం లేదు. ఇంతట్లోకే ఆ అమ్మాయి చారువడ్డించింది. చారులో మాత్రం పని తొందరలో ఉప్పువెయ్యడం మఱచిపోయింది. అదను చిక్కిందిగదా అని ఆ పండితుడు ఆ అమ్మాయిని ఒక సంస్కృత శ్లోకం చదివి ఆక్షేపించాడు. ఏమనంటే, "ఇంగువ జీలకర్ర అవి వేయటంచేత చారు

చాలా బాగానే ఉంది కాని ఉప్పు లేకపోవటం చేత మోదుగపువ్వులా శోభించటం లేదని. ఇది వినటంతోనే తాను పూర్వము మొగుణ్ణి రహస్యంగా ఎత్తిపొడవటం ఆ అమ్మాయికి జ్ఞాపకం వచ్చింది. ఇతడే తనమగడని తెలిసి లోని లోపలికి వెళ్లిపోయింది. ఏడుస్తూ వంటింట్లో కూర్చుంది. తండ్రికి, అన్నగార్లకి ఇది విపరీతంగా తోచింది. సంగతి కనుక్కోరమ్మని తల్లిని ఆ అమ్మాయిదగ్గరకు పంపించారు. క్రమంగా సంగతంతా తెలిసింది. పండితుడు తమ అల్లుడని తెలిసి జరిగినదానికి చాలా నొచ్చుకున్నారు. ఆయన తెలివితేటలకు చాలా సంతోషించి తగినట్లుగా గౌరవించారు ఈసారి. అల్లుడు మంచివాడవటంచేత, ఆ అమ్మాయిని, మళ్లీ మామూలు వేషంలోకి తీసుకువచ్చాక కార్యం చేసుకొని ఇంటికి తీసుకువెళ్లాడు.

---

## పిల్లల పాటలు

గోపరాజు రాజన్నగారు సేకరించినవి



మాణమ్మనవ్వులూ మంచి ముత్యాలు
సుగుణమ్మ చూపులూ చుక్కల్ల పొదుపు
మాణమ్మ సుగుణమ్మ మాకు నీడల్లు
సుగుణమేమణిగాద ఎంచి చూడంగ.



చిట్టి చిట్టి చిలుక
చిన్నారి చిలుక
మాటలాడే చిలుక
మా బావ చిలుక
పండు తెచ్చే చిలుక
మాపచ్చ చిలుక
చుట్టాలొస్తే చిలుక
పలుకరించే చిలుక
తోటలో వుండే చిలుక
'తోటకూర' చిలుక.



తల్లికంటె వేఱు దైవం
ఇలను లేను ఎంచిచూడ
తల్లిగాదు మనలనెపుడు
పాలు ఇచ్చి పెంచునుండు
ఎందుగానీ ఏమిగానీ
తల్లిమనకూ శ్రీవజాపు
మాతృపూజా మనకు మేలు
మాతృసేవా మనకు చాలు.

---

# పిల్లలపాటలు

యం. వి. పాపన్నగుప్త గారు సేకరించినవి

౧

అచ్చక్క బుచ్చక్క తవుడు
　తవుళ్లో రాగింజ దారం
దారం యెత్తకపొయ్యి సాలయ్యకిస్తి
సాలయ్య పుణ్యాన బొంత నేయిచ్చె
బొంతకట్టుకోని సంతకుబోతి
సంతాలో మా రాజు సప్పిరకుట్ట

౨

పూగాడు చెట్లల్లో గంగా
కాపురం చేతాం గంగా
ఆమాను యీమాను పండూ
కోపురేగి మాగిన పండూ
సాకాలయెల్లప్ప జుట్టూ
జుట్టూకు బెంకాయ కొట్టూ
అది ఊడిపోతే నన్నడుగూ
జారిపోతే నన్నడుగూ

కొత్తకుండల్లో యిత్తాళికమ్మాల్
పాతికనల్లాల్ (నల్లపూసలు)
పరకతాళీబొట్లు పెట్టుకో
సుబ్బక్క పెండ్లికి పోదాం.

3

చింతపూవు చింతపూవు రాలంగ
చిల్లక్క బొట్లూ బెట్టంగ
దండుబోయ దండుబోయ నామఅది
దండలు దెచ్చే దేవరెవరు ?
పసలపోలిగాని తమ్ముడూ
అట్లయితే యిట్లరమ్మాను
ఆకులతోటకు పొమ్మాను
అరకట్టాకులు తెమ్మాను
చెర్లోపల్లెకు బొమ్మాను
చారెడొక్కలు (వక్కలు) తెమ్మాను

దుగ్గుదుగ్గుపెండ్లికొడుకా దుగ్గాణిస్తావా?
పయనమయ్యే పాపిరెడ్డి పడుచు నిస్తావా?

౪

[పూర్వ మెప్పుడో ఒకపల్లెకు యజమానురాలైన నాగులమ్మయనే ఆమె చిత్రాల చెరగు, చేమంతిపూలంచు గలిగిన చీర గట్టుకొనిపోయి పుంగనూరు తేరులాగుటకుముందు తానే యందు వెలసియుండు దేవుటికి తొట్టతొలుత టెంకాయకొట్టుచుండెడిదట. తర్వాతనే తేరు లాగబడెడిదట. ఆమె రానంతట తేరు కదలెడిదే కాదట. అందుచే ఆ విచిత్రము సంతతి నెవ్వరో పిల్లపాటగా నల్లి పాడారట. నాటినుండి నేటివరకు బాలగోపాలము మూలము దెలియక పిల్లపాటగా పాడుకొనుచున్నారు.]

కుంటోడిపల్లి కాడ దొడ్డి
దొడ్డికి దొరసాని నాగి
నాగికి నల్లంచుచీర
చీరకు చిత్రాలబేరి
బేరికి బత్తాలచెరుగు
చెరుగుకు చామంతిపువ్వు
పువ్వుకు పుంగనూరుతేరు
తేరుకు టెంకాయ నీరు
నీరుకు నిమ్మాలబాయి.

౫

[పిల్లలు తమ రెండు పెదవులను గలిపి "తుర్రు" మని తుంపర్లు విడచుచుందురు. అప్పుడు వారి చెంతనుండు తల్లులు ఆ వైచిత్రి నవలోకించి యీ క్రిందివిధమున బిడ్డల నవ్వింతురు. పురుషశిశువైన "అప్పయ్యా" యనియు, "స్త్రీ" శిశువైన "అమ్మయ్యా" యనియు చివర మాటలునవరించి పాడెదరు.]

తుంపర్లో బయ్యక్కా
చిన్నమ్మకూతురు సరవక్కా
కాదుకాదు మల్లక్కా
కాసుకు రెండుమిరియాలు
శెట్టి శెట్టి నామాలు
చంద్రగిరి బాణాలు
అమ్మయ్యా! గిలగిల! సారి గిలగిల.

---

## జోలపాటలు

శంకర సీతారత్నముగారు

. ఓ లాలీ;
లాలెమ్మగుఱ్ఱాలు లంకల్లు మేసూ
అబ్బాయిగుఱ్ఱాలు మేసుపల్లాలూ
* * *
చిచ్చీ చిచ్చీ చీమల్లమఱ్ఱీ

మఱ్ఱికిం దున్నాడు తొఱ్ఱినాగన్నా
తొఱ్ఱినాగన్నకీ తోడెవ్వరమ్మా
యేనుగులు గాసేటి యెఱ్ఱడే తోడూ
గుఱ్ఱాల్ని గాసేటి గుఱవడే తోడూ
* * *



తల్లికంటె వేఱుదైవం
ఇలను లేదు ఎంగిచూడ
తల్లిగాచు మనల నెపుడు
పాలు ఇచ్చి పెంచునుండు
ఎందుగానీ ఏమిగానీ
తల్లి మనకూ త్రోవజూపు
మాతృపూజా మనకు మేలు
మాతృసేవా మనకు చాలు.

---

# పిల్లలపాటలు

యం. వి. పాపన్నగుప్త గారు సేకరించినవి

౧

అచ్చక్క బుచ్చక్క తవుడు
తవుళ్లో రాగింజ దారం
దారం యెత్తకపోయ్యి సాలయ్యకిస్తి
సాలయ్యపున్యాన బొంత నేయిచ్చె
బొంతకట్టుకోని సంతకుబోతి
సంతాలో మా రాజు సప్పిరకట్టె

౨

పూగూడు చెట్లల్లో గంటూ
కాపురం చేతాం గంటూ
ఆమాను యీమాను పండూ
కోపురేగి మాగిన పండా
సాకాలయెల్లప్ప జుట్టూ
జుట్టూకు టెంకాయ కొట్టూ
అది ఊడిపోతే నన్నడుగూ
జారిపోతే నన్నడుగూ

కొత్తకుండల్లో యిత్తాళికమ్మాల్
పాతికవల్లాల్ (వల్లపూసలు)
పరకతాళీబొట్లు పెట్టుకో
సుబ్బక్క పెండ్లికి పోదాం.

3

చింతపూవు చింతపూవు రాలంగ
చిల్లక్క బొట్లూ బెట్టంగ
దండుబోయ దండుబోయ నామఅది
దండలు దెచ్చే దెవరెవరు ?
పసలపోలిగాని తమ్మూడూ
అట్లయితే ఇట్ల రమ్మాను
ఆకులతోటకు పొమ్మాను
అరకట్టాకులు తెమ్మాను
కర్లోపల్లెకు బొమ్మాను
చారెడాక్కులు (వక్కలు) తెమ్మాను

దుగ్గుదుగ్గుపెండ్లికొడుకా దుగ్గాణిస్తావా?
పయనమయ్యే పాపిరెడ్డి పడుచు నిస్తావా?

౪

[పూర్వ మెప్పుడో ఒకపల్లెకు యజమానురాలైన నాగులమ్మయనే ఆమె చిత్రాల చెరగు, చేమంతిపూలంచు గలిగిన చీర గట్టుకొనిపోయి పుంగనూరు తేరులాగుటకుముందు తానే యందు వెలసియుండు దేవునికి తొట్టదొలుత టెంకాయకొట్టుచుండెడిదట. తర్వాతనే తేరు లాగబడెడిదట. ఆమె రానంతట తేరు కదలెడిదేకాదట. అందుచే ఆ విచిత్రమునంతటి నెవ్వరో పిల్లపాటగా నల్లి పాడారట. నాటినుండి నేటివర కాబాలగోపాలము మూలము దెలియక పిల్లపాటగా బాడుకొనుచున్నారు.]

కుంటోడిపల్లికాడ దొడ్డి
దొడ్డికి దొరసాని నాగి
నాగికి నల్లంచుచీర
చీరకు చిత్రాలచేరి
చేరికి బత్తాలచెరుగు
చెరుగుకు చామంతిపువ్వు
పువ్వుకు పుంగనూరుతేరు
తేరుకు టెంకాయ నీరు
నీరుకు నిమ్మాలబాయి.

౫

[పిల్లలు తమ రెండు పెదవులను గలిపి "తుర్రు" మని తుంపర్లు విడచుచుందురు. అప్పుడు వారి చెంతనుండు తల్లు లా వైచిత్రి నవలోకించి యీక్రిందివిధమున బిడ్డల నవ్వింతురు. పురుషశిశువైన "అప్పయ్యా" యనియు, "స్త్రీ" శిశువైన "అమ్మయ్యా" యనియు చివర మాటలునవరించి పాడెదరు.]

తుంపర్లో బయ్యక్క—
పిన్నమ్మకూతురు సరవక్క—
కాదుకాదు మల్లక్క—
కాసుకు రెండుమిరియాలు
శెట్టిశెట్టి నామాలు
చంద్రగిరిబాణాలు
అమ్మయ్యా! గిలగిల! సారి గిలగిల.

---

## జోలపాటలు

శంకర సీతారత్నముగారు

. ఓ లాలీ;
లాలెమ్మగుఱ్ఱాలు లంకల్లు మేసూ
అబ్బాయిగుఱ్ఱాలు మేసుపల్లాలూ

*　　*　　*

చిచ్చీ చిచ్చీ చీమల్లమఱ్ఱీ
మఱ్ఱికెం దున్నాడు తొఱ్ఱినాగన్నా
తొఱ్ఱినాగన్నకీ తోడెవ్వరమ్మా
యేనుగులు గానేటి యెఱ్ఱిడే తోడూ
గుఱ్ఱాల్ని గానేటి గుఱవడే తోడూ

*　　*　　*

ఓ పిల్లీ;

పిల్లలకి పాలోసి పల్లెలకి బంపీ
అమ్మాయికి పాలోసి ఆడుకోబంపీ
ఆడుకుని అమ్మాయి వచ్చెగాబోలూ
అందెల్లచప్పుడాయె పందిళ్లలోనూ
చదువుకునీ అమ్మాయి వచ్చెగాబోలూ
సరస్వతీచప్పుడాయె సావిళ్లలోనూ

* * *

ఓ చిచ్చీ;

చిచ్చోసి పిల్లనీకు సిగ్గేలలేదె
చిన్నినాఅమ్మాయికి భయమేలలేదు
యేడవకు యేడవకు వెఱ్ఱినాతల్లీ
యేడిస్తె నీకళ్లు నీలాలుగారు
నీలాలుగారితే నేచూడలేను
పాలాలుగారవే బంగారుకళ్లా.

* * *

ఓ పిల్లీ;

పిల్లెమ్మ వెళ్లిందె బచ్చల్లిమెయ్యా
అమ్మాయి రచ్చల్ల నాడవెళ్లిందీ

* * *

చిట్టెడుగు పొట్టెడుగు కావాలెనంటే
సివుండుమాకిచ్చాడు చిన్నబాలల్నీ

పోలేరమ్మతల్లి పొత్తుళ్లుగాయియా
పొత్తుళ్ల నాడేటి అబ్బాయినిగాయియా
పోలేరమ్మతల్లి పొదికట్లుగాయియా
పొదికట్ల నాడేటి అబ్బాయినిగాయియా.

* * *

ఓ లాలీ;

లాలికి లక్కపళ్లూ
అమ్మకి అరటిపళ్లూ
అమ్మతో బాలలకి నిమ్మయ్యపళ్లు.

ఓ జోలా;

జోలమామిడిపళ్లు దూరానిగలవూ
దానిగట్టి తెచ్చేరె అమ్మమామల్లూ
అమ్మాయిమామల్లు యెటువంటివారూ
చేపలగంపలదగ్గిర చెయిజాచువారూ
గడ్డికుక్కా నెక్కి గుదులాడువారూ
పందిపిల్లా నెక్కి పరుగెత్తువారు
వారు మాఅమ్మాయి మేనమామల్లూ:
అమ్మాయిబాబయిలూ యెటువంటివారూ
చెవిచెవిని చేరడేసి పోగుల్లవారు
అంచుపంచలవారు అంగీలవారు
పట్టుపంచలవారు పాగాలవారు
గుండుపోగులవారు గుఱ్ఱాలవారు
వారు మాఅమ్మాయి బాబాయిలూ



## నాడానేత


కో. నరసింహాచారిగారు

ఇప్పుడిచ్చట చెప్పబడు నాడానేతకు మగ్గ మక్కరలేదు. అట్టముక్కల మూలమున అనేకవిధములగు చిత్రము (Patterns) లేర్ప డునట్లు నాడాల నేయవచ్చును. పడుగు దారములు వివిధవర్ణములలో నుండిన చిత్రములు అనేకవిధములుగ నేర్పడును. ఇందు మన ముపయోగించు అట్టముక్కలసంఖ్య ఎక్కువ యగుకొలది నాడాయొక్క వెడల్పు ఎక్కువ యగును.

### పరికరములు

రెండంగుళముల చతురములు గాని లేక కొంత హెచ్చుతక్కువ వైశాల్యము గలవిగాని యగు అట్టముక్కలను ఆజెంటిని కత్తిరించుకొనవలయును. అట్టముక్కలు చతురస్రములుగ గాని వర్తులములుగగాని, అండాకృతిగలవిగగాని యుండవచ్చును (చిత్రము ౧, ౨, ౩). అట్టలన్నియు ఒకే పరిమాణము గలిగి యుండవలెను. ప్రతిఅట్టయందును ౧, ౨ అనిగుర్తించి యుండు ప్రదేశములందు రెండు రంధ్రములు చేయవలెను. పిమ్మట మనకు కావలసిన నాడాయొక్క నిడుపునకు సరియగు కొలతగల దారపుతునకలను ఒక్కొక్క అట్టకు రెండు వంతున పండ్రెండు తునకలను తీసికొనవలెను. దారపుతునకల పొడవు రెండుమూర లుండిన చాలును. వీటియందు మనయిష్టము వచ్చినట్లు కొన్ని యొకరంగునను, మరికొన్ని మరియొక రంగునను ఉండవచ్చును. చిత్రము ౪,౫ లందు అల్లికచిత్రములకుతగిన వర్ణభేదములను తెలుపు ఆధారము లివ్వబడి యున్నవి. ప్రతిచిత్రము నందును క ఖ గ ఘ జ చ అనునవి, చిత్రము ౬ నందు చూపబడిన అట్టముక్కలను తెలుపుచున్నవి. ౧,౨ అను సంఖ్యలు, ప్రతి అట్టముక్కయందును గల ౧ వ రంధ్రమును గాని, ౨ వ రంధ్రమును గాని చూపును. చిత్రము ౪ నందుచూపిన రీతిని పడుగు నేర్పరుపవలెనన్న క అను అట్టయందలి ౧ అను

రంధ్రము గుండా, నల్లనిదారమును దూర్చవలెను. ౨ అను రంధ్రముగుండా రోజావర్ణపు దారమును దూర్చవలెను. ఖ అను అట్టయందలి ౧ అను రంధ్రముగుండా రోజాదారమును ౨ అను రంధ్రము గుండా నల్లని దారమును, దూర్చవలెను. (చిత్రము ౪,౫ లందు నల్లని గదులు నీలవర్ణమును, తెల్లనిగదులు రోజావర్ణమును తెలియజేయును.) గ అనుఅట్టయందు ౧ రంధ్రముగుండా నల్లనిదారమును ౨ రంధ్రముగుండా రోజాదారమును ఇట్లే చిత్రము నందు జూపబడినరీతికి తగినట్లు ప్రతిఅట్టయందలి రంధ్రములగుండా నాయూరంగుల దారములను దూర్చవలెను. ప్రతిదారమును ఎడమప్రక్క నుండి, అట్టకు వెనుకవైపుగా రంధ్రముగుండా దూర్చి, అట్టకు పైవైపుగా కుడిప్రక్కకు తీసికొనిపోవలెను. అన్నిదారములను కుడిప్రక్క ఫ వద్దను, ఎడమప్రక్క ప వద్దను చేర్చి కట్టవలెను (చిత్రము ౭). ప, ఫ అను కొనలను రెండుప్రక్కల లాగి రెండుఆధారములకు కట్టవలెను. పిమ్మట ౮ చిత్రమునందు చూపబడిన కండెవలె నొక అట్టముక్కను కత్తిరించి దానికి తెల్లనిదారమును కావలసినంత చుట్టుకొనవలెను. దారముయొక్క కొనను, ప వద్ద ముడివేసికొనవలెను. అట్టలయందు ౧ రంధ్రముల గుండా దూర్చబడిన దారములన్నియు పైతట్టును, ౨ రంధ్రములగుండా దూర్చబడిన దారములన్నియు క్రింది తట్టును ఉండునుగాన, మధ్య నొకసందు ఏర్పడును. కండెదారమును ఈ సందుగుండా మనప్రక్కనుండి వెనుక పక్కకు పోనిచ్చి ఒక అట్టముక్కతో ఈ పేకదారమును దట్టముగా ప వైపునకు అదుముచు రావలెను.



ఒకసారి పేకను వేసిన పిమ్మట అట్టలపై యంచుల నన్నిటిని కుడిఅరచేతిలోను, క్రింది యంచు లన్నింటిని ఎడమఅరచేతిలోను పట్టుకొని ఎడమవైపులకు దొర్లించవలెను. దొర్లించ వలసినవిధము చిత్రము య, ర, ల, వ శ, లందు జూపబడియున్నది. ఇట్లు దొర్లించిన యెడల పైనుండు ౧ రంధ్రము లన్నియు క్రింది కిని క్రిందనుండు ౨ రంధ్రము లన్నియు పైకిని మారును. అపుడు మరల, రెండు రంధ్రముల దారముల మధ్యను సందుగుండా కండెను పోనిచ్చినయెడల రెండవ పేకవరుస పడును. పేక వేయునపు డంతయు ఒకబద్దతో దానిని దట్టముగ నదుముచు రావలెను. రెండవ పేకను వేసినపిదప అట్టముక్కలను ఎడమప్రక్క నుండి కుడిప్రక్కకు త్రిప్పవలెను. పేకనూలును వేసినపు డంతయు అట్టల నొకమారు కుడి ప్రక్కగను, ఇంకొకమారు ఎడమప్రక్కగను త్రిప్పుచు రావలెను. ఇట్లు నేయుచువచ్చిన యెడల నాడా అల్లిక యేర్పడుచువచ్చును. నాడాపొడువంతయు అల్లినతర్వాత పట్టెల వద్ద కట్టినకుట్లను విప్పి అట్టలను తీసివేయ వలెను.

అట్టలను త్రిప్పుటలో ఒక్కొక్క ప్రక్కకు ఒక్కొక్క మారుగగాని, రెండుమారులుగ గాని మూడుమారులుగగాని త్రిప్పుచు రావచ్చును. ఈవిధముగగూడ అల్లికచిత్రములందు భేదములు గల్పించవచ్చును.

---

# కవితాప్రసంగము

పి. నరసింహశాస్త్రిగారు

(నీలకంఠదీక్షితుని శివలీలార్ణవమునుండి)

వేదముల నెల్ల పనిబూని, వెదకి వెదకి
యలసిసొలసిన యాదిమత్స్యం బడేల
నిఖిలనిగమవిమృగ్యమై నెగడు తావ
కాక్షిమీనంబు నుతియింతు నంబ! మేము.

చెవిని బడిన గీత మివురు నచ్చోటన
సైకతమున బడిన జలముభంగి
అంతరంగ మెనసి యానంద మొనగూర్చు
సుధనుమించి సుకవిసూక్తి యెపుడు.

పదములు మన మెరిగిన వే
కద, యర్థము మనకు క్రొత్తకాదిక వానిం
దదుచితరీతులు మెరయం
గదియించి భ్రమింపజేయు కవిలోకములౌ.

ఉన్నవిషయంబు లుండ నేయున్నయవి త
దర్థములు చేయదగినదో యానుపూర్వి
కవితయన నింతమాత్రంబ కాదె, దీని
యందువిధి యెంత తారతమ్యంబు వెట్టె.

అందమగు కూర్పుచందంబు లరయునపుడు
పదము లొండొంటితో సరిపరచునపుడు
అన్నియును దీర్చి పరికించునపుడు కవికి
గలుగు హర్షంబునకు మేర కలదె చూడ?

---

## ౬

## (మామూలు మర్యాదలయిన పిమ్మట)

శి—ఏ విషయము మీఁద నేఁడు ప్రసంగింపఁదలఁచుకొన్నారు?

గు—కుమారప్పగారు వ్రాసినదంతయు నగుపడును విషయాంతరములోఁ బ్రవేశించుటకు వీలు లేదుగదా! పరిపాలకు లప్పులుచేసి చేయువ్యయములను గూర్చి నేఁడు ముచ్చటించుకొందము. ఇంగ్లీషులో వానిని Capital Expenditure అందురు.

శి— అనఁగా ముఖ్యముగా రెయిలుబాటలను గూర్చి మాటలాడుదు రన్నమాట.

గు—ఔను. అవకాశ ముండునెడఁ దరువాత పత్రనాణక ప్రచారముఁగూర్చియు స్వర్ణరజత నాణకవినిమయమునుగూర్చియు నిం చుక చెప్పెదను.

శి—సరియే! అయోమార్గము లత్యంత సుఖదాయకములై యున్నవి. పూర్వము వారణాసి కేఁగుటయు వల్లకాటికేఁగుటయు నొక్కటియే యని చెప్పుకొనెడువారట. చోరభయాద్యపాయములు లేకుండ నిప్పుడు కాశిరామేశ్వరముల కిట్టె వెళ్లి యట్టె రావచ్చును. దేశములుకాని దేశములనుండి కొలఁదికాలములో వింతవింత సరకులు వచ్చి పడి భోగానుభవము లగుచున్నవి— అట్లు చూచుచున్నారేమి?—ఆయురారోగ్యములు హ్రస్వములగుచున్న వనియు, సోమరితనము పెరుఁగుచున్న దనియు భోగపదార్థములవాడుక యనావశ్యకముగా వృద్ధినొందుచున్న దనియు, కష్టసహనశక్తి సడలిపోవుచున్న దనియు నింక నేమేమో యనర్థములు వచ్చుచున్న వనియు, మీ మామూలుపాట పాడఁజూచుచున్నారు కాఁబోలు!

గు—నా యుపదేశభారము నీపైనే వైచుకొని నా శ్రమ తగ్గింపఁదలఁచుకొన్నావు కాఁబోలు! అట్లే కానిమ్ము. నేనూరకుండెదను. నన్నుండి యేవో వాలుగు మాటలు వినఁగోరివచ్చి "దగ్గఱగఁ బిలిచి దాసరి! నీకన్నలోట్టు" యన్నట్లు చేయుచున్నావేమోయి?

శి—క్షమింపుఁడు. మీరు వెనుకఁ జెప్పిన మాటలింకను జ్ఞప్తిలో నేయున్నవని చూపుటకును, మీరు చెప్పినట్లు శక్తివంచన లేకుండ మీ శ్రమ తగ్గించుటకును అట్లంటినిగాని, మీకుఁ గోపము తెప్పించుటకుఁ గాదు. వచోమార్దవలోపముండిన నుండవచ్చును.

గు—దాని కేమిలే! కొన్ని నష్టములు నీవే చేర్కొంటివి గనుక వానిని విడిచి యితరానర్థములఁ గూర్చియే ముచ్చటించుకొందము.

అయోమార్గములు స్వతః మంచివే కావచ్చును. కాని యావశ్యకతనుబట్టి వానిని నిర్మించుకొనవలెను. వానిని భరించుటకుఁ గావలయు అర్థాభివృద్ధి దేశమునకు లేనప్పుడును, తగిన ప్రయోజనములు లేనప్పుడును, అవి యుపకారకము లగుటకు మాఱుగా నపకారకములు కాకమానవు. ఆఁకలి లేనప్పుడు తినుతిండివలెనే యావశ్యకత లేనప్పుడు వేసికొను రెయిల్లును అనర్థకారు లగును. ఇండియా కిప్పుడు ముఖ్యముగాఁ గావలయునవి కృషికర్మానుకూలములగు నీటివసతులును, జనులను, సరకులను సునాయాసముగా నొక గ్రామమునుండి యొక గ్రామమునకుఁ గొనిపోవుటకుఁ జాలిన చౌకబాటలును.

శి—కోపముమాత్రము రానీకుఁడు, మీకు మీకే ప్రమాణమా, ప్రమాణాంతర మేమైన నున్నదా?

గు—నాది టపాపెట్టెయని మొట్టమొదటనే చెప్పితిని. కుమారప్పగారి భావములే తెలుఁగున నీకుఁ జెప్పుచున్నాను. ఆయనమాటలు నిష్ప్రమాణములు గావు.

ప్రభుత్వమువారి లెక్కలనుబట్టి ౧౯౩౫-౩౬ వ సంవత్సరము చివరవఱకు సేద్యపునీటివసతులకు ఖర్చుపెట్టిన మొత్తము ౯౬ కోట్లనియు, రెయిలుబాటలకు

వ్యయించిన మొత్తము ౬౫౬ కోట్లనియు స్పష్టమగు చున్నది. ఇండియాలో నంతటను ౩౭, ౫౮౯ మైళ్ల పొడుగుగల రెయిల్వేలున్నవట. ఏషియాలోని యే యితర దేశమునందును ఇంతదీర్ఘమైన యినుపబాటలు లేవట.

శి—తక్కిన యక్కఱ లన్నిటిని ఉపేక్షించి, చిక్కిన ధనమంతయును ఈరెయిళ్లమీఁదనే పెట్టి వెచ్చించుటకు హేతువేమై యుండునో?

గు—మెడ్డానల్డుమంత్రిగారు వ్రాసిన యీక్రింది మాటలనుబట్టి హేతువు నీవే గ్రహించుకొనుము. "అప్పు చేసి తెచ్చిన మొత్తములనుండి ఖర్చుపెట్టి రెయిల్వేలు మున్నగునవి వేసినారు; అవి యాయవ్యయగణనము చేసికొను అర్థాలోచన కార్యస్థానములందుఁ గాక, యుద్ధాలోచనకార్యస్థానములందు పరికల్పింపఁబడినవి; కనుక ఆయాధనవ్యయమును అమోఘమార్గపరిపోషణవ్యయ వేషముతో మఱుఁగుపఱిచి మన కగపఱిచినారు."

శి—సేనల నొకచోటనుండి యొకచోటికి శీఘ్రకాలములోఁ గొనిపోవుట కనుకూలముగా ఈరెయిళ్లు వేసినారన్నమాట. ఇతరస్వప్రయోజనము లేమైన నున్నవా?

గు—ఉండకేమి? రెయిళ్లకుఁగావలయు యంత్రములు పట్టెలు మున్నగు ననేకములైన యుక్కుసామానులు ఇంగ్లండునుండియే రావలెను గనుక, నచటికర్మాగారములలోఁ బనిచేయువారికిఁ జేతినిండఁబని, కడుపు నిండఁదిండి, యొడలినిండ దుస్తులు. ఇండియానష్టి యింగ్లండునకు పుష్టి.

హిందూదేశములోపండు ముడిసరకులు ఈ రెయిళ్ల మూలమున సులభముగా రేవుపట్టణములకుఁ దేవచ్చును; అట వాని నోడలలోని కెక్కించి యింగ్లండునకు రవాణా చేయవచ్చును.

మఱియు నింగ్లండులో తయారై మనదేశమునకు దిగుమతియగు ననంఖ్యాకములగు సరకులు అమ్మకమునకై యీరెయిలుబాటలమీఁద సులభముగా మనదేశములోని వివిధప్రదేశములకుఁ గొనిపోవచ్చును.

శి—మీరు నిష్పక్షపాతబుద్ధితో మాటాడవలెను. నానాప్రదేశములకు విదేశవస్తువులను గొనిపోవుట కుపయోగించు రెయిళ్లే మనదేశములోఁ జేయఁబడు సరకులనుగూడ నాయాతావులకుఁ గొనిపోవుట కుపయోగించుచుండుట లేదా?

గు—ఇంగ్లండు వర్తకమునకుఁ బ్రోత్సాహము గలిగించుటకును, స్వదేశవర్తకమును నిరుత్సాహపఱచుటకును, రెయిలుబాడిగ లేర్పఱుచుటయందుఁ జేసిన యన్యాయమునకు మెహతాగారు మూఁడువాలుగు నిదర్శనము లిచ్చినారు విను.

శి—ఏ వవి?

గు—బొంబాయిలో దిగుమతియైన విదేశపు అగ్గిపుల్లలపెట్టెలను అటనుండి రెయిలుపై ఢిల్లీకిఁ గొనిపోవుటకు నియమితమైన రెయిలుబాడిగయును, మన దేశములో తయారైన అగ్గిపుల్లలసరకును అహమ్మదాబాదు నుండి ఢిల్లీకిఁ గొనిపోవుట కీయవలయు మూల్యమును సమానములుగా నుండెడివట. అహమ్మదాబాదునకును ఢిల్లీకిని గల దూరము బొంబాయికిని ఢిల్లీకినిఉండు దూరముకంటె ౩౦౦ మైళ్లు తక్కువ.

శి—అనఁగా సరకులు బొంబాయినుండి అహమ్మదాబాదునకును ఉచితముగాఁ దీసికొనివెళ్లి రెయిల్వేవారు విదేశవస్తుకారున కుదారసహకారు లయ్యెడివారన్నమాట. ఆపాక్షికపుబాడిగ లింకను అట్లేయున్నవా?

గు—లేవు; ప్రజలు పదేండ్లదేపనిగా పోరఁగా పోరఁగా చివరకు అధికారులు అహమ్మదాబాదునుండి ఢిల్లీకిఁగొనిపోవు సరకులపై మణుఁగు ౧కి రు ౨-౨-౧౧ చొప్పునను బొంబాయినుండి కొనిపోవువానిపై మ ౧కి ౩-౪-౨ చొప్పునను తక్కువబాడిగలు విధించి పుచ్చుకొన మొదలుపెట్టినారఁట.

శి—రెండవనిదర్శన మేది?

గు—ద్వితీయతృతీయనిదర్శనములు చక్కెరను గూర్చియు శెల్లమునుగూర్చియు నీయఁబడినవి. బొంబాయికిని కాన్పూరునకును దూరము ౮౪౦ మైళ్లు;

కాన్పూరునకును అకోలాకును దూరము ౬౪౯ మైళ్లు. ఎక్కువ ఖరీదుగలిగిన విదేశపు దిగుమతి తెల్లచక్కెర. బొంబాయినుండి కాన్పూరునకుఁ గొనిపోవుటకుచెల్లించు బాడిగ మ ౧ కి రూ ౦-౧౩-౬. చౌక స్వదేశపు తెల్ల చక్కెర కాన్పూరునుండి అకోలాకుఁ గొనిపోవుటకుఁ జెల్లింపవలయు మూల్యము మ ౧ కి రూ ౧-౨-౮.

భోగపదార్థమగు తెల్లని పరదేశపు పంచదార బొంబాయినుండి బార్సీకిఁ గొనిపోవుటకు మ ౧ కి ౬ అణాలచొప్పున రెయిలుబాడిగ యీవలెను. ఇక బీద వాండ్ర కుపయోగపడు ముడిబెల్లము బార్సీనుండి బొంబాయికిఁ గొనిపోవుటకు మ ౧ కి రూ ౦-౯-౯ చొ.న బాడిగచెల్లింపవలెను. అనఁగా ౧౪ రెట్లకంటె నధికమగు మూల్యము చెల్లింపవలెనన్నమాట.

శి—మూఁడవ యుదాహరణము ?

గు—అదియు వచ్చుచున్నది, ఓపికపట్టుము. అది స్వదేశవిదేశకార్పాసవస్తునిర్మాతలఁగూర్చి యీయఁబడినది. ఢిల్లీలో స్వదేశీయుల వస్త్రనయనయంత్రశాలయును కాన్పూరులో యూరపియనుల బట్టలమరయును నున్నవి. చౌదసినుండి ౨౩౬ మైళ్ల దూరమున నున్న కాన్పూరునకు ముడిపత్తి గొనిపోవుటకు రెయిలుబాడిగ మ ౧ కి ౫ అ. అచ్చటినుండి ౧౨౭ మైళ్ల దూరము మాత్రమే యున్న ఢిల్లీకి బాడిగ మ ౧ కి రు ౦-౬-౫.

ఇట్లే పచ్చితోళ్లు, గోధుమలు, మున్నగు ముడిసరకులు రేవుస్థలములకుఁ గొనిపోవుటకు రేట్లు తక్కువ. అవియే దేశమధ్యమందున్న హైందవకర్మాగారములకుఁ గొనిపోవుటకు రేట్లు హెచ్చు. రెయిల్వేలు తమచేతిలో పెట్టుకొని యీవిధముగా హిందూదేశపరిపాలకులు విదేశవస్తునిర్మాతలకుఁ దోడ్పడుచు స్వదేశవస్తునిర్మాతలకు నష్టముఁ గలిగించుచు నున్నారు.

ఘోష్, వాచా, డిగ్బి, హిండ్మన్ — మున్నగు అర్థశాస్త్రజ్ఞు లిట్టి యభిప్రాయములనే యిచ్చుచున్నారు. వాని నన్నిటిని ఎత్తి యుట్రాయుటకుఁ దావులేదు.

శి—పోనిండు ; మీమాట ప్రమాణముగానే గ్రహించెదను. కాని శీఘ్రగమనాగమనసాధనము లగు రెయిళ్లవలన లాభములే లేవని చెప్ప సాహసింతురా ?

గు—అదిగో ! మరల మొదటికి వచ్చుచున్నావు. ఏవో కొన్ని కొలఁదిసౌఖ్యము లున్నవనిచెప్పి గోఁచిపాతరాయఁడు కోటీశ్వరుఁ డెత్తుపరుగు లెత్తఁదగునా ? మనదేశములో రెయిలుబాట లతిమాత్రములుగా నున్నవి. అర్థసమృద్ధి గలిగిన పిమ్మట నెలకొల్పఁబడవలయు రెయిలుబాటలు తత్పూర్వమే నెలకొల్పఁబడినవి. ఆవశ్యకత లేని యర్థవ్యయ మనర్థకారి. ప్రభుత్వమువా రితరసత్ప్రయోజనముల కెన్నిటికో వినియోగింపవలయు పెద్దమొత్తములు ప్రతిసంవత్సరము ఈ యనయోమార్గరూపబ్రహ్మరాక్షసికి బలిగా నిడుచున్నారు. అదియుఁ గాక వేసిన రెయిళ్లను సద్వినియోగము చేయుటలేదని పైనిదర్శనములఁబట్టి నీవే తెలిసికొనఁగలవు. మితమైన దేశాదాయమును అమితముగా రెయిళ్లపై వెచ్చించి కృషీవలుల కుపయోగించు చెఱువులు కాలువలు నూతులు త్రవ్వించుట, చౌకబాటలు వేయించుట, ప్రజారోగ్యవర్ధనము లగు సాధనములు కల్పించుట మున్నగు నవశ్యకర్తవ్యములను పరిపాలకులు మానివేయుచున్నారు. ఇదంతయుఁ బ్రమాదజన్యమనిచెప్పి వారు తప్పించుకొనఁజాలరు. ఎందుచేత ? ప్రజ లవిచ్ఛిన్నముగా మొఱ్ఱలు పెట్టుకొనుచున్నప్పటికిని వారవి పెడచెవిని బెట్టి పట్టుదలతో అక్షేమకరమైన ఆపద్ధతినే యవలంబించి నడచుచున్నారు గనుక.

శి—అదితప్పే. ఈనష్టమంతయు భరించువారు తుదకు హిందూదేశప్రజలే గనుక, రెయిల్వేసంబంధమైన దేశఋణభారము నిర్లక్ష్యభావముతో నేఁటేఁట నిట్లు పెరుఁగనీయఁగూడదు. నేఁడువచ్చి రేపు మళ్లియు మూటయుఁ గట్టుకొనిపోవు నల్పసంఖ్యాకులగు నన్యదేశీయుల యర్థతృష్ణానివారణముకోసము, కోట్లకొలఁదిగా నుండు నోరులేని హైందవదరిద్రప్రజావర్గమును బాధించుట ధర్మము కాదు.

గు—నిజమే. ఒక దేశభాగము నుండి యింకొక దేశభాగమున కతివేగముగా సరకులను గొనిపోవుట కనుకూలించు [ఈ యయోమార్గములే, దేశములోఁ బండిన పంటలన్నియు దేశమునుండిలాగి పరదేశముల కంపుట కుపయోగించుచున్నవి. ఒకపాలు లాభము చేయుచున్న, నూఱుపాళ్లు నష్టముఁ గలిగించుచున్నవి. తఱచుగా మన దేశమున క్షామపీడలు గలుగుచుండుట కిదియొక ప్రధాన కారణము.

బ్రిటిష్వాణిక్సంఘముల ప్రార్థనలు విని ప్రభుత్వము వారు రేవుపట్టణములకుఁ బెద్దపెద్ద యయోమార్గములు వేయుట యెక్కువచేయుచున్నారు గాని, చిన్న తేలిక రెయిల్వేలును కాలువలును వైచి దేశములోపలి గ్రామములకుఁ బరస్పరసంబంధము వృద్ధిచేయు సదుపాయములు గావించుట లేదు.

శి—ఔనుగాని, దేశములోఁ బండినచోట్లనుండి యాహారపదార్థములను పండనికఱవుప్రదేశములకుఁ గొనిపోయి రెయిళ్లు క్షామబాధానివారకము లగుట లేదా?

గు—అనుచున్నమాట వాస్తవమే. కేవలనిరుపయోగ పదార్థమేదియుఁ బ్రపంచమున నుండఁజాలదు. మనుష్యులఁ జిటికెలోఁ జంపు గరళముకూడఁ గొన్ని రోగములకు సిద్ధౌషధముగా నుపయోగపడుచున్నది. రోగములు దెచ్చి చికిత్స చేయుట మంచిదా? ఆరోగములు రాకుండఁజూచి యారోగ్యరక్షణము చేయుటమంచిదా?

శి—ఆరోగ్యరక్షణమే మంచిది.

గు—ఔనుగదా! క్షామబాధకలిగినపిమ్మట దానిని తగ్గింపఁ బ్రయత్నించుటకంటె, పంటల నెక్కువచేయు నీటివసతులు కల్పించి, రైతు చెల్లింపవలయు పన్నులు తగ్గించి, గ్రాసమునకుఁగావలయు ధాన్యాదులు పోఁగా, కష్టదినముల కక్కఱకువచ్చుటకుఁ గొంతసామగ్రి నిలువ చేసికొను సదుపాయము లతనికిఁ గావించి, పరిపాలకులు క్షామబాధలు రాకుండఁజేయుటకే యేల ప్రయత్నింపఁ గూడదు? పరదేశవణిక్ప్రతినిధులగు జట్టికాండ్రు, పంట యింకను పొలముమీఁదనుండఁగనే, చౌకగా బేరము కుదుర్చుకొని, అర్థాతురుఁడగు రైతుచేతిలోఁ జేరోకొంత పైకము పెట్టి, పైరంతయు నీరైళ్లమీఁదఁ బరదేశములకుఁ బంపుదురు. చాల నాహారపదార్థము దేశములో లేమిచే ధాన్యాదుల వెలలు అపరిమితముగా లేచి కఱవులు గావించును. పుష్కలముగాఁ బండు భూములుండియుఁ దెచ్చిపెట్టుకొను దారిద్ర్యముచే బాధపడుదేశ మీ ప్రపంచములో నొక్క మనదేశమే కాన్పించుచున్నది.

శి—కనుక నేమిచేయు మనెదరు?

గు—ఏమిచేయవలయునా? స్వార్థప్రయోజనముల మనస్సులోఁ బెట్టుకొని వృథాగా అమితధనము రైళ్లువేయుటకై పరిపాలకులు వినియోగింపఁ గూడదు. ఇట్లే యనావశ్యకముగాఁ గ్రొత్తఢిల్లి వంటి రాజధానులు నిర్మించుటకు లక్షలకొలఁది ధనము వ్యయింపఁగూడదు. "వసూలుచేయు ౮౦౦ కోట్లపన్ను మొత్తములోను దాదాపుగా ౩౦౦ కోట్లు హిందూదేశమున కేమాత్రము నుపయోగింపని స్వార్థప్రయోజనములకు వెచ్చింపఁబడుచున్నవి" అని షా పండితుఁడు వ్రాసినాఁడు. పెక్కుమాటలేల? ౫౦౦౦ మైళ్లదూరమునందున్న చిన్నద్వీపములో మహాధనవంతులై యుండు నల్పసంఖ్యాకు లగు తమవారి సుఖముకై, హిందూదేశములోఁ బరమదరిద్రులై పడియుండు బహుసంఖ్యాకులగు ప్రజల బాధపెట్టకుండ, ఆంగ్లప్రభువులు ధర్మదృష్టితోఁ బాలనకృత్యములు నెఱపుకొనవలెను.

శి— ఏవో కాగితపునోట్లను గుఱించియు కాసు రూపాయనాణెముల మాఱకమునుగూర్చియుఁ గొంచెము చెప్పెదనంటిరి. ఇవియైనను మనకు లాభకారులుగా నున్నవా? నష్టకరములుగా నున్నవా?

గు—నష్టకారులుగానే యున్నవని రాజ్యతంత్రజ్ఞుల యభిప్రాయము. విషయము దుర్బోధమగు చిక్కువిషయము. నే నప్రమత్తుఁడనై వినిపింపవలెను. నీ వశ్రద్ధ లేకుండ వినవలెను.

శి—చిత్తము.

గు—వ్యవహారసౌకర్యార్థము, ప్రతిదేశములోను సాటాబేరముతో వస్తువినిమయము చేసికొనుటమాని, ప్రజ లిప్పుడు నాణెములతోఁ గ్రయవిక్రయములు గావించు

కొనుచున్నారు. అవి ప్రధాననాణకము లనియుఁ జిల్లర నాణెములనియు రెండువిధములుగా నుండును. ఇంగ్లండు మున్నగు నాగరక దేశములలో బంగారునాణెములు ప్రధాన నాణకములుగాను వెండిరాగినాణెము లుపనాణకములు గాను నుండును. పూర్వకాలమున మనదేశమందుఁ గూడ రెండురకముల నాణెములును ప్రచారములో నుండెడివి. ఇప్పుడు వెండిరూపాయ అసలునాణె మైనది. నికెల్ మొదలగు నల్పలోహములతోఁ జేయు పావులా, బేడ మున్నగు నాణెములు చిల్లరనాణెము లైనవి. వెనుక మన దేశములో నుండెడిటంకసాల యిప్పుడు తీసివేయఁబడినది.

శి—ఉపనాణకములు కూడ వెండితో నేల చేయఁగూడదు?

గు—అల్పమూల్యములగు అణాయున్నగు నాణెములు వెండితోఁ జేసినఁ గడుఁ జిన్నవియై వాడుక కననుకూలముగానుండును. పెద్దమొత్తములు చిల్లరనాణెములతోఁ జెల్లింతుమన్న, నా కక్కఱలేదు రూపాయ లిచ్చినఁగాని పుచ్చుకొనను—అని మనము తిరుగఁగొట్టవచ్చును. అది శాసనదృష్టిని తప్పుగాదు.

రూపాయలుగా మిక్కిలి పెద్దమొత్తము లొకచోటనుండి యొకచోటికిఁ గొనిపోవుట కష్టముగను అపాయకరముగను నుండును గనుకఁ, బ్రభుత్వమువారు వ్యాపారసౌకర్యార్థము రూ. ౫ మొదలు రూ. ౧౦ వేల వఱకు కిమ్మతుగల కృత్రిమపు కాగితపునోట్లు కల్పించి చలామణీ చేయించుచున్నారు.

శి—ఈగొడవయంతయు మన ప్రస్తుత విషయమున కెట్లు సంబంధింపఁగలదు?

గు—చివరవఱకుఁ జెప్పనిచ్చిన సంబంధ మగపడును.

శి—కానిండు, ముసలివారు ముంగోపులు.

గు — వెనుక కాసు రూ ౧౫ల చొప్పున మాఱుచుండెడిది, జ్ఞప్తిలో నున్నదా?

శి—ఆ, అప్పుడు వెండి చౌకకాఁబోలు. యుద్ధానంతరము వెండి ప్రియమాటచేతను మఱికొన్ని కారణములచేతను కాసుధర తగ్గినది. పూర్వము ౧౬ షిల్లింగులకు సమానమగు మనరూపాయ కిప్పుడు ౧౪ షిల్లింగుల కిమ్మతు వచ్చినదట. మన ప్రధాననాణకము వెల హెచ్చుగుట మనకు లాభమే కాదా?

గు—నేను శ్రమపడకుండ నీవే కథలోనికిఁ దింపినావు; మంచిదే, జాగ్రత్తతో విను మఱి.

శి—చిత్తము.

గు—ప్రతిదేశముయొక్క భాగ్యోన్నతియును దాని యెగుమతిదిగుమతివ్యాపారములను బట్టి యుండును. ఇంగ్లండు మున్నగు దేశములలో ప్రధాననాణకము బంగారునాణె మనుమాట మఱచిపోకుము. వారు కొనుసరకుల విలువ చెల్లించుటకు వారు మనకుఁ బంపు హుండీలు కాసులలో నుండును. వారినుండి మనముకొను దిగుమతిసరకుల విలువయును వారికి కాసులరూపముననే మనము చెల్లింపవలసియున్నది పూర్వపు పదియేను రూపాయల కాసిప్పుడు రూ ౧౦ య లయిన దనుకొందము. ఇక నీకుఁ గొన్ని ప్రశ్నలు వేసెదను. నిదానించి జవాబు చెప్పుము.

శి—ఈప్రశ్నోత్తరోపనిషత్తు న న్నెచటికిఁ గొనిపోనున్నదో తెలియకున్నది.

గు—గమ్యస్థానమును సత్యమునకే! భయపడకు! ౧ పౌండు వెలగల ముడిసరకు నీ వెగుమతి చేసినావను కొనుము. దానికి వెనుక నీ కెంత వచ్చెడిది? ఇపు డెంత వచ్చుచున్నది?

శి—వెనుక రూ ౧౫ లు. ఇప్పుడు రూ ౧౦ లు.

గు—వెనుకటి రూ ౧౫ లు నీకువచ్చుట కిప్పుడు నీవు వెనుకటియంతసరకును, అదనముగా నందులో సగముసరకును, బంపవలెనా లేదా? అదినష్టమా? లాభమా?

శి—ఔను, నష్టమే.

గు—ఒకపౌండు వెలగల మల్లుతాను నీవింగ్లండునుండి దిగుమతిచేయించి తెచ్చికొనినా వనుకొనుము.

శి—మఱియిప్పుడో! వెనుకటి పదియేనురూపాయల తాను ౧౦ రూపాయలకే వచ్చుచున్నది. ఇది నష్టమా? లాభమా?

గు—చంకలు గొట్టుకొనక శాంతముగా వినుము. కొన్న నీకు లాభమును, స్వదేశవర్తకునకు నష్టమును.

శి—ఎందుచేత?

గు—మనదేశమునందలి వయనయంత్రశాలలో నేసి పూర్వము ఇంగ్లండు తానుతోపాటు రూ ౧౫ ల కమ్మ స్వదేశవర్తకుఁ డిప్పుడు దానివెల ౧౦ రూపాయలకు దింపినఁగాని దివాలా దీయును. విదేశవర్తకునకు పోటీగాఁ దానిప్పుడు ౧౪ తానో అంత కెక్కువయో యిచ్చినఁగాని తనసరకెవరును గొనరు. ఇది దేశక్షేమమా? దేశారిష్టమా?

శి—దేశారిష్టమే యనకతీఱదు. విదేశవర్తకునకు మాత్ర మేమియు నష్టములేదు — వెనుకవచ్చెడు ౧ పౌం కు ఇప్పుడును అతనికి వచ్చుచున్నది. సరియేకాని, పెద్ద పెద్ద జీతములు గొనుచుఁ బనిచేసి యుద్యోగానంతరమున సీమకువెళ్లు తెల్లవారికిచ్చు పెన్షనులలో లాభము లేదా? ౧ పౌను పెన్షనుకై పూర్వము రూ ౧౫ లు పంపవలసియుండఁగా నిప్పుడు రూ ౧౦ లు పంపినఁ జాలుచున్నదిగదా!

గు—మహా మేధావులగు మనప్రభువు లట్టినష్టమునుగూడఁ దీయుటకే, యున్నతోద్యోగులగు యూరపియనుల జీతము లిప్పు డెక్కువ చేసినారు. అన్యాయమని ప్రజలు ఘోషింతురనికాఁబోలు, వారితోపాటు మనవారికిఁ గొందఱకుఁ గూడ వేతనాభివృద్ధిఁ గావించినారు. ఇంకొకమాట చెప్పి నేటి ప్రసంగ మింతటితోఁ గట్టిపెట్టుదము.

శి—అది యేది?

గు—లోపల ౧౧ అణాల వెండిమాత్రమే కల రూపాయ, దేశములో ౧౬ అణాలకు చలామణి యగుచుండుటచేత, గవర్నమెంటునకు రూ ౧ కి ౬ అణాల లాభమువచ్చుచున్నదిగదా! ఏఁటేఁటవచ్చు నీలాభమంతయును వినిమయనష్టపూరణముకొఱకు, "గోల్డెక్స్చేంజి స్టాండర్డురిజర్వు" (Gold Exchange Standard Reserve) అనుపేర నొక నిధి యింగ్లండులోఁ బెట్టినారు. మఱియు, ముద్రింపఁబడిన నోట్లన్నియును మాఱునోమాఱవో యనుమారదృష్టితో వానికి సమానమైన కిమ్మతుగల స్వర్ణరూపధనము "పేపర్కరెన్సీ రిజర్వు" (Paper Currency Reserve) అనుపేర మఱియొకనిధిగా నింగ్లండులోనే పెట్టినారు. అది నాలుగుకోట్లును ఇది రెండుకోట్లును యున్నదట. ఈ నిధులు స్వదేశములో నుండక పరదేశముల కేగుటచే, నింటికి జ్యేష్ఠాదేవులును బొరుగింటికి లక్ష్మీదేవులును అయి, యిదివఱకే ధనవంతులుగా నుండు విదేశపు కొలిదారులను ధనవత్తరులఁ జేయుచున్నవని అర్థశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

శి—పైయనర్థము లెట్లుపోఁగలవు?

గు—రూపాయలోని వస్తుక్రయశక్తి స్థిరముగా నుండు నేర్పాటులు చేయవలెను గాని, విదేశవణిజుల క్షేమముకై పౌండునుబట్టి దానివెల తఱచుగా మార్చుచుండఁగూడదు. ఇండియాలోఁ గూడ బంగారు నాణెము ప్రధాననాణకముగాఁజేసి దేశములోవరల టంకసాల నెలకొల్పవలెను. మాఱకపు టేర్పాటులును ఆయవ్యయనిర్ణయమును ప్రజలచేతులలోనికి రావలెను.

శి—నమస్కారము! సెలవు.

గు—సుఖీభవ!

---

## భార్యాభర్తలు



# వరిసాగును తగ్గింపవలెనా?

మోచర్ల కృష్ణమూర్తిగారు

చెన్నరాష్ట్రమున వరిసాగును యథారీతి నభివృద్ధి చెందనీయవచ్చునా లేక దానిని తగ్గింపవలసిన పరిస్థితు లరుదెంచెనా? అను విషయ మిప్పుడు, ప్రజల మనముల నాందోళనపరుచుచున్నది. వరిధాన్యపు ధర లిటీవల కొన్ని వత్సరములనుండి క్రమముగా తగ్గిపోవుచుండుట ఇందుకు ముఖ్యకారణము. దీనినిగాంచి ప్రస్తుత మవసరమైనదానికంటె చాల అధికముగ పంటయగుచున్న దనియు అందుచే గిరాకి తగ్గుచున్న దనియు సరకు నిలిచిపోవుచున్న దనియు కొందరు అభిప్రాయపడుచున్నారు. ఈ యభిప్రాయమును బలపరుచువారిలో చెన్నపురి వ్యవసాయశాఖాధికారి యగు హిల్సనుగారు ముఖ్యులు. "ప్రస్తుత మీరాష్ట్రమున ప్రతివత్సరము పండు పంట ప్రజలకు సరిపోవుటయె గాక, ఇంకను చాల నిలిచిపోవుచున్నది. వరిసాగు నిప్పటివలెనే అభివృద్ధి నందనిచ్చిన యెడల, అచిరకాలములోనే మనరైతాంగమునకు వంగదేశమున జనుము సాగుచేయు రైతులకు పట్టినస్థితియే పట్టును. రైతుల ఆర్థికస్థితి తిరిగికోలుకొనవలెనవినయెడల వెంటనే వారు వరిసాగును తగ్గించి వానిస్థానమున కూరగాయలు, పారిశ్రామికములగు పైరులు మొదలగువానిని పైరుచేయవలెను" అని హిల్సనుగారు హెచ్చరించుచున్నారు.

భారతదేశార్థికనిర్మాణమునందు వరిసాగు ఎట్టి ప్రధానస్థానము నాక్రమించుచున్నదో ప్రతివారికిని తెలిసినవిషయమే. భారతీయులలో నూటికి ౭౨ వంతుల ప్రజకువ్యవసాయపరిశ్రమ యొక్కటే జీవనాధారము. భారతదేశపు దిగుమతుల వ్యాపారము, ఇంచుమించు పూర్తిగ, వ్యవసాయకులచే నుత్పత్తిజేయబడిన పదార్థములే. ఇట్టిభారతవ్యవసాయపరిశ్రమయందు సర్వవిధములను వరిసాగు ప్రధానస్థానము నాక్రమించుచున్నది. ౧౯౪౮-౪౯ సంవత్సరమున ఈదేశమున సాగుబడి యందున్న మొత్తము ౪౪౮, ౧౬౬, ౦౯౬ ఎకరములలో ౪౦౦, ౪౬౮, ౮౪౪ యకరములు ఆహారధాన్యములక్రింద నున్నది. అందు సుమారు ౭౦౦ లక్షల యకరములలో వరిసాగుజేయబడుచున్నది. వరిసాగునందు, వంగ, బీహారు, ఒరిస్సారాష్ట్రములు వరుసగా ప్రధానస్థానముల నాక్రమించియున్నను, మూడవదగు చెన్నరాష్ట్రమునగూడ వరిసాగు అల్పమని చెప్ప వీలు లేదు. ఈరాష్ట్రమున ౧౯౪౮-౪౯ సంవత్సరమున సాగుచేయబడిన ౩౮,౭౪, ౯౮౧ యకరములలో ఆహారధాన్యముల క్రింద ౪౪౯ లక్షల యకరములు సేద్య మొనర్పబడెను. అందు ౧౧౦ లక్షల యకరములలో వరి సాగుచేయబడెను. ఇంతియ గాక ఈదేశమున ప్రజలకు, వరిధాన్యము ప్రధానాహారపదార్థములలో నొకటి. దక్షిణహిందూదేశము, బీహారు-ఒరిస్సా, బెంగాలు, కర్ణాటకములందు విశేషముగను, ఇతరప్రాంతములయందు చాలవరకును, ప్రజలచే నిది ప్రధానాహారముగ నుపయోగింపబడుచున్నది. ఒక్క చెన్నరాష్ట్రమునకే గాక భారతదేశమున కంతకునుగూడ ప్రధానమగు నీ వరిసాగునకు హిల్సనుగారు సూచించిన పరిస్థితులు సంభవించియున్న యెడల, భారతీయులను చాలవిషమమగు సమస్యయే యెదుర్కొనియున్న దనుట నిర్వివాదాంశము. కాని నిజముగ నిప్పు డట్టిపరిస్థితులు సంభవించెనా? సంభవించినచో, నివారణోపాయము లేమి అనువిషయములు, దేశీయార్థికనిర్మాణక్షేమాభిలాషులగు ప్రతివారికిని విచారణీయము. ధరలు తగ్గుటకు అనేకకారణము లుండవచ్చును. కాని ప్రస్తుతము ధరలుతగ్గుటకు పంట యధికమగుట కారణమా? ప్రస్తుతముగల పంట ప్రజలకు గావలసినదానికంటె అధికముగ నున్నదా యనుప్రశ్నలకు సంబంధించిన విషయములమాత్రమే ఈవ్యాసమున పాఠకులకెరుకుట నుంచెదను.

పంట అవసరమైనదానికంటె అధికముగ నున్నదా లేదా యను విషయమును గనుగొనుటకు ముందు చెన్నరాష్ట్రమునందు ప్రజల కవసరమగుపంట యెంతయో నిర్ణయింపవలసియున్నది. ఇది అంత సులభమగు విషయముగాదు. మొదట ప్రతివ్యక్తికి గావలసిన ఆహారపదార్థమును గురించియు, రెండు: బియ్యము నాహారపదార్థముగ నుపయోగించు జనుల సంఖ్యను గురించియు గూడ చాల భేదాభిప్రాయములు గన్పట్టుచున్నవి. పంట అవసరమైన దానికంటె నధికముగనున్నదని వాదించుచు హిల్సనుగారు తల ౧ కి సం.నకు ౪౪౮ పౌనులబియ్యము (౪ హం.వె.) గావలసి యుండునని నిర్ణయించిరి. అనగా రోజు ౧ కి ౧౯.౬ ఔన్సుల బియ్యము. కాని యీయంచనా చాల తక్కువయని యీక్రిందనుదాహరింపబడిన అంకెల వలన దెలియగలదు.

| | రోజు ౧ కి ఔన్సులు |
|---|---|
| మద్రాసు జైలులో మగఖైదీకి | ౨౦ |
| స్త్రీకి | ౧౭ |
| బొంబాయిజయిలులో | ౨౬ |
| మదరాసు క్షామనివారణ చట్టము ప్రకారం శ్రమపడనివారికి | ౨౭ |

గొప్పప్రమాణగ్రంథముగ నందరిచేతను అంగీకరింపబడుచున్న ‘ Memorandam on the Progress of the Madras Presidency ’ అను గ్రంథమునందు శ్రీనివాసరాఘవయ్యంగారు, చెన్నరాజధాని వాసుల కుటుంబవ్యయముల చర్చించుచు రోజుకు తల ౧ కి ౨౪ ఔన్సులబియ్యముకావలసియుండునని నిర్ణయించిరి.

రోజు ౧ కి ౧౯.౬ నుండి ౨౭ ఔన్సుల వరకును వ్యాపించియున్న పై యంచనాలలో మన మేది ప్రమాణముగ గైకొనవచ్చు నను విషయము విచారణీయము. మదరాసు కారాగారవాసుల కొసగబడు బియ్యపు ఆహారప్రమాణము నందలి శరీరపోషక గుణములను, ప్రజాసామాన్య మువయోగించు ఆహారప్రమాణము నందలి శరీరపోషకగుణములను పరీక్షింపగా ఖైదీల ఆహారమునందు నత్రజని ౧౯౯.౭౭ గుణములు, కార్బన్ ౪౬౩౯.౩౦ గుణములు గలవనియు ప్రజ లుపయోగించు ఆహారమునందు ౨౫౬.౩ నత్రజని, ౫౯౯.౩ కార్బన్ గలదనియు గనుగొనబడెను. దీనినిబట్టి సామాన్యప్రజ లుపయోగించు ఆహారము ఖయిదీల కొసగుదానికంటె నూటికి ౨౫ వంతు లధికముగ నుండునని తెలియవచ్చును. ప్రజలలో కొందరు బాలు రుందురను విషయమును లెక్కలోనికి దీసికొనినచో శ్రీనివాసరాఘవయ్యంగారు గావించిన యంచనా మిగిలిన వానికంటె సత్యసన్నిహితముగ నుండునని భావింపవచ్చును. ఈలెక్కప్రకారము తల ౧ కి సం.కు సుమారు ౫ హం. వె. బియ్యము గావలసి యుండును.

కాని చెన్నరాష్ట్రమునందు ప్రజ లందరును వరిబియ్యమునే ఆహారపదార్థముగ నుపయోగించుట లేదు. వరిపంట విశేషసంఖ్యాకులకు ఆహారముగ నున్నను జొన్నలు, సజ్జ, కొఱ్ఱ, రాగి మొదలగు నితరధాన్యములు గూడ చాలమందిచే నాహారముకొరకు వినియోగింపబడుచున్నవి. ఎంతమంది ఏయేధాన్యముల నుపయోగించుచున్నా రనువిషయమును నిర్ణయించుట కెట్టిలెక్కల నాధారము గాని లేదు. ప్రజలలో సుమారు ౪౦ వంతులు మాత్రమే వరిపంట నుపయోగించుచున్నారని హిల్సనుగారు అంచనావేసిరి. కాని దేశమున పండుచున్న వరిపంటనుబట్టియు, ఒక్కొకరికి గావలసిన ఆహారమును గురించి తాను నిర్ణయించిన పరిమాణమునుబట్టియు వీ రీసంఖ్యను నిర్ణయించినట్లుల గన్పించుచున్నదే గాని ఇందుకు మరొకపద్ధతి దురూహ్యముగ నున్నది. కాని ప్రజలతో పరిచయము గల ప్రతివారికిని ఇంతతక్కువయంచనా చాల విపరీతముగ గన్పట్టును. ఈరాష్ట్రమున నితరధాన్యముల నుపయోగించువారికంటె బియ్యము నుపయోగించువారిసంఖ్యయే అధికమని ప్రతివారికిని అనుభవవేద్యము. ఈవిషయమును నిర్ణయించుటకు హిల్సనుగా రవలంబించిన పద్ధతికంటె, దేశమున నుత్పత్తియగు ఇతరాహారపదార్థములపరిమాణమునుబట్టి నిర్ణయించినయెడల, నాయంచనాలు సత్యసన్నిహితముగ నుండగలవు. ౧౯౨౮-౨౯ సంవత్సరమున

మదరాసురాష్ట్రమున వ్యవసాయశాఖవారి అంచనాల ప్రకారము ౭, ౭౫౭, ౨౩౦ టన్నుల వరిధాన్యమును, ౪, ౨౩౦, ౧౩౦ టన్నుల ఇతరాహారధాన్యములును పండెను. అనగా సుమారు నూటికి ౬౫ వంతులు వరిపంట, మిగిలిన ౩౫ వంతులు ఇతరధాన్యములు. దీనిని బట్టి ఆయాధాన్యముల నుపయోగించువారిసంఖ్య గూడ ఇటులనే యుండునని భావించుట కెట్టిఆక్షేపణయు గన్పింపదు. అటుల గాక హిల్సనుగారి యంచనాలప్రకారము నూటికి ౪౦ వంతులు ప్రజలు మాత్రమే వరిధాన్యము నుపయోగించుచున్నారని అంగీకరించునెడల, మిగిలిన ౬౦ వంతులప్రజలును—వరిపంటలో సగముకంటె స్వల్పముగ హెచ్చుగ నున్న—ఇతరధాన్యములపంటపై నాధారపడియున్నారని చెప్పవలసివచ్చును. కనుక ఆ యంచనా ఎంతహాస్యాస్పదమో వేరుగచెప్ప నక్కరలేదు.

౧౯౩౧ సం. రపు జనాభాలెక్కలప్రకారము చెన్నరాష్ట్రమున సుమారు ౪౭౦ లక్షలప్రజలు గలరు. వీరిలో నూటికి ౬౫ వంతులు వరిపంటపై నాధారపడువారని అంగీకరించునెడల ౩౦౫.౫ లక్షలమందికి అవసరమగు వరిపంట దేశమున నుత్పత్తి గావలసియున్నది. అనగా తల ౧-కి ౪ హ. వె. చొప్పున నైనచో ౬౧.౧ లక్షల టన్నులు బియ్యమును ౫ హ. వె. చొ॥న నైనచో ౭౬.౩ లక్షల టన్నులును గావలెను.

ఇందు మించుమలె చెన్నరాష్ట్రమున గలపంటను పరికించుదము. విత్తనములు ఇతరపారుదల పోను య ౧ కి పండినపంటలో ఎనిమిది హం౹డెడువెయిట్లు బియ్యము ప్రజలుఆహారముగ నుపయోగించుకొనుటకు అందుబాటులో నుండునని హిల్సనుగారు అంచనావేసిరి. ఇందుకు గాను వీరు ప్రభుత్వమువారు ప్రతిసంవత్సరమును పంటను గురించి ప్రకటించుఅంచనాలపై నాధారపడి రని నమ్మవచ్చును. కాని ప్రభుత్వమువారి అంచనాలు అన్ని ప్రాంతములకును వర్తింపవనియు, మొత్తముమీద జూచినచో ఆయంచనాలకంటె అసలుపంట చాల తక్కువయనియు చాలమంది అభిప్రాయము. ఇట్లు భావించువారు కొక్కు అధికారేతరులే గాదు. చాల బాధ్యతాయుతమగు పదవుల నధివసించియున్న అనుభవజ్ఞులగు రివెన్యు సెటిల్మెంటు ఆఫీసరులును అధికారులును దెలిపిరి. మదరాసు రెవిన్యూబోర్డు కమిషనరగు అట్కిన్సనుగారు దెలిపిన యభిప్రాయము నిచట నుదాహరించుచున్నాను. "చాల సందర్భములలో పంటల పరిశోధనార్థము నిర్ణయింపబడిన భూములు సాధారణపుభూములకంటె నెక్కుడు సారవంతమైనవి." (బి. పి. నొ. ౨౨౫. డి. ౧౯౦౭.)

౧౯౧౨ సం. నెం. ౨౬౧౯ రు జి. ఓ. యందు పార్సనుగారును, ౧౯౧౭ సం. జి. ఓ. నెం ౨౬౮౭ రు నందు సర్ ఫ్రెడరికు నికల్సనుగారును గూడ ఇట్టి అభిప్రాయమునే వెలిబుచ్చిరి. పంటల పరిమాణమును నిర్ణయించు పరిశోధనలను వ్యవసాయశాఖవారు సాధారణ భూములకంటె ఎక్కుడు సారవంతములగు భూములను దీసుకొనుటవలన అందలి పంటలపరిమాణమునుబట్టి మొత్తమును పంటను నిర్ణయించుట సరిగాదు. ఈ కారణముల వలన ప్రభుత్వమువారి అంచనాల కంటె అసలు పంట చాల తక్కువగ నుండునని తేటతెల్లము.

ప్రభుత్వమువారి అంచనాలకంటె పంట ఇంకను చాల తక్కువయని మరికొన్ని కారణములవలన గూడ అంగీకరింపవలసి యున్నది. సాగుచేయబడిన భూమి యంతయు మంచిపంట పండెనని భావించుటకు వీలు లేదు. అందు ఎంతయో బీడుభూమి గలదు. పైరులు పూర్తిగా పోయిన ప్రాంతము లుండును. హిల్సనుగారి యంచనాలలో వీని కెట్టి మినహాయింపును గన్పింపదు. అకాలవేష్యమువలన గలుగుచున్న పంటనష్టమును గూడ అధికారులు లెక్కలోనికి దీసికొనుటలేదు. ఈ సందర్భమున, కృష్ణా గోదావరి జిల్లాల ఆర్థికవిచారణసంఘము వారు నుడివిన ఈక్రిందివాక్యములు గమనింపదగియున్నవి: "జూను, జూలై, ఆగష్టు, సెప్టెంబరులలో సాగు చేయబడు పొలములు, వరుసగా ౧౨, ౧౦, ౮ బస్తాలు పండె ననుకొనినచో, మొత్తం దామాషాయాన యకరం ౧-కి ౯-౧౩ బస్తాలపంటయే లేలును. ఈ విధముగ ఆలస్యముగా నాటువేయుటవలన గలిగిన నష్టము లే నూటికి ౮౪ పంతు లుండును." ఈ వాక్యములు

పైన వివరించిన విషయములబట్టి దేశమునందలి పంట ప్రజలయాహారావశ్యకతలకు ఎటుల చాలకున్నది యీ స్పష్టపడగలదు. ఇట్టి వరి ఆహారపదార్థముల సేవ్యమును నధికముగ ప్రోత్సహింపవలయునేగాని తగ్గింపవలె నని చెప్పుట దేశీయార్థికనిర్మాణమునకును, దేశక్షేమమునకును చాల విపత్కరముగ గన్పట్టుచున్నది.

---

## మరాళసందేశము

కొడాలి ఆంజనేయులుగారు

౧

నవశిరీషలతాంతమార్దవము లమృత
మధురములు నైన వాక్యసంపదల, వలపు
రాయబారముల్ నడపు కార్యములు దలప
త్వచ్ఛిరానుభవైకవేద్యములు గావె!

౨

ప్రియప్రియాలాపములను వర్ణింప నెన్ని
యూహ లెంత రసజ్ఞత యుండవలయు
నవమృణాళనాళ మధురాన్నము భుజించు
నోట ప్రేమసందేశముల్ నుడువదగును.

౩

మామకవిపంచి నవ్యగీతామృతముల
నతనికీర్తివల్లరిఁ బెంచె ననుము నాదు
యావనవసంతస్వప్నవృత్తాంతగాథ
లతని కంకితదివ్యకావ్యమ్ము లనుము.

౪

పదిపదారు వెన్నెలకార్లు పైనబడిన
పూపపాయంపుటూహల పోడము వలపు
నందనోద్యాన దేవకాంచననికుంజ
భాద్రపదనర్తితమయూరి వంటి దనుచు.

౫

అలతిరేయెండ జెట్లనీడలకు డాగు
వింత వలవంత దెలిపి రప్పింపు మతని
మంగళగళాంకితము గాగ మధుతుషార
లలితలవలీప్రవాళమాల్యములు నైతం.

---

"చేబదులు"కి ఇంగ్లీషు ప్రతిపదార్థం (Hand-loan) అని వాడుతూవుంటారు. చేయిచేయి అంగీకరించిన ఋణమన్నమాట. మనసులు రెంటికీ యిద్దామనికాని కృతజ్ఞతాపూర్వకంగా తీర్చాలనికాని తెలియబడదు, చేబదులు వ్యవహారాల్లో.

చేబదులిచ్చినసొమ్ము తిరిగి నాచేతపడగానే, లాటరీ వచ్చినంత ఆనందం నాకు.

చేబదుళ్లు సామాన్యంగా స్నేహితులికిస్తూవుంటాం. అట్లా యివ్వడంలో రెండు ప్రమాదాలున్నాయి. మూడువంతులు ముప్పాతిక స్నేహమూ, ధనమూ రెండూ నష్టిస్తాయి. ఎంచేతనంటారా? మనం గట్టిగా అడిగితే మనమీద అమర్యాద ఆరోపించి మనతో జోక్యం తెంపుకుంటాడు మిత్రుడు. అనూనే యెత్తకుండా వూరుకుంటే మనసు చిన్నబుచ్చుకుని సాధ్యమైనంతవరకు మాయెదుట పడకుండా మెలుగుతాడు. చేబదులు విషయం జ్ఞప్తికి తెస్తూ సూచనగానైనా ఒకవేళ అడిగేనా అతనిహృదయాన్ని శూలంగ్రుచ్చినట్లవుతుంది. అతన్ని యేదో నువ్వు అంగామా చెయ్యడానికి పూనుకున్నట్లు భావించి కుంచితదృష్టితో నీవేపుతప్ప యితరత్ర చూస్తాడు. నువ్వు పచ్చిగా కత్రవిరిగినట్లడిగితే దాంతో మీ యిద్దరి స్నేహానుబంధం పుటుక్కున తెగిపోయినట్టే. వామనమూర్తి అంతటి అవతారపురుషుడే మూడడుగుల నేల కొలుకిపుచ్చుకుని యిచ్చిన వాణ్ని అధఃపాతాళాని కణగద్రొక్కాడు. "నమామి" అని తిలోదకాలు విడిచేసిన బలి రాక్షసుడట! వామనుడు శ్రీమహావిష్ణువు! లోకరీతి యీలాగే వుంటుంది.

చేబదులు పుచ్చుకుంటూన్నప్పుడుండే కృతజ్ఞత మానవముఖంలో మరెన్నడూ కనిపించదు. ఆడబ్బుకి మళ్లీ నువు ఆశించేవో నిన్ను పెద్దకోమటిగా భావిస్తాడతను. Delicacy, courtesy ఇత్యాది సభ్యగుణాలు నీలో లేవనే అతని విశ్వాసం. "లేకపోతే మనిషంతమనిషిని నిలఃదీసి అడుగుతాడూ? యేం పెద్దమనిషి తరహా! పెకనడబ్బా! ఎప్పుడో బదులిస్తే యిచ్చుగాక" ఇలాంటి తరంగాలు అతని హృదయంలో దొర్లుతాయి.

ఇచ్చిన చేబదులు తిరిగి తెలుగులో సున్నితంగా అడగడం దుర్లభమేమో అని నానమ్మకం. ఇంగ్లీషునైతే

"By-the-by do you mind financing me a little in return?"

"Oh, not in the least, but sorry I should have inconvenienced you."

"Alright, don't mind much ; it is only by the way"

ఇత్యాదిగామనసులో యిద్దరకూ కష్టంగావున్నా పైనిస్నేహం పూర్తిజెయ్యొచ్చు. ఏభాషలో అడిగినా మొత్తానికి పర్యవసానం ఒకటేలెండి.

ఒకవేళ చేబదులు తీర్చడమే తటస్థించినపుడు, అతడది ఒకగుప్తదానం చేసినట్లుగా ఆనందిస్తాడు. తనకు మనం కృతజ్ఞులమై ఉండాలనికూడా గర్విస్తాడు మనస్సులోపల.

చేబదుళ్లు పుచ్చుకునేవారు రెండురకాలు. తిరిగి తీర్చవలసుంటుందని ఆ విషయం నమ్మనివారు ఒకరకం. మరికొందరికట్లాంటి సదుద్దేశం కలిగినా అశక్తులౌతారు. వీరిలో రెండుజాతివారు సర్వత్ర పూజ్యులు.

ఓమాటు ఒకమిత్రుడు నావద్ద నాలుగు రూపాయిలు బదులుపుచ్చుకున్నాడు. చాలారోజులైన తర్వాత తీర్మానం కోరుతూ సాధ్యమైనంత లౌక్యంగానే ఉత్తరం వ్రాసేను. తిరుగుటపాలో క్షమాపణ పత్రికవొచ్చింది. నా వుత్తరం అందేటప్పటి అతని అవస్థ అవర్ణనీయమనీ, వెంటనే పంపజాలనందుకు అతను పొందుతూన్న విచారం గర్భనిర్భేదకరమనీ, అన్యథా నేను భావించవని నమ్ముతున్నాననీ, మొదలగు ఘోరవర్తమానంతో ఆశ

త్తరం వచ్చివాలింది. మళ్లీ ఆరుమాసాలదాకా అర్జీ దాఖలు చేస్తే వారంరోజులవరకూ జవాబురాలేదు. తర్వాత వచ్చిన ఉత్తరం యిది:—

“పదిరూపాయిలు వెంటనే మనియార్డరు చేయ ప్రార్థన. మీ ఋణమే కాక యిక్కడ కాఫీహోటలు వాడికి కొంత యివ్వాలిసుంది”—

తుర్కీ దేశపు సుల్తాను గారు మునుపు యీమాత్రమే ఆర్థికసమస్య పరిష్కరించడంలో అవలంబించినట్లు చరిత్ర తెలుపుతూంది. పాత ఋణాలు వడ్డీతో కూడా తీర్చేనిమిత్తం కొత్త ఋణాలు చేసేరట వారు. National Debt సమస్యకూడా Gordian knot లాగ విప్పే ఉపాయం చెప్పేరు నా మిత్రుడు! మళ్లీ యేమొహం పెట్టుకదగ వదిన్ని ?

చేబదుళ్లివ్వడం ఒకనికి నచ్చేదంటే యిస్తావన్నాళ్లు నీయందు కృతజ్ఞత లేకపోయినా క్షమాపణ పూర్వకంగానైనా నీవొక్కసారి నాస్తి చెప్పేనో నీ అంతటి అపరాధి అతనిసృష్టిలో మరొకడుండడు. నిన్ను నమ్మినందుకు తాను బాగా మోసపోయినట్లు మహోగ్రహావిష్టుడౌతాడు. వెనకటి చిల్లర్లకోసు అప్పుడు నువ్వు కదిపితే నీవు ప్రబల శత్రుత్వం అతనితో తెచ్చుకున్నట్లే.

* * * *

ఈవ్యాసం నాస్వంత పేరుతో వ్రాస్తే కపు చేబదులు పుట్టదనే భయంచేత మారుపేరుతో వ్రాసేను. స్వార్థచింతనకి క్షంతవ్యుణ్ణి.

---

## కాలము*

సెట్టి లక్ష్మీనరసింహముగారు (కవితాసమితి)

కాలము! కొలువరాని యగాధసాగ
రమ్మ! వత్సరమ్ములు నీతరంగములు; బ
హువ్యథాతతుల్ నీలోని యుదకము, లవి
జనుల కన్నీళ్లుపడి యుప్పఁదనముపొందె!
పారమెఱుఁగని కడలి! నీపాటుపోటు
లందు లోఁగొందు వీవు మర్త్యజగమెల్ల;
పొట్టఁ బెట్టుకొన్నట్టివి పెట్టుకొనుచు,
మఱియుఁగావలెననుమాట మానక, యవి
ముక్కముక్కలుగాఁ జేసి యక్కటకట;
వెడలఁగక్కుచు వొడ్డను బడెడునట్లు
క్రూరమవు ప్రశాంతివి, మహాఘోరమవు తు
ఫానుల: నెవండు నిన్నాదరింపఁగలండు?

---

* Shelley.




## ప్రాత కట్టడములు, గవాక్షములు

క. రామ్మోహనశాస్త్రిగారు

ఇప్పుడు 'అజంతా' విశ్వకళా పరిషత్తేని, 'ఎల్లోరా' సార్వజనీన యాత్రాస్థలము. 'అజంతా' ప్రాచ్యచిత్రకళయొక్క అత్యున్నత స్థానమును చూపుచున్నది. 'ఎల్లోరా' యందలి భాస్కర్యము శిల్పజగత్తునందు దసమానము. ఇట్లగుట ఇప్పుడో యీ రెండును యాత్రాస్థలము లే.

మేము వెళ్లిన కొలదిమాసములకు పూర్వము షుమారు మూడువందలమంది చైనా జపాను దేశస్థులిచటికి వచ్చి మకాము చేసి కొంతకాలముండి వెడలిరట! ఇటులనే ప్రతి వత్సరము అనేకులు నల్దిక్కులనుండి శ్రమ కోర్చి యిచ్చటికి వచ్చి ప్రాచ్యకళాలక్ష్మికొకతిరి ప్రణమిల్లి వెడలుచుందురు.

కళాదక్షులచే పరమశివుడు ప్రతిష్ఠింపబడిన కైలాసమందిరములో నడుగిడుసరికి ఏకశిలయందు తొలిచి — బయటినుంచి యొక రాతిముక్కనైనను లోనికి తేక — నిర్మించబడిన యింత పెద్దసౌధము (చిత్రము ౧), మిక్కిలి ఆశ్చర్యము గొలుపుట సహజమే

కైలాసనాథుడు, విష్ణుగాథలు, భారత యుద్ధము, దశకంఠుడు, శివలీలలు, గంధర్వులు, కిన్నరులు, ఏనుగులు, సింగములు, శరభ సాళ్వములు, ఇంద్రసభాగుహాయందు దొరక చూతనరుచ్ఛాయ, ఇంద్రునిభార్య శచీదేవి, మామిడిచెట్టునందు తీర్చిన మామిడిపండ్లు, అందు వానరములు, మరియు మకరతోరణములు, గంగా యమునా సరస్వతీమూర్తులు, వివిధపక్షులు మొదలగునవి మిక్కిలి ఆకర్షకములు. కొన్ని ముఖ్యమగువాటిని అప్రచురితములను మేము చూచి వ్రాసికొంటిమి.


అద్దమువలె నునుపుగ నున్న కైలాస గుహా మొదటి అంతస్తు వసారా యందు (చిత్రము ౧) మే మొకనాటి మధ్యాహ్నము విశ్రమించుతరి పైన సరంబీయందు కొన్ని వర్ణాలేఖ్యములు కాన్పించెను. పక్కగోడ యందు రంధ్రములు గల బహు చక్కని చెక్కడపుపనితో నలరారు గవాక్ష మొండును గోచరించెను. నా చూచివ్రాతప్రతిలిపి యుదాహరణము (చిత్రము ౨). దానిసొబగు నేవర్ణింప

బనిలేదు. ఎల్లోరాగుహాల మొత్తమువిూద ఆకువివిధకల్పనలుగలయిట్టి గవాక్షములు వెలుతురు, గాలివచ్చునటులు గలవు. రాతినుండియే యువిధముగ చెక్కబడినగవాక్షములు అనేకపురాతనపుకట్టడములలోగలవు. ఇచ్చట కొన్ని యుదాహరణము లివ్వబడినవి వీటిని పరిశీలించు సమయమున "Indian design is an inexhaustible treasure-house of fine invention" అని ఆనందకుమారస్వామి వ్రాసుచ్చినది మనఃపథమునకు వచ్చును. మహమ్మదీయుల నిర్మాణములయందును మిక్కిలి నిపుణములగు నిట్టివి కొన్ని ప్రసిద్ధిగన్న టాజ్ మహాలు మొదలుగాగలకట్టడములయందుగలవు. (చిత్రము 3). కట్టియునుమా కన్న చంద్రశిలయే యుత్తమము, శాశ్వతము నని తలచి యుండనోపుదురు; లేక అందమున చంద్రశిలసాటి యింకొకటి లేదని విడిచిరో! మ్లేచ్ఛులు తమవెంట స్థపతుల శిల్పుల నిక్కడకు తోడ్కొని రాలేదనియు, యిక్కడి శిల్పులచేత నే వారల మతాభిరుచుల ననుసరించి జగత్ప్రసిద్ధమైన 'టాజ్ మహాలు' మొదలగు సౌధములు నిర్మించి రనియు హావెలుపండితుడు సిద్ధాంతీకరించెను. కనుక హిందూదేశమందలి, రాజపుత్ర మొగలు, బౌద్ధ జైన, మొదలగు వివిధరీతులు హిందూ శిల్పకళయొక్క పరిణామములే యగుచున్నవి. చిత్రము 3 సిద్దీసయ్యద్ మసీదునందలి యొక గవాక్షము. అహమ్మదాబాదు. ఇట్టి అర్ధవలయాకృతి నున్న గవాక్షము లీమసీదునందు పది గలవు. ఈమసీదు షుమారు 1500 క్రీ. శ. స. ప్రాంతమున ఇసుకరాయి (Sandstone) తో నిర్మింపబడినది. చెక్కడపు పని హిందూసాంప్రదాయము ననుసరించి యున్నది. మైసూరు జగన్మోహనప్రాసాదమున మంచిగంధపు చెక్కలో చెక్కబడిన దీమాదిరిదే గలదు. కాని యిది యిటీవలిది. "నాలుగుపోకచెట్లు మూడు పెద్ద వటవృక్షములు గలిపి బహునేర్పుగ రచించిన యిది టాజ్ మహాలునందలివాటికన్న మిన్న" అని ఫెర్గూసను వ్రాసెను.


26 వ నెం. అజంతా చైత్యము:—

అశ్వలాడమాకృతినున్న యీగవాక్షము (చిత్రము ౪) నుండి వెలుతురు గర్భగుడియందు పడునటుల నిర్మింపబడినది. దానిమధ్య చెక్కతో అడ్డముగ అల్లిక గలది యుండెడి దేమో యను కొందరు పాశ్చాత్యుల యభిప్రాయము సరియైనది కాదు. ఎల్లోరాయందును నిట్టివి గలవు. విశ్వకర్మచైత్యము (చిత్రము ౫) చూడనగును. మైసూరు హొయసలేశ్వర దేవళము, హాలబీడునందలి బహుసుందరమగు (Screened Wall) రాతిపలక తెర (చిత్రము ౬) గమనింపదగును. అన్నిటిలో పట్టాడకల్లు విరూపాక్ష దేవాలయమునందలి గవాక్షములు కడుమిన్నలు. ఇవి ఎల్లోరావాటిని పోలియున్నవి. పట్టాడకల్లు బీజాపూర్ దక్షిణమున నున్నది. చాళుక్యవంశపురాజగు ౨వ విక్రమాదిత్యుడు 733-747 సంవత్సరములు పాలించెననియు, ఈదేవాలయము ఆతనికాలములో నిర్మింపబడెననియు నొక శిలాశాసనము బట్టి తెలియుచున్నది.


# ప్రాతకట్టడములు, గవాక్షములు




చిత్రము ౧




చిత్రము ౨




చిత్రము 3




చిత్రము ౪



చిత్రము ౭




చిత్రము ౮




చిత్రము ౭



చిత్రము ౮



చిత్రము ౯



చిత్రము ౧౦



కాంచీపురము వరదరాజస్వామి ఆలయములోని రాతిస్తంభము

ఛాయాచిత్రకారుడు: శ్రీ యం. కె. రంగస్వామయ్యంగారు